اهدنا الصراط المستقيم

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 3 సంచికలు 8 & 9 మార్చి & ఏప్రిల్ 2012 రూ. 34/-



## సైన్స్ - ధర్మం

ప్రత్యేక వ్యాసం

## ముస్లిమ్ మహిళ

ఇస్లామ్‌లో వివాహ వ్యవస్థ

## పొగ త్రాగడం నిషేధమా?

## రాతి యుగం

సృష్టికర్త లేకుండానే మానవ జాతి అభివృద్ధి చెందిందా?

## విశ్వాసి భయపడవలసిన అవసరం లేదు

He is ALLAH, other than whom there is no deity, the Sovereign, the Pure, the Perfect, the Bestower of Faith, the Overseer, the Exalted in Might, the Compeller, the Superior Exalted is ALLAH above whatever they associate with Him.

(Qur'an 59:23)

هُوَ اللّٰهُ الَّذِىْ لَآ اِلٰهَ اِلَّا هُوَ اَلْمَلِكُ الْقُدُّوْسُ السَّلٰمُ الْمُؤْمِنُ
الْمُهَيْمِنُ الْعَزِيْزُ الْجَبَّارُ الْمُتَكَبِّرُ سُبْحٰنَ اللّٰهِ عَمَّا يُشْرِكُوْنَ

సృష్టికర్త

اَللّٰهُ

అల్లాహ్

అల్-ఖుద్దూస్

اَلْقُدُّوْس

పరమ పవిత్రుడు

The Pure

అల్-మలిక్

اَلْمَلِک

విశ్వసార్వభౌముడు

The Sovereign

ఆయనే అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు.
ఆయన విశ్వ సార్వభౌముడు, పరమ పవిత్రుడు, శాంతికి
మూలా ధారుడు, శాంతి ప్రదాత, సంరక్షకుడు, సర్వశక్తివంతుడు,
గొప్ప ప్రాబల్యం గలవాడు, సర్వాధికుడు. వారు కల్పించే
భాగస్వాములకు అల్లాహ్ అతీతుడు. (ఖుర్'ఆన్ 59:23)

# శాంతిబాట

మాసపత్రిక రూ. 34/-

సంపుటి 3 సంచిక 8&9 మార్చి-ఏప్రిల్, 2012

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

www.saanthibaata.net

www.saanthibaata.com

Email:velugubaata@gmail.com

Cell : 9491103017


Saanthibaata


**ఎడిటర్:**

ఎమ్‌డి. అతహరుల్లా

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అప్ఫాన్ ఉమ్రీ

**Editor**

Md. Athaharullah

**Advisory Board**

Dr. Salim Pasha

Dr. Nagireddi Srinivasa Rao

Md. Affan Omri



**Printed by**

Md. Athaharullah

**Published by**

Md. Athaharullah

**Owned by**

Velugubaata Educational Society

(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**

Saanthibaata Printing House,

19-1-447, Hanuman Statue Center

Samalkot - 533440

and

**Published at**

2-8-31, Kota Bazar,

Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,

Email: velugubaata@gmail.com

RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**

T. Srinivasa Rao

(Zakir)


## మార్చి - ఏప్రిల్' 2012

**రబీ ఉల్ ఆఖిర్ హి. 1433 - జమాద అల్ ఆఖిర్ 1433**


**4** **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ : 30 - 33 ఆయత్‌లు ...

**8** **ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ సమాజం - పొగ త్రాగడం నిషేధమా? ...

**12** **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** తన సహచరులలో విశ్వాస పునాది ...

**17** **రెండవ ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వారి జీవిత చరిత్ర :** హుదైబియా ఒప్పందం ...

**21** **హదీస్ విజ్ఞానం :** బుఖారీ(ర) (ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్) ...

**23** **రాతియుగం - ఓ చారిత్రక అబద్ధం :** మానవాభివృద్ధి ...

**27** **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం- **ఖదీజా**(రజి)

**34** **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...

**35** **జిన్నులు మరియు చేతబడి :** నిజమైన విశ్వాసి భయపడవలసిన అవసరం లేదు ...

**44** **సైన్స్ - ధర్మం :** ప్రతీ విశ్వాసానికి ఆధారాలుండవు ...

**52** **ముస్లిమ్ మహిళ :** ఇస్లామ్‌లో వివాహ వ్యవస్థ ...

**57** **ధర్మసందేశ ప్రచారం :** ప్రస్తుతం సమాజంలో అనుసరిస్తున్న కొత్త పోకడల గురించి .... ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో సందేశాన్ని అందించే విధానాల పరిచయం. **జకాత్**



**సంవత్సర చందా:**

**రూ. 200/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**

2-8-31, కోట బజార్,

సామర్లకోట-533440

**మీ ఫోన్ నంబర్ తప్పనిసరిగా వ్రాయండి**

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.

లేదా

క్రింది నెంబర్‌కు

మీ వివరాలను **SMS** చేయండి.

**Cell : 9491103017**

ఇతర వివరాలకై సంప్రదించండి

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.* **Cell : 9491103017**

**M.O. పంపినా లేక బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ చేసినా, వెంటనే ఫోన్ చేసి చెప్పవలసిందిగా కోరుతున్నాము**

బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ఏ స్థాయిలో ఉండాలి?

ప్రజాస్వామ్యంలో పౌరులందరికీ సమానహక్కులుంటాయి. అదే విధంగా లౌకిక రాజ్యమైన మనదేశంలో ప్రతీ ధర్మానికి సమాన హక్కులున్నాయి. ఈ హక్కులను కాపాడవలసిన బాధ్యత మన ప్రభుత్వంపై ఉంది. వాస్తవానికి పేదవాని విషయానికొస్తే ఈ హక్కులు అనేవి ఎండమావిలోని నీళ్ళు వంటివి. నిజమైన ప్రజాస్వామ్యం ప్రస్తుతం ఎక్కడా అమలులో లేదు. కాని దాదాపు 1400 సంవత్సరాల క్రితం సంపూర్ణ ప్రజాస్వామ్యం ఓ అతిపెద్ద భూభాగంలో అమలు చేయబడింది. **ఇది చారిత్రక వాస్తవం.** రెండవ ఖలీఫాయైన ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు ఓ 10 లక్షల చదరపు మైళ్ళ భూభాగానికి (ఇస్లామీయ పరిపాలనలో) **నిజమైన మరియు సంపూర్ణ** ప్రజాస్వామ్యాన్ని తీసుకువచ్చి ప్రతీ ఒక్కరికి సమానహక్కు కలుగజేశారు. ఆయన ఏమన్నారో చూడండి:

> **“అణిచేవాడి పట్ల నేను నిర్దయుడిగా మరియు కఠినంగా ఉంటాను, కాని నేను బలమైన స్తంభంగా ఉంటాను బలహీనుల పట్ల. ప్రజలను పీడించేవాడి ఒక చెంప నేలపై ఉంచి, రెండవదానిని (రెండవ చెంపను) నా పాదం క్రింద ఉంచనంత వరకూ నేను శాంతించను. మరియు పేదవారు మరియు బలహీనుల కొరకు నా చెంపనే నేలపై ఉంచుతాను.”**

ఇస్లామీయ చట్ట ప్రకారం ఆయన ఏర్పరచిన సంపూర్ణ శాంతియుత ప్రజాస్వామ్యంలో మనుష్యులకే కాదు, జంతువులకు కూడా న్యాయం జరిగింది. ప్రతీ ధర్మానికి ఓ లక్షణం ఉంటుంది. ఇస్లామ్ లక్షణం న్యాయం. ఆకలితో టైగ్రిస్ నది ఒడ్డున ఓ కుక్క చనిపోయినా, అది కూడా దేశాధ్యక్షుడిగా తన బాధ్యతేనని ఉమర్(రజి)వారు ప్రకటించారు. తినడానికి కూడా ఏమీలేని పేదరాలైన ఓ స్త్రీ తనను ప్రశ్నించగలిగే స్వేచ్ఛను ఆయన కల్పించారు. ఆమెకు మరియు ఆమె బిడ్డల కొరకు దేశాధ్యక్షుడైనప్పటికీ పిండిని తన భుజాలపై మోసుకొచ్చి, స్వయంగా వంట చేసి ఆహారాన్ని అందించారు. ప్రజల ముందు అణుకువగా ఉండేవారు. అధికార దర్పమూ, అహంకారమూ లేనే లేవు. వేసుకున్న బట్టలకు 12 అతుకులు. కరువు కాలంలో ఆకలితో తన దేశ ప్రజలు చనిపోయే పరిస్థితి రాకుండా ఆయన తీసుకున్న జాగ్రత్తలు నేటి ఆధునిక కాలంలో కూడా ఏ అధ్యక్షుడైనా తీసుకోగలిగాడా? ఆ విషయాలు ఇన్షా అల్లాహ్ ఒక వ్యాసరూపంలోగాని, పుస్తకరూపంలోగాని త్వరలో అందిస్తాము. నేడు మనకు మనదేశ అధ్యక్షుడినే కాదు, ఓ కలెక్టర్‌ని సైతం సూటిగా ప్రశ్నించగలిగే స్వేచ్ఛ ఉందా? ఒక వ్యక్తి యొక్క గౌరవాన్ని కించపరిచేలా ఓ కవి పద్యం వ్రాస్తే, అతనిని ఉమర్(రజి)వారు తీవ్రంగా హెచ్చరించారు. మనిషికి మాట్లాడే హక్కు ఉంది. నిజమే కాని దానికీ ఓ హద్దు ఉంది. **స్వేచ్ఛకు హద్దులు అవసరమా?** అవును, నిజంగా అవసరమే! ఎందుకంటే ఆ స్వేచ్ఛ యొక్క పర్యవసానం సమాజంపై తీవ్ర పరిణామాలకు దారి తీసేది అయితే లేదా ప్రజలకు కీడు కలిగించేదే అయితే, **హద్దులు లేకపోతే ఎలా?**

ఉదాహరణకు మన రాష్ట్రప్రభుత్వం బ్రాందీ షాపులకు మరియు బార్లకు లైసెన్సులు ఇచ్చింది. డబ్బు గలవానికి అందులోకి వెళ్ళి త్రాగే స్వేచ్ఛ ఉంది. అది చట్టపరంగా నేరం కాదు. డబ్బు అతనిది మరియు త్రాగే స్వేచ్ఛ ప్రభుత్వం కలిగించింది. కాని ఆ త్రాగుడు వలన అన్ని రకాలుగా సమాజానికి కీడే జరుగుతుంది. కాని ప్రభుత్వం దానిని ఓ ఆదాయ వనరుగానే భావిస్తుంది. త్రాగినవాడు బయటకు వచ్చి ప్రజానీకానికి ఇబ్బంది కలిగేలా అరుస్తూ, అశ్లీలమైన పదాలు పలుకుతూ ఉంటే, అది న్యూసెన్స్ కేసు అవుతుంది. ఆ విధంగా ప్రవర్తించడానికి ప్రభుత్వం అతనికి స్వేచ్ఛ నివ్వలేదు. **కాని అలా జరుగుతుందని ప్రభుత్వానికి తెలియదా?** పత్రికలకు రాజ్యాంగం స్వేచ్ఛనిచ్చింది. ఎలక్ట్రానిక్ మీడియాకు కూడా. అయితే ఆ స్వేచ్ఛ కేవలం నిజాలను నిర్భయంగా తెలపడానికి మాత్రమే. అధికారులకు, సంఘవిద్రోహశక్తులకు, ప్రభుత్వానికి భయపడకుండా వ్రాయగలిగే ఆ స్వేచ్ఛ నేడు దుర్వినియోగం చేయబడుతుంది. కొన్ని మీడియా సంస్థలు బ్లాక్‌మెయిలింగ్‌కి పాల్పడుతున్నాయి. వారు అడిగినంత డబ్బు ఇవ్వకపోతే, వారి గురించి తమ టీవీ లేదా పేపర్ ద్వారా కథనాలు వ్రాస్తామని బెదిరించడం నేడు సర్వసామాన్యం అయిపోయింది. వ్యాపార ప్రకటనలు ఇవ్వని కొన్ని కార్పోరేట్ కళాశాలలపై ఓ న్యూస్ ఛానల్ కక్షగట్టి దుష్ప్రచారం చేసినట్లు ఇంతకు పూర్వం ఎన్నో వార్తలు వచ్చాయి. ఒక పత్రిక మరో పత్రికను దెబ్బతీయడం కోసం, ఒక న్యూస్ ఛానల్ మరో న్యూస్ ఛానల్‌ను ఎదగనివ్వకుండా చేయడం కోసం ఎన్నో తప్పుడు కథనాలు ప్రసారం చేయడం చూస్తూనే ఉన్నాము. మరి **ఈ స్వేచ్ఛ ఆరోగ్యకరమైనదా?**

**మీడియాలో వచ్చేది నిజమో, అబద్ధమో ప్రజలకు తెలియదు.** ఆలోచించే అవకాశం వారికి లేకుండా చేస్తున్నారు. ఆ విధంగా మీడియా ద్వారా ‘ఇస్లామ్’పై చెడు భావం కలిగేలా ఎంతో ప్రచారం జరిగింది. దానికి కారణం ఏమిటి? 1. బాధ్యతా రాహిత్యం కావచ్చు 2. డబ్బు కోసం కావచ్చు 3. ఇతరత్రా కారణాలు కావచ్చు.

**బాధ్యతా రాహిత్యం** : నేడు ప్రతీ పేపర్‌కి లేదా ప్రతీ ఛానల్‌కి ఓ రాజకీయ పార్టీ అండ ఉంది. కాబట్టి ఏదైనా సంఘటన జరిగితే తమకు అనుకూలంగా ఉండేలా దానిని చూపిస్తున్నారు. **ఇది బహిరంగ రహస్యమే.** తమకు వ్యతిరేకమైన నాయకుడు మంచి పనిచేసినా సరే, ఆ పనిలో ఏదో స్వార్థం ఉందని, దాని ద్వారా అతడు ఫలానా మేలు పొందగోరుతున్నాడని రకరకాల ఊహలతో, ఊహాజనిత కథనాలు వ్రాయగలిగిన మీడియా, **అమెరికా విషయంలో మాత్రం అటువంటి కథనాల జోలికి ఎందుకు పోలేదు?** అమెరికా మాటలకు తానా అంటే తందానా అని ఎందుకు అంటుంది.

ఇంటర్‌నెట్‌లో ఊహాజనిత విషయాలకు మసాలా చేర్చి ప్రజలను భయభ్రాంతులను చేయడానికి అన్నిరకాల ప్రయత్నాలు చేసే కొన్ని మీడియా సంస్థలు, అమెరికా ద్వంద్వ నీతి గురించి ఆ విధంగా విశ్లేషించి ఎందుకు వ్రాయలేక పోయాయి? ఎంతో సమాచారం ఇంటర్‌నెట్‌లో ఉంది. **‘ఇస్లామిక్ తీవ్రవాదం’** అని అమెరికా ఎలా చెబితే అలా వ్రాస్తారు. **అసలు ఇస్లామ్‌కి మరియు తీవ్రవాదానికి సంబంధం ఏమిటని ఒక్క క్షణమైనా ఆలోచించరు.** అమెరికాలో ట్విన్ టవర్స్ కూల్చేశారు అనగానే వెంటనే మరికాస్త మసాలా జోడించి ముస్లిములపై చెడు ప్రచారాన్ని ప్రారంభిస్తారు. అది కేవలం అమెరికా చేసిన ఆరోపణే కావచ్చుని, ఆ సంఘటనలోని నిజానిజాలేమిటో తెలుసుకోవాలని ఎందుకు ఆలోచించరు? అమెరికా నీచ చరిత్ర అందరికీ తెలిసినదే! 1400 సంవత్సరాల క్రితం నుండి ప్రపంచంలో ఇస్లామ్ ఆచరణలోనే ఉంది కదా! **“ఇన్ని శతాబ్దాలుగా శాంతిని బోధించే ఇస్లామ్ అకస్మాత్తుగా ఓ 20 సంవత్సరాల క్రితం నుండి తీవ్రవాదాన్ని ఎలా బోధిస్తుంది? అది ఎలా సాధ్యం?”** అని కనీసం ఓ నిమిషమైనా మన మీడియా ఆలోచించి ఉంటే ఎంత బాగుండేది!

శతాబ్దాల తరబడి తీవ్రవాద దాడులు ఎవరు చేసారో, చరిత్రను ఓసారి అధ్యయనం చేస్తే విషయం అర్థం అవుతుంది కదా! ఆ మాత్రం జ్ఞానం కూడా

మీడియాకు లేకపోయిందా? ఆ వ్రాతల ప్రభావం సమాజంపై ఎంత తీవ్రంగా ఉంటుందో కూడా తెలియనివారు **పత్రికలను నడపడం అనేది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిది.** 'ఇస్లామ్'ను అనుసరించేవారికి **మనో వేదనను కలిగించే స్వేచ్ఛ వీరికి ఎవరిచ్చారు?**

**ధనం కోసమా?** : ఈ సంవత్సరం ఫిబ్రవరి చివరి వారంలో మన ప్రధాని గౌ॥ మన్మోహన్ సింగ్‌గారు చేసిన వ్యాఖ్యలు కొన్ని విషయాలను బయట పెట్టాయి. తమిళనాడులోని కూడంకుళం అణువిద్యుత్ కేంద్రం వద్ద స్థానికుల నిరసనలకు విదేశీ ఎన్జీవోలే కారణమని ప్రధాని వ్యాఖ్యానించారు. అమెరికాకు చెందిన ఎన్జీవోలే కారణమని ఆయన ఓ సైన్స్ మేగజైన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆరోపించారు. ప్రధాని స్థాయిలో ఉన్న వ్యక్తి, ఇతర దేశాలకు సంబంధించిన సంస్థల గురించి ఆ విధంగా వ్యాఖ్యానించారంటే, అందులో వాస్తవం లేకుండా ఉంటుందా? వాస్తవాలు తెలిసినా, తప్పనిసరి పరిస్థితిలోనే మరియు చేయిజారిన పరిస్థితిలోనే అటువంటివి బయటపెడతారు. **ఒకప్పుడు మీడియా అమెరికాకు పూర్తిగా అనుకూలంగా ఉండేది.** ఇప్పటికీ మీడియాలోని కొన్ని వర్గాలు అమెరికా మాటకు తానా తందానా అంటున్నాయి. అమెరికా ఎన్జీవోలే కొన్ని నిరసనలకు కారణమని ప్రధాని మన్మోహన్‌గారు చేసిన వ్యాఖ్యలను బట్టి, ఈ మీడియా వర్గాలకు కూడా ఏదో రూపంలో విదేశాల నుండి డబ్బు అందుతుందా? లేక విదేశీ కంపెనీల ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ కోసం ఆ విధంగా చేస్తున్నారా? ఐక్యరాజ్యసమితి కూడా అమెరికా విషయంలో నోరు మెదిపే సాహసం చేయలేనప్పుడు పత్రికలు మాత్రం ఏం చేయగలవు అని అంటారేమో!


విదేశాల నుండి మంచి కార్యక్రమాల కోసమని అందే సహాయం ప్రక్కదారి పడుతుందని సాక్షాత్తు ప్రధానిగారే చెప్పారు. **ఇస్లామ్‌పై మరియు ముహమ్మద్(స)వారిపై పల్లెటూర్లలో మరియు ఓ మోస్తరు పట్టణాలలో దుష్ప్రచారం జరుగుతుంది.** ఆ విధంగా చేసేవారికి, వేరే కార్యక్రమాల పేరుతో విదేశాల నుండి అందే నిధులు దారి మళ్ళుతున్నాయి. వాటిని దేని కొరకు వాడుతున్నారో ప్రభుత్వానికి తెలియనిది కాదు. ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా తెలుసుకోగలదు. మీడియాకు ఇచ్చిన స్వేచ్ఛ వ్యాపార రూపం దాల్చింది. దక్షిణ భారతదేశంలో పేరున్న ఓ ఇంగ్లీష్ దినపత్రికలో ఓ వ్యక్తిచేత ఎడిటోరియల్ వ్యాసానికి ప్రక్కనే, ఇస్లామ్‌కి వ్యతిరేకంగా సంవత్సరంలో కనీసం ఓ డజను వ్యాసాలకుపైనే వ్రాయిస్తారు. ఆ వ్యక్తి ఇస్లామ్ గురించి తన వ్రాతలలో విషం కక్కుతూనే ఉంటాడు. ఈ మధ్య ఒక వ్యాసంలో toxic islam అని వ్రాశాడు. అతనికి అంత స్థాయిలో మత దురభిమానం ఉంటే, అది వ్యక్తిగత స్థాయిలో ఉండాలిగాని, **బహిరంగంగా ఈ విధంగా ఓ ధర్మం గురించి విషపు వ్రాతలు వ్రాసే స్వేచ్ఛ ఇవ్వదగునా? సత్యాన్ని తెలుసుకోలేనివారు వ్యాసకర్తలు కావడం సమాజానికి కీడే!**

**'జయలలిత గొడ్డు మాంసం తింటారు'** అని **నక్కీరన్** అనే తమిళ పత్రిక వ్రాసింది. ఆ పత్రిక కార్యాలయం ఆవరణలో కార్లు, ద్విచక్ర వాహనాలు, కంప్యూటర్లు, అద్దాలు ధ్వంసం చేశారు. రాస్తారోకోలు చేశారు. **ఈ వార్త వలన ప్రజలకు జరిగే మేలు ఏమిటి?** ఇటువంటి వార్త వలన ఏమి జరుగుతుందో పత్రికవారికి తెలియదా? ఇటీవల ఓ పారిశ్రామికవేత్త, రఘురామకృష్ణంరాజుగారు ఒక తెలుగు దినపత్రికపై 25 కోట్లకు పరువునష్టం దావా చేశారు. ఆ అసత్య వార్తలు తనకు ఆవేదన కలిగించాయని, తన గౌరవానికి భంగం కలిగించాయని చెప్పారు. ఒక వ్యక్తి పరువుకు నష్టం కలిగినప్పుడు, దాని వలన అతనికి మానసిక ఆవేదన కలిగినప్పుడు పరిహారానికై కోర్టుకెళ్ళడానికి రాజ్యాంగం అనుమతినిచ్చింది.

మరి 150 కోట్లకు పైగా ముస్లిముల మనోభావాలను దెబ్బతీసేలా, వారికి తీవ్ర ఆవేదన కలిగేలా, ఇస్లామ్ గురించి చెడువ్రాతలు వ్రాసినప్పుడు, ఆ వ్రాతలు వ్రాయడానికి స్వేచ్ఛను ఇచ్చిన **ప్రభుత్వాలు ఆలోచించాలి.** ఫిబ్రవరి నెలలో మన జైపూర్‌లో **సాహిత్య ఉత్సవం** జరిగింది. అది సాహిత్యం కొరకు ఏర్పాటు చేసినది మాత్రమే. ఎందరో కవులు, రచయితలు హాజరైనప్పటికీ వారి సాహిత్య సేవల గురించి కాకుండా కేవలం **సల్మాన్ రష్దీ** గురించే చర్చ అంతా. ఇతర కవులు మరియు రచయిత సేవల గురించి మీడియా ప్రాముఖ్యత నివ్వలేదు. ఒక వ్యక్తి గురించి మాత్రమే ఆ ఉత్సవం ఏర్పాటు చేసినట్లు ప్రవర్తించారు. సల్మాన్ రష్దీ కనుక ఇస్లామ్‌కి వ్యతిరేకంగా వ్రాయకపోయి ఉంటే ఎవరూ అతనిగురించి మాట్లాడి ఉండేవారు కాదు. ఈ విషయంలో రాజకీయ నాయకులు చేసిన వ్యాఖ్యలలో అవివేకం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. బీజేపీ నాయకుడైన రవిశంకర్ ప్రసాద్, **నిఘా సంస్థలు,** జిహాదీలు *కుమ్మక్కయ్యారని, రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో కీలకపాత్ర పోషించిందని* అన్నారు. (సాక్షి, 24.02.12). ఇది ఎంత ఘోరమైన ఆరోపణ. **అంటే భారతదేశంలో తీవ్రవాదులు, నిఘాసంస్థలు కలిసి పనిచేస్తున్నాయా? అంటే రాజకీయ నాయకులు భారతదేశం గురించి ప్రపంచానికి ఎటువంటి సంకేతాలు ఇవ్వాలనుకుంటున్నారు?** ఇక మరో బీజేపీ నేతయైన ఉమాభారతి గారు ఇలా అన్నారు : **"కాంగ్రెస్ రష్దీని రుచికరమైన వంటకంగా ముస్లిములకు వడ్డిస్తుంది."** రష్దీ తన పుస్తకం 'శాటానిక్ వర్సెస్'లో హనుమంతుడుని ఎగతాళి చేశారని, అయితే పుస్తకాలను నిషేధించాలని తాము కోరలేదని ఆమె చెప్పారు. హనుమంతుడిని ఎగతాళి చేస్తే ఆమెకు ఏమీ అనిపించకపోవచ్చు. ఇస్లామ్‌పై విమర్శ చేస్తూ వ్రాసిన పుస్తకం కదా! అది చాలు ఆమెకు. ఆ ఆనందం ముందు ఆ ఎగతాళి ఆమెకు ఎక్కువ కాలేదని అర్థమౌతుంది. ఒకవేళ హనుమంతుడిని కాక ఈమెను ఎగతాళి చేసి ఉంటే, **ఈమె స్పందన ఎలా ఉండేదో!**

రష్దీ పుస్తకం మన దేశంలో నిషేధించబడింది. దానిలో నుండి కొన్ని పంక్తులు చదవడం ద్వారా రచయితలు హరి కుంజ్రు, అమితాభ కుమార్, జీత్ తాయిల్, రుచిర్ జోషీలు కలకలం రేపారట. అంతర్జాతీయ ప్రముఖులు ఎందరో హాజరైనప్పటికీ, రష్దీ గురించిన ప్రస్తావనే ఎక్కువగా ఉందట. ఈ నలుగురి వ్యవహారంతో నిర్వాహకులు తమకు సంబంధం లేదన్నారట. చేతన్ భగత్ మాట్లాడుతూ, రష్దీ తనకు హీరో అని, అయితే **ఇతరుల మనోభావాలను గాయపరిచేందుకు సాహిత్యాన్ని మాధ్యమంగా ఎంచుకోవడాన్ని సమర్థించబోనని అన్నారు.** నిర్వాహకులకు అంత జ్ఞానం కూడా లేదా? దేశ పరిస్థితులు వారికి తెలియవా? వారికి బాధ్యత లేదా? ఒక దేశంలో ఓ పుస్తకం నిషేధంలో ఉన్నప్పుడు, దానిలోని వాక్యాలను చదివిన ఆ నలుగురికి, సాహిత్యం తప్ప ప్రభుత్వ ఆదేశాలకు విలువివ్వాలని తెలియకపోవడం శోచనీయం. **ఇదేమి స్వేచ్ఛ!** ఒకవేళ చెప్పాలనుకుంటే వీరందరూ ప్రయత్నం చేసి నిషేధం ఎత్తివేసేలా చేసి, ఆ తరువాత మాట్లాడాలి. **సాహిత్యం ప్రజలకు మేలు చేసేదిగా ఉండాలి.** నిర్వాహకులు కూడా బాధ్యతారాహిత్యాన్ని ప్రదర్శించారు. నేడు ఎన్నో సినిమాలు వస్తున్నాయి. ఎన్నో కథలు పత్రికలలో వస్తున్నాయి. ఒకవేళ మానసిక ఆరోగ్యం బావుండలేనివారు, మనస్సులో దేనిపైనో కక్ష పెంచుకున్నవారు రచయితలైతే, వారు తమ శాడిజాన్ని వాటిలో చూపుతారు. **ప్రజలను ప్రభావితం చేసే ప్రతీ విషయంపైనా సమాజ శ్రేయస్సు దృష్ట్యా స్వేచ్ఛకు కొన్ని పరిమితులుండాలి.** హద్దులే కనుక లేకపోతే, హైదరాబాద్ వంటి నగరంలో ట్రాఫిక్ కంట్రోల్ సిగ్నల్స్ లేకుండా ఎవరి స్వేచ్ఛ ప్రకారం వారు పోతే ఏమి జరుగుతుందో, సమాజం కూడా అదేవిధంగా అస్తవ్యస్తం అయిపోతుంది. ఆరోగ్యకరమైన స్వేచ్ఛ గురించి ఆలోచించండి!

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

22

## ఖుర్'ఆన్ తఫ్సీర్

البقرة

**2. సూరహ్ అల్-బఖరా**

*( గత సంచిక తరువాయి )*

గత సంచికలో 30 నుండి 33వ ఆయత్ వరకూ, తెలుగు అనువాదాన్ని మరియు ఆయత్‌లలోని ప్రతీ అరబీ పదానికి అర్థాన్ని కూడా అందించడం జరిగింది. ఈ వ్యాసంలో ఆ 4 ఆయత్‌ల తఫ్సీర్ అందించబడుతుంది.

ఈ సూరహ్‌లోని 30వ ఆయత్‌తో మొదలైన 10 ఆయత్‌లు మానవజాతి పితామహుడైన ఆదమ్(అ)వారి జీవిత వృత్తాంతాన్ని మనకు తెలియ జేస్తున్నాయి.

అల్లాహ్ నుండి అందే అనుగ్రహాలు రెండు రకాలు - (1) స్పష్టంగా తెలిసేవి మరియు (2) అస్పష్టమైనవి.

ఆహారం, నీరు, డబ్బు, భవనాలు మరియు భూములు మొదలైనవి స్పష్టంగా కనిపించే అనుగ్రహాలయితే గౌరవం, సంతోషం, జ్ఞానం అనేవి రెండవ రకమైన అనుగ్రహాలు.

ఈ 30వ ఆయత్‌కు ముందుగా వచ్చిన ఆయత్‌లు మొదటి రకం అనుగ్రహాలకు సంబంధించినవి. ప్రస్తుతం తఫ్సీర్‌లో చెప్పుకుంటున్న ఈ ఆయత్‌లు మాత్రం రెండవ రకం అనుగ్రహానికి సంబంధించినవి.

**ఆదమ్(అ)వారికి అల్లాహుతాలా జ్ఞానాన్ని అనుగ్రహించారు.** తన దూతల చేత అతని ముందు సజ్దా చేయించారు. మానవజాతి పితామహుడికి గౌరవాన్ని కలిగించారు. మరియు మానవులకు '**ఆదమ్ సంతానం**' అనే గౌరవాన్ని కూడా కలుగజేశారు.

### కాబట్టి జ్ఞానం మనిషికి గౌరవాన్ని కలుగజేస్తుంది.

**ఆదమ్(అ)వారిని సృష్టించడం :**

తన ప్రతినిధిగా భూమిపై ఆదమ్(అ)వారిని సృష్టించడానికి అల్లాహుతాలా నిర్ణయం తీసుకున్నారు. అతనిని ఖలీఫాగా నియమించాలనుకున్నారు. తన దూతలకు ఆ నిర్ణయాన్ని తెలియ జేశారు. వారు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.

**"మరియు నీ ప్రభువు తనదూతలతో చెప్పినప్పుడు"** అని 30వ ఆయత్‌లోనున్న పదాలకు అర్థం "ఓ ముహమ్మద్(స)! అల్లాహ్ ఏదైతే తన దూతలతో చెప్పాడో దానిని నీవు నీ ప్రజల ముందు ప్రస్తావించు" అని తెలుసుకోవాలి.

గతించిన కాలానికి సంబంధించి ఖుర్'ఆన్‌లో అల్లాహుతాలా తెలియజేసే ఎన్నో విషయాలు ఇహలోకంలోని మన జీవితాలకు ఓ గుణపాఠంగానూ, మన మార్గాన్ని సులభం చేసే విషయంలోనూ ఉపయోగ పడతాయి.

అల్లాహుతాలా తన దూతలతో ఇలా చెప్పారు : **"వాస్తవంగా నేను భూమిలో ఒక ప్రతినిధిని సృష్టించ బోతున్నాను!"**

అంటే కేవలం ఓ వ్యక్తిని మాత్రమే అని కాదు. ఆ వ్యక్తి ద్వారా మానవజాతి ప్రారంభమౌతుంది. ఒక తరం నుండి మరొక తరం, ఆ విధంగా నిరంతరాయంగా మానవోత్పత్తి జరుగుతూనే ఉంటుంది. ఎందుకంటే ఖుర్'ఆన్‌లో మరో చోట (6:165 లో) అల్లాహుతాలా ఇలా తెలియ జేస్తున్నారు:

> **మరియు ఆయనే మిమ్మల్ని భూమి మీద ప్రతినిధులుగా నియమించి, మీకిచ్చిన దానితో మిమ్మల్ని పరీక్షించటానికి - మీలో కొందరికి మరికొందరిపై ఉన్నత స్థానాన్ని ఇచ్చాడు. నిశ్చయంగా నీ ప్రభువు శిక్ష విధించడంలో అతి శీఘ్రుడు, మరియు నిశ్చయంగా, ఆయన క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత** (ఖుర్'ఆన్ 6:165)

పై ఆయత్‌ను బట్టి కేవలం ఆదమ్(అ)వారు ఒక్కరే ఖలీఫా (ప్రతినిధి) కాదని స్పష్టమౌతుంది. ఆదమ్(అ)వారు తొలి ప్రతినిధి అయ్యారు.

అల్లాహ్ దూతలు ఇలా అన్నారు : **"ఏమీ? నీవు భూమిలో కల్లోలం రేకెత్తించే వానిని మరియు నెత్తురు చిందించే వానిని నియమించ బోతున్నావా? మేము నీ స్తోత్రం చేస్తూ, నీ పవిత్రతను కొనియాడుతూనే ఉన్నాము కదా!"**

ఖలీఫా అనే పదాన్ని బట్టి అల్లాహ్ దూతలు ఇలా అర్థం చేసుకుని

ఉండవచ్చు. 'ఖలీఫా' అనే పదానికి అర్థం - ప్రజల మధ్య తగవులు జరిగినప్పుడు తీర్పునిచ్చే వ్యక్తి, అన్యాయం నుండి మరియు పాపం నుండి నిరోధిస్తాడు (ఖుర్తుబీ).

ఫరిష్తాలనే భూమిపై ప్రతినిధులుగా నియమిస్తే చెడుకు అవకాశం లేదు. కాని భూమిపై ప్రాతినిధ్యం కొరకు అల్లాహ్ మానవజాతినే ఎన్నుకున్నారుగాని ఫరిష్తాలను ఎన్నుకోలేదు. క్రింది ఆయత్ చూడండి:

**మరియు మేము కోరితే మీకు బదులుగా, అల్లాహ్ యొక్క దూతలను (ఫరిష్తాలను) భూమిపై ఉత్తరాధికారులుగా చేసేవారము.** (ఖుర్ఆన్ 43:60)

ఫరిష్తాలు (అల్లాహ్ యొక్క దూతలు) ఆయన కంటే ముందుగా మాట్లాడరు. ఆయన యొక్క అనుమతి లేకుండా ఏదీ అడగరు. వారికి మానవజాతి అంటే అసూయ ఎంతమాత్రం లేదు. అల్లాహ్ వారికిచ్చిన జ్ఞానాన్ని బట్టి వారు తమ అభిప్రాయాన్ని ఆయన ముందు తెలియ జేశారు.

అంతేకాకుండా ఎల్లవేళలా అల్లాహ్‌ను ఆరాధిస్తూ, ఆయన ఆదేశించినట్లు చేయడానికి సిద్ధంగా ఉండేవారే - అల్లాహ్ యొక్క దూతలు. కాబట్టి చెడు చేయనివారైన తాము ఉండగా మరొక జాతి సృష్టికి గల కారణం ఏమిటో వారికి అర్థం కాలేదు. అంటే ఆ విషయం వారి జ్ఞానపరిధిలో లేదని తెలుస్తుంది. వారు వెలిబుచ్చిన అభిప్రాయానికి సమాధానంగా అల్లాహ్ ఇలా అన్నారు : **నిశ్చయంగా, మీకు తెలియనిది నాకు తెలుసు!**

మానవులలో కల్లోలం రేకెత్తించేవారూ మరియు నెత్తురు చిందించే వారు మాత్రమే లేరు. మానవజాతిలో ఎందరో ప్రవక్తలు, సందేశహరులు, సత్యవంతులు, సద్వర్తనులు, నిజాయితీపరులు, షహీదులు కూడా ఉన్నారు. **మానవజాతిని సృష్టించడంలోని వివేకం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు.** జ్ఞానం అనేది అల్లాహ్ ఇస్తేనే లభిస్తుంది. ఫరిష్తాలైనా, షైతానులు అయినా, మానవులైనా ఎవరికీ అగోచర జ్ఞానం లేదు. విశ్వాన్ని సృష్టించడం లోని వివేకం కేవలం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు.

ఇక్కడ మనం తెలుసుకోవలసిన ముఖ్యమైన విషయం ఒకటుంది. అదేమిటంటే మన చుట్టూ ఉనికిలో ఉన్నవి ఎన్నో. వాటిలో కొన్ని మనకు అనవసరం అని మనకు ఎప్పుడైనా అనిపించవచ్చు. కాని వాటి సృష్టి వెనుక ఉన్న వివేకం ఏమిటో మనకు అర్థం కాలేదు, అంతే!

### ఫరిష్తాలపై ఆదమ్(అ)వారికున్న విశిష్ఠత

అల్లాహుతాలా ఆదమ్(అ)కు ఒక విశిష్ఠతను కలుగజేశారు. అదేమిటంటే తన దూతలకు నేర్పని విషయాలను కూడా ఆదమ్(అ)కు ఆయన నేర్పారు. 31వ ఆయత్‌లో అల్లాహుతాలా ఇదే విషయాన్ని తెలియ జేస్తున్నారు. అద్-దహ్హాక్ ఈ వాక్యంపై ఇబ్నె అబ్బాస్(రజి)వారి వ్యాఖ్యానాన్ని వివరించారు : "పేర్లు అంటే ప్రజలు ఉపయోగించే పేర్లు, మానవుడు, జంతువు, ఆకాశం, భూమి, సముద్రం, గుర్రం, గాడిద వంటి పేర్లు ఇతర జాతుల పేర్లతో కలిపి."

తబరీ తఫ్సీర్ గ్రంథంలో వివరించిన మరికొన్ని విషయాలను ఇక్కడ చెప్పుకుందాం. ఇబ్నె అబీ హాతిమ్ మరియు ఇబ్నె జరీర్ ఉల్లేఖనం ఒకటుంది. ఈ ఆయత్‌పై ఇబ్నె **అబ్బాస్(రజి) అడగబడ్డారని** సయీద్ బిన్ మ'బద్ నుండి ఆసిమ్ బిన్ కులైబ్ ఉల్లేఖించారు.

**"అల్లాహుతాలా ఆయనకు 'పళ్ళెం' (ప్లేట్) మరియు 'కుండ' వంటి పేర్లను కూడా నేర్పారా?"** ఆయన (ఇబ్నె అబ్బాస్)ఆ ప్రశ్నకు ఇలా సమాధాన మిచ్చారు, "ఔను, మరియు ఆసనం నుండి గాలి వదలడం (పిత్తు) వంటి పదాలు కూడా."

దీనిని బట్టి ఆదమ్(అ)వారికి అన్నింటి పేర్లు తెలుసు అని అర్థమౌతుంది. ఆదమ్(అ)వారు భూమిపైకి రాకముందే అల్లాహుతాలా ఆయనకు అన్నీ నేర్పారు అంటే, బహుశా ప్రళయం వరకూ ఉనికిలోకి వచ్చే ప్రతీ వస్తువు పేరు కూడా ఆయనకు తెలిసి ఉండవచ్చు. బహుశా అందుకేనేమో అరబీ భాషలో ప్రతీ వస్తువుకు ఓ పేరు ఉంది.

అబ్దుర్రజ్జాఖ్ ఉల్లేఖనం : మ'మర్ చెప్పారు, ఖతాదా చెప్పారు, "దూతల ముందు అల్లాహ్ వస్తువులను ప్రదర్శింపజేశారు". దూతలు వాటి పేర్లను చెప్పలేకపోయారు. అప్పుడు వారు అల్లాహ్‌తో ఇలా అన్నారు : **"నీవు సర్వలోపాలకు అతీతుడవు. నీవు తెలిపినదే తప్ప మాకు మరేమీ తెలియదు. నిశ్చయంగా నీవే సర్వజ్ఞుడవు, మహా వివేకవంతుడవు"**

ఆదమ్(అ) యొక్క జ్ఞాన విశిష్ఠత ఈ సందర్భంగా ప్రదర్శించ బడింది. అల్లాహుతాలా ఆదమ్(అ)తో అన్నారు: **"ఓ ఆదమ్! వీటి (ఈ వస్తువుల) పేర్లను వీరికి తెలుపు."**

మరొక వివేకవంతమైన సూచన కూడా ఇందులో ఇమిడి ఉంది. అదేమిటంటే భూమిపై సరియైన విధంగా ప్రాతినిధ్యం వహించడానికి, అక్కడ ఉనికిలో ఉండే మరియు ఉనికిలోనికి వచ్చే వాటి పేర్లు, వాటి గుణగణాలు తెలిసి ఉండాలి. కాని అల్లాహ్ యొక్క దూతలకు అటువంటి సామర్థ్యం లేదు.

ఆదమ్(అ)వారు వాటి పేర్లు తెలిపాక, అల్లాహుతాలా అన్నారు :

**"నిశ్చయంగా నేను మాత్రమే భూమ్యాకాశాల అగోచర విషయాలను ఎరుగుదునని మీతో చెప్పలేదా? మరియు మీరు ఏది బహిర్గతం చేస్తారో మరియు ఏది దాస్తారో కూడా నాకు బాగా తెలుసు!"**

పై ఆయత్‌పై ఇబ్నె అబ్బాస్(రజి)వారి వ్యాఖ్యానాన్ని అద్-దహ్హాక్ గారు తెలియజేశారు, "నాకు రహస్యాలు తెలుసు, కనిపించేవి ఎలా అయితే నాకు తెలుసో అదే విధంగా ఇబ్లీస్ తన హృదయంలో దాచుకున్న పొగరు మరియు అహంకారమూ తెలుసు."

అల్లాహ్ తన నిర్ణయాన్ని తన దూతలతో చెప్పడానికి గల కారణం ఏమై ఉండవచ్చు? కేవలం వారికి తెలియజేయడం కోసమేనా? లేక ఆ విషయంపై వారి అభిప్రాయాన్ని బహిర్గత పరచడానికా? వారు ఏదైతే

చెబుతారో అది కూడా అల్లాహ్‌కు ముందుగానే తెలుసు. అంతేకాకుండా అందరినీ సంప్రదించి చేయవలసిన అవసరం అల్లాహ్‌కు ఎంత మాత్రం లేదు. ఆయన మహావివేకవంతుడు కాబట్టి. క్రింది ఆయత్ చూడండి:

**తాను చేసే దానిని గురించి ఆయన (అల్లాహ్) ప్రశ్నించబడడు. కాని వారు ప్రశ్నించబడతారు.** (ఖుర్ఆన్ 21:23)

ఫరిష్తాల విషయంలో చెడు అనే ప్రసక్తే లేదు. పరిపూర్ణ విధేయత చూపుతారు. సృష్టి విషయంలో ఫరిష్తాలు అభ్యంతరాన్ని లేవదీయలేదు. వారికి అటువంటి ఆలోచనే ఉండదు. వారికి తెలుసుకోవాలనే ఆసక్తిని మనం గమనించవచ్చు.

ఫరిష్తాల (అల్లాహ్ యొక్క దూతల) స్వభావం మరియు మానవ స్వభావం వేర్వేరు. మానవ స్వభావానికి సరిపోయే పరిస్థితులు భూమిపై ఉంటాయి. ఆ పరిస్థితులు ఫరిష్తాల స్వభావానికి తగియుండవు. ఉదాహరణకు ఫరిష్తాలకు ఆకలి, దాహం ఉండదు. ఓ పాము లేదా ఓ తేలు కుడితే కలిగే బాధ ఏమిటో వారికి తెలియదు. ఆదమ్(అ)వారికి ప్రత్యేకమైన సామర్ధ్యాన్ని అల్లాహుతాలా కలుగజేశారు. మానవుని లక్షణమే జ్ఞానాన్ని అందుకునేలా చేస్తుంది. పుట్టుకతోనే మనిషికి కొంత జ్ఞానం ఉంటుందని అందరికీ తెలిసిన విషయమే!

ఫరిష్తాలకు జీవనోపాధి యొక్క అవసరం లేదు. వారికి ఏ అవసరాలు ఉండవు. వారు మలినరహితంగా ఉంటారు. ఎటువంటి మలినాలను విసర్జించరు. వారికి కష్టాలు, బాధలు ఏమీ ఉండవు. వారు అల్లాహ్ ఆదేశాలను ఖచ్చితంగా పాటిస్తూ ఉంటారు. ఎల్లప్పుడూ అల్లాహ్ ఆరాధనలోనే ఉంటారు. **ఈ భూమిపై జీవించాలంటే తప్పనిసరిగా జ్ఞానం కావాలి.** మానవుని సృష్టికి ముందు, ఫరిష్తాల కంటే మేలైన జాతి మరియు జ్ఞానం కలిగిన జాతి లేదు. కాని అల్లాహ్ మనిషిని సృష్టించారు. అంతేకాకుండా ఫరిష్తాలకు తెలియని జ్ఞానాన్ని కూడా మనిషికి ఇచ్చారు.

ఫరిష్తాలు అల్లాహ్‌తో ఏమన్నారు ? ''నీవు సర్వలోపాలకు అతీతుడవు ....'' **సర్వలోపాలకు అతీతుడు అంటే** ఆయనలో ఎటువంటి లోపాలుండవు. ఒకరికి న్యాయం చేసి మరొకరికి అన్యాయం చేయడం వంటివి, ఒకరిపట్ల పక్షపాతం చూపడం మొదలైన లోపాలు మనలోనే ఉంటాయి. ఆయత్‌లోని ప్రతీ పదాన్ని నిశితంగా పరిశీలిస్తే, అందులో ఇమిడి ఉన్న గొప్ప వివేకం మనకు అర్ధమౌతుంది. ఆదమ్(అ)వారికి ఏ జ్ఞానాన్ని అయితే నేర్పారో, దానిని ఫరిష్తాలకు అల్లాహుతాలా ఎందుకు నేర్పలేదు? మానవులకంటే ముందే సృష్టించబడిన ఫరిష్తాలకే ఆ జ్ఞానాన్ని కూడా ఇచ్చి ఉంటే ఫరిష్తాలే మానవుని కంటే సుపీరియర్ అయి వుండేవారు కదా అని ఆలోచన రావడం సహజం. కాని తన సృష్టిలోని దేనికి ఎటువంటి జ్ఞానం అవసరమో సృష్టికర్త మరియు మహావివేకవంతుడైన అల్లాహ్‌కు మాత్రమే బాగా తెలుసు.

మానవుడు భూమిపై రక్తం చిందిస్తాడని ఫరిష్తాలు ఎలా తెలుసుకో గలిగాయి? తఫ్సీర్ గ్రంథాలలో ఇవ్వబడిన కొన్ని ఉల్లేఖనాలను బట్టి, ఈ సందర్భంగానే మనిషి భూమిపై ఎలా ప్రవర్తిస్తాడో అల్లాహుతాలా వాటికి తెలియ జేసారని అర్థమౌతుంది.

అల్లాహ్ ప్రతీదానిని పాపరహితంగానే పుట్టిస్తాడు. అయితే దానిలో ఉండే మంచి గుణం, చెడును జయించలేనప్పుడు మరియు చెడు పెరిగి పోయినప్పుడు సన్మార్గం కోల్పోవడం జరుగుతుంది. ఇమామ్ అల్-అష్'అరీగారు చెప్పిన దాని ప్రకారం మానవులు మాట్లాడుకునే భాష కూడా అల్లాహ్‌యే సృష్టించారు. భాష అనేది మనిషి కనుగొన్నది కాదు.

అంతేకాకుండా ఈ మొత్తం వృత్తాంతంలో ఒక ముఖ్యవిషయాన్ని మనం గమనించాలి. అల్లాహుతాలా ఆదమ్(అ)తో వస్తువుల పేర్లను ''**వీరికి తెలుపు**'' అన్నారుగాని ''**నాకు చెప్పు**'' అని అనలేదు. అంటే అల్లాహుతాలా ఏదైతే ఆదమ్(అ)కు నేర్పారో, వాటిని ఫరిష్తాలకు తెలుపమన్నారు. అంటే ఆదమ్(అ)వారు టీచర్ మరియు ఫరిష్తాలు విద్యార్థులు అయ్యారని అనుకోవాలి.

భూమిపై ప్రతినిధులను, ప్రవక్తలను, సందేశహరులను అల్లాహ్‌యే ఎన్నుకుంటారు. ఒకరు తన మంచి ఆచరణల ద్వారా లేదా కృషి చేయడం వలన ప్రవక్త పదవిని పొందడం జరగదు. ఈ విషయం ఎన్నో ఆయత్‌ల ద్వారా స్పష్టమౌతుంది. ఉదాహరణకు,

**"అల్లాహ్ ఫరిష్తాల నుండి మరియు మానవుల నుండి తన సందేశ హరులను ఎన్నుకుంటాడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వం చూసేవాడు"** (ఖుర్ఆన్ 22:75)

---

**"... తన సందేశాన్ని ఎవరిపై అవతరింపజేయాలో అల్లాహ్‌కు బాగా తెలుసు ..."** (ఖుర్ఆన్ 6:124)

భూమిపై ప్రాతినిధ్యం ఆదమ్(అ)వారితో ప్రారంభమై చిట్టచివరి ప్రవక్తయైన ముహమ్మద్(స)వారి వరకూ కొనసాగింది. ఈ భూమిపై అల్లాహ్ యొక్క చివరి ఖలీఫా - ముహమ్మద్(స).

ఈయనే అల్లాహ్ యొక్క చిట్టచివరి ఖలీఫా, చిట్ట చివరి సందేశ హరుడు (రసూల్) మరియు చిట్టచివరి ప్రవక్త (నబీ). అల్లాహుతాలా ఖుర్ఆన్‌లో చెబుతున్నారు. ఒక ప్రవక్తకు మరొక ప్రవక్తపై ఆధిక్యత నిచ్చారని.

**"మరియు భూమ్యాకాశాలలో ఉన్న వారినందరి గురించి నీ ప్రభువుకు బాగా తెలుసు. మరియు వాస్తవానికి మేము కొందరి ప్రవక్తలకు మరికొందరిపై ఘనత నొసంగాము ..."** (ఖుర్ఆన్ 17:55)

ముహమ్మద్(స)వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలను అల్లాహుతాలా అనుగ్రహించారు. వాటిని ఇతర ప్రవక్తలకు అనుగ్రహించలేదు.

పూర్వం వచ్చిన ప్రవక్తలు ఒక ప్రత్యేక ప్రాంతానికో లేక ఒక ప్రత్యేక జాతికో సందేశమివ్వడానికి పంపబడ్డారు. కాబట్టి ఆ ప్రవక్తగారి అధికారం తన న్యాయపరిపాలనకి మాత్రమే పరిమితమై ఉండేది. ఉదాహరణకు

మూసా(అ) మరియు ఈసా(అ) బనీ ఇస్రాయీల్ వారికోసం పంపబడ్డారు.

ముహమ్మద్(స)వారు సర్వ మానవుల కొరకు పంపబడ్డారు. ఈ విషయం ఖుర్'ఆన్‌లో చాలా స్పష్టంగా చెప్పబడింది. క్రింది హదీస్ కూడా ఈ విషయాన్ని స్పష్టంగా వివరిస్తుంది.

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు, "నాకు ఐదు (విషయాలు) ఇవ్వబడ్డాయి. నాకు పూర్వం వచ్చిన ప్రవక్తలలో ఎవ్వరికీ ఇవ్వబడలేదు. అవి :

1. (అల్లాహ్‌చే) సహాయం చేయబడ్డాను ఒక నెల (ప్రయాణ) దూరంలో (ఉన్న శతృవుల హృదయాలలో) భయం పుట్టేలా.
2. భూమి అంతా చేయబడింది నా కొరకు మస్జిద్‌గా మరియు ఓ విషయం శుద్ధి కోసం (తయమ్ముమ్). కాబట్టి నన్ను అనుసరించే వారెవరైనా సలాత్ చేసుకోవచ్చు అతడు ఎక్కడుంటే అక్కడే సలాత్ సమయమైనప్పుడు.
3. యుద్ధప్రాప్తి నా కొరకు హలాల్ చేయబడింది.
4. ప్రతీ ప్రవక్త పంపబడేవాడు తన జాతికొరకు మాత్రమే కాని నేను పంపబడ్డాను సర్వమానవుల కొరకు.
5. నాకు ఇవ్వబడింది సిఫారసు చేసే హక్కు (తీర్పు దినం నాడు)

**(సహీహ్ బుఖారీ, 438, పుస్తకం 8, అధ్యా. 56, సంపుటి 1)**

**"(ఓ ముహమ్మద్!) వారికి చెప్పు : "మానవులారా! నిశ్చయంగా, నేను మీ అందరివైపునకు (పంపబడిన) అల్లాహ్ యొక్క సందేశహరుడుని ..."** (ఖుర్'ఆన్ 7:158)

పూర్వం వచ్చిన ప్రవక్తల యొక్క ప్రాతినిధ్యం మరియు ప్రవక్త పదవి ఓ జాతికోసం మరియు ఓ కాలం కోసమే. ఒక ప్రవక్త యొక్క పదవి పూర్తయ్యాక ఆ స్థానంలో మరొక ప్రవక్త వచ్చేవారు, ఆ స్థానంలో కొత్త ప్రతినిధిగా. అయితే వీరికి భిన్నంగా ముహమ్మద్(స)వారిని చిట్ట చివరి ప్రవక్తగా అల్లాహ్ పంపారు మరియు ఆ ప్రవక్త పదవి ప్రళయం వరకూ ఉంటుంది.

అదే విధంగా పూర్వపు ప్రవక్తలకు అందజేయబడిన ధర్మశాస్త్రం కూడా ఓ కాలానికో, ఓ జాతికో పరిమితమైంది. ఎప్పుడైతే ధర్మశాస్త్రం నుండి ప్రజలు ప్రక్కకు పోయారో, అల్లాహ్ మరో ప్రవక్తను కొత్త ధర్మ శాస్త్రంతో పంపేవారు. కాని ముహమ్మద్(స)వారికి ఇవ్వబడిన ధర్మశాస్త్రం విశ్వం ఉనికిలో ఉన్నంత వరకూ ఉంటుంది. ఖుర్'ఆన్‌ను అప్పటి వరకూ రక్షించే బాధ్యతను స్వయంగా అల్లాహ్‌యే తీసుకున్నారు.

**"నిశ్చయంగా మేమే ఈ ఖుర్'ఆన్‌ను అవతరింపజేసినవారము మరియు నిశ్చయంగా మేమే దీనిని కాపాడేవారము."** (ఖుర్'ఆన్ 15:9)

అల్లాహ్‌యే ధర్మ శాస్త్రాన్ని కాపాడుతున్నారు కాబట్టి, మరో కొత్త ప్రవక్త అవసరంగాని లేదా సందేశహరుని అవసరంగాని లేదు.

ఇస్రాయేలీయులు తమ ప్రవక్తలచే పరిపాలించబడ్డారు. ఒక ప్రవక్త కాలం అయిపోతే, ఆయన స్థానంలోకి మరొకరు వచ్చేవారు. ముహమ్మద్(స)వారి తరువాత మరొక ప్రవక్త రారు. ఆయన ప్రతినిధులు (ఖులఫా) కొనసాగుతారు. వారు చాలామంది ఉంటారు.

**ప్రపంచం ఎంత మారినా సరే, ముహమ్మద్(స)వారి ఉమ్మత్‌లో కొందరుంటారు, వారు సత్యాన్ని రక్షించుకుంటారు మరియు భద్రంగా చూసుకుంటారు. చివరికి వారిదే విజయం.**

ముహమ్మద్(స)వారి మరణం తరువాత పరిపాలించిన నలుగురు ఖలీఫాలను అల్-ఖులఫా అర్-రాషిదూన్ (సన్మార్గం పొందిన ఖలీఫాలు) అంటారు. వారు తీర్పులను తమ వ్యక్తిగత అభిప్రాయాల ప్రకారం ఇవ్వలేదు.

## ఆయత్ 34

**34.** మరియు మేము అల్లాహ్ యొక్క దూతలతో, **"మీరందరూ ఆదమ్ ముందు సజ్దా చేయండి."** అని ఆదేశించినప్పుడు, ఒక్క ఇబ్లీస్ తప్ప, మిగతా వారంతా సజ్దా చేశారు. అతడు నిరాకరించాడు మరియు దురహంకారానికి గురి అయ్యాడు మరియు సత్య తిరస్కారులలోని వాడయ్యాడు.

| فَسَجَدُوْٓا | لِاٰدَمَ | اسْجُدُوْا | لِلْمَلٰٓئِكَةِ | قُلْنَا | وَاِذْ |
|---|---|---|---|---|---|
| **వెంటనే సజ్దా చేశారు** | **ఆదమ్‌కు** | **సజ్దా చేయండి** | **అల్లాహ్ యొక్క దూతలకు** | **మేము చెప్పాము** | **మరియు అప్పుడు** |

| الْكٰفِرِيْنَ | مِنَ | وَكَانَ | وَاسْتَكْبَرَ | اَبٰى | اِبْلِيْسَ | اِلَّآ |
|---|---|---|---|---|---|---|
| **సత్యతిరస్కారులు** | **నుండి** | **మరియు అయ్యాడు** | **మరియు గర్వపడ్డాడు** | **తిరస్కరించాడు** | **ఇబ్లీస్** | **తప్ప** |

***ఈ ఆయత్‌లోని అరబీ పదాల అర్థాలు మరియు తఫ్సీర్, ఇన్షా అల్లాహ్, వచ్చే సంచికలో ...***

ప్రపంచ శాంతి దూత

సన్మార్గ బోధకుడు
నాయకుడు
ఆదర్శనీయుడు

# ముహమ్మద్ (స) వారి

## బోధనలు ఆచరణలు

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్థిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్లినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన ప్రోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్‌ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్‌ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

## ఉత్తమ సమాజం 18

(క్రిందటి సంచిక తరువాయి భాగం)

**ఈ నెల ప్రత్యేకం : సంపూర్ణ మద్యపాన నిషేధం**

**"మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము ....." (ఖుర్'ఆన్ 2:143)**

"And thus we have made you a **median [i.e. just] community** that you will be witnesses over the people and the Messenger will be a witness over you ....." (Qur'an 2:143)

**"మీరే మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు మంచిని ఆదేశించే (బోధించే)వారు మరియు చెడును నిరోధించే వారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు ..." (ఖుర్'ఆన్ 3:110)**

"You are the **best nation** produced [as an example] for mankind. You enjoin what is right and forbid what is wrong and believe in ALLAH ....." (Qur'an 3:110)



ఒక సమాజం ఉత్తమ సమాజం కావాలంటే జీవనోపాధి గురించి ఇతరులపై ఆధారపడకుండా, ఏ రిజర్వేషన్లు లేకుండానే ఏ విధంగా సాధించవచ్చో జూన్-జూలై'10 సంచికలోనూ, ఆర్థికంగా స్థిరపడిన తరువాత మనపై నున్న బాధ్యతలను తెలుసుకుని మసలుకోవాలని చెబుతూ, ముఖ్య బాధ్యతలను హదీస్‌ల ద్వారా క్లుప్తంగా తరువాయి సంచికలో వివరించడం జరిగింది. వ్యాపారం మరియు వ్యవసాయ ఉత్పత్తులు వాటికి సంబంధించిన విషయాలను, సంపాదన గురించి ఈ శీర్షికలోని గత మూడు వ్యాసాలలో అందించడం జరిగింది. హరామ్(నిషిద్ధ) వ్యాపారాలు చేయకూడదు. హలాల్ (ధర్మసమ్మతమైన) వ్యాపారంలో కూడా ఏ ఏ విషయాలు ప్రవక్త(స)వారిచే నిషేధించబడ్డాయో, ఏవి అనుమతించబడ్డాయో చెప్పడం జరిగింది.

వ్యాపారం గురించి, వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల గురించి, సంపాదన గురించి ముఖ్య విషయాలను ముహమ్మద్(స)వారి బోధనల ద్వారా తెలుసుకున్నాము. కేవలం బోధనలు వినడం వలన ఉత్తమ సమాజం ఏర్పడదు. వాటిని ఆచరణలో పెట్టాలి. వాటిలో కొన్నింటిని ఆచరణలో పెట్టడానికి నాయకుడు కఠినంగా వ్యవహరించాలి కూడా.

ఇదే శీర్షికలో వెనుకటి వ్యాసంలో జ్ఞానాన్ని 'ప్రాపంచిక జ్ఞానం మరియు ధార్మిక జ్ఞానం' అని వేర్వేరుగా జ్ఞానాలుగా విభజించ నవసరం లేదని, ఇస్లామీయ జ్ఞానమున్నవానికి ప్రాపంచిక జ్ఞానం బాగా ఉంటుందని చెప్పడం జరిగింది. ఇస్లామ్ అంటే కేవలం బోధించబడే ధర్మం కాదు. దానితోపాటు ఆచరణ కూడా ఉండాలి. ఇస్లామీయ జ్ఞానమున్న వ్యక్తి ఏదైతే ప్రజలకు బోధిస్తాడో అతడు కూడా దానిని ఆచరిస్తాడు.

## పొగత్రాగడం నిషేధమా?

క్రిందటి సంచికలో హదీస్‌ల ద్వారా మద్యపాన నిషేధం గురించి మరియు మద్యపానం వలన ఆరోగ్యంపై పడే చెడు ప్రభావాలను వివరించడం జరిగింది. మద్యం ఒక్కటే కాకుండా మత్తు కలిగించే పదార్థాలు ఎన్నో ఉన్నాయి. ఈ రోజుల్లో అందరికీ బాగా తెలిసినవి డ్రగ్స్. దురదృష్టవశాత్తూ నేటి కాలంలో కొన్ని కాలేజీలు, యూనివర్శిటీల లోకి కూడా ఈ మత్తుమందులు చొరబడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మద్యపానం గురించి శాంతిబాటలో ప్రచురించాక సిగరెట్లు, చుట్టల గురించి మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల గురించి చాలామంది అడిగారు. అవి కూడా నిషేధించ బడ్డాయా? అని అడుగుతున్నారు.

ముహమ్మద్(స)వారు కొన్ని పనుల నుండి ప్రజలను నిరోధించేవారు. అటువంటి వాటి గురించి ఇదే శీర్షికలో వ్యాపారానికి సంబంధించిన వ్యాసాలలో వివరించాము. **నిరోధించడం** అంటే **ఆపడం**. అది **నిషేధం** కాదు. నిషేధించబడిన పని చేయడం పాపం. అల్లాహ్ యొక్క సందేశహరుడు నిరోధించిన దానిని, ఆపకుండా కొనసాగిస్తే అందులో మనకు అనుగ్రహాలు ఉండవు.

### పొగత్రాగడం నిషేధమా? లేక నిరోధమా?

సిగరెట్ కాల్చడాన్ని లేదా బీడీ, చుట్టలు కాల్చడాన్ని ఖుర్'ఆన్ మరియు హదీస్‌లు నిషేధించాయా? అనే ప్రశ్న ఇస్లామ్‌పై అవగాహన ఉన్నవారిలో ఉత్పన్నం కాదు. ఎందుకంటే ఇస్లామ్ శుభ్రతకు అత్యంత ప్రాధాన్యత నిస్తుంది. శుభ్రతను సగం ఈమాన్‌కి సమానం చేసింది ఇస్లామ్. చెమట వాసన రాకుండా, సామూహిక సలాత్‌లలో పాల్గొన్నప్పుడు అత్తరు పూసుకోవడం గురించి అందరికీ తెలిసిన విషయమే. సిగరెట్లుగాని, బీడీలు గాని కాల్చేవారి దగ్గర **సువాసన వస్తుందా? దుర్వాసన వస్తుందా?** అత్తరు పూసుకుని వెళితే ఎవ్వరూ అభ్యంతరం చెప్పరు. సిగరెట్లు కాల్చేవారు వదిలే పొగ చూసి ప్రజలు తిట్టుకుంటారు. ఆ పొగ బారిన పడి తీవ్రంగా చిరాకు పడతారు. **'పొగ త్రాగరాదు'** అనే బోర్డులు చాలా చోట్ల దర్శనమిస్తాయి. మన దేశంలో కొన్ని చోట్ల సిగరెట్ కాలిస్తే, దానిని నేరంగా పరిగణించి శిక్ష వేస్తారు.

ఇస్లామ్ సూచించిన ప్రతీ నడవడిక తోటివారి నుండి ప్రశంసలు అందుకుంటుంది. కాబట్టి దుర్వాసన వెదజల్లే సిగరెట్లు, బీడీలకు ఇస్లామ్‌లో స్థానం లేదని ఓ మామూలు ముస్లిమ్ కూడా సులభంగానే చెప్పగలుగుతాడు.

అయితే కొందరు వితండవాదులున్నారు. 'పొగత్రాగడం' నిషేధమని ఖుర్'ఆన్‌లో స్పష్టంగా చెప్పబడిన ఆయత్ చూపిస్తేనే మానివేస్తాము అని చెప్పేవారున్నారు. అయితే దురదృష్ట వశాత్తూ వారు ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదివేవారు కాదు. అర్థం చేసుకుంటూ చదివితే స్పష్టంగా చాలా విషయాలు తెలుస్తాయి.

ఉదాహరణకు కేకులు, బిస్కట్లు ఉన్నాయి. **అవి తినవచ్చా? లేదా?** అని అడిగితే, వాటి గురించి ఖుర్'ఆన్‌లో వెతకనవసరం లేదు. వాటి తయారీలో హరామ్ చేయబడిన పదార్థాలేవీ ఉపయోగించకపోతే, అవి హలాల్ చేయబడిన వస్తువులతోనే తయారుచేయబడి ఉంటే, వాటిని నిరభ్యంతరంగా తినవచ్చు. అంతేగాని కేక్, బిస్కట్ అనే పేర్లు ఏ ఆయత్‌లోనూ లేవు కాబట్టి తినకూడదు అని అనడంలో అర్థం లేదు కదా.

కొన్ని పదార్థాలు మన ఆరోగ్యానికి హానికరం అని స్పష్టంగా తెలిసి నప్పుడు, వాటిని దూరంగా ఉంచాలి. అంతేకాదు హానికారకమైన వస్తువులను ఇతరుల నుండి కూడా దూరంగా ఉంచాలి. పొగత్రాగడం వలన ఊపిరితిత్తులకు కేన్సర్ సోకి మరణిస్తున్నారని స్పష్టంగా ఋజువైనప్పుడు, అటువంటి వాటిని వేరొకరికి అమ్మితే, అతని చావుకు మనం కూడా కారకులము అవుతాము. అంటే డబ్బు కోసం ఒక వ్యక్తిని చంపినట్లు అవుతుంది.

సిగరెట్ పెట్టెపై **'పొగత్రాగడం ఆరోగ్యానికి హానికరం'** అని ఉంటుంది. హానికరమైనది ఉపయోగిస్తే అది వివేకం అనిపించు కుంటుందా?

సిగరెట్లు, బీడీలు మరియు చుట్టలు వాటిని కాల్చేవారిని మాత్రమే కాకుండా, ఆ పొగబారినపడిన ఇతరుల ప్రాణాలకు కూడా అపాయం కలుగజేస్తాయి. దీనిని బట్టి స్పష్టంగా తెలిసేది ఏమిటంటే లంగ్ కేన్సర్ వచ్చి మరణం సంభవిస్తుందని తెలిసి కూడా ఒక వ్యక్తి పొగత్రాగి మరణిస్తే అది **ఆత్మహత్యగానూ** మరియు ఇతరులకు తాను వదిలే పొగద్వారా ప్రమాదం కలిగించినందుకు, అది **హింస / హత్య గానూ** పరిగణించ వలసి ఉంటుంది.

సిగరెట్ కాల్చడం వలన, కాల్చే వ్యక్తికిగాని, ప్రక్కనున్న వారికిగాని, కుటుంబానికి గాని ఎటువంటి ఉపయోగం లేదు. అంతేకాకుండా దాని వలన అందరికీ ఇబ్బందే.

సుగర్ తినడం హలాల్. కాని అది సుగర్ వ్యాధి ఉన్నవారికి నిరోధించబడింది. అది ఆ వ్యాధిగల వారికి మాత్రమే నిరోధంగాని, అతని కుటుంబమంతటికీ కాదు. సుగర్ వ్యాధి ఉన్న వ్యక్తి సుగర్ తిన్నా లేక తినకపోయినా, అతని కుటుంబ సభ్యులకు ఎటువంటి

హాని కలుగదు. కాని ఇంటిలో ఒకరు పొగత్రాగే వారుంటే , ఆ పొగ త్రాగిన వారికే కాకుండా, ఆ పొగను పీల్చిన కుటుంబ సభ్యులకు కూడా దాని వలన హాని కలుగుతుంది (పాసివ్ స్మోకింగ్ వలన).

ఇంతకు పూర్వం రెండు, మూడు సార్లు శాంతిబాటలో తెలిపిన ఓ హదీస్‌ను మరోసారి ఇక్కడ ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాము.

حَدَّثَنَا يَحْيَى بْنُ يَحْيَى قَالَ : قَرَأْتُ عَلَى مَالِكٍ عَنْ سُمَيٍّ، مَوْلَى أَبِي بَكْرٍ، عَنْ أَبِي صَالِحٍ، عَنْ أَبِي هُرَيْرَةَ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ : ((بَيْنَمَا رَجُلٌ يَمْشِي بِطَرِيقٍ، وَجَدَ غُصْنَ شَوْكٍ عَلَى الطَّرِيقِ، فَأَخَّرَهُ، فَشَكَرَ اللهُ لَهُ، فَغَفَرَ لَهُ)).

**అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం అల్లాహ్ యొక్క సందేశహరులు (ముహమ్మద్-స) ఇలా అన్నారు: "ఓ వ్యక్తి దారిన పోతుండగా, మార్గంపై ఓ ముళ్ళ కొమ్మను చూశాడు. దానిని తీసివేశాడు. దానిని (ఆ సత్కార్యాన్ని) అల్లాహ్ మెచ్చుకొని, అతనిని క్షమించాడు." (సహీహ్ ముస్లిమ్, నెం. 6669, సంపుటి 6, అధ్యా. 36)**

حَدَّثَنَاه أَبُو بَكْرِ بْنُ أَبِي شَيْبَةَ : حَدَّثَنَا عُبَيْدُ اللهِ : أَخْبَرَنَا شَيْبَانُ عَنِ الْأَعْمَشِ، عَنْ أَبِي صَالِحٍ، عَنْ أَبِي هُرَيْرَةَ عَنِ النَّبِيِّ ﷺ قَالَ : ((لَقَدْ رَأَيْتُ رَجُلًا يَتَقَلَّبُ فِي الْجَنَّةِ، فِي شَجَرَةٍ قَطَعَهَا مِنْ ظَهْرِ الطَّرِيقِ، كَانَتْ تُؤْذِي النَّاسَ)).

**అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా చెప్పారు: "ప్రజలకు ఇబ్బందిని కలిగించే మార్గంలోని చెట్టును నరికినందుకు గాను, స్వర్గంలో ఆనందిస్తున్న ఓ మనిషిని నేను చూశాను". (సహీహ్ ముస్లిమ్, నెం. 6671, సంపుటి 6, అధ్యాయం 36)**

పై హదీస్ ప్రకారం మన తోటివారికి హాని/ఇబ్బంది కలిగిస్తుందనే సంకల్పంతో ఓ ముళ్ళ కొమ్మను రహదారి నుండి తొలగిస్తే, ఆ వ్యక్తికి అంత పెద్ద ప్రతిఫలమా? ఖుర్‌ఆన్‌లో అల్లాహుతాలా చెబుతున్నారు, స్వర్గం అంత సులభంగా లభించదని. కాని పై హదీస్‌లోని వ్యక్తి చేసిన పని చాలా సులభమైనదే అయినప్పటికీ అతని సంకల్పం మాత్రం చాలా గొప్పది. అంటే **తోటివారికి హాని/ఇబ్బంది కలుగకుండా ఉండాలనే అతని సంకల్పం అల్లాహ్ నుండి ఊహించ నంత స్థాయిలో కారుణ్యాన్ని పొందగలిగింది.**

అల్లాహ్ కారుణ్యం లేకుండా కేవలం తన ఆచరణలతోనే ఏ విశ్వాసి కూడా స్వర్గాన్ని పొందలేడు. అందువలనే అల్లాహ్ కారుణ్యం లభించే ఏ పనిని కూడా విశ్వాసి వదులుకోడు. తోటివారికి ఇబ్బందిని తప్పించే ఏ పనినైనా చేయడానికి సిద్ధపడతాడు.

**మరి తోటివానికి మేలు చేయడానికి బదులుగా మనమే స్వయంగా అతనికి హాని కలిగిస్తే ఏమవుతుంది? కారుణ్యం లభిస్తుందా?** లేక దౌర్భాగ్యానికి గురౌతామా? సిగరెట్ త్రాగేవాడిది యాక్టివ్ స్మోకింగ్ అయితే అతని ప్రక్కనున్నవాడు ఆ పొగ పీలిస్తే అది పాసివ్ స్మోకింగ్ అవుతుంది. యాక్టివ్ స్మోకింగ్ వలన ఆరోగ్యానికి ఎంత హాని కలుగుతుందో, అంతకంటే ఎక్కువ హాని ప్రక్కనున్న పాసివ్ స్మోకింగ్ వ్యక్తికి కలుగుతుంది. అంటే పొగ త్రాగేవాడికంటే, ఆ పొగవలన ఇతరులకు హాని ఎక్కువ జరుగుతుంది. కాబట్టి **పొగ త్రాగేవాడు చేసేపని పై హదీస్‌కు పూర్తి వ్యతిరేకంగా చేసే పని. కాబట్టి సిగరెట్లు మరియు చుట్టలు త్రాగే ముస్లిములు ఎవరైనా ఉంటే, పొగత్రాగడాన్ని ఈ రోజు నుండి ఆపివేస్తారని ఆశిస్తున్నాము. అల్లాహ్ కారుణ్యానికి దూరం కావద్దని మనవి చేసుకుంటున్నాము.**

పొగత్రాగడం వలన సంవత్సరానికి 10 లక్షలమంది చనిపోతున్నారు. 2010వ సంవత్సరంలో 5 లక్షల 56వేల మంది కేన్సర్‌తో చనిపోయారు. మరణానికి కారణమౌతున్న కాన్సర్‌లలో పొగాకు ఉత్పత్తుల వలన కలిగే కాన్సర్‌లు మరియు సెర్వికల్ కాన్సర్ (కంఠానికి చెందిన కాన్సర్)లే ఎక్కువగా ఉన్నాయి. ఈ కాన్సర్‌లు పట్టణ ప్రాంతంలో కంటే గ్రామీణ ప్రాంతంలోనే మూడురెట్లు అధికంగా ఉన్నాయని చెబుతున్నారు.

మస్జిద్ ప్రాంగణంలో ప్రార్థన కోసం వచ్చేవారికి ఒంటికి, రెంటికి అవసరమైనప్పుడు, వారి సౌకర్యం కొరకు టాయిలెట్స్ ఏర్పాటు ఉంటుంది. దురదృష్టవశాత్తూ ఆ టాయిలెట్స్ దగ్గర గుట్కాలు మొదలైన వాటిని ఉమ్మడం ద్వారా ఎర్రటి మరకలు జుగుప్సాకరంగా ఉంటాయి. శుభ్రత సగం విశ్వాసం (ఈమాన్) అని ఇస్లామ్ బోధిస్తుంటే, ఆ బోధనకు వ్యతిరేకంగా చేయడం వలన లభించేది అనుగ్రహమా లేక ఆగ్రహమా? ఇది కూడా తోటివారికి ఇబ్బంది కలిగించడమే కదా!

ఇటువంటివి మానుకోమని చెబితే, వాటిని ఇస్లామ్ నిషేధించలేదని ఎలా చెప్పగలుగుతున్నారు? **అల్లాహ్ కారుణ్యం పొందాలను కునేవారు మాత్రం ఇటువంటివి మానుకుంటారు.**

"మరియు అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టండి. మరియు **మీ చేతులారా మిమ్మల్ని వినాశంలో పడవేసుకోకండి.** మేలు చేయండి, నిశ్చయంగా అల్లాహ్ మేలు చేసేవారిని ప్రేమిస్తాడు. (ఖుర్‌ఆన్ 2:195)

సిగరెట్ కోసం పెట్టే ఖర్చు అల్లాహ్ మార్గంలో పెట్టే ఖర్చు కాదు. పొగ త్రాగడం ద్వారానూ మరియు పొగాకు ఉత్పత్తులైన ఖైనీ, పాన్ మసాలా, గుట్కా మొదలైనవి ఎవరైనా నమలడం ద్వారా వారు చేతులారా తమను తాము వినాశంలో పడవేసుకుంటున్నారు. అలా చేసుకోవద్దని పై ఆయత్‌లో అల్లాహ్ సూచిస్తున్నారు. "మేలు చేయండి" అని అల్లాహ్ చెబితే, దురలవాట్ల ద్వారా వారు తోటివారికి హాని కలిగిస్తున్నారు. "నిశ్చయంగా అల్లాహ్ మేలు చేసేవారిని ప్రేమిస్తాడు." అని పై ఆయత్‌లో చెప్పబడింది. దీనికి విరుద్ధంగా హాని కలిగిస్తున్నారు కాబట్టి, **'అల్లాహ్ ప్రేమించడు'** అని అర్థమౌతుంది. పై ఆయత్‌ను పదే పదే చదివి ఆలోచించాలి! పొగ త్రాగడం నిషేధమా లేక నిరోధమా లేక మరేమిటి అనేది సులభంగానే అర్థమౌతుంది.

"ఓ విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్ము నొకరు అన్యాయంగా తినకండి, పరస్పర అంగీకారంతో చేసే వ్యాపారం వల్ల వచ్చేది తప్ప. మరియు **మీరు ఒకరినొకరు చంపుకోకండి**. నిశ్చయంగా అల్లాహ్ మీ యెడల అపార కరుణాప్రదాత. (ఖుర్'ఆన్ 4:29)

హానికరమైన వస్తువులను అమ్మడం మరియు వాటిని కొని ఉపయోగంలో పెట్టడం అంటే 'అది ఒకరినొకరు చంపుకోవడం'లోకి వస్తుందో? లేదో? ఆలోచించండి.

**పై రెండు ఆయత్‌లు మరియు హదీస్‌లను బట్టి స్పష్టంగా తెలిసేది ఏమిటంటే పొగత్రాగడం అనేది ఒక విశ్వాసికి విశేషంగా నష్టం కలిగిస్తుందని.**

ప్రపంచ ఆరోగ్య సంస్థ 25 సంవత్సరాలుగా పొగాకు ఉత్పత్తులను నిర్మూలించడానికై గట్టిగా కృషి చేస్తుంది ఆ సంస్థ వేసిన అంచనా ప్రకారం 2030 సంవత్సరం వచ్చేసరికి ప్రతీ సంవత్సరం 80 లక్షలమంది ప్రజలు పొగాకు వలన మరణిస్తారని. ఈ విధంగా మరణించేవారిలో, పొగ త్రాగకపోయినా దానిని త్రాగేవారి పక్కన ఉండేవారు కూడా ఉన్నారు.

పొగాకును ఉపయోగించడం వలన **మన దేశంలో** ప్రతీ రోజు 2,500 మంది మరణిస్తున్నారు. ఇండియాలో 9 కోట్ల 40 లక్షల మంది పొగ త్రాగేవారున్నారు. వీరిలో 1 కోటి 40 లక్షల మంది COPD వ్యాధితో తీవ్రంగా జబ్బుపడి ఉన్నారు. ఇండియాలో చావులకు కారణమయ్యే వాటిలో 4వ కారణం పొగత్రాగడమే.

30 మరియు 69 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీలలో 5 శాతం మంది మరియు పురుషులలో 33 శాతం మంది బీడీలు కాల్చే వారున్నారు మరియు సిగరెట్లు కాల్చేవారున్నారు. బీడీలు కాల్చేవారు చాలా తొందరగా మరణానికి గురి అవుతున్నారు.

- సిగరెట్లు త్రాగని వారికంటే, వాటిని త్రాగేవారి మరణం 10 సంవత్సరాలకు ముందే సంభవిస్తుందని అంచనా వేశారు. సిగరెట్ ఎందుకు కాల్చుతారు? దాని వలన టెన్షన్ తగ్గుతుందని భావిస్తున్నారు గాని, దాని వలన అది మరింత పెరుగుతుంది.
- ప్రతీ సంవత్సరం 8 లక్షల కేన్సర్ కేసులు కొత్తవి నమోదు అవుతున్నాయి. వాటిలోని 3,20,000 కేసులు తల మరియు మెడ కాన్సర్‌లకు సంబంధించినవి అయితే, మిగతా 4,80,000 పొగాకు ఉత్పత్తుల వాడకం వలన వచ్చినవి.
- పొగాకు వాడకం వలన ప్రపంచం మొత్తం మీద ప్రతీ సంవత్సరం 49 లక్షల మంది మరణిస్తుంటే, దానిలోని 10 లక్షల మంది మన దేశంలోనే మరణిస్తున్నారు. హార్ట్ ఎటాక్‌లు, పక్షవాతం, అబార్షన్లు, ఫీటల్ గ్రోత్ రిటార్డేషన్‌కు ఇది కారణమౌతుంది.

పొగత్రాగితేనే ప్రమాదమని, పొగలేకపోతే ఫర్వాలేదనే తప్పుడు భావంతో చాలామంది ఉన్నారు. దాని ఫలితంగా చాలా రకాల పొగాకు ఉత్పత్తులు మార్కెట్లోకి వచ్చాయి. వాటిని నములుతున్నారు.

పొగరాని పొగాకుకు సంబంధించి చాలా రూపాలున్నాయి. వాటిలో కొన్ని : గుట్కా, ఖైనీ, జర్దా, మిషి, మవ మరియు పాన్ మసాలా. వీటిని చిన్న పాకెట్లలో తక్కువ రేటుకి అమ్ముతున్నారు.

ఈ ప్లాస్టిక్ పాకెట్ల వలన పర్యావరణానికి ఎంతో నష్టం కలుగుతుంది. అంతేకాకుండా కాన్సర్ కలిగించే విషపూరితమైన పదార్థాలు ఈ ఉత్పత్తులు కలిగి ఉన్నాయి. వీటివలన నోటి సంబంధమైన మరియు pancreatic కేన్సర్‌లు వస్తున్నాయి. ఇవి బ్లడ్ ప్రెషర్‌ని పెంచుతాయి మరియు సంతానోత్పత్తి విషయంలో చెడు ప్రభావాన్ని చూపుతాయి.

దీని వలన వచ్చే రోగాల పట్టిక చాలా పెద్దదే ఉంది. పొగత్రాగే వారి చుట్టుపక్కల ఉండేవారికి (పాసివ్ స్మోకర్స్‌కి) ఆ పొగ వలన కరోనరీ హార్ట్ డిసీజ్ (హార్ట్ ఎటాక్) ప్రమాదముంది.

పొగాకు యొక్క పొగలో నికొటిన్, తార్, HCN, వోలటైల్ అల్డెహైడ్స్ మరియు నైట్రోసమైన్స్ వంటి ప్రమాదకర పదార్థాలున్నాయి.

పొగాకు ఉత్పత్తులను నమిలేవారిలో, నికొటిన్ ఓరల్ టిష్యూలచే పీల్చుకోబడుతుంది మరియు అది మెదడుకు చేరే రక్తంలో కలుస్తుంది. ఒకవేళ నమిలినదానిని ఊసేసినప్పటికీ, నికొటిన్ ఇంకనూ రక్త ప్రవాహంలోనే ఉంటుంది (పొగ త్రాగేవారికంటే, పొగాకు సంబంధిత ఉత్పత్తులను నమిలేవారిలో నికొటిన్ ఎక్కువ సేపు రక్తంలో ఉంటుంది.)

గుట్కా కూడా డోస్ ఎక్కువయితే అది కూడా డ్రగ్‌తో సమానం అవుతుంది. దీర్ఘ కాలికంగా వాడటం వలన oral submucous fibrosisకి కారణమౌతుంది. ఈ పరిస్థితిలో నోరు తెరవడం కష్టమౌతుంది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ప్రకారం కాన్సర్‌కి దారి తీస్తుంది. worsening of asthma. నోటి కాన్సర్ మాత్రమే కాకుండా లివర్, cervix, ఉదరం, ప్రొస్టేట్ మరియు ఊపిరితిత్తుల కేన్సర్‌కి కారణమయ్యే ప్రమాదం ఉంది. కండరాలు గట్టిగా అయిపోవడం, శరీరంలో కొన్ని భాగాలు కదపడం కష్టం అవుతుంది. చెప్పాలంటే ఇంకా చాలా పెద్ద జాబితాయే ఉంది.

ముహమ్మద్(స)వారు మిస్వాక్‌ని ఉపయోగించేవారు. నోటి శుభ్రత కొరకు ఎంతో ప్రాధాన్యత నిచ్చేవారు. పొగత్రాగడం వలన నోరు మాత్రమే కాదు, మన చుట్టూ ఉండే వాతావరణం కలుషితమవుతుంది.

కాబట్టి పొగత్రాగడం వలన త్రాగేవారికి, తోటివారికి మరియు పర్యావరణానికి హాని ఉంది. మరి ఇటువంటి హానికి కారణమై, అల్లాహ్ కారుణ్యానికి దూరం కావడానికే నిర్ణయించుకుంటే దాని ప్రతిఫలం ఏమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

**ఉత్తమ సమాజంలో దురలవాట్లకు స్థానం లేదు. ఈ వ్యాసంలో మేము రెండు ఆయత్‌లను మరియు రెండు హదీస్‌లను మాత్రమే అందించాము. ఖుర్'ఆన్ చదువుతూ ఉంటే ఈ అంశానికి సంబంధించి అసంఖ్యాకమైన ఆయత్‌లను మీరు గమనించ గలుగుతారు.**

ఇన్షా అల్లాహ్ మరొక అంశంపై వచ్చే సంచికలో ...




సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి ఆయనపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

# సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

**15**

## విశ్వాస పునాది మరియు శిక్షణ
### (ముహమ్మద్(స)వారి అనుచరులలో)

ఇస్లామ్ స్వీకరించిన తరువాత, స్వీకరించిన వారి హృదయాలలో సుస్థిరమైన విశ్వాస పునాదిని ప్రవక్త(స)వారు ఏ విధంగా వేశారో క్రిందటి సంచికలో ప్రారంభించడం జరిగింది. ఆ విధంగా పునాది వేయడంలో భాగంగా '**అల్లాహ్**' అంటే ఏమిటో వారికి స్పష్టంగా అర్థమయ్యేలా, మరియు వారి హృదాయలలోని పూర్వకాలపు తప్పుడు భావనలు ఏమైనా ఉండి ఉంటే వాటిని ఖుర్'ఆన్ ద్వారా తొలగించారు. **'అల్లాహ్' అంటే స్పష్టమైన అవగాహన లేకపోతే ఎవరైనా విశ్వాసి ఎలా కాగలడు?** ఆ విధంగా ముహమ్మద్(స)వారి శిక్షణ ద్వారా వారు అల్లాహ్ గురించి స్పష్టమైన అవగాహనను అనుచరులు పొందగలిగారు.

మక్కాలో అవతరించబడిన ఖుర్'ఆన్ ఆయత్‌లు - ప్రవక్త(స)వారి అనుచరుల హృదయాలలో సంపూర్ణ తౌహీద్‌ను మరియు ప్రవక్త(స)వారి కర్తవ్యపాలనని నాటుకునేలా చేశాయి. అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసంతో పాటు, కొన్ని అగోచరమైన విషయాలను మనస్ఫూర్తిగా విశ్వసించినప్పుడు మాత్రమే, ఒక వ్యక్తి పరిపూర్ణమైన 'విశ్వాసి' కాగలుగుతాడు. ఆ అగోచర విషయాలన్నింటినీ ఖుర్'ఆన్ ద్వారా ముహమ్మద్(స)వారు స్పష్టంగా వివరించారు. ఆ విధంగా ముహమ్మద్(స)వారి ద్వారా శిక్షణ పొందిన సహాబీలు కష్టాలకు చలించకుండా సంతోషంగా జీవించ గలిగారు. ప్రవక్త(స)వారు తన అనుచరులకు ఇచ్చిన శిక్షణ వంటిది, **మనలోని ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పొందాలి.**

ఆ కాలంలో ఫరిష్తాల విషయంలో మక్కా ప్రజలకు కొన్ని అపోహలు ఉండేవి. వారు ఇస్లామ్ స్వీకరించిన తరువాత ఫరిష్తాలపై వారికి ఉన్న అటువంటి భావాలను మక్కాలో అవతరించబడిన ఖుర్'ఆన్ ఆయత్‌లు చక్కదిద్దాయి. ఫరిష్తాలు (అల్లాహ్ యొక్క దూతలు) కూడా అల్లాహ్ యొక్క సృష్టేనని అవి స్పష్టం చేశాయి.

ప్రస్తుత కాలంలో అందరమూ తెలుగు లేదా ఇంగ్లీష్ లేదా ఉర్దూలో ఉన్న అనువాదాలపై ఆధారపడ్డాము. ఈ అనువాదాలలో చాలా వరకూ ఉద్దేశ్యపూర్వకంగానో లేదా తెలియ కుండానో వాడిన పదాలు వాటిని చదివే వారిలో స్పష్టమైన భావనను కలుగజేయడం లేదు. ఉదాహరణకు 'తఖ్వా' అంటే 'దైవభీతి' అని అనువాదం జరిగింది. ఇది సాధారణమైన పదం కావడంతో కొందరు దానిని అన్నింటికి వర్తింపజేసి, ప్రజలకు అనుమానాలు కలిగేలా చేస్తున్నారు.

కాని 'తఖ్వా' అంటే '**అల్లాహ్ పట్ల ఉండే భీతి**' అని అనువదిస్తే, ఈ పదాన్ని వక్రీకరించడానికి ఎవరికైనా ఏ మాత్రం అవకాశం ఉండదు. అదే విధంగా 'మలాయికతున్' అనే అరబీ పదానికి 'దైవ దూతలు' లేదా దేవదూతలు అని అనువదిస్తున్నారు. కాని వాస్తవంగా వారు **"అల్లాహ్ యొక్క దూతలు"**. ఈ దూతలు అల్లాహ్‌ను ఆరాధిస్తూ మరియు ఆయనకు సజ్దా చేస్తుంటారు. అల్లాహ్‌కు దాసులు ఈ దూతలు. అంతేగాని అల్లాహ్‌కు భాగస్వాములు కారు. అల్లాహ్ ఆదేశిస్తే తప్ప వారు స్వయంగా మనకు మేలుగాని, కీడుగాని చేయలేరు.

ఫరిష్తాలను విశ్వసించడం కూడా విశ్వాసంలో ఒక ముఖ్యమైన భాగం. ఇక్కడ విశ్వసించడమంటే, వారు **అల్లాహ్ యొక్క సృష్టి అని నమ్మాలి.** ఫరిష్తాలు ఉన్నారని నమ్మడం. ఎందుకంటే సాధారణంగా వారు ఎవరికీ కనిపించరు. కాబట్టి ఫరిష్తాల గురించి స్పష్టంగా ఖుర్'ఆన్‌లో చెప్ప బడింది. వాటిలోని కొన్ని ఆయత్‌లు దిగువన అందిస్తున్నాము. అల్లాహ్ యొక్క దూతలు ఎల్లప్పుడూ అల్లాహ్‌ను ఆరాధిస్తూ, ఆయన ఆదేశాన్ని పాటిస్తూ ఉంటారు.

> మరియు ఉరుము ఆయన పవిత్రతను కీర్తిస్తుంది. ఆయన స్తోత్రం చేస్తుంది. మరియు అల్లాహ్ దూతలు కూడా ఆయన పట్ల భయంతో (స్తోత్రం చేస్తూ ఉంటారు). మరియు ఆయన ఫెళఫెళమనే ఉరుములను పంపి, వాటి ద్వారా తాను కోరిన వారిని శిక్షిస్తాడు. అయినా వీరు అల్లాహ్‌ను గురించి వాదులాడు తున్నారు. మరియు ఆయన అద్భుత యుక్తిపరుడు **(ఖుర్'ఆన్ 13:13)**

---

> మరియు ఆకాశాలలోను మరియు భూమిలోనూ ఉన్న సమస్త ప్రాణులు మరియు అల్లాహ్ యొక్క దూతలు అందరూ అల్లాహ్‌కు సజ్దా చేస్తూ ఉంటారు. వారెన్నడూ గర్వపడరు. **(ఖుర్'ఆన్ 16:49)**

సకల పొగడ్తలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! ఆకాశాలు మరియు భూమి యొక్క సృష్టికి మూలాధారి. ఆయనే మలాయికను (అల్లాహ్ యొక్క దూతలను) సందేశాలు అందేజేసేవారిగా నియమించాడు. వారు రెండేసి, మూడేసి లేదా నాలుగేసి రెక్కలు గలవారు. ఆయన తన సృష్టిలో తాను కోరిన దానిని అధికం చేస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతీదీ చేయగల సమర్థుడు **(ఖుర్'ఆన్ 35:1)**

---

నిశ్చయంగా, నీ ప్రభువుకు దగ్గరగా ఉన్నవారు (అల్లాహ్ యొక్క దూతలు) తమ ప్రభువును ఆరాధించటానికి అహంభావం చూపరు మరియు ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటారు మరియు ఆయనకే సజ్దా చేస్తూ ఉంటారు **(ఖుర్'ఆన్ 7:206)**

అల్లాహ్ యొక్క దూతలకు అహంకారం ఉండదు. అల్లాహ్ యొక్క పవిత్రతను కొనియాడుతూ ఉంటారు. అల్లాహ్‌కు సజ్దా చేస్తుంటారు. వారు అల్లాహ్ యొక్క సందేశాలను అందజేస్తూ ఉంటారు. ఇదే సంచికలో సైన్స్ మరియు ధర్మం గురించి ఓ వ్యాసాన్ని అందించాము. అల్లాహ్ ఆదేశంతో ఆ దూతలు చేసే మరికొన్ని పనులను ఆ వ్యాసంలో చూడగలరు.

**ఖుర్'ఆన్ మరియు పూర్వపు గ్రంథాల విషయంలో ...**

క్రిందటి సంచికలో ఇదే శీర్షికలోని వ్యాసంలో ముహమ్మద్(స)వారికి పూర్వం వచ్చిన కొందరు ప్రవక్తల గురించి చెప్పడం జరిగింది. వీరందరూ అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని ప్రజలకు ఎలా బోధించారో, ముహమ్మద్(స)వారు కూడా అలాగే బోధించారని చెప్పడం జరిగింది. వారిలో కొందరికి గ్రంథాలు ఇవ్వబడ్డాయి.

"మరియు (ఓ ముహమ్మద్) నీవు ప్రజలకు నెమ్మది నెమ్మదిగా చదివి వినిపించాలని, మేమే ఖుర్'ఆన్‌ను విభజించి క్రమక్రమంగా అవతరింపజేశాము" **(ఖుర్'ఆన్ 17:106)**

---

ఆయన అవతరింపజేశాడు నీపై గ్రంథాన్ని సత్యంతో **(ఖుర్'ఆన్ 3:3)**

---

"అల్లాహ్ **సర్వశ్రేష్ఠమైన బోధనను** (ఖుర్'ఆన్‌ను) ఒక గ్రంథ రూపంలో అవతరింప జేశాడు. దానిలో ఒకే రకమైనవి మాటిమాటికి ఎన్నో విధాలుగా. తమ ప్రభువుకు భయపడేవారి శరీరాలు దానితో గజగజ వణుకుతాయి. తరువాత వారి చర్మాలు మరియు వారి హృదయాలు అల్లాహ్ ధ్యానం వలన మెత్త బడతాయి. ఇది అల్లాహ్ మార్గదర్శకత్వం. **ఆయన దీనితో తాను కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు.** మరియు ఏ వ్యక్తిని అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో వదులుతాడో అతనికి మార్గదర్శకుడు ఎవ్వడూ ఉండడు." **(ఖుర్'ఆన్ 39:23)**

---

మరియు మేము పూర్వం గతించిన వారి వద్దకు ఎంతోమంది ప్రవక్తలను పంపాము. **(ఖుర్'ఆన్ 43:6)**

మరియు భూమ్యాకాశాలలో ఉన్నవారందరి గురించి నీ ప్రభువుకు బాగా తెలుసు. మరియు వాస్తవానికి మేము కొందరు ప్రవక్తలకు మరి కొందరిపై ఘనత నొసంగాము. మరియు మేము దావూద్‌కు జబూర్ నిచ్చాము. **(ఖుర్'ఆన్ 17:55)**

---

మరియు (ఓ ముహమ్మద్!) వాస్తవానికి మేము నీకు పూర్వం అనేకమంది ప్రవక్తలను పంపాము. వారిలో కొందరి వృత్తాంతం మేము నీకు తెలిపాము. మరికొందరిని గూర్చి నీకు తెలుపలేదు. మరియు అల్లాహ్ అనుమతి లేనిదే, ఏ ప్రవక్త కూడా ఏ అద్భుత క్రియలను స్వయంగా చేయలేడు. కాని అల్లాహ్ ఆజ్ఞ వచ్చినప్పుడు, న్యాయంగా తీర్పు చేయబడుతుంది. మరియు అప్పుడు అసత్యవాదులు నష్టానికి గురి అవుతారు. **(ఖుర్'ఆన్ 40:78)**

## అగోచర విషయాలు

విశ్వాసం (ఈమాన్)కి సంబంధించి అతి ముఖ్యమైన మరో భాగం ఉంది - స్వర్గం మరియు నరకం ఉన్నాయని నమ్మడం. స్వర్గం మరియు నరకం అనేవి ఉన్నాయని, తాను చేసిన కర్మల ఫలితంగా ఆ రెండింటిలో ఏదో ఒకటి శాశ్వతంగా లభిస్తుందని నమ్మకపోతే ఆ వ్యక్తికి ఈమాన్ లేనట్లే.

> కాబట్టి ఒక విశ్వాసిని ధర్మాచరణలో ఉంచడానికి మరియు ధర్మంపై స్థిరంగా ఉంచడానికి స్వర్గం మరియు నరకంపై సరియైన అవగాహన కలిగియుండటం తప్పనిసరి. ఈ విషయాలు చాలా స్పష్టంగా హదీస్ శీర్షికలో ఇన్షా అల్లాహ్ వివరించ బడతాయి.

మక్కాలో అవతరించిన ఆయత్‌లలో స్వర్గం మరియు నరకం యొక్క వర్ణనలు ఎన్నో ఉన్నాయి. ఖుర్'ఆన్‌లోని ఆయత్‌లు వివరించిన ఆ వర్ణనలను చదువు తుంటే, ఎవరికైనా కళ్ళ ఎదురుగా పునరుత్థాన దినం ఉన్నట్లు అనిపిస్తుంది. ఉదాహరణకు క్రింది ఆయత్‌లు చూడండి

వారు అల్లాహ్ సామర్థ్యాన్ని గుర్తించవలసిన విధంగా గుర్తించలేదు. పునరుత్థాన దినమున **భూమి అంతా ఆయన పిడికిలిలో ఉంటుంది మరియు ఆకాశాలన్నీ చుట్టబడి ఆయన కుడిచేతిలో ఉంటాయి.** ఆయన సర్వలోపాలకు అతీతుడు మరియు వారు కల్పించే భాగ స్వాముల కంటే అత్యున్నతుడు. మరియు బాకా ఊదబడినప్పుడు ఆకాశాలలో మరియు భూమిలో ఉన్న వారందరూ మూర్ఛిల్లి పడిపోతారు - అల్లాహ్ కోరినవారు తప్ప. ఆ తరువాత రెండవసారి బాకా ఊదబడుతుంది. అప్పుడు వారందరూ లేచి చూడటం ప్రారంభిస్తారు. మరియు భూమి తన ప్రభువు తేజస్సుతో వెలిగిపోతుంది మరియు కర్మ పత్రం వారియెదుట ఉంచబడింది. ప్రవక్తలు మరియు సాక్షులు రప్పింపబడతారు. మరియు వారి మధ్య న్యాయంగా తీర్పు చేయ బుతుంది మరియు వారికెలాంటి అన్యాయం జరగదు. మరియు ప్రతి వ్యక్తి తాను చేసిన కర్మలకు పూర్తి ప్రతిఫలం పొందుతాడు.

ఎందుకంటే వారు చేస్తున్నదంతా ఆయనకు బాగా తెలుసు. సత్యాన్ని తిరస్కరించిన వారు గుంపులు గుంపులుగా నరకం వైపునకు తోలబడతారు. చివరకు వారు దాని వద్దకు వచ్చినప్పుడు, దాని ద్వారాలు తెరువబడతాయి. మరియు వారితో దాని రక్షకులు ఇలా అంటారు : **"ఏమీ? మీలో నుండి, మీ ప్రభువు సూచనలను వినిపించే సందేశహరులు మీ వద్దకు రాలేదా? మరియు వారు మిమ్మల్ని ఈనాటి మీ సమావేశాన్ని గురించి హెచ్చరించలేదా?"** వారంటారు : **"అవును"** కాని సత్యతిరస్కారులపై శిక్షా నిర్ణయం తీసుకోబడింది. వారితో ఇలా అనబడుతుంది : **"నరక ద్వారాల లోనికి ప్రవేశించండి. ఇక్కడ మీరు శాశ్వతంగా ఉంటారు. గర్విష్ఠుల నివాస స్థలం ఎంత చెడ్డది!"** మరియు తమ ప్రభువు పట్ల భయభక్తులు గలవారు గుంపులు గుంపులుగా స్వర్గం వైపునకు తీసుకొని పోబడతారు. చివరకు వారు దాని దగ్గరికి వచ్చినప్పుడు, దాని ద్వారాలు తెరువబడతాయి మరియు దాని రక్షకులు వారితో అంటారు : **"మీకు శాంతి కలుగుగాక (సలాం)! మీరు మంచిగా ప్రవర్తించారు. కావున ఇందులో శాశ్వతంగా ఉండటానికి ప్రవేశించండి!"** మరియు వారంటారు : "మాకు చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపిన అల్లాహ్‌యే సర్వస్తోత్రాలకు అర్హుడు మరియు ఆయనే మమ్మల్ని ఈ నేలకు వారసులుగా చేశాడు. స్వర్గంలో మేము కోరిన చోట స్థిరనివాసం ఏర్పరచు కోగలము! సత్కార్యాలు చేసేవారి ప్రతిఫలం ఎంత ఉత్తమమైనది!" మరియు అల్లాహ్ దూతలు, తమ రబ్ (ప్రభువు) పవిత్రతను కొనియాడుతూ, ఆయన అర్ష్‌ను అన్ని వైపుల నుండి చుట్టుకుని ఉండటాన్ని నీవు చూస్తావు. మరియు వారి మధ్య న్యాయంగా తీర్పు చేయబడుతుంది. మరియు "సర్వస్తోత్రాలకు అర్హుడైన అల్లాహ్‌యే సమస్త లోకాలకు ప్రభువు." అని పలుకబడుతుంది **(ఖుర్'ఆన్ 39:67-75)**

ఒక వ్యక్తి ఇస్లామ్ స్వీకరించి, అల్లాహ్ ఒక్కరినే ఆరాధిస్తున్నాడని మరియు షిర్క్ చేయడం లేదంటే సరిపోదు. ఆ వ్యక్తి **మోమిన్** (విశ్వాసి) కావాలి. ఎందుకంటే మోమిన్లు మాత్రమే స్వర్గంలో ప్రవేశించ గలుగుతారు. కాబట్టి ముస్లిమ్ అయినంత మాత్రాన స్వర్గ ప్రవేశం లేదు.

## స్వర్గం

అగోచర (కంటికి కనిపించని) విషయాలలో ఇది ఒకటి. ఖుర్'ఆన్ లోని ఎన్నో ఆయత్‌లలో స్వర్గం యొక్క వర్ణనలు ఉన్నాయి. అయితే స్వర్గాన్ని పోలినదేదీ లేదు. స్వర్గానికి ద్వారాలున్నాయి. వాటిని మన ద్వారాలతో పోల్చలేము. స్వర్గంలో కూడా వివిధ స్థాయిలుంటాయి. దాని క్రింద నదులు ప్రవహిస్తూ ఉంటాయి. నీటి ధారలు, భవనాలు రకరకాల చెట్లు ఉంటాయి. స్వర్గ నివాసులకు లభించే అనుగ్రహాలు కూడా అల్లాహ్ ఖుర్'ఆన్‌లో ప్రస్తావించారు. వారికి ఆహారం, పానీయం, దుస్తులు, అభరణాలు, సేవకులు, స్త్రీలు మొదలైనవెన్నో. ఇవన్నీ ఇహలోకంలో లభించేటటు వంటివి కావు. ఇహలోకంలో తనివి తీరదు. అంటే సంతృప్తి కలగదు. ఆశ పెరుగుతూనే ఉంటుంది. స్వర్గంలో తనివి తీరుతుంది. పూర్తి సంతృప్తి ఉంటుంది.

స్వర్గం గురించి ఖుర్'ఆన్‌లో ప్రస్తావించబడిన కొన్ని వర్ణనలు దిగువనిస్తున్నాము.

### 1. స్వర్గాన్ని పోలినదేదీ లేదు.

అల్లాహ్ యొక్క అపరిమిత కారుణ్యం నుండి అందే ఓ భాగమే - ఈ స్వర్గ భోగం. ఈ స్వర్గాన్ని అల్లాహుతాలా తన దాసులకొరకు సిద్ధం చేశారు. ఇక్కడ మనమందరం గుర్తు పెట్టుకోవలసింది ఒకటుంది. అల్లాహ్ స్వర్గంలోని కొన్ని సౌఖ్యాల గురించి మాత్రమే ఖుర్'ఆన్‌లో వర్ణించడం జరిగింది. ఆయన చాలా విషయాలు మానవులకు తెలియజేయలేదు. ఒకవేళ ఆయన వాటిని చెప్పినా కూడా, అవి ఈ లోకంలో మనకు అర్థం కావు.

"కాని వారికి, వారి కర్మల ఫలితంగా వారి కొరకు (పరలోకంలో) **కళ్ళకు చలువనిచ్చే ఎటువంటి సామాగ్రి దాచిపెట్టబడి ఉందో ఏ ప్రాణికీ తెలియదు.**" (ఖుర్'ఆన్ 32:17)

అల్లాహ్ తన విధేయులైన దాసులకే ఉత్తమ ప్రతిఫలాన్ని ఇవ్వడానికి గల కారణం స్పష్టం చేశారు - వారు సత్కార్యాలు చేస్తుంటారు రాత్రివేళల్లో ప్రార్థనలు మరియు ఇస్లామ్ మార్గంలో ఖర్చు చేయడం మొదలైనవి. అల్లాహ్ చెప్పారు :

"వారు తమ ప్రక్కలను తమ పరుపుల నుండి దూరం చేసి, తమ ప్రభువును భయంతో మరియు ఆశతో వేడుకుంటారు. మరియు మేము వారికి ప్రసాదించిన జీవనోపాధి నుండి ఖర్చు చేస్తారు. కాని వారికి, వారి కర్మల ఫలితంగా వారి కొరకు (పరలోకంలో) కళ్ళకు చలువనిచ్చే ఎటువంటి సామాగ్రి దాచి పెట్టబడి ఉందో ఏ ప్రాణికీ తెలియదు." **(ఖుర్'ఆన్ 32:16,17)**

### 2. స్వర్గంలోని వివిధ స్థాయిలు

స్వర్గంలో ప్రవేశించడమే గొప్ప విషయం. అయితే విశ్వాసంతో సత్కార్యాలు చేసిన విశ్వాసుల యొక్క పుణ్యఫలాన్ని బట్టి, అధికంగా అనుగ్రహం పొందినవారు స్వర్గంలో కూడా ఉన్నత స్థాయిని పొందే అవకాశం ఉంది. సత్కార్యాలు చేయడంలో అల్లాహ్ దయవలన కొందరు మరికొందరిపై ఆధిక్యతలో ఉంటారు. అటువంటి వారికి స్వర్గ భోగంలో కూడా ఆధిక్యత లభిస్తుంది.

"ఎవరైతే విశ్వాసిగా హాజరవుతాడో మరియు సత్కార్యాలు చేసి ఉంటాడో అలాంటి వారికి ఉన్నత స్థానాలుంటాయి. **(ఖుర్'ఆన్ 20:75)**

పై ఆయత్ బట్టి స్వర్గంలో కూడా వివిధ స్థానాలున్నాయని చెప్పడమే కాకుండా, కేవలం విశ్వసించడమే సరిపోదని, సత్కార్యాలు కూడా చేయాలని స్పష్టం అవుతుంది. ఎక్కువ విశ్వాసం మరియు ఎక్కువ

సత్కార్యాలు చేసినవారు స్వర్గంలో ఉన్నత స్థానంలో ఉంటారు.

చూడండి! మేము కొందరికి మరికొందరిపై ఏ విధంగా ఘనత నొసంగామో! కాని పరలోక జీవితం గొప్ప స్థానాలు గలది మరియు గొప్ప ఘనత గలది. (**ఖుర్'ఆన్ 17:21**)

మరియు ఎవరైతే విశ్వసిస్తారో మరియు వారి సంతానం విశ్వాసంలో వారిని అనుసరిస్తారో! అలాంటివారిని వారి సంతానంతో (స్వర్గంలో) కలుపుతాము. మరియు వారి కర్మలలో వారికి ఏమాత్రం నష్టం కలిగించము. ప్రతి వ్యక్తి తాను సంపాదించిన దానికి తాకట్టుగా ఉంటాడు. (**ఖుర్'ఆన్ 52:21**)

కాని ఎవరైతే తమ ప్రభువు యెడల భయభక్తులు కలిగి ఉన్నారో! వారి కొరకు అంతస్తుపై అంతస్తుగా కట్టబడిన ఎత్తైన భవనాలు ఉంటాయి. వాటి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. ఇది అల్లాహ్ వాగ్దానం. అల్లాహ్ తన వాగ్దానాన్ని ఎన్నడూ భంగపరచడు. (**ఖుర్'ఆన్ 39:20**)

### 3. స్వర్గ నదులు

ఖుర్'ఆన్‌లో ప్రస్తావించబడినవి :

భయభక్తులు గలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గం యొక్క ఉదాహరణ ఇలా ఉంది : అందులో వాసన మరియు రంగు మారని నీటి సెలయేళ్ళు ఉంటాయి మరియు రుచి మారని పాల నదులు ఉంటాయి. మరియు అందులో త్రాగేవారికి మధురంగా ఉండే పానీయ నదులు ఉంటాయి. మరియు అందులో శుద్ధమైన తేనె నదులుంటాయి. మరియు వారి కొరకు అందులో అన్ని రకాల మంచి ఫలాలు మరియు వారి ప్రభువు నుండి క్షమాపణ కూడా వుంటాయి. (**ఖుర్'ఆన్ 47:15**)

### 4. నీటి చెలమలు

నిశ్చయంగా, అల్లాహ్‌పట్ల భీతిగలవారు స్వర్గవనాలలో చెలమల మధ్య ఉంటారు (**ఖుర్'ఆన్ 15:45**)

నిశ్చయంగా భయభక్తులు గలవారు నీడలలో చెలమల దగ్గర ఉంటారు (**ఖుర్'ఆన్ 77:41**)

అల్లాహ్ పట్ల భీతిగలవారికి రెండు తోటలను అల్లాహ్ సిద్ధపరిచాడు ఆ రెండు (తోటలలో) పొంగి ప్రవహించే రెండు చెలమలు ఉంటాయి (**ఖుర్'ఆన్ 55:66**)

స్వర్గంలో రెండు చెలమలు ఉంటాయి. అల్లాహ్‌కు సాన్నిధ్యం పొందినవారు, అత్యంత విధేయులైన దాసులు వాటి నీటిని స్వచ్ఛమైన రూపంలో త్రాగుతారు. అబ్‌రార్ (అల్లాహ్‌కు భయపడే ధర్మపరాయణులు మరియు చెడును దూరంగా ఉంచేవారు) కూడా ఈ చెలమల నీటిని త్రాగుతారు. అయితే అది ఇతర పదార్థాలతో కలుపబడిన మిశ్రమ పానీయం.

పైన తెలిపిన రెండు నీటి చెలమలలో ఒకటి 'కాఫూర్'. కాఫూర్ గురించి క్రింది ఆయత్‌లో వివరించబడింది.

నిశ్చయంగా పుణ్యాత్ములు (అబ్‌రార్) కాఫూర్ అనే ఒక చెలమ నుండి ఒక గిన్నెలో తెచ్చిన (మిశ్రమ పానీయాన్ని) త్రాగుతారు. ధారాళంగా పొంగి ప్రవహింప జేయబడే ఊటలనుండి, అల్లాహ్ దాసులు త్రాగుతూ ఉంటారు. (**ఖుర్'ఆన్ 76:5,6**)

రెండవ చెలమ పేరు **అత్-తస్నీమ్**. అల్లాహ్ చెప్పారు :

నిశ్చయంగా పుణ్యాత్ములు సుఖ సంతోషాలలో ఉంటారు. ఎత్తైన ఆసనాలపై కూర్చుని తిలకిస్తూ. వారి ముఖాలు కళకళలాడుతూ ఉండటం నీవు చూస్తావు. సీలు చేయబడిన (సువాసనా భరితమైన) నాణ్యమైన మధురపానీయం త్రాగటానికి ఇవ్వబడుతుంది. దాని చివరి బిందువులోనూ కస్తూరి సువాసన ఉంటుంది. కాబట్టి దానిని పొందటానికి ఆపేక్షించేవారంతా ప్రయాసపడాలి. మరియు దానిలో తస్నీమ్ కలుపబడి ఉంటుంది. అదొక చెలమ. (అల్లాహ్) సాన్నిధ్యం పొందినవారే దాని నుండి త్రాగుతారు. (**ఖుర్'ఆన్ 83:22-28**)

ఖుర్'ఆన్‌లో తెలియజేయబడిన మరొక చెలమ పేరు : **అస్-సల్‌సబీల్**.

అల్లాహ్ చెప్పారు :

మరియు వారికి సొంటి కలిపిన పాత్రలు త్రాగడానికి ఇవ్వబడతాయి. అది స్వర్గంలోని సల్-సబీల్ అనే పేరుగల ఒక ఊట." (**ఖుర్'ఆన్ 76:17,18**)

### 5. స్వర్గంలోని కొన్ని చెట్ల వివరణ

సిద్రతుల్ ముస్తహా అనే చెట్టు గురించి ఖుర్'ఆన్‌లో చెప్పబడింది. ఈ హద్దు దాటి ఎవరూ ముందుకు పోజాలరు. కాని ముహమ్మద్(స) వారొక్కరే ఈ చెట్టుని దాటి ముందుకు వెళ్ళి, అల్లాహ్‌తో ప్రత్యక్షంగా సంభాషించారు. సిద్రతుల్ ముస్తహా దగ్గర ప్రవక్త(స)వారు, జిబ్రీల్(అ) వారిని సహజ రూపంలో చూడటం జరిగింది. (అంటే అల్లాహ్ ఏ రూపంలో జిబ్రీల్(అ)ను సృష్టించారో, ఆ రూపంలో)

అల్లాహ్ చెప్పారు :

"మరియు వాస్తవానికి అతను (ముహమ్మద్) అతనిని (జిబ్రీల్‌ను) మరొకసారి (ప్రత్యక్షంగా) అవతరించినప్పుడు చూశాడు. (సప్తాకాశంలో) చివరి హద్దులోనున్న చెట్టు (సిద్రతుల్ మున్‌తహా) దగ్గర. అక్కడికి దగ్గరలోనే జన్నతుల్ మఅ'వా ఉంది. అప్పుడు ఆ సిదరహ్ వృక్షాన్ని కప్పేది కప్పేసినప్పుడు! అతని (ప్రవక్త) దృష్టి తప్పిపోనూ లేదు మరియు హద్దులు దాటిపోలేదు. (**ఖుర్'ఆన్ 53:13-17**)

మరో చెట్టు తూబహ్. దీని గురించి ముహమ్మద్(స)వారి బోధనల ద్వారా తెలుస్తుంది.

అనస్ బిన్ మాలిక్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు, "స్వర్గంలో ఒక వృక్షం ఉంది (అది ఎంత పెద్దది అంటే) ఒక రౌతు దాని నీడలో వంద సంవత్సరాలు ప్రయాణం చేసినా, అతడు దానిని దాటలేడు. **(సహీహ్ బుఖారీ, 3251, పుస్తకం 59, అధ్యా.7, సం.4)**

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు, "స్వర్గంలో ఒక వృక్షం ఉంది (అది ఎంత పెద్దది అంటే) ఒక రౌతు దాని నీడలో వంద సంవత్సరాలు ప్రయాణించగలడు. మరియు మీరు కోరితే, పఠించగలరు : "మరియు వ్యాపించి ఉన్న నీడలు" (ఖుర్'ఆన్ 56:30)"

**(సహీహ్ బుఖారీ, 3252, పుస్తకం 59, అధ్యా.7, సంపుటి 4)**

## 6. స్వర్గవాసుల ఆహారపానీయాలు

స్వర్గవాసులు ఏ రకమైనవి తినాలని కోరుకుంటారో మరియు త్రాగాలను కుంటారో వాటన్నింటిని స్వర్గం కలిగియుంటుందని అల్లాహ్ ఖుర్'ఆన్‌లో ప్రస్తావించారు.

మరియు వారు కోరే పండ్లూ, ఫలాలు ఉంటాయి **(ఖుర్'ఆన్ 56:20)**

---

వారి మధ్య బంగారు పళ్ళాలు మరియు కప్పులు త్రిప్పబడతాయి. మరియు అందులో మనస్సులు కోరేవి మరియు కళ్ళకు ఇంపుగా ఉండేవి అన్నీ ఉంటాయి. మరియు మీరందులో శాశ్వతంగా ఉంటారు. **(ఖుర్'ఆన్ 43:71)**

---

"గడచిపోయిన దినాలలో మీరు చేసి పంపిన కర్మలకు ప్రతిఫలంగా, ఇప్పుడు మీరు హాయిగా తినండి మరియు త్రాగండి!" **(ఖుర్'ఆన్ 69:24)**

---

వారి మధ్య ప్రవహించే చెలమల నుండి, పానీయపు పాత్రలు త్రిప్పబడుతుంటాయి. అది తెల్లగా త్రాగే వారికి ఎంతో రుచికరమైనదిగా ఉంటుంది. దానివల్ల వారికి ఎలాంటి బాధా కలుగదు మరియు తమ తెలివినీ పోగొట్టుకోరు **(ఖుర్'ఆన్ 37:45-47)**

## 7. స్వర్గంలోని ఆహారపానీయాలు స్వచ్ఛమైనవి :

స్వర్గమనేది మలినాలు లేకుండా స్వచ్ఛంగా ఉంటుంది. మరియు దానిలో నివశించేవారు కూడా అదే విధంగా ఉంటారు.

అల్లాహ్ యొక్క సందేశహరుడు(స) చెప్పారు : "స్వర్గంలో ప్రవేశించే తొలి సమూహం యొక్క ముఖాలు పౌర్ణమి రోజు చంద్రుని తేజస్సులా ఉంటాయి. అందులో వారు ఉమ్మడం చేయరు మరియు ముక్కులను చీదరు మరియు మలిన విసర్జన చేయరు. వారి పాత్రలు మరియు దువ్వెనలు బంగారం మరియు వెండివి, వారి కొరకు సువాసనకై మండించే దానిలో ఉపయోగించేది కస్తూరి. మరియు వారి చెమట కస్తూరి. అందులో ప్రతీ ఒక్కరూ ఇద్దరు భార్యలను కలిగి ఉంటారు. వారి పిక్కలలో ఉండే ఎముకల లోపల ఉండే మూలుగు కూడా మాంసపు కండరాల గుండా కనిపిస్తుంది వారి యొక్క (అతి) సౌందర్యం వలన. వారి (స్వర్గ వాసుల) మధ్య వ్యతిరేకతగాని లేక శతృత్వంగాని ఉండవు మరియు వారి హృదయాలు ఒకే హృదయంగా ఉంటాయి మరియు వారు అల్లాహ్ యొక్క పవిత్రతను ఉదయం మరియు సాయంత్రం కీర్తిస్తూ ఉంటారు. **(అబూహురైరా (రజి)వారి ఉల్లేఖనం. సహీహ్ ముస్లిమ్, 7151, పుస్తకం 51, అధ్యా. 7, సంపుటి 7)**

స్వర్గవాసులు అక్కడ తింటారు మరియు త్రాగుతారు వారు ఉమ్మి వేయరు మరియు మల మూత్ర విసర్జన చేయరు మరియు తమ ముక్కులను చీదరు. వారు అడిగారు : "వారి ఆహారం సంగతేమిటి?" (అంటే జీర్ణమైనది ఏమౌతుందని సందేహం అయి ఉంటుంది). ఆయన చెప్పారు : "అది త్రేన్పులు మరియు చెమట రూపంలోకి మారిపోతుంది కస్తూరి వలే. మరియు వారు కీర్తిస్తారు మరియు పొగుడుతారు అల్లాహ్ యొక్క ఘనతను మనం శ్వాస పీలుస్తున్నంత సులభంగా. **(జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. సహీహ్ ముస్లిమ్, 7152, పుస్తకం 51, అధ్యా. 7, సంపుటి 7)**

స్వర్గంలో ఆహారపానీయాలు ఉంటాయి. అవి స్వర్గవాసులు కోరుకున్న విధంగా ఉండటమే కాకుండా అవి జీర్ణమయ్యాక, మలిన రూపంలో బయటికి రావు. స్వేదం రూపంలో సువాసన కలుగజేస్తాయి. అంటే స్వర్గంలో ప్రతీది స్వచ్ఛంగా ఉండటమే కాకుండా, స్వర్గవాసులు కూడా స్వచ్ఛంగా ఉంటారు.

చాలా సులభంగా అల్లాహ్‌ను కీర్తిస్తారు మరియు ఆయన ఘనతను పొగుడతారు. ఊపిరి తీసుకోవడాన్ని జ్ఞాపకం పెట్టుకున్న లేక మర్చిపోయినా, శ్వాస మనకు తెలియకుండా జరుగుతూనే ఉంటుంది. ఇక్కడి శ్వాస మనిషి జీవించడానికి అవసరం. కాని అక్కడి శ్వాస శాశ్వతంగా ఉంటుంది. అక్కడ మరచిపోవడం వంటి మానవ బలహీనతలు ఉండవు.

స్వర్గంలో ధరించే దుస్తులు, అభరణాలు, సువాసన కలిగించే ద్రవ్యాలు, స్వర్గవాసుల సమావేశాలు మరియు వారి ప్రసంగాలు, స్వర్గ వాసుల భార్యల గురించి, హూర్ మరియు 'ఈన్ గురించి మరియు వారికి ఇవ్వబడే ఉత్తమమైన వాటి గురించి మరియు మరెన్నో **ఇతర విషయాలను ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో అందిస్తాము.** స్వర్గం మరియు నరకానికి సంబంధించిన ఆయత్‌లు విశ్వాసులపై ఎంతో ప్రభావాన్ని చూపాయి. ఆ ఆయత్‌లు పఠించేటప్పుడు, విశ్వాసులు రోదిస్తూ స్పృహ తప్పిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కాబట్టి కనీసం క్లుప్తంగా అయినా స్వర్గం మరియు నరకం గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ప్రపంచ పాలకులు మరియు రాజకీయ నాయకులు తప్పనిసరిగా తెలుసుకోవలిసిన ముహమ్మద్(స)వారి ప్రియ అనుచరుని జీవితచరిత్ర

ప్రపంచానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించిన ధర్మం - ఇస్లామ్

రెండవ ఖలీఫా

# ఉమర్ బిన్ ఖత్తాబ్

9

రజి అల్లాహుతాలా అన్హు

- అతి నిరాడంబరుడు
- ప్రపంచంలోని అతి పెద్ద భూభాగానికి నాయకుడు
- అవినీతి అధికారులకు సింహస్వప్నం

ఓ దశాబ్దంపాటు నూటికి నూరు శాతం ప్రజాస్వామ్య పరిపాలన అందించిన ప్రజానాయకుడు

ఎటువంటి తిరుగుబాటులకు అవకాశం రానివ్వని ఉత్తమ పాలకుడు

ప్రజలకేకాకుండా మూగజీవాలకూ న్యాయం చేకూర్చిన అత్యంత దైవభీతిపరుడు

(గత సంచిక తరువాయి ...)

### హుదైబియా ఒప్పందం ...

ముహమ్మద్(స)వారు ఏదైతే ఉమర్(రజి)వారికి చెప్పారో ఖచ్చితంగా అదే విషయాన్ని అబూబక్ర్(రజి) కూడా చెప్పారు. అబూబక్ర్(రజి)వారికి సహచరులలో ఉన్నత స్థాయి లభించడానికి కారణం అదే, ఆయన యొక్క అమోఘమైన విశ్వాసం, జ్ఞానం మరియు వివేకం.

తరువాత కొన్ని విచారకరమైన సంఘటనలు జరిగాయి.

చాలామంది సహచరులు ముహమ్మద్(స)వారితో ఈ ఒప్పందంపై వ్యతిరేకత తెలియజేయడానికి వెళ్ళారు. కాని అల్లాహుతాలా తన సందేశహరుడికి విశేషమైన సహనం, వివేకం, సౌమ్యతను అనుగ్రహించడంతో, వారిని ఆయన(స) ఆ ఒప్పందం విషయంలో ఒప్పించారు. అది తమకు మేలు అని మరియు విజయం సాధిస్తుందని వారు తెలుసుకున్నారు.

ఈ పై విషయాలను బట్టి, ఈ పాటికే ఉమర్(రజి)వారు ఎటువంటి పాఠాన్ని ప్రవక్త(స)వారి నుండి నేర్చుకున్నారో అర్థం చేసుకుని ఉంటారు.

ఆ పాఠం ఏమిటంటే, ముస్లిముల సంక్షేమం కోసం నిజాయితీతో ఎవరైనా ఏదైనా అభ్యంతరం చెప్పినప్పుడు, **నాయకుడు సహనంతో వినాలి.** అంతేగాని అతనిని తిట్టడం గాని, శిక్షించడంగాని చేయకూడదు.

ప్రవక్త(స)వారు ఉమర్(రజి)వారితో మరియు ఆయనతో వచ్చిన మిగిలిన వారితో ఎంత సౌమ్యంగా మాట్లాడి ఉంటారో అల్లాహ్‌కే బాగా తెలుసు. ప్రవక్త(స)వారు తన అనుచరులకు చాలా గొప్ప శిక్షణనిచ్చారు, ఎందుకంటే తన తరువాత ముస్లిమ్ జాతి నాయకులు వారే కనుక.

ముహమ్మద్(స)వారు ఎంత స్వేచ్ఛనిచ్చారో చూడండి. తమ అభ్యంతరాలను తెలపడానికి ఏ విధమైన అడ్డంకి ఏర్పాటు చేయలేదు. సావధానంగా విన్నారు. ఈ సంఘటనలు సహచరులపై ఎంత ప్రభావం చూపాయో మనం చరిత్రలో చూశాం.

**ఓ ముసలామె ఉమర్(రజి)వారిని ఓ విషయంలో నిలదీసి అడిగారు.** ఆమెకు అంత స్వేచ్ఛను విశాల భూభాగానికి నాయకుడైన ఉమర్(రజి)వారు ఇచ్చారంటే, దానికి కారణం తన గురువుగారి శిక్షణే. ముహమ్మద్(స)వారి అమోఘమైన శిక్షణ, తరువాయి కాలంలో ఆయన సహచరులకు ప్రపంచంలో ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చింది.

ఉమర్(రజి)వారు ఖలీఫాగా పాలించేటప్పుడు, ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు అందరి అభిప్రాయాలను తీసుకునేవారు, అంతేకాకుండా అభిప్రాయాలు చెప్పే విధంగా వారిని ప్రోత్సహించేవారు.

తరువాయి కాలంలో హుదైబియా ఒప్పందంలోని వివేకం అర్థమైంది.

**ఉమర్(రజి)వారు ఆవేదన చెందారు. ఆ రోజు ఆయన చేసిన దానికి ప్రాయశ్చిత్తంగా దానాలు ఇవ్వడం, ఉపవాసాలుండటం, ప్రార్థనలు చేయడం మరియు బానిసలను విడిపించడం చేస్తుండేవారు. ముహమ్మద్(స)వారి దగ్గర తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకే ఇదంతా చేశారు. ఈయనలో నిజాయితీ ఉంది. ముహమ్మద్(స)వారు అంటే మచ్చలేని ప్రేమ ఉంది. కాని ముహమ్మద్(స)వారు చెప్పిన దానికి అభ్యంతరం వ్యక్తం చేసినందుకే ఎంతో భయపడిపోయారు.**

ఈ విషయం నుండి కూడా నేటి ముస్లిములు ఎంతో నేర్చుకోవాలి.

ఈ ఒప్పందమే గొప్ప విజయానికి దారి తీసింది. అదే మక్కా విజయం.

హిజ్రీ శకం 7వ సంవత్సరంలో షాబాన్ నెలలో అల్లాహ్ యొక్క సందేశహరుడు(స) ఓ సైనిక దళాన్ని తుర్బహ్‌కి పంపారు. ఆ దళంలో 30మంది ఉన్నారు మరియు ముహమ్మద్(స)వారు ఉమర్(రజి)వారిని దళానికి నాయకుడిగా నియమించారు. ప్రవక్త(స)వారు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను బట్టి, వారి కర్తవ్యం ఏమిటంటే అల్-ఖుబలా దిశ నుండి హవాజిన్ తెగవారిపై దాడిచేయాలి - దానర్థం ఉమర్(రజి)వారు మరియు ఆయన సైనికులు హవాజిన్ తెగవారిని చుట్టుముట్టి తుర్‌బహ్ భాగం నుండి దాడి చేయాలి. ఆ ప్రాంతం మదీనాకు చాలా దూరం. మదీనా నుండి అక్కడికి దాదాపు 4 రోజుల ప్రయాణం.

మదీనా నుండి వెడలేటప్పుడు, ఉమర్(రజి)వారు బనూ హిలాల్ తెగ నుండి ఓ వ్యక్తిని మార్గం చూపడానికి తనతో పాటు తీసుకెళ్ళారు. వీరు రాత్రుళ్ళు ప్రయాణం చేసి, పగలు మాత్రం ఎక్కడైనా

కనిపించనిచోట ఉండేవారు. చివరికి ఈ విషయం హవాజిన్ వారికి చేరిపోయింది.

వీరు అక్కడికి ఆలస్యంగా చేరుకున్నారు. అప్పటికే వారు భయపడి తమ నివాసాలు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. ఉమర్(రజి)వారు అక్కడికి చేరేసరికి పోరాడటానికి ఎవరూ లేరు. కనీసం ఆ విధంగానైనా శత్రువుల గుండెల్లో భయాన్ని కలుగజేయడం జరిగింది.

ఉమర్(రజి)వారు తన సైన్యంతో మదీనాకు తిరుగు ప్రయాణం ప్రారంభించారు. ఒక ఉల్లేఖనాన్ని బట్టి ఉమర్(రజి)వారితో దారి చూపడానికి వచ్చిన వ్యక్తి తుర్బహ్‌కు వెళ్ళే దారిలో ఉన్న ఖుస్‘అమ్ తెగపై దాడి చేయవచ్చని సలహా ఇచ్చాడు. ఉమర్(రజి) అతనితో అన్నారు: “అల్లాహ్ యొక్క సందేశహరులు(స) వారిపై దాడి చేయమని మనల్ని ఆదేశించ లేదు, ఆయన కేవలం హవాజిన్ వారిపైనే దాడి చేయమన్నారు.”

ఇటువంటి దాడులకు కారణాలు ముహమ్మద్(స)వారి జీవిత చరిత్రలో ఇన్షా అల్లాహ్ అందిస్తాము. ఇవి కేవలం శాంతిభద్రతల కోసం మాత్రమేనని పాఠకులు అర్థం చేసుకోవాలి.

అంతదూరం ఎలాగూ వెళ్ళాము కదా అని గైడ్ చెప్పినట్లు ఆయన చేయలేదు. ఏదైతే తనకు ఆదేశం ఇవ్వబడిందో దానికే ఆయన కట్టుబడి ఉన్నారు. **ఈ క్రమశిక్షణ మరియు తమ నాయకుని పట్ల ఉండే విధేయతే, ముస్లిములను ఎన్నో రాజ్యాలను జయించ గలిగేలా చేసింది.**

**ముహమ్మద్(స)వారి ముఖ్య అనుచరులందరూ ఆణిముత్యాలవంటి వారు. ఏ అనుచరుడికి ఎటువంటి శిక్షణ అవసరమో, అటువంటి ప్రత్యేక శిక్షణను ఆ అనుచరుడికి ఇచ్చేవారు. ప్రవక్త(స)వారు అందరికీ కేవలం ఒకే విషయంపై శిక్షణ ఇవ్వలేదు. దానితోపాటు ఓ ప్రత్యేక విషయంపై శిక్షణనిచ్చారు. ఈ కారణంగా ఒకొక్క సహచరుడు ఒకొక్క రంగంలో నైపుణ్యాన్ని పొందారు.**

మన సమాజంలో డాక్టర్లు, ఇంజినీర్లు, సైంటిస్ట్‌లు, లాయర్లు ఇలా ఎన్నో రంగాలకు చెందిన వారున్నారు. అందరూ ఒకే రంగానికి చెందిన వారైతే సమాజం లోప భూయిష్టం అవుతుంది. అందుకని అందరూ అన్ని రంగాలలో నిష్ణాతులు కావాలన్నా అసాధ్యమే! ప్రవక్త(స)వారికి తన సహచరులలోని ప్రతీ ఒక్కరి ప్రతిభ తెలుసు. కాబట్టి వారి ప్రతిభ, వివేకాలను పరిగణనలోకి తీసుకుని ఒకొక్కరిని, ధర్మానికి చెందిన ఒకొక్క విషయంపై ప్రత్యేక శిక్షణనిచ్చారు.

పైన చెప్పినటువంటి ముఖ్య విశ్లేషణలు వివరించకుండా కేవలం ఓ జీవిత చరిత్రలా ఈ శీర్షికను అందిస్తే లభించే ప్రయోజనం కంటే, ఈ వివరాల వలన ముస్లిములకు అసలైన ధార్మిక శిక్షణ అనేది ఎలా ఉండాలో బోధపడుతుంది.

మరొక సంఘటనను ఇక్కడ చెప్పుకుందాం. అది ఖైబర్ దండయాత్ర. పట్టణవాసులు దుర్బేధ్యమైన కోటలలో దాక్కున్నారు. ఆ కోటలలో కొన్నింటిని జయించడం చాలా కష్టంతో కూడుకున్నది. ఖైబర్‌లోని అటువంటి ఒక కోటను వశం చేసుకోవడానికి ప్రవక్త(స)వారు ఓ దళాన్ని ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారి నాయకత్వంలో పంపారు. ఆ పోరాటం చాలా తీవ్రంగా జరిగింది. కాని రోజు ముగిసేసరికి ఉమర్(రజి)వారు మరియు వారి సైన్యం విజయం సాధించలేక పోయారు.

వారంతా ముహమ్మద్(స)వారి దగ్గరకు తిరిగి వచ్చారు. అప్పుడు ముహమ్మద్(స)వారు చెప్పారు, “రేపు నేను పతాకాన్ని ఒకరికిస్తాను. అతడు అల్లాహుతాలాను మరియు ఆయన సందేశహరుడుని ప్రేమిస్తాడు, మరియు అతనిని అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు ప్రేమిస్తారు.”

తరువాత రోజు ఉదయం, ఆ గౌరవం ఎవరికి దక్కుతుందోనని సహచరులు ఎదురుచూస్తున్నారు. అయితే ముహమ్మద్(స)వారు అలీ బిన్ అబీతాలిబ్(రజి) పేరు చెప్పారు. ఆయనకు కళ్ళల్లో విపరీతమైన నొప్పి కలగడం వలన ఆయన సమావేశానికి హాజరు కాలేదు. ఆయన పిలిపించబడ్డారు మరియు ఆయన రాగానే, ప్రవక్త(స)వారు తన లాలాజలాన్ని ఆయన కళ్ళల్లో వేశారు. దాని పర్యవసానంగా కంటి వాపు మరియు నొప్పి తగ్గిపోయాయి. మరియు ఆయన చూపు మామూలు స్థితికి వచ్చింది.

ప్రవక్త(స)వారి నుండి పతాకాన్ని అందుకుని, అలీ(రజి)వారు సైన్యంతో ఖైబర్‌లోని గట్టిపట్టున్న వాటిపై దాడి చేశారు. ఆ పోరాటంలో అలీ(రజి)వారు మర్‌హబ్ అనే యూదుడితో ముఖాముఖి తలపడ్డారు. ఇద్దరూ హోరాహోరీగా పోరాడుతున్నారు. చివరకి అలీ(రజి)వారు విసిరిన శక్తివంతమైన దెబ్బకి, శత్రువు శిరస్త్రానానికి అలీ(రజి)వారి కత్తి తగిలింది. ఆ ధ్వని ఇరువైపులున్న సైనికులకు వినబడింది. కాస్సేపటికి అలీ(రజి)వారి సైన్యానికి విజయం లభించింది.

సహచరులలోని ఓ సమూహం ప్రవక్త(స)వారి దగ్గరకి వెళ్ళి చెప్పారు, “ఫలానా వ్యక్తి షహీద్ అయ్యాడు”. ప్రవక్త(స)వారు సమాధానమిచ్చారు: “లేదు వాస్తవానికి! నిశ్చయంగా, నేను అతనిని నరకాగ్నిలో చూశాను, ఓ దుప్పటిని (లేక ఓ రకమైన వస్త్రాన్ని) ధరించి ఉండగా. దానిని అతడు దొంగిలించాడు యుద్ధప్రాప్తి నుండి.”

**అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ఉమర్(రజి)వారిని ఉద్దేశించి చెప్పారు : “ఓ ఇబ్నె ఖత్తాబ్! వెళ్ళి దీనిని ప్రజలకు ప్రకటించు : ‘నిశ్చయంగా, ఎవరూ స్వర్గంలో ప్రవేశించరు, విశ్వాసులు (మోమిన్లు) తప్ప.’ ”**

ముస్లిమ్ సైన్యం ఖైబర్‌లో ఉన్నప్పుడే ఇది జరిగింది. అప్పుడు ఉమర్(రజి) వెళ్ళి ముస్లిములను పిలిచి, **మోమిన్లు (విశ్వాసులు) తప్ప ఎవ్వరూ స్వర్గంలో ప్రవేశించరనే విషయాన్ని ప్రకటించారు.**

**ముస్లిములకు స్వర్గ ప్రవేశం లేదు,**
**వారు మోమిన్లు (విశ్వాసులు) అయితే తప్ప.**

## మక్కాపై దండయాత్ర

హుదైబియా ఒప్పందంపై సంతకాలు చేసి ఖురైష్ నాయకులు వారి అదృష్టాన్ని వారే బంధించుకున్నట్లు అయింది. చూడటానికి వారు చేసుకున్న ఒప్పందం వారికి అనుకూలంగా ఉన్నట్లే ఉంది. కాని వాస్తవానికి వారు నిస్సహాయస్థితికి పడిపోవడానికి ఈ ఒప్పదం కారణమైంది. దీనివలన ముస్లిములకు సమయం లభించింది, వారి సంఖ్య మరియు బలం పెరగడానికి అవకాశం లభించింది.

ఖురైషులు దాడి చేస్తారనే బెడద లేకపోయేసరికి, ముస్లిములు ఇతర తెగలను ఇస్లామ్‌వైపు ఆహ్వానించే విషయంపైనే తమ శక్తినంతా కేంద్రీకరించారు. ముస్లిములు బలం పుంజుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా మక్కా వారికి కలిసొచ్చింది ఒక్కటే - వారి మీద ముస్లిములు దాడి చేయరు. కాని ఇప్పుడు ముస్లిములు తలచుకుంటే మక్కా వారిని ఓడించగలిగే స్థాయిలో బలంగా ఉన్నారు.

ఈ ఒప్పందం అమలులో ఉన్నప్పుడు, ముస్లిములపైగాని లేదా ముస్లిములతో స్నేహ సంబంధాలున్న తెగలపైగాని దాడిచేయకూడదు. కాని అటువంటి ఓ తెగవారిలో కొందరిని మక్కావాళ్ళు చంపారు. అంటే వారు ఒప్పందాన్ని ఉల్లంఘించారు. ఇప్పుడు ముస్లిములకు ప్రతీకారం తీర్చుకునే హక్కు ఉంది.

ఖురైషులు ఘోరతప్పిదాన్ని చేసారని గ్రహించిన వారి నాయకుడు అబూసుఫ్యాన్ మదీనాకు బయలుదేరారు, ప్రవక్త(స)వారిని ఒప్పించి మరలా ఆ ఒప్పందాన్ని పున:ప్రారంభించాలని. అబూ సుఫ్యాన్, ముహమ్మద్(స)వారితో తన అభిప్రాయాన్ని అంగీకరించమని అడిగారు. కాని ప్రవక్త(స)వారు అతనికి ఏ సమాధానం ఇవ్వకుండా ముఖం తిప్పుకుని వెళ్ళిపోయారు. అబూసుఫ్యాన్ ఆశ వదులుకోలేదు. ప్రవక్త(స)వారి ముఖ్య అనుచరులను ప్రాధేయపడ్డాడు, వారేమైనా తన తరపున ప్రవక్త(స)వారికి సిఫారసు చేస్తారేమోనని. కాని వారందరూ తిరస్కరించారు. అబూ సుఫ్యాన్, ఉమర్(రజి)వారిని తన తరపున అల్లాహ్ యొక్క సందేశహరులు(స)తో సిఫారసు చేయమని అడిగినప్పుడు, ఉమర్(రజి)వారు ఇలా సమాధానమిచ్చారు:

**"నేను నీ తరపున రసూలుల్లాహ్(స) వారితో సిఫారస్ చేయమని కోరుతున్నావా? అల్లాహ్ సాక్షి, నాకు ఏదీ దొరకకపోయినా (ఆయుధంగా) చిన్న చీమలు తప్ప, నేను నీకు వ్యతిరేకంగా వాటితో పోరాడుతాను." అన్నారు.**

అబూ సుఫ్యాన్ తన కుమార్తెయైన ఉమ్మె హబీబా(రజి)వారి దగ్గరికి వెళ్ళారు. ఆమె(రజి) ముహమ్మద్(స)వారి ధర్మపత్ని. ఆమె కూడా తిరస్కరించారు. భర్త విశ్రమించే దుప్పటిపై కూర్చోవడానికి కూడా అనుమతి నివ్వలేదు.

అబూ సుఫ్యాన్‌లో భయం మొదలైంది. ప్రవక్త(స)వారు మక్కాపై దండయాత్రకు నిర్ణయించుకున్నారని భావించాడు. ముహమ్మద్(స)వారు ఓ పెద్ద సైన్యాన్ని సిద్ధపరుస్తున్నారు. కాని మక్కాపై పోరాటానికి వెళుతున్నట్లు, దానికోసమే ఆ సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు అందరికీ తెలియదు, ప్రవక్త(స)వారు కొద్దిమందికే ఈ విషయం చెప్పారు. కొన్ని కీలకమైన విషయాలు అందరితో పంచుకోవలసిన అవసరం లేదని పై సంఘటన బట్టి అర్థమౌతుంది. కాబట్టి ముందు జాగ్రత్తగా కొన్ని విషయాలు ముఖ్యమైనవారికి మాత్రమే చెప్పవచ్చు. హాతిబ్ బిన్ అబూ బల్త'అహ్(రజి) అనే ఓ సహచరుడు ఇది తెలుసుకుని మక్కా ప్రజలకు తెలపడానికి ఓ లేఖ వ్రాశాడు ప్రవక్త(స) ఓ పెద్ద సైన్యంతో వారి వైపు వస్తారని. ఆ లేఖను ఓ స్త్రీకి ఇవ్వడం జరిగింది.

హాతిబ్(రజి) చేసిన ద్రోహానికి ఫలితంగా ప్రవక్త(స)వారికి గాని లేదా అనుచరులకు గాని ఏ హాని జరగలేదు. **వహీ ద్వారా ముహమ్మద్(స) వారికి హాతిబ్(రజి) లేఖ గురించి తెలిసింది.** ముహమ్మద్(స)వారు అలీ(రజి), జుబైర్(రజి) మరియు మిఖ్దాద్(రజి)లను పంపారు. వారు ఆ లేఖను కలిగి యున్న స్త్రీని ఆపి, ఆ లేఖను వశపరచుకుని, ఆమెను మదీనాకు తీసుకురావాలని.

ముహమ్మద్(స)వారు అలీ(రజి)వారిని, జుబైర్(రజి)వారిని మరియు అల్-మిఖ్దాద్(రజి)వారికి ఇలా చెప్పి పంపారు : "ముందుకు సాగండి మీరు రౌదా ఖాఖ్ చేరేవరకూ అక్కడ ఓ లేఖను తీసుకెళుతున్న స్త్రీ ఉంటుంది మరియు దానిని తీసుకోండి ఆమెనుండి. వారు తమ గుఱ్ఱాలను పరుగులెత్తించారు రౌదా చేరేవరకూ మరియు వారు ఆ స్త్రీని కనుగొన్నారు మరియు ఆమెతో చెప్పారు, "బయటికి తియ్యి లేఖను." ఆమె అన్నది, "నా దగ్గర లేఖ లేదు". వారు చెప్పారు, "బయటికి తియ్యి ఉత్తరాన్ని లేదా (లేఖను వెతకడానికి) నీ దుస్తులను తొలగించాల్సి ఉంటుంది." కాబట్టి ఆమె తన జడలో (కొప్పులో) నుండి లేఖను బయటకి తీసింది మరియు వారు ఆ లేఖను అల్లాహ్ యొక్క సందేశహరులు(స) వద్దకు తెచ్చారు. ఆ లేఖ హాతిబ్ బిన్ అబీ బల్తా నుండి మక్కాలోని కొందరు ముష్రిక్‌లకు వ్రాయబడింది, ముహమ్మద్(స)వారు ఏమి చేయాలని సంకల్పించారో (ఆ విషయాన్ని) వారికి తెలియజేస్తూ. రసూలుల్లాహ్(స)వారు అడిగారు, "ఓ హాతిబ్! ఇది ఏమిటి?" హాతిబ్ సమాధానమిచ్చారు, "ఓ రసూలుల్లాహ్(స)! తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దు నా గురించి. నేను ఖురైషులకు చెందిన వ్యక్తిని కాదు. కాని నేను వారికి బయటి నుండి మిత్ర సంబంధాన్ని కలిగి యున్నాను. మరియు వారితో రక్త సంబంధం లేదు మరియు మీతో ఉన్న ముహాజిరీన్‌లకు బంధువులున్నారు (మక్కాలో) వారి కుటుంబాలను మరియు సంపదలను రక్షించడానికి. కాబట్టి వారికి నేను తోడ్పడాలను కున్నాను, వారు నా బంధువులను రక్షిస్తారేమోనని వారితో నాకు రక్త సంబంధం లేదు గనుక. నేను ఇది చెయ్యలేదు ఇస్లామ్ నుండి మార్గభ్రష్టున్ని కావడానికో లేక నేను ఇది చేయలేదు ఏ ధర్మానికి చెందని దానిని ఎంచుకోవడానికో ఇస్లామ్ తరువాత."

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) తన సహచరులతో అన్నారు, "అతనికి సంబంధించి నంతవరకు, అతడు మీకు సత్యమే చెప్పాడు." ఉమర్(రజి)వారు అన్నారు, "ఓ రసూలుల్లాహ్! అనుమతించండి నన్ను ఈ మునాఫిక్ శిరస్సు ఖండించడానికి" ప్రవక్త(స)వారు చెప్పారు, "అతడు (హాతిబ్) బద్ర్ యుద్ధంలో పాల్గొన్నాడు మరియు నీకేమి తెలుసు, బహుశా అల్లాహ్ తెలియపరుస్తారు బద్ర్‌లో పాల్గొన్నవారిని" మరియు చెప్పారు, "ఓ బద్ర్ ప్రజలారా! చేయండి మీ కిష్టమైనది, ఎందుకంటే నేను మిమ్మల్ని క్షమించాను." తరువాత అల్లాహ్ సూరహ్ అవతరింపజేశారు :

> "ఓ విశ్వాసులారా! నాకు శతృవులైన వారిని మరియు మీకు కూడా శతృవులైనవారిని - వారి మీద ప్రేమ చూపిస్తూ - వారిని మీ స్నేహితులుగా చేసుకోకండి. మరియు వాస్తవానికి వారు మీ వద్దకు వచ్చిన సత్యాన్ని తిరస్కరించారు మీ ప్రభువైన అల్లాహ్‌ను మీరు విశ్వసించి నందుకు, వారు ప్రవక్తను మరియు మిమ్మల్ని వెడలగొట్టారు. ఒకవేళ మీరు నా ప్రసన్నత కోరి, నా మార్గంలో ధర్మయుద్ధం కొరకు వెళితే. వారిపట్ల వాత్సల్యం చూపుతూ మీరు వారికి రహస్యంగా సందేశం పంపుతారా! మీరు దాచేది మరియు మీలో ఎవడైతే ఇలా చేస్తాడో, అతడు వాస్తవంగా, ఋజుమార్గం నుండి తప్పిపోయినవాడే." (ఖుర్'ఆన్ 60:1)

పై సంఘటనలో ప్రవక్త(స)వారికి మరియు ఉమర్(రజి)వారికి మధ్య హాతిబ్(రజి)కు సంబంధించి జరిగిన చర్చ నుండి మనం చాలా పాఠాలను నేర్చుకోవచ్చు.

ఇస్లామ్‌లో, శతృవు మేలు కోసం గూఢచర్యం చేస్తే దాని ఫలితం మరణశిక్షే. ఉమర్(రజి)వారు హాతిబ్(రజి)ని అతను చేసిన నేరానికి చంపాలను కున్నప్పుడు, ముహమ్మద్(స)వారు ఉమర్(రజి)వారితో ఆయన సూచించిన శిక్షను ఆ నేరానికి వర్తించదు అని చెప్పలేదు. బదులుగా, ఆయన(స) స్పష్టం చేశారు హాతిబ్(రజి) విషయం అసాధారణమైన కేస్. అతను బద్ర్ యుద్ధంలో పోరాడాడు. అంతేకాకుండా బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారికి ముస్లిములలో ఉన్న ప్రత్యేక హోదాని ముహమ్మద్(స) వారికి అల్లాహుతాలా తెలియజేశారు.

ఉమర్(రజి)వారి జీవితచరిత్రకు సంబంధించి కొన్ని ముఖ్య సంఘటనలను విడివిడిగా శాంతిబాటలో అందిస్తూ వస్తున్నాము. క్రిందటి సంచికలలో ఇబ్నె అబ్బాస్(రజి)వారి గురించి అందించిన వివరాలలో కూడా బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారి గురించి చెప్పడం జరిగింది.

> ఉమర్(రజి)వారు బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారికి ప్రత్యేక స్థానాన్ని కలుగజేశారు. సమావేశాలలో వారు హాజరుకావడానికి ఆహ్వానించేవారు. అదే విధంగా బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారికి అధిక పెన్షన్ ఇచ్చేవారు. ఉమర్(రజి)వారు బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారికి ఎందుకు అంత ప్రత్యేకత ఇచ్చేవారో, ఈ హాతిబ్(రజి) సంఘటన చదివిన వారికి స్పష్టంగా అర్థమౌతుంది.

ఇస్లామ్ ధర్మాని రక్షించుకునే విషయంలో ఉమర్(రజి)వారు పట్టు సడలకుండా, కఠినంగా, కనికరం లేకుండా ఉండేవారు. ఈయనలోని ఆ లక్షణాలు హాతిబ్(రజి) విషయంలో గాని లేదా మునాఫిక్ యైన అబ్దుల్లాహ్ బిన్ ఉబై విషయంలోగాని, వారిని చంపడానికి ప్రవక్త(స)వారిని అనుమతి నడిగినప్పుడు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

అంత కోపంలో ఉన్న ఉమర్(రజి)వారు హాతిబ్(రజి) గురించి ముహమ్మద్(స)వారు చెప్పిన సమాధానం వినగానే, ఒక్కసారిగా అణుకువగా మారిపోయారు. **ఆగ్రహావేశ స్థితి కాస్త అణుకువ స్థితిగా వెనువెంటనే మారిపోయింది.** ఇది అల్లాహ్ పట్ల మరియు ముహమ్మద్(స)వారి పట్ల ఆయనకున్న విధేయతను స్పష్టం చేస్తుంది.

మక్కాను జయించడానికి ముహమ్మద్(స)వారు మదీనా నుండి బయలుదేరారు. మక్కావైపు ప్రయాణం కొనసాగించారు. మర్ర్ అద్-దహ్రాన్ అనే ప్రాంతం చేరేసరికి సాయంత్రం అయింది. అక్కడ ఆగారు విడిది చేయడానికి. మర్ర్ అద్-దహ్రాన్ అనేది ఒక లోయ ప్రాంతం అది మక్కాకు ఉత్తర దిక్కున సుమారు 22 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

ఆ రోజుల్లో మక్కాకు బయట ఉన్న ఎడారి బహిరంగ ప్రదేశంగా ఉండేది. అది నివాస ప్రాంతం కాదు మరియు ఎటువంటి అభివృద్ధికి నోచుకోని భూభాగం. అందువలన ఎన్నో కిలోమీటర్ల దూరంలో నుండి చాలా సులభంగా మరియు స్పష్టంగా వెలిగించిన మంటలు కూడా చూడవచ్చు. మక్కాకు బాగా సమీపానికి వచ్చాక, తన రాక గురించి ప్రవక్త(స)వారు ప్రకటించాలను కున్నారు. ఆయన(స)తో పాటు బలగం ఎంత ఉందో తన శతృవులకు స్పష్టంగా తెలియడానికి తన సైన్యంతో మంటలు రాజేయమన్నారు. దాదాపు పదివేల సంఖ్యలో మంటలు ఆ రాత్రి వెలగడం జరిగింది.

**అందరూ విడిది చేసిన తరువాత, మొత్తం విడిదికి రక్షణగా ప్రవేశం దగ్గర ఉమర్(రజి)వారిని ఉండమని ముహమ్మద్(స)వారు ఆదేశించారు.**

అబ్బాస్(రజి)వారికి తన ప్రజలకు (అంటే మక్కావారికి) క్లిష్టమైన పరిస్థితి ఎదురు కాబోతుందని అర్థమైంది. సుదీర్ఘకాలం పాటు వారికి వ్యవధి ఇవ్వబడింది. మరియు ఇప్పుడు వారి నాశనానికి సమయం దగ్గరపడింది. మరింత ఆలస్యం కాకుండా, తనవాళ్ళు స్వయంగా తమను తాము రక్షించు కోవడానికి ఒక అవకాశం ఇవ్వాలనుకున్నారు అబ్బాస్(రజి)వారు. ఆయన(రజి) తనకు తాను చెప్పుకున్నారు, "**అయ్యో! ఖురైష్‌లకు బాధాకరమైన ఉదయం. అల్లాహ్ సాక్షి, తమ రక్షణ కొరకు గ్యారంటీ అడగటానికి వారు ఈయనను కలవక ముందే, రసూలుల్లాహ్(స) బలగంతో ప్రవేశిస్తే, దాని అర్థం ఖురైష్‌ల సంపూర్ణ నిర్మూలనే ...**"

ఆయన(రజి) తన వాహనాన్ని ఎక్కి ఖురైష్ నాయకులకు ఈ వార్తను తెలపడానికి ఎవరినో ఒకరిని వెతకడానికి బయలు దేరారు, ఆ విధంగా మక్కావాసులు ముహమ్మద్(స)వారి వద్దకు వచ్చి తమ రక్షణ కొరకు వాగ్దానాన్ని పుచ్చుకోవడానికి. **(తరువాయి భాగం 33వ పేజీలో)**

# Science of Hadith
# హదీస్ విజ్ఞానం

( గత సంచిక తరువాయి )

11

## బుఖారీ (ర)
### ( ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ )
(194 - 256 హి.)

### ఇమామ్ బుఖారీ(ర)వారు వ్రాసిన పుస్తకాలు

సాధారణంగా ఇమామ్ బుఖారీ(ర)వారు వ్రాసిన పుస్తకం అనగానే ముస్లిములకు వెంటనే స్ఫురణకు వచ్చేది 9 సంపుటాలతో కూడిన హదీస్ గ్రంథం. అది సహీహ్ బుఖారీగా అందరికీ సుపరిచితమైంది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషలలోకి అనువదించ బడిన గ్రంథం మాత్రమే కాకుండా, అందరిచే ఆమోదించబడిన గ్రంథమది. అయితే ఈ గ్రంథం మాత్రమే కాకుండా ఆయన(ర) చాలా పుస్తకాలు వ్రాశారు. వాటి వివరాలు:

1. సహీహ్ అల్-బుఖారీ (అల్-జామి' అస్-సహీహ్ అల్-ముస్నద్ మిన్-హదీస్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్, వ సుననిహి వ అయ్యామిహి)
2. అత్-తారీఖుల్ కబీర్
3. అత్-తారీఖుల్ ఔసత్
4. అత్-తారీఖుస్ సఘీర్
5. అల్-జామి'ఉల్ కబీర్
6. అల్-ముస్నదుల్ కబీర్
7. అత్-తఫ్సీరుల్ కబీర్
8. కితాబుల్ అష్రిబహ్
9. కితాబుల్ హిబహ్
10. అజ్-జు'అఫా ఉస్-సఘీర్
11. ఖల్ఖ్ అఫా'ఆలుల్ 'ఇబాద్
12. అస్మా ఉస్-సహాబహ్
13. కితాబుల్ వహ్దాన్
14. కితాబుల్ మబ్సూత్
15. కితాబుల్ 'ఇలాల్
16. కితాబుల్ కున
17. కితాబుల్ ఫవాఇద్
18. కితాబు అదబుల్ ముఫ్రద్
19. జుజ్జ్ రఫ్'ఉల్-యద్దైన్ ఫిస్-సలాత్
20. బిర్రుల్-వాలిదైన్
21. ఖజా ఉస్-సహాబహ్ వత్-తాబి'ఈన్
22. కితాబుద్ దఖాఖ్
23. అల్-జామి అస్-సఘీర్ ఫిల్-హదీస్
24. జుజ్జ్ ఉల్-ఖిరా'అహ్ ఖల్ఫల్-ఇమామ్

**1. సహీహ్ బుఖారీ**

ఈ పుస్తకం అమూల్యమైనది. హదీస్ గ్రంథాలలో తొలి ప్రాధాన్యతను పొందిన పుస్తకమిది. ఈ గ్రంథం ఇమామ్ బుఖారీ(ర)వారు ఎంచుకున్న 7563 హదీస్‌లు మాత్రమే కలిగి ఉంది. ఈ గ్రంథంలో ఇస్లామ్ యొక్క వివిధ అంశాలను పుస్తకాలుగానూ మరియు ప్రతీ పుస్తకాన్ని అధ్యాయాలు గానూ విభజించారు. ఆ విధంగా ఈ హదీస్ గ్రంథంలోని పుస్తకాల సంఖ్య 97. మొదటి పుస్తకం (కితాబ్) పేరు : **అల్-వహీ**. చివరి పుస్తకం (కితాబ్) పేరు : **అత్-తౌహీద్**. అధ్యాయాన్ని బాబ్ అంటారు.

ఈ గ్రంథంలోని ప్రతీ అధ్యాయానికి ఒక పేరు ఉంటుంది. ఆ అధ్యాయాల పేర్లు సాధారణ ముస్లిమ్‌లకు విశేషంగా అనిపించక పోవచ్చు. కాని హదీస్ విద్వాంసులకు ఆ పేర్లలో కూడా ఎంతో సమాచారముంది. ఇమామ్ బుఖారీ(ర)వారి జ్ఞానం యొక్క స్థాయి ఆ పేర్లలో ప్రతిబింబిస్తుంది.

సహీహ్ బుఖారీ అనే ఒక గ్రంథం వ్రాయాలని తలంపు ఆయనకు ఎందుకు వచ్చిందని ఓ సాధారణ పాఠకుడికి సందేహం రావచ్చు లేదా అడగవచ్చు. అందుకు ఎన్నో కారణాలు ఉన్నాయి. వాటిలో కొన్ని, శాంతిబాట నవంబర్-డిశంబర్ 2011 సంచికలో వివరించాము. ఇమామ్ బుఖారీ(ర)వారికి పూర్వం వచ్చిన ముహద్దిస్‌లు కూడా హదీస్‌లను సహీహ్, దయీఫ్, మౌజూగా వర్గీకరించారు. అయితే హదీస్‌లన్నీ కలిసి ఉండేవి. వాటిలో నుండి సహీహ్ హదీస్‌లను విడిగా తీసి, ఓ గ్రంథంగా అందించడం అనేది బుఖారీ(ర)వారు మాత్రమే ప్రారంభించారు. గ్రంథాన్ని పుస్తకాలగానూ, అధ్యాయాల గానూ వర్గీకరించడంలో ఆయన అనుసరించిన విధానం నేడు వివిధ రంగాలలో పరిశోధన చేస్తున్న విద్యార్థులకు ఆదర్శప్రాయమైనదని చెప్పవచ్చు.

**2. అత్-తారీఖుల్ కబీర్ :**

సహీహ్ బుఖారీ గ్రంథం విద్వాంసులకు, విద్యార్థులకు మరియు సాధారణ ప్రజల కొరకు వ్రాయబడితే, అత్-తారీఖుల్ కబీర్ అనేది

కేవలం విద్వాంసులకు (scholars) మరియు విద్యార్థులకు రిఫరెన్స్ వర్క్‌గా వ్రాయబడింది. ఇంతకు పూర్వం ఇటువంటి పుస్తకం వ్రాయబడ లేదు. ఉల్లేఖకుల పేర్లు కలిగిన రికార్డ్‌తో అందించబడిన ఇటువంటి పుస్తకం ఎవరైనా ప్రముఖ విద్వాంసుడు తాను జీవితకాలం అంతా కష్టపడితేనే గాని తయారు కాదు. కాని ఇమామ్ బుఖారీ గారు వ్రాసిన ఎన్నో పుస్తకాలలో ఇది ఒకటి.

ఈ పుస్తకంలో ఉల్లేఖకుల పేర్లు ఉన్నాయి. అందులో విశ్వస నీయమైన ఉల్లేఖకులు, బలహీన ఉల్లేఖకులు, సాపేక్షంగా తెలియని ఉల్లేఖకుల పేర్లు ఉన్నాయి. అంతేకాకుండా వారికి సంబంధించిన ముఖ్య సమాచారం కూడా పుస్తకంలో పొందుపరచబడింది. ఈ పుస్తకానికి సంబంధించి అతి ముఖ్యమైన మరో విషయం ఏమిటంటే ఇతర పుస్తకాలలో ప్రస్తావించబడని ఉల్లేఖకుల వివరాలను కూడా ఇది కలిగి ఉండటం. తండ్రీకొడులిద్దరూ ఉల్లేఖకులు అయివుండి, వారి పేర్లు కూడా ఒకటే అయివున్నప్పుడు, వారిద్దరినీ వేర్వేరుగా గుర్తించడం కష్టమైన పని. ఒకొక్కసారి ఇటువంటి పేర్లు అయోమయానికి గురి చేస్తాయి.

ఈ అయోమయానికి అవకాశం లేకుండా తండ్రి మరియు కొడుకుల వివరాలను విడివిడిగా వివరించారు. అంతేకాకుండా ఇతర హదీస్ గ్రంథాల్లో అరుదుగా ఉండే కొన్ని హదీస్‌లను కూడా ఈ పుస్తకంలో అందించారు. చంద్రుని కాంతిలో ప్రవక్త(స)వారి సమాధి పక్కన కూర్చుని ఇమామ్ బుఖారీగారు ఈ పుస్తకాన్ని వ్రాశారు. ఆయనకు తెలియని ఉల్లేఖకుని వివరాలు అరుదు. అయితే ప్రతీ ఒక్కరి సమాచారం అందిస్తే పుస్తకం చాలా పెద్దది అయిపోతుందని కొందరి పేర్లు దీనిలో పొందుపరచలేదు. ఇస్‌హాక్ బిన్ రాహవయ్యా గారు అత్-తారీఖ్ పుస్తకాన్ని తీసుకుని అబ్దుల్లాహ్ బిన్ తాహిర్ గారికి సమర్పించారు. అబ్దుల్లాహ్‌గారు ఆ పుస్తకాన్ని చూచి చాలా ప్రభావితం అయ్యారు. అటువంటి పని ఎలా చేయగలిగారో తనకు అర్థం కావడం లేదని ఆశ్చర్యపోయారు. అస్-సుబ్‌కీ(ర) అత్-తారీఖుల్ కబీర్ పుస్తకాన్ని ఇంతకు ముందెన్నడూ జరగని గొప్ప కార్యంగా అభిప్రాయ పడ్డారు. ఇమామ్ బుఖారీ(ర)వారి తరువాత వచ్చే విద్వాంసులు ఎవరైనా, ఉల్లేఖకుల చరిత్రపైగాని, వారి పేర్లు మరియు కున్యాలపైగాని వ్రాసేటప్పుడు ఈ పుసకాన్ని ఉపయోగించు కోకుండా ఉండలేరని చెప్పారు. విద్వాంసులు ఈ పుస్తకాన్ని ఎంతగానో ప్రశంసించారు.

**3. అత్-తారీఖుల్ అవ్‌సత్** : అబ్దుల్లాహ్ బిన్ అహమద్ బిన్ అబ్దుస్సలామ్ అల్-ఖఫ్ఫాఫ్ మరియు జిన్‌జవై అల్-లిబాద్ ఈ పుస్తకం గురించి ఉల్లేఖించారు.

**4. అత్-తారీఖుస్ సఘీర్** : ప్రవక్త(స)వారి జీవిత చరిత్రను మరియు ముహాజిరూన్, అన్సార్, తాబి'ఊన్ మరియు వారి తరువాత వచ్చిన వారి జీవితాలను సంగ్రహంగా ఈ పుస్తకంలో తెలియజేశారు. దీనిలో ఉల్లేఖకుల వంశాలు మరియు కున్యాలు మరియు వారు చనిపోయిన తేదీలను ప్రస్తావించారు. అంతేకాకుండా ప్రతీ ఉల్లేఖకుడు - అతడు విశ్వసనీయుడో లేక బలహీనుడో లేక నమ్మకూడనివాడో వివరించారు. ఈ పుస్తకంలోని అధ్యాయాలు తేదీల వరుస క్రమంపై ఆధారపడ్డాయి. ఒక సంవత్సరంలో జరిగిన ముఖ్య సంఘటనలను మరియు అదే సంవత్సరంలో చనిపోయిన ప్రముఖ విద్వాంసుల పేర్లు కూడా ఈ పుస్తకంలో ప్రస్తావించబడ్డాయి.

**5. అల్-జామి'ఉల్ కబీర్** : ఈ పుస్తకం ఇప్పుడు లేదు. ఈ పుస్తకాన్ని ఇబ్నె తాహిర్ రిఫర్ చేశారు.

**6. అల్-ముస్‌నదుల్ కబీర్** : అల్-ఫిరాబ్రీ ఈ పుస్తకం గురించి ప్రస్తావించారు. ఇది కూడా కోల్పోబడింది.

**7. అత్-తఫ్సీరుల్ కబీర్** : అల్-ఫిరాబ్రీ ఈ పుస్తకం గురించి ప్రస్తావించారు. ఇది కూడా కోల్పోబడింది.

**8. కితాబుల్ అష్రిబహ్** : దారఖుత్నీ తన పుస్తకం 'అల్ మాతలఫ్ వల్-ముఖ్తలఫ్ ఫీ తర్జుమహ్ కైసహ్'లో ఈ పుస్తకాన్ని రిఫర్ చేశారు.

**9. కితాబుల్ హిబహ్** : దీనిలో సుమారుగా500 హదీస్ లున్నాయి.

**10. అజ్-జు'అఫా అస్-సఘీర్** : ఇందులో బలహీన ఉల్లేఖకుల పేర్లను అక్షరక్రమంలో వ్రాశారు. వారి బలహీనతకు కారణాలు కూడా ఈ పుస్తకంలో ప్రస్తావించబడ్డాయి.

**11. ఖల్ఖ్ అఫ్'ఆలుల్ 'ఇబాద్** : ఆయత్‌లను మరియు సహాబీలు మరియు తాబి'ఊన్‌లు ఉల్లేఖించిన హదీస్‌లను తిరస్కరించి **వక్రమార్గంలో పోయే తెగలు చేసిన తప్పుడు ప్రకటనలను ఈ పుస్తకంలో ఖండించారు.**

**12. అస్మాఉస్ సహాబహ్** : అబ్దుల్ ఖాసిమ్ బిన్ మన్‌దహ్‌గారు ఈ పుస్తకాన్ని ప్రస్తావిస్తూ, తరచుగా ఇందులోని పాసేజెన్‌ని కోట్ చేస్తుండేవారు. విద్వాంసులకు ఇది ఒక రిఫరెన్స్ పుస్తకం. సహాబాల పేర్లు, వంశావళి మరియు జీవితచరిత్ర ఈ పుస్తకంలో పొందుపరచ బడ్డాయి.

**13. కితాబుల్-వహ్‌దాన్** : ఈ పుస్తకం నుండి ఇబ్నె మన్‌దహ్ పాసేజెస్‌ను తరచుగా చెబుతుండేవారు. ఈ పుస్తకంలో సహాబాలలో బాగా తక్కువుగా సుపరిచితమైన వారిపై దృష్టి పెట్టారు. ఆ సహాబాలు కేవలం ఒక్కొక్కరు ఒక్కొక్క హదీస్ మాత్రమే ఉల్లేఖించినవారు. బుఖారీ(ర)వారి సమకాలీకులైన ముస్లిమ్(ర) మరియు నసాయీ(ర) కూడా ఇదే అంశంపై వ్రాశారు.

**14. కితాబుల్-మబ్‌సూత్** : ఈ పుస్తకం కూడా కాలగర్భంలో కలిసి పోయింది. అల్-ఖలీలా గారు తన పుస్తకం అల్-ఇర్‌షాద్‌లో అల్-మబ్‌సూత్ గురించి ప్రస్తావించడం వల్లనే అటువంటి ఓ పుస్తకాన్ని ఇమామ్ బుఖారీ(ర) వ్రాశారని తెలిసింది. అబ్దుల్లాహ్ బిన్ అర్-రహమానీ గారు చెప్పినదానిని బట్టి ఈ పుస్తకానికి సంబంధించి ఇబ్నె మన్‌దహ్ గారు చేతితో వ్రాసిన ప్రతులు జర్మనీలో రెండవ ప్రపంచ యుద్ధకాలానికి ముందు వరకూ ఉండేవనీ చెప్పారు.

**(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)**

మనిషి కోతినుండి పరిణామం చెందాడనే

THEORY OF EVOLUTION

# డార్విన్ సిద్ధాంతం - శాస్త్రీయ వాస్తవం కాదు.

# రాతి యుగం ఓ చారిత్రక అబద్ధం

మానవులందరికీ పితామహుడు మరియు అల్లాహ్ యొక్క తొలి ప్రవక్తయైన ఆదమ్(అ)వారి గురించి, బాలబాలికలకు ప్రత్యేకం శీర్షికలో డిశంబర్'10 సంచికలో స్పష్టంగా వివరించాము. ఆయన కాలం నుండే వ్యవసాయం ప్రారంభమైంది. వారు వస్త్రాలు ధరించారు. 3వ ప్రవక్త ఇద్రీస్(అ)వారి ద్వారా టైలరింగ్ మరియు వ్రాయడం మొదలైంది. నూహ్(అ)వారు ఓడను నిర్మించారు. కాబట్టి మానవుడు ఈ భూమిపై అడుగు పెట్టినప్పటి నుండి సంస్కారంతో ఒక విధానం ప్రకారమే జీవనాన్ని ప్రారంభించడం జరిగింది.

మనిషి కోతి నుండి రూపాంతరం చెందాడనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన దగ్గర నుండి, ఆ అసత్యాన్ని నిజంగా చూపడానికి చరిత్రను దానికణుగుణంగా మార్చి వ్రాశారు. మన పాఠ్య పుస్తకాల ద్వారా చిన్నతనం నుండి అవే నేర్చుకుంటున్నాము. చిన్నతనం నుండే ఓ అసత్యం మన మనస్సులలో నాటుకు పోయేలా చేస్తున్నారు. ఇటువంటి సిద్ధాంతం ద్వారా మనం ఏ విధంగా మోసగించబడ్డామో స్పష్టంగా తెలుసు కోవడానికి అనువైన ఓ పుస్తకం **"A Historical Lie - The Stone Age"** దీనిని టర్కీ దేశానికి చెందిన హారున్ యహ్యా వ్రాశారు. శాంతిబాట ప్రారంభంలో ఈయన వ్యాసాలను కొన్నింటిని అందించాము. పాఠకుల నుండి విశేష ఆదరణ లభించింది. ఈ పుస్తకాన్ని పూర్తిగా గాని లేదా ముఖ్యవిషయాలను గాని యథాతథంగా ఈ శీర్షికలో ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.

## 3 మానవాభివృద్ధి

*ఈ శీర్షిక తొలి వ్యాసంలో వేల సంవత్సరాల క్రితం మానవులు తయారు చేసిన పనిముట్లు, వస్తువులు, అభరణాల గురించి ఫొటోలతో సహా వివరించాము. రాతియుగం అనేది లేదని అందరికీ అర్థం కావడానికి స్పష్టమైన ఆధారాలతో ఆ వ్యాసం అందించడం జరిగింది. క్రిందటి సంచికలో "ఈ భూమిపై మానవ జీవితం ఎప్పుడు ప్రారంభమైంది" అనే విషయంపై ఓ అంచనా వేసి, కనీసం ఒక లక్ష సంవత్సరాల కంటే ఎక్కువేగాని తక్కువ కాదు అని చెప్పడం జరిగింది.*

### ఏక కాలంలో ప్రవక్తల సంఖ్య

ఈ అంచనా వేసేటప్పుడు ఏకకాలంలో ఒకరి కంటే ఎక్కువ మంది ప్రవక్తలు ఈ భూమిపై ఉండవచ్చని చెబుతూ, ఆ విధంగా ఉండటం ఎన్ని రకాలుగా సాధ్యం కావచ్చో వాటన్నింటిని క్రిందటి సంచికలో చర్చించడం జరిగింది. ఒకే కాలంలో 43మంది ప్రవక్తలున్నారని తెలియజేసే ఓ సంఘటనను తఫ్సీర్ గ్రంథాల నుండి ఇక్కడ అందిస్తున్నాము.

సూరహ్ ఆలిమ్రాన్‌లో 21వ ఆయత్ ఓ సారి గమనించండి :

**నిశ్చయంగా, అల్లాహ్ ఆయత్‌లను తిరస్కరించే వారికి మరియు ఆయన ప్రవక్తలను అన్యాయంగా చంపేవారికి మరియు న్యాయసమ్మతంగా వ్యవహరించమని బోధించే ప్రజలను చంపేవారికి, బాధాకరమైన శిక్ష ఉన్నదని తెలియజెయ్యి**(ఖుర్'ఆన్ 3:21)

పై ఆయత్‌లో ప్రస్తావించబడిన వారు యూదులు. రూహుల్‌మానీలో ఈ ఆయత్‌పై వ్యాఖ్యానం ఉంది. ఇబ్నె అబీ హాతిమ్‌గారి ఉల్లేఖనం ప్రస్తావించ బడింది. దాని ప్రకారం బనీ ఇస్రాయీల్ ఒకే సమయంలో 43 మంది ప్రవక్తలను చంపివేశారు. అంతేకాకుండా 170 మంది ధర్మపరాయణులైన పెద్దలు లేచి వారిని న్యాయాన్ని నిలబెట్టాలని అడిగారు. అదే రోజు వారందరినీ కూడా చంపడం జరిగింది. (బయానుల్ ఖుర్'ఆన్)

### పరిణామ సిద్ధాంతం

పరిణామ సిద్ధాంతం ప్రకారం జీవరాశులన్నీ కొన్ని ప్రత్యేక దశల ద్వారా బాక్టీరియా నుండే మానవుని వరకూ అభివృద్ధి చెందాయట. ఈ అభివృద్ధికి కొన్ని లక్షల సంవత్సరాల కాలం పట్టిందని పరిణామవాదులు నమ్ముతారు. ఈ పరిణామ సిద్ధాంతం ప్రకారం, **మానవుడు గత 20 వేల సంవత్సరాల కాలంలోనే అభివృద్ధి చెందాడట**. వారు చెప్పిన దానికి ఆధారంగా ఇంతవరకూ ఏ fossil రికార్డ్ కూడా లేదు. పురావస్తు పరిశోధనలు ఏవీ కూడా వీరి సిద్ధాంతాన్ని బలపరచడం లేదు. ఈ శీర్షిక ప్రారంభంలోనే చెప్పుకున్నాం, తొలి మానవుడు వ్యవసాయం చేశాడని. మరికొన్ని విషయాలు క్లుప్తంగా పై టైటిల్ క్రింద ఇవ్వబడిన పేరాలో చూడండి.

తొలి మానవుడైన ఆదమ్(అ)వారు ఈ భూమిపై జన్మించలేదు. ఆయన భార్యతో సహా ఈ భూమిపైకి పంపబడ్డారు. వారి సంతానం యొక్క పరంపర కొనసాగుతూనే ఉంది. ఆ సంతానానికి చెందిన వారమే మనమంతా. అందుకే ఖుర్'ఆన్‌లో అల్లాహుతాలా సమస్త మానవులను ఉద్దేశించి 'ఓ ఆదమ్ సంతానమా!' అని సంబోధించి చెప్పడం జరిగింది.

తొలి మానవుని దగ్గర నుండి ఈ రోజు వరకూ మానవుడు సంస్కార వంతంగానే జీవనం సాగించడం జరుగుతుంది. **ఈ 21వ శతాబ్దంలో అనాగరికులు లేరా?** ఈ రోజుల్లో కూడా నాగరికత తెలియకుండా బ్రతికే వారున్నారు. ఇటువంటివారు పూర్వకాలంలో కూడా ఉండి ఉండవచ్చు. కాని కేవలం కొందరు అనాగరికులను మాత్రమే దృష్టిలో పెట్టుకుని, తొలి మానవుడు గుహల్లో జీవించాడని మరియు రాతి పనిముట్లనే వాడేవాడు అని చెప్పడం పరిణామవాదుల యొక్క ఒక ఊహ మాత్రమే.

ఊహలకు హద్దు లేదు. కాని తమ ఊహలను నిజమని నమ్మించ డానికి ప్రయత్నించడం సరికాదు. స్కూలు మరియు కాలేజీలలో చదువుకునే వారిలో, అత్యధిక శాతం మంది ఈ పరిణామ సిద్ధాంతాన్ని నమ్ముతారు. నమ్ముతారు అనే కంటే అంత ఘోరంగా వారిని నమ్మించారు అనే చెప్పాలి. **నిరూపణకాని ఓ సిద్ధాంతాన్ని నిజమని నమ్మించారు.** నిరూపించబడని ఏ విషయాన్నైనా నమ్మవద్దని నాస్తికులు మరియు హేతువాదులే చెబుతుంటారు. అటువంటి నమ్మకాలను మూఢ నమ్మకాలుగా కొట్టి పారేస్తారు.

అయితే వారు తమ సహజ వాదానికి భిన్నంగా ఊహాజనిత పరిణామ సిద్ధాంతమనే ఓ మూఢ నమ్మకాన్ని ఈ నాస్తికులు మరియు హేతువాదులే ప్రజలను నమ్మమని చెబుతున్నారు. సైన్స్ పుస్తకాలలో వచ్చే ప్రతీ అంశం నిజం కాదని, కొన్ని ఘోర అసత్యాలు అందులో ఉన్నాయని ప్రజలలో అనుమానం బలపడింది. **'మనిషిని అల్లాహ్ సృష్టించాడు అనే సత్యాన్ని'** ప్రజలు నమ్మకుండా చేయడానికి దానిని ఓ మూఢనమ్మకమని ప్రజలు భావించేలా చేయడానికే వారు ఓ అసత్యాన్ని ఆధారంగా చేసుకున్నారు. అసత్యాలపైన ఆధారపడిన ఏ పునాది అయినా చాలా బలహీనంగా ఉంటుంది.

**వ్యవస్థలో సమస్య వస్తే దానిని పరిష్కరించాలి గాని, వ్యవస్థనే నిర్మూలించాలనే ఆలోచన అవివేకం కాక మరేమిటి?**

సమాజంలోని సాంఘిక దురాచారాలను వివేకంతో తొలగించాలి. న్యాయస్థానంలో కొందరికి అన్యాయం జరిగిందని, అసలు న్యాయ వ్యవస్థే ఉండకూడదంటే, అది అజ్ఞానం అనిపించు కుంటుంది. రాజ్యాంగం ప్రకారం న్యాయం జరిగేలా కృషి చేయాలి.

మతం ముసుగులో ఎవరైనా దౌర్జన్యానికి ఒడిగడితే, ఆ దౌర్జన్యాన్ని అరికట్టడానికి బదులు, మతం అనేదే ఉండకూడదని, అదే దౌర్జన్యానికి కారణమని చెప్పడం అజ్ఞానపు చీకట్లలో కొట్టుమిట్టాడటమే అవుతుంది.

**మానవజాతి అభివృద్ధి**

తొలి పురుషుడు కోరికతో తొలి స్త్రీని శారీరకంగా కలిసాక, ఆ స్త్రీ ఓ బిడ్డను ప్రసవించిందని అనుకుందాం. ఆ బిడ్డను ఏం చేయాలో ఆ తల్లికెలా తెలుస్తుంది. గర్భం గురించి శ్రద్ధ తీసుకోకపోతే గర్భం నిలిచే అవకాశం కూడా లేదు. ప్రసవించాక ఆ బిడ్డను తల్లి వదిలేసి వెళ్ళిపోతే ఆ బిడ్డ ఏమవుతుంది?

ఆ బిడ్డ తల్లి దగ్గరికి రాలేదు. బిడ్డ పుట్టిన తరువాత ఆ బిడ్డకు పాలివ్వాలి. పాలు ఇవ్వకపోతే బిడ్డ ఏడుస్తుంది. పరిణామవాదులు భావిస్తున్నట్లు తొలి మానవులు అనాగరికులు అయితే, **బిడ్డ ఏడుపుకు అర్థం ఆ తొలి తల్లికి ఎలా అర్థమైంది?** ఆవు దగ్గరకు దూడ వెళ్ళి పాలు త్రాగ గలుగుతుంది. మరి తల్లి దగ్గరకు పసిబిడ్డ వెళ్ళి పాలు త్రాగగలుగుతుందా? పాలు లేక ఆ బిడ్డ చనిపోవచ్చు. ఆ బిడ్డ చావుకు కారణం వారికి తెలియదు. ఈ విధంగా పుట్టిన ప్రతీసారి బిడ్డ పాలు లేక చనిపోతే, ఎంతమంది బిడ్డలకు ఆ స్త్రీ జన్మనివ్వ గలదు? **ఆ తొలి జంటతోనే మానవజాతి అంతరించిపోదా?**

మానవజాతి అభివృద్ధి చెందాలంటే ఓ వివాహ వ్యవస్థ ఉండాలి. అత్యాచారాలు, అరాచకాలు, దొంగతనం, దోపిడీలు మొదలైన వాటి నుండి రక్షణ కల్పిస్తూ న్యాయం నిలబెట్టగలిగే ఓ వ్యవస్థ ఉండాలి. ఈ వ్యవస్థే జీవన విధానం. ఆ జీవన విధానాన్నే మతం అంటారు.

ఒక స్త్రీ, పురుష జంట ఉన్నంత మాత్రాన సరిపోదు. వారి ద్వారా సంతానోత్పత్తి కావాలి. దాని కొరకు స్త్రీ, పురుషులు శారీరకంగా కలిసినప్పుడు, పురుషుని వీర్య కణాలు, స్త్రీ గర్భాశయాన్ని చేరాలి. ఇక్కడే ఉంది అసలు విషయం. **పరిణామ సిద్ధాంతం వివరించలేని ఓ నిజం.** ఆ నిజం తెలుసుకుంటే సృష్టికర్త ఉన్నాడని స్పష్టంగా తెలుస్తుంది.

ఈ వీర్యకణాలు వృషణాల నుండి స్త్రీ గర్భాశయానికి చేరడానికి జరిగే ప్రయాణంలో ఎన్నో దశలున్నాయి. చాలా ప్రక్రియలు జరుగుతాయి. అవన్నీ ఇక్కడ చెప్పడానికి స్థలం సరిపోదు. ముఖ్యమైన వివరాలను మాత్రమే ఇక్కడ అందిస్తున్నాము. ఈ ప్రయాణంలో వీర్యకణాలకు సహకరించేవి కూడా చాలా ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది ప్రోస్టేట్ గ్రంధి. స్పెర్మ్ (వీర్యం) తయారుకాగానే, ప్రోస్టేట్ గ్రంధిలో ప్రత్యేకమైన ద్రవాలు ఉత్పత్తి కావడం మొదలౌతుంది. ఈ ప్రత్యేక ద్రవాలు వీర్యంతో కలసి ప్రయాణిస్తాయి.

ఈ ద్రవంలో, సిట్రిక్ యాసిడ్, కాల్షియం మరియు యాసిడ్ ఫాస్ఫేట్స్, క్లాటింగ్ ఎంజైమ్ మరియు ప్రొఫినోలిసిన్ ఉంటాయి. స్త్రీ యొక్క పునరుత్పత్తి అవయవాలలో చిక్కటి యాసిడ్ మిశ్రమం ఉంటుంది. ఈ మిశ్రమ ద్రవం వాటిలో బాక్టీరియాను పెరగకుండా ఆపుతుంది (prevents proliferation of bacteria).

1. స్త్రీ అవయవాలలో ఉండే ఈ యాసిడ్ మిశ్రమం వీర్యం యొక్క కదలిక సామర్థ్యాన్ని త్రుంచివేయడమే కాకుండా, వీర్యకణాలను కూడా చంపగలదు. కాని పురుషుని ప్రోస్టేట్ గ్రంధి నుండి వెలువడిన ద్రవం ఈ యాసిడ్ ప్రభావాన్ని తటస్థం (న్యూట్రలైజ్) చేసేసి, ఆ విధంగా వీర్యకణాలు అండం వైపు ఈదుకుంటూ సులభంగా వెళ్ళేలా చేస్తుంది.
2. ఈ ద్రవంలో ఫ్రక్టోజ్ మరియు ఇతర పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. అంతేకాకుండా ఎక్కువ పరిమాణంలో prostaglandins మరియు fibrinogen ఉంటాయి.

స్త్రీ శరీరంలో ప్రవేశించిన దగ్గరనుండి 'అండం' ఫలధీకరణం చెందే సమయం వరకూ వీర్యానికి ఫ్రక్టోజ్ మరియు ఇతర పోషకాలు బలాన్నిస్తాయి. అదనంగా ఈ ద్రవంలో ఉండే 'prostaglandin' వీర్యం భిన్న పద్ధతుల ద్వారా అండాన్ని చేరడానికి సహాయపడుతుంది. Prostaglandin పనులలో ఒక పని ఏమిటంటే గర్భాశయ మార్గంలో mucusతో చర్య జరిపి, వీర్యం కదలడానికి అనువైన పరిస్థితులను కలుగజేస్తుంది. మరొక పని ఏమిటంటే గర్భాశయంలో మరియు ఫాలోపియన్ గొట్టాలలో reverse contractions అయ్యేలా చేసి వీర్యం చాలా సులభంగా కదిలేలా జేస్తుంది.

పైన చెప్పిన రెండు విషయాలను మరోసారి చదివి, ఆలోచించండి.

మగవానిలోని ప్రోస్టేట్ గ్రంధికి స్త్రీ శరీరంలో ఉండే పరిస్థితులు తెలియవు కదా! తెలిసే అవకాశం ఎంత మాత్రం లేదు. కాని స్త్రీ శరీరంలోని పరిస్థితులకు తగిన విధంగా మగవాని ప్రోస్టేట్ గ్రంధి ఎలా పనిచేస్తుంది? ఆ జ్ఞానం ఈ గ్రంధికి ఎలా వచ్చింది? వీర్యం చేసే ప్రయాణంలో యాసిడ్ (ఆమ్ల) పరిస్థితులను ఎదుర్కోబోతుందని, ఆ పరిస్థితులలో వీర్యకణాలు బ్రతకలేవని తెలుసుకోవడమే కాకుండా, ఆ ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలో మరియు ఎటువంటి ద్రవాన్ని ఉత్పత్తి చేయాలో ఈ గ్రంధి (gland) ఎలా తెలుసుకోగలిగింది?

ద్రవాన్ని స్రవించే మగవానిలోని ఓ గ్రంధి, దానితో సంబంధంలేని మరొక శరీరంలోని పరిస్థితులను, ప్రక్రియలను తెలుసుకోవడం మరియు తదనుగుణంగా నిర్ణయాన్ని తీసుకొని, వాటిని అమలు చేయడమనేది అసాధ్యమైన విషయం.

నాస్తికుల నమ్మకం ప్రకారం, సృష్టికర్త యొక్క అవసరం లేకుండా అప్రయత్నంగా ఓ జీవి ఉద్భవించింది అనుకుందాం. ఆ జీవిలో కాలాను గుణంగా మార్పులు జరిగి, జరిగి ప్రస్తుతం ఈ రూపంలో ఉన్నట్లు చెబుతున్నారు. ఎక్కువ ఉష్ణోగ్రతలుండే వేడి ప్రాంతాలలో, శరీరం ఆ వేడిని తట్టుకునే విధంగా చర్మంలో మార్పు రావచ్చు. అలాగే చలి ప్రదేశంలో నివశించేవారికి, చలిని తట్టుకునే విధంగా కూడా చర్మంలో మార్పులు రావచ్చు. అంతేగాని తనకు తెలియని మరియు తన శరీరంతో ప్రత్యక్షంగా ఎటువంటి సంబంధంలేని, వేరే శరీరభాగానికి సరిపోయేటట్లుగా **మార్పు చెందడమనేది ఆలోచించడానికే అసమంజసంగా ఉంది.** ఏదైనా ఓ జీవి శరీరంలో అంతర్లీనంగా జరిగే మార్పులు, ఆ జీవి శరీరానికే తెలుస్తాయిగాని, వేరే జీవికి తెలియవు. ఒక మనిషికి గట్టిగా దెబ్బ తగిలితే ఆ మనిషికి నొప్పి కలుగుతుంది. ఆ మనిషి కళ్ళ నుండి అప్రయత్నంగా నీళ్ళు వస్తాయి. అలాగే మనిషికి ఏదైనా జరిగితే, దానికి అనుగుణంగా ఆ శరీరంలోనే ఇతర ప్రక్రియలు జరుగుతాయి.

అస్సలు చదువుకోని మగవాడైనాసరే, లేదా అతడు చాలా గొప్ప జ్ఞాని అయినా సరే, వారిద్దరిలో కూడా ప్రోస్టేట్ గ్రంధి ఒకే విధంగా పనిచేస్తుంది. ఆ గ్రంధి ఏమి చేస్తుందో కూడా వారికి తెలియదు. పైన చెప్పినట్లు ఏదైనా ప్రమాద సమయాల్లో అనుకోకుండా, అప్రయత్నంగా మన శరీరభాగాలు మనకు తెలియకుండానే రియాక్ట్ అవుతాయని మీరు అనవచ్చు. నిజమే! కాని ఇక్కడ పరిస్థితి అది కాదు. మగవాని శరీరభాగంలో, స్త్రీ గర్భాశయం ఒక భాగం కాదు కదా! ఈ రెండింటికి అస్సలు కనెక్షన్ లేనే లేదు. వారిద్దరికీ పెళ్లి కాకముందు కూడా మగవానిలో ఈ గ్రంధి ఉంటుంది.

ఆ గ్రంధి ఆ సమయానికి ద్రవాన్ని విడుదల చేయాలని నిర్ణయం చేయడం, అంతేకాకుండా అక్కడ జరిగే చర్యలన్నిటికీ కూడా కారణం ఏమిటి? **మనలోని ఈ ఇంటెలిజెంట్ డిజైన్ని చేసింది ఆ సృష్టికర్తే!** స్త్రీ యొక్క జననాంగ మార్గంలో ఉండే పరిస్థితులేమిటి, అందులో ఏ ద్రవాలుంటాయి. వాటి యొక్క లక్షణాలు ఏమిటి? అలాగే పురుషుని వీర్యం యొక్క లక్షణాలేమిటి, అవి స్త్రీ గర్భాశయంలోని అండాన్ని చేరడానికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి. వీర్యం ఎదుర్కోబోయే ప్రమాదమేమిటీ, అందుకు పరిష్కారంగా ఎటువంటి ద్రవం కావాలి మొదలైన విషయాలను అర్థం చేసుకోవాలంటే, ఎన్ని సంవత్సరాలు కష్టపడి తెలుసుకోవాలో ఆలోచించండి.

మరి లక్ష సంవత్సరాల క్రితమే పురుషుని శారీరక నిర్మాణానికి ఈ విషయం ఎలా తెలిసింది? ప్రోస్టేట్ గ్రంధిలో అటువంటి ఓ ప్రత్యేకమైన ద్రవం తయారు కావాలని ఆ గ్రంధికి సమాచారాన్నిచ్చింది ఎవరు? ఈ గ్రంధినుండి అటువంటి ద్రవం తయారుకాకపోతే తొలి మానవుడితోనే, మానవ జాతి అంతరించి పోయేది కదా!

**"ఓ మానవులారా! మీ ప్రభువు పట్ల భయభక్తులు కలిగి ఉండండి, ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి సృష్టించాడు. మరియు ఆయనే దాని నుండి దాని జంటను సృష్టించాడు మరియు వారిద్దరి నుండి అనేక పురుషులను మరియు స్త్రీలను వ్యాపింపజేశాడు. మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి..."** (ఖుర్'ఆన్ 4:1)

కాబట్టి సృష్టి దానంతట అదే ఏర్పడిపోలేదు. ఈ సృష్టినంతటినీ సృష్టించి, దానికొక విధానాన్ని ఏర్పరచిన సృష్టికర్త ఉన్నాడు. భారీ విస్ఫోటనం (Big Bang) వలన సృష్టి ఏర్పడితే, ఆ విస్ఫోటనమే విశ్వానికి ఇంత అందమైన రూపాన్ని ఇచ్చిందా? ఆలోచించండి!

**లక్ష సంవత్సరాల పూర్వానికి చెందిన లోహ పాత్ర**

**1852వ సంవత్సరం జూన్ 5న సైంటిఫిక్ అమెరికన్ అనే మేగజైన్‌లో ఒక డిస్కవరీ ప్రచురించబడింది. లక్ష సంవత్సరాల క్రితం తయారైన ఓ లోహ పాత్ర యొక్క శిధిలాలు కనుగొన్నారు. అది గంట ఆకారంలో ఉంది. దాని రంగు జింక్‌ను పోలి ఉంది మరియు అది మిశ్రమ లోహంతో తయారు చేయబడింది. గమనించ దగిన పరిమాణంలో దానిలో వెండి కూడా ఉంది. అంతేకాకుండా ఆ పాత్ర ఉపరితలంపై పువ్వులు, లతలు అందంగా చెక్కబడి ఉన్నాయి.**

అంటే ఆ కాలంలో లోహాలను మిశ్రమం చేసి పాత్రలు తయారు చేయడం మాత్రమే కాకుండా, చిత్రకళా నైపుణ్యం వారికి ఉంది అంటే, వారు పరిణామవాదులు చెప్పినట్లు గుహలలో నివశించే వ్యక్తులు కాదని, నాగరిక జీవనాన్ని సాగించేవారని అర్థమౌతుంది.

### మానవ చరిత్ర నాగరికమైనదే!

తొలి మానవుడి నుండి ముహమ్మద్(స)వారి వరకూ మానవులకు సన్మార్గం బోధించడానికి ఎందరో ప్రవక్తలను అల్లాహుతాలా పంపారు. వారంతా ఒక్కరినే ఆరాధించారు. నైతిక విలువలు కలిగి ఉండేవారు.

పూర్వం మానవులంతా ఒకే ఒక సమాజంగా ఉండేవారు. అప్పుడు అల్లాహ్ వారికి శుభవార్తలు ఇవ్వటానికి మరియు హెచ్చరికలు చేయటానికి ప్రవక్తలను పంపాడు మరియు మానవులలో ఏర్పడిన బేధాలను పరిష్కరించటానికి ఆయన గ్రంథాన్ని సత్యంతో వారి ద్వారా అవతరింప జేశాడు. మరియు అది ఇవ్వబడినవారు, స్పష్టమైన హితోపదేశాలు పొందిన తరువాత కూడా, పరస్పర ద్వేషాల వల్ల బేధాభిప్రాయాలు పుట్టించుకున్నారు. కాని అల్లాహ్ తన ఆజ్ఞతో, విశ్వాసులకు వారు వివాదాలాడుతున్న విషయంలో సత్యమార్గాన్ని చూపాడు మరియు అల్లాహ్ తాను కోరిన వారికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తాడు. (ఖుర్'ఆన్ 2:213)

ప్రతీ సమాజాన్ని హెచ్చరించడానికి, సృష్టికర్త యొక్క ఏకత్వాన్ని జ్ఞాపకం చేయడానికి వారి దగ్గరకు ప్రవక్తలు పంపబడేవారు.

**నిశ్చయంగా మేము నీకు సత్యం ప్రసాదించి, శుభవార్త నిచ్చేవానిగా మరియు హెచ్చరిక చేసేవానిగా పంపాము. మరియు హెచ్చరిక చేసేవాడు వారి మధ్య లేకుండా, ఏ సమాజం కూడా గడచిపోలేదు.** (ఖుర్'ఆన్ 35:24)

అంటే చరిత్రలో అల్లాహ్ నుండి **సందేశాన్ని అందుకోకుండా ఉన్న జాతిగాని, ప్రాంతంగాని లేదు** అని చాలా స్పష్టంగా తెలుస్తుంది.

మానవులు సన్మార్గంలో, నైతిక విలువలతో బ్రతకడానికి మార్గాన్ని చూపడానికై గ్రంథాలను అల్లాహ్ తన సందేశహరులపై అవతరింప జేశారు. అయితే వాటిని తిరస్కరించి, చెడుమార్గంలో అనాగరికంగా జీవించినవారు కూడా ఉన్నారు.

సులైమాన్(అ)వారి కాలంలో టెక్నాలజీ ఏ స్థాయిలో ఉండేదో ఖుర్'ఆన్‌పై అవగాహన కలిగిన వారికి ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాం. సబా రాణి సులైమాన్(అ)వారి కోటలో ప్రవేశించినప్పుడు ఒక చోట నీరు ఉందని భావించి తన వస్త్రాలు తడుస్తాయని, కొంతమేర వాటిని పైకి లేపారు. కాని వాస్తవానికి అది నీరు కాదు. గాజు. అదే విధంగా ఆయన కాలంలో కమ్యూనికేషన్ టెక్నాలజీ కూడా బాగుండేది.

ఈజిప్టులో పిరమిడ్లు చూస్తే అప్పటివారి నైపుణ్యం ఏమిటో మనకు అర్థమౌతుంది. ఈ నైపుణ్యం, ఇటువంటి టెక్నాలజీ మొదలైన విజ్ఞానమంతా అల్లాహ్ యొక్క అనుగ్రహమే.

మరియు మీ ప్రభువు ప్రకటించిన విషయం : "**మీరు కృతజ్ఞులైతే, నేను మిమ్మల్ని ఎంతో అధికంగా అనుగ్రహిస్తాను.** కాని ఒకవేళ మీరు కృతఘ్నులైతే, నిశ్చయంగా, నా శిక్ష ఎంతో కఠినమైనది. (ఖుర్'ఆన్ 14:7)

ఇహలోకంలో మరియు పరలోకంలో సంతోషంగా ఉండటానికి మనపై అల్లాహ్ ఎన్నో అనుగ్రహాలను కురిపించారు.

ఏ పురుషుడూ గానీ, లేక స్త్రీ గానీ విశ్వాసులై, సత్కార్యాలు చేస్తే, అలాంటి వారిని మేము తప్పక (ఇహలోకంలో) మంచి జీవితం గడిపేలా చేస్తాము. మరియు వారికి (పరలోకంలో) వారు చేసిన సత్కార్యాలకు ఉత్తమ ప్రతిఫలం తప్పక ప్రసాదిస్తాము. (ఖుర్'ఆన్ 16:97)

ప్రతీ కాలంలోనూ మానవుడు తన అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీని అభివృద్ధి చేసుకున్నాడు. ప్రతీ మనిషి పరీక్షించబడతాడు కష్టాలతో మరియు ఆపదలతో. ఆపదలలో ఉన్నప్పటి వారి పరిస్థితులను చూచి వారిని అనాగరికమైన వారుగా భావించకూడదు.

ప్రస్తుతం మన దేశంలో ఎల్లప్పుడూ మినరల్ వాటర్‌ని మాత్రమే త్రాగేవారు కొందరున్నారు. కాని దేశంలో అత్యధిక శాతం ప్రజలు కలుషితమైన నీరు త్రాగుతున్నారు. బిందెడు నీటికోసం ఎన్నో కిలోమీటర్లు నడిచి వెళ్ళి తెచ్చుకోవలసిన దుస్థితి నేడు నెలకొని ఉంది. నేటికీ కోట్ల సంఖ్యలో ప్రజలు పేదరికాన్ని అనుభవిస్తున్నారు. తినడానికి తిండి లేకుండా ఒకచోట పిల్లలు చనిపోతుంటే, మరో చోట ఎక్కువై పోయిన ఆహారాన్ని చెత్త కుండీల్లో పోస్తున్నారు. ఇంట్లో డైనింగ్ టేబుల్ దగ్గర భోజనం చేసే నాగరీకులు మాత్రమే కాదు. చెత్త కుండీల ప్రక్కన అందులో పారవేసిన ఆహారాన్ని తినే అనాథ పిల్లలూ ఉన్నారు. మనం తయారుచేసుకునే పనిముట్లు మన నాగరికతను తెలియజేస్తాయా? లేక మనలోని మానవత్వం మన నాగరికతను తెలియజేస్తుందా?

ఏమీ? వీరు భూమిపై ప్రయాణం చేయలేదా? వీరి పూర్వీకుల గతి ఏమయిందో చూడటానికి? వారు, **వీరికంటే ఎక్కువ బలవంతులుగా ఉండేవారు మరియు వారు భూమిని బాగా దున్నేవారు, త్రవ్వేవారు మరియు దానిపై, వీరి కట్టడాల కంటే ఎక్కువ కట్టడాలు కట్టారు** మరియు వారి వద్దకు వారి సందేశహరులు, స్పష్టమైన సూచనలు తీసుకుని వచ్చారు. అల్లాహ్ వారికెలాంటి అన్యాయం చేయలేదు. కాని వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు. (ఖుర్'ఆన్ 30:9)

పై ఆయత్ ద్వారా ప్రజలు ఎలా బ్రతకాలో తెలుసుకోవడానికి అల్లాహ్ తన సందేశహరులను పంపారు. అయితే ఆ సందేశాన్ని తిరస్కరించి తమకు తామే అన్యాయం చేసుకున్నారు. అంతేకాకుండా ఆ ప్రజలకు పూర్వం జీవించినవారు, వీరికంటే ఎక్కువ నైపుణ్యాన్ని కలిగి ఉన్నారని చెప్పడాన్ని బట్టి, మనకు పూర్వం గడచిన కాలాలలో ఇప్పటికంటే ఎక్కువ అభివృద్ధి జరిగి ఉండవచ్చు.

కాబట్టి మన పూర్వీకుల నైపుణ్యాన్ని తక్కువ అంచనా వేయడానికి లేదు. ఇప్పటికి దాదాపు 1300 సంవత్సరాల క్రితం బుఖారీ(ర)వారు వేల సంఖ్యలో హదీస్‌లను కంఠస్థం చేశారు. రెండవ ఖలీఫా ఉమర్(రజి) 1400 సంవత్సరాల క్రితం నిజమైన ప్రజాస్వామ్యాన్ని అమలు చేసి ప్రపంచానికి ప్రజాస్వామ్యాన్ని పరిచయం చేసారు. ఇప్పటి ప్రజాస్వామ్య వాదులు ఉమర్(రజి)వారి ప్రజాస్వామ్య పరిపాలనకు దరిదాపుల్లో కూడా లేరు.

అంతేకాకుండా ప్రతీ కాలంలోనూ కొన్ని ప్రాంతాలు బాగా వెనుకబడి ఉంటాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకోవాలి. కేవలం ఊహలతో ఓ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, తొలి మానవుడిని అవమానించడం ఖండించ వలసిన విషయం.

నేడు ఎంతో టెక్నాలజీ అభివృద్ధి చెందింది. అయినప్పటికీ మన పూర్తి అవసరాలను తీర్చలేక పోతుంది. గతించిన తరాలలో కూడా వారి అవసరాలను బట్టి ప్రజలు టెక్నాలజీ అభివృద్ధి చేసుకున్నారు.

**తొలి మానవుడు సగం మనిషి సగం కోతిలా ఉండి, శరీరమంతా వెంట్రుకలతో ఉన్నట్లు చూపించే బొమ్మలు ఊహాజనితమైనవి. వాటికి సైంటిఫిక్ ఆధారాలు ఏమీ లేవు.**

మనిషి మనిషిలాగే పుట్టాడు. దేనినుండీ రూపాంతరం చెందలేదు. ఖుర్'ఆన్ తొలి మానవుడి పుట్టుక గురించి చాలా స్పష్టంగా వివరించింది.

పురావస్తు త్రవ్వకాలలో లభించే వాటిని బట్టి క్రింది విషయాలు స్పష్టమౌతున్నాయి : వారు కూడా ఇండ్లు నిర్మించుకున్నారు. వంట పాత్రలు, ఫర్నిచర్, వస్త్రాలను కలిగి ఉండేవారు. అప్పుడు కూడా వైద్యులు, ఇంజినీర్లు, కార్పెంటర్లు, ఉపాధ్యాయులు, టైలర్స్, ఆర్టిస్టులు ఉండేవారు.

**మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...**

# తిరిగి గూటికి

దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం వంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో అల్లాహ్ ధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా 'ఇస్లామ్'లోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా వారికి కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవన విధానంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి వారిలో కొందరికి మరికొంత సమయం పట్టవచ్చు. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకమైన అవస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్'ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

## నవ ముస్లిమ్? | New Muslim?

అబూబక్ర్ సిద్దీఖ్(రజి), ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి), ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి), అలీ బిన్ అబీ తాలిబ్(రజి) మొదలైన విశ్వాసులంతా ఇస్లామ్ స్వీకరించిన వారే! వీరిని నవముస్లిములుగా ఎవరూ పరిచయం చేయలేదు. నమాజ్ చేయడం నేర్చుకునే వరకో లేక మస్జిద్ అలవాటు అయ్యే కొన్ని రోజుల వరకో తోటి ముస్లిములకు తెలియడానికై 'నవముస్లిమ్' అనే పదాన్ని వారి కొరకు ఉపయోగించవచ్చు. కాని వారికి ఇస్లామ్ ధర్మంపై పూర్తి అవగాహన ఏర్పడి ఇస్లామ్ ప్రకారం వారి ఆచరణ ఉన్నప్పుడు, ఎన్ని సంవత్సరాలైనా సరే వారిని 'నవ ముస్లిములు'గా పరిగణించడం సరికాదు.

## ఏ భాష అయినా ఒక్కటే! | అంతా సమానమే!

ఖుర్'ఆన్ అరబీ భాషలో అవతరించింది. అరబీ భాష ముస్లిములకు అతి ముఖ్యమైన మరియు నేర్చుకోవలసిన భాష. 'ఉర్దూ' భాష భారతీయ భాషలలో ఒక భాష మాత్రమే. 'ఉర్దూ' అంటే మార్కెట్ అని అర్థం. ఇది అరబ్బులు మరియు భారతీయుల మధ్య వ్యాపార లావాదేవీల కొరకు తయారైన భాష. అరబీ భాష కాకుండా, ఇతర ఏ భాష అయినా ముస్లిములకు ఒక్కటే! ఇస్లామ్‌లో రంగు, తెగ, లేమి, కలిమి, భాష, ప్రాంతం మొ॥న వాటిని బట్టి ఎటువంటి ప్రాముఖ్యతా లేదు. అందరూ సమానమే! కేవలం ధర్మ పరాయణత మాత్రమే ముస్లిముల స్థాయిని నిర్దేశించే కొలమానం. తెలుగు మాట్లాడేవారి కొరకు ఒక మస్జిద్, వేరే భాష మాట్లాడేవారికి మరొక మస్జిద్ ఏర్పాటు చేయాలని చేసే ఏ ప్రయత్నమైనా సున్నత్‌కి వ్యతిరేకమైనదే! అందరినీ కలిపి ఉంచే ధర్మమే ఇస్లామ్ (శాంతి).

**నవ ముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం – 9**

*శాంతిబాట మొదటి సంవత్సరంలో విదేశాలలో ఇస్లామ్ స్వీకరించిన ఏడుగురు సోదరీమణుల గురించి తెలియజేయడం జరిగింది. ద్వితీయ సంవత్సరం తొలి సంచికయైన ఆగష్టు'10 సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్'ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** తరువాయి సంచికలలో కొన్నింటికి ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో పరిష్కారం అందించాము. వాస్తవ సంఘటనల ద్వారా సమస్యల పరిష్కారాన్ని తెలియజేసే ఉద్దేశ్యంతో ముహమ్మద్(స)వారి అనుచరులైన బిలాల్(రజి), అబూజర్(రజి), సల్మాన్ ఫార్సీ (రజి), అబూ ఉబైదా(రజి), సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి), అమ్ర్ బిన్ ఆస్(రజి)వారి జీవితచరిత్రలను క్లుప్తంగా అందించడం జరిగింది. ఇవన్నీ చదివితే ఎవరికైనా తమ సమస్యలు పైన వివరించిన విశ్వాసుల సమస్యల కంటే చాలా చిన్నవిగా కనిపిస్తాయి. సులువుగా తమ సమస్యలను పరిష్కరించుకో గలమనే మనో ధైర్యం వారిలో ఏర్పడుతుంది. క్రిందటి సంచిక నుండి విశ్వాస స్త్రీల జీవితచరిత్రలను ఓ ఆరు నెలల పాటు అందించాలని అల్లాహ్ పేరుతో సంకల్పించడం జరిగింది. **ఈ సంచికలో ఇస్లామ్‌లో తొలి ముస్లిమ్ మహిళయైన ఖదీజా (రజి) వారి గురించి క్లుప్తంగా అందిస్తున్నాము.**

# ఖదీజా బిన్తె ఖువైలిద్ (రజి)

**ఇస్లామ్ స్వీకరించిన తొలి వ్యక్తి. విశ్వ ప్రభువు యొక్క సలాములు అందుకున్న మహిళ**

**ఒక రాత్రి ఆమెకు కల వచ్చింది. ఆకాశం నుండి ప్రకాశించే సూర్యుడు తన ఇంటి ఆవరణలో దిగి, తన ఇంటిని ప్రకాశవంతం చేస్తున్నట్లు.**

ఖదీజా(రజి) మరణించిన తరువాత ఆమె గురించి ఎంతో గౌరవంగా ముహమ్మద్(స) వారు చెప్పిన మాటలు :

**"... ప్రజలు నన్ను త్రోసి పుచ్చిన రోజుల్లో ఆమె నా పక్షాన నిలిచింది. ప్రజలు తిరస్కార వైఖరి నవలంభిస్తుండగా ఆమె ఇస్లాంను స్వీకరించింది. నాకు సహాయపడే వారెవరూ లేని సమయంలో ఆమె నన్ను ఆదుకున్నది"**

**ముహమ్మద్(స)వారిచే ప్రేమించబడి మరియు గౌరవించబడిన ఖదీజా(రజి)వారు నేటి స్త్రీలకు ఆదర్శం**

ముహమ్మద్(స)వారికి ప్రవక్త పదవి లభించిన తరువాత, ఆయనను అల్లాహ్ యొక్క సందేశహరుడిగా అంగీకరించి, ఇస్లామ్ స్వీకరించిన తొలి మహిళ ఖదీజా(రజి). ముహమ్మద్(స)వారిచే ప్రేమించబడిన మరియు గౌరవించబడిన మహిళామె. ఉత్తమ భార్యకు ఉత్తమ ఉదాహరణ ఈ ఇల్లాలు. తీక్షణమైన ఎండలోనున్న వ్యక్తికి చల్లటి గాలి సేద తీర్చినట్లు, కష్టాలను ఎదుర్కొనే ముహమ్మద్(స)వారికి ఓదార్పుగా ఆయన(స)తో జీవితాన్ని పంచుకున్న ఉత్తమ మహిళయైన ఈ మాతృమూర్తి గురించి వ్యాసాన్ని అందించే భాగ్యం అల్లాహ్ మాకు కలుగజేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

ఈమె మహిళలలో ఇస్లామ్ స్వీకరించిన తొలి ముస్లిమ్ మాత్రమే కాదు, ముహమ్మద్(స)వారి చేతుల మీదుగా ఇస్లామ్ స్వీకరించిన తొలి ముస్లిమ్ కూడా ఈమెయే! నేటి మహిళలు ఖదీజా(రజి)వారి గురించి తెలుసుకుని, ఆమె తన భర్త పట్ల వ్యవహరించిన తీరును అనుసరిస్తే, వారు తమ కుటుంబాలను శాంతినిలయాలుగా మార్చుకోగలుగుతారు.

తొలి ముస్లిమ్ గురించి తొలి సంచికలో కాకుండా, ఇంత ఆలస్యంగా ఎందుకు ప్రచురిస్తున్నారని ఎవరికైనా అనిపించవచ్చు. ఆమె యొక్క ఉత్తమ స్థాయిని సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి పాఠకులకు ఇదే సరియైన సమయమని భావించాము.

ఈమె ఖురైష్ తెగకు చెందినవారు. మక్కాలో జన్మించారు. ముహమ్మద్(స)వారి కంటే వయస్సులో 15 సంవత్సరాలు పెద్దవారు. ఆమె తల్లిగారి పేరు : ఫాతిమా బిన్తె జైద్. మరియు ఆమె తండ్రిగారి పేరు ఖువైలిద్ బిన్ అసద్. ఈయన ఖురైష్ తెగలో పేరున్న ఓ నాయకుడు. అంతేకాదు ఈయన ఐశ్వర్యవంతుడు మరియు మంచి వ్యాపారవేత్త. ప్రముఖ ఫిజార్ యుద్ధంలో మరణించాడు. ఈ యుద్ధం గురించిన వివరాలు ముహమ్మద్(స)వారి జీవితచరిత్రలో చదవండి.

కాబట్టి ఖదీజా(రజి)వారు సౌఖ్యంలోనే పుట్టి పెరిగారు. ఆమెకు అబూ హాలా మలక్ బిన్ నబష్ గారితో వివాహం జరిగింది. ఆయన ద్వారా ఇద్దరు పిల్లలు జన్మించారు. వారు : హాలా మరియు హింద్. ఆమె తన భర్త మంచి ఐశ్వర్యవంతుడు కావాలనే ఉద్దేశ్యంతో, ఆయన ఓ పెద్ద వ్యాపారాన్ని ప్రారంభించేలా ఆర్థిక సహాయాన్ని అందించారు. కాని దురదృష్ట వశాత్తు ఆయన మరణించారు.

కొన్నాళ్ళ తరువాత విధవరాలైన ఆమెకు అతీఖ్ బిన్ ఐత్ బిన్ అబ్దుల్లాహ్ అల్-మఖ్జూమి గారితో వివాహం జరిపించారు. ఆయన ద్వారా ఆమెకు హిందా అనే కుమార్తె కలిగింది. కాని ఆ వివాహం విజయవంతం కాలేదు. మరలా ఆమె ఒంటరి అయ్యారు. ఇక ఆమె తన పిల్లల పెంపకంపై మరియు తన తండ్రి నుండి వారసత్వంగా లభించిన

వ్యాపారంపై దృష్టి కేంద్రీకరించారు. ఆమెకున్న వ్యాపార ధక్షత ఆమెను ఖురైష్‌లలో ప్రముఖ వ్యాపారులలో ఒకరిగా చేసింది.

ఆ కాలంలో ఇప్పుడున్న విధంగా సమాచార వ్యవస్థ లేదు. ఆమె తరపున వ్యాపారం చేయడానికి, సుదూర దేశాలకు కొందరిని పంపించేవారు ఆమె. కాబట్టి తన తరపున వ్యాపారం చేసేవారి నిజాయితీపైనే ఆమె ఆధారపడవలసి వచ్చేది.

వ్యాపార మార్గాలలో మక్కా నగరం అతి కీలకమైన చోట ఉండటం వలన, ఇక్కడి నుండి వేరే చోటికి సరుకులను తీసుకువెళ్ళి అమ్మి, అక్కడి నుండి అవసరమైన సరుకులు కొని తీసుకువచ్చి మక్కాలో అమ్మేవారు. వ్యాపారాలు బాగా సాగేవి. తన తరపున వ్యాపారం చేసేవారికి, ఆమె తనకు లభించిన లాభంలో సగం ఇచ్చేవారు.

ఖదీజా(రజి)వారు, ముహమ్మద్(స)వారి నిజాయితీ, సత్ప్రవర్తన గురించి విన్నారు. ఆమె తన తరపున వ్యాపారం చేయడం కొరకు ఆయన(స)కు కబురు పంపారు. ఆయన(స) అంగీకరించారు.

ఖదీజా(రజి)వారి నౌకరు పేరు మైసరా. ముహమ్మద్(స)వారు అతనితో కలిసి సిరియా బయలుదేరారు. అక్కడ తమతో పాటు తీసుకువెళ్ళినది అంతా అమ్మివేశాక, వేరే సామాగ్రి కొని, దానిని కూడా పూర్తిగా అమ్మివేసి, తిరుగు ప్రయాణం చేశారు. ఈ వ్యాపారం ద్వారా ఖదీజా(రజి)వారికి అధిక లాభాలు అందాయి. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా తన ఐశ్వర్యంలో అనుగ్రహాలు కలిగాయని గ్రహించారు.

ముహమ్మద్(స)వారికి ఈ వ్యాపారం ద్వారా లభించిన సంపద కంటే, ఈ ప్రయాణం ఎంతో మేలు చేసింది. ఈ ప్రయాణంలో ఆయన ఎన్నో ప్రాంతాల గుండా వెళ్ళారు. తరువాత కాలంలో ఇవన్నీ ఇస్లామ్ రాజ్యంలోకి వచ్చాయి.

అంతేకాకుండా ఈ ప్రయాణమే ఖదీజా(రజి)వారితో వివాహానికి దారి తీసింది. ఖదీజా(రజి)వారి నౌకరు ముహమ్మద్(స)వారితో ఉండటం వలన, ముహమ్మద్(స)వారి యొక్క ఉత్తమ లక్షణాలు, గొప్పదైన ఆయన వ్యక్తిత్వాన్ని దగ్గరుండి చూడగలిగాడు. ఇతర చారిత్రక పుస్తకాలలో మైసరా ఈ ప్రయాణంలో ఎన్నో అద్భుతాలను చూశారని వ్రాయడం జరిగింది. మైసరా ద్వారా ముహమ్మద్(స)వారి మహోన్నత వ్యక్తిత్వాన్ని ఖదీజా(రజి)వారు తెలుసుకున్నారు.

**ఒక రాత్రి ఆమెకు కల వచ్చింది. ఆకాశం నుండి ప్రకాశించే సూర్యుడు తన ఇంటి ఆవరణలో దిగి, తన ఇంటిని ప్రకాశవంతం చేస్తున్నట్లు. ఆమెకు మెలకువ వచ్చాక తన కజిన్ అయిన వరఖా బిన్ నౌఫల్ దగ్గరకు వెళ్ళారు. ఆయనకు కల యొక్క అర్థాన్ని వివరించి చెప్పగలిగే నైపుణ్యం ఉంది. అంతేకాకుండా తౌరాత్ మరియు ఇంజీల్‌లో కూడా ఆయనకు జ్ఞానముంది. ఆ కల గురించి ఆయన వినగానే చిరునవ్వుతో కంగారు పడవలసిందేమీ లేదని అది ఆశాజనకమైన స్వప్నం అని చెప్పారు.**

ప్రకాశవంతమైన సూర్యుడు ఆమె ఇంటి ఆవరణలో దిగడం, ప్రవక్తను సూచిస్తుందని, ఆయన రాక గురించి తౌరాత్ మరియు ఇంజీల్‌లో ముందుగానే చెప్పబడిందని, ఆయన ఆమె ఇంటికి గౌరవం చేకూరుస్తారని మరియు ఆమె తన జీవితంలో ఆయన సాన్నిహిత్యాన్ని పొందుతుందని వివరించారు.

ఖదీజా(రజి)వారు తన ఐశ్వర్యంలో గలిగిన శుభాలను గ్రహించి మరియు ముహమ్మద్(స)వారి గుణగణాలను తెలుసుకున్నాక ఆమెకు ప్రవక్త(స) వారిపై కలిగిన మంచి అభిప్రాయాన్ని తన సన్నిహిత సఖి అయిన నఫీసా బిన్త్ మునబ్బహ్‌కు చెప్పారు. నఫీసా ముహమ్మద్(స)వారి దగ్గరికెళ్ళి ఖదీజా(రజి)వారి తరపున పెళ్ళి ప్రస్తావన ఆయన(స) ముందుంచారు. ఆ ప్రతిపాదన ఆయనకు కూడా సంతోషం కలిగించింది. కాని ఆయన ముందుగా తన పినతండ్రుల దగ్గరకు వెళ్ళి వారి సలహాను అడిగారు. వారంతా ఒప్పుకున్నారు. ఎందుకంటే, ఆమె సభ్యతా సంస్కారాల గురించి, ఉత్తమ శీలం గురించి ఖురైషీయులకు బాగా తెలుసు. ఆమె రెండవ భర్త మరణించాక దాదాపు మక్కాలోని ముఖ్యనాయకులు అందరూ ఆమెను వివాహం చేసుకుంటామని ప్రతిపాదించారు. కాని ఆమె వారిని తిరస్కరించారు. ముహమ్మద్(స)వారు ఖదీజా(రజి)వారిని వివాహం చేసుకున్నారు. అప్పటి అరబ్బు సమాజంలో ఎవరైనా ఎన్ని వివాహాలైనా చేసుకోవచ్చు. **కాని ఆమె జీవించియుండగా ఆయన(స) మరొక వివాహం చేసుకోలేదు.**

పాఠకులకు గుర్తుండే ఉంటుంది. ముహమ్మద్(స)వారు పసిబిడ్డగా ఉన్నప్పుడు ఆయన(స)కు తన చనుబాలు ఇచ్చి పెంచిన హలీమా సాదిఆను వివాహానికి ప్రత్యేకంగా ఆహ్వానించారామె. వివాహం మరియు విందులు పూర్తి అయిన తరువాత, **ఖదీజా(రజి)వారు ఆమెకు నిత్యావసర వస్తువులతో పాటు ఓ ఒంటె మరియు 40 మేకలను ముహమ్మద్(స)వారిని పసితనంలో బాగా చూసుకున్నారనే కృతజ్ఞతా భావంతో బహూకరించారు.**

**ఈ సంఘటన ద్వారా ముందుగానే తెలుస్తుంది, ముహమ్మద్(స)వారి గురించి ఎంత గొప్ప శ్రద్ధ తీసుకునే భార్యను అల్లాహ్ అనుగ్రహించారో! తన భర్తను బాగా చూసుకోవడమే కాకుండా, ఆయనను బాల్యంలో బాగా చూసుకున్నవారిని కూడా గుర్తుపెట్టుకుని గౌరవించడం నేటి స్త్రీలకు కనువిప్పు కలిగించాలి.**

ఈ దంపతులకు ఇద్దరు కుమారులు మరియు నలుగురు కుమార్తెలు కలిగారు. కుమారుల పేర్లు : అల్-ఖాసిమ్ మరియు అబ్దుల్లాహ్. వీరే అత్-తాహిర్ మరియు అత్తయ్యిబ్‌గా పిలువబడ్డారు. ప్రయాణానికి ఉపయోగించే పశువుపై కూర్చోగలిగే వయస్సు వచ్చేసరికి ఖాసిమ్ మరణించారు. అబ్దుల్లాహ్ పసివానిగా ఉన్నప్పుడే మరణించారు. ఇదంతా ముహమ్మద్(స)వారు ప్రవక్త కాకమునుపే జరిగింది. ముహమ్మద్(స)వారి కుమార్తెలు: జైనబ్(రజి), రుఖయ్యా(రజి), ఉమ్మె కుల్సూమ్(రజి) మరియు ఫాతిమా(రజి).

ముహమ్మద్(స)వారు ప్రవక్త బాధ్యతలు స్వీకరించడానికి కొంతకాలం

ముందు నుండే ఏకాగ్రత కోసం హిరా గుహకు వెళ్ళి అక్కడే కొన్నాళ్ళు గడిపేవారు. ఈ విషయానికి సంబంధించి ఆయిషా(రజి)వారు ఉల్లేఖించిన ఒక హదీస్‌ను దిగువున అందిస్తున్నాము.

**విశ్వాసుల మాతృమూర్తి హ.జ్రత్ ఆయిషా(రజి) ఉల్లేఖనం** : ప్రారంభంలో దైవప్రవక్త(స)కు కొన్ని మంచి (నిజమైన) కలలు వచ్చేవి. అవి పగటి వెలుతురులా నిజమైనవి. మరియు ఆయనపై ఏకాంతం అనుగ్రహించ బడింది. ఆయన ఒంటరిగా హిరాగుహకు వెళ్ళి (అక్కడ) ఎన్నో రాత్రులు ఆరాధనలో నిమగ్నులై ఉండేవారు తిరిగి తన కుటుంబాన్ని (చూడటానికి) వెళ్ళేవరకూ. అక్కడ ఉండటానికి ఆయనతో పాటు ఆహారం తీసుకెళ్ళేవారు మరియు వెనక్కి (తన భార్య) ఖథీజా(రజి) దగ్గరకు వచ్చి ఆహారాన్ని తీసుకెళ్ళేవారు. ఇలాగే జరుగుతూ ఉంది, అకస్మాత్తుగా ఆయన హిరాగుహలో ఉండగా ఆయనపై సత్యం దిగేవరకూ. అల్లాహ్ యొక్క దూత ఆయన దగ్గరికి వచ్చి ఆయనను చదవమని అడిగారు. ప్రవక్త(స) చెప్పారు, 'ఎలా చదవాలో నాకు తెలియదు'.

ప్రవక్త(స) ఇంకా చెప్పారు, "తరువాత అల్లాహ్ యొక్క దూత నన్ను (బలంగా) పట్టుకుని, నేను ఏ మాత్రం భరించలేనంత గట్టిగా అదిమారు. తరువాత ఆయన నన్ను వదిలి, చదవమని అడిగారు. మరియు నేను సమాధానమిచ్చాను, 'ఎలా చదవాలో నాకు తెలియదు'. అప్పుడు మరలా నన్ను పట్టుకుని రెండవసారి నన్ను అదిమారు. ఇక నేను ఎంతమాత్రం భరించలేనంత వరకూ. తరువాత ఆయన నన్ను వదిలి, చదవమని మరలా అడిగారు కాని నేను మరలా సమాధానం చెప్పాను, 'ఎలా చదవాలో నాకు తెలియదు' అప్పుడు ఆయన మూడవసారి నన్ను పట్టుకుని అదిమారు. మరియు తరువాత నన్ను వదలి చెప్పారు, "చదువు నీ ప్రభువు పేరుతో, ఆయనే (సర్వాన్ని) సృష్టించాడు. ఆయనే మానవుణ్ణి రక్తపు ముద్ద (జీవకణం)తో సృష్టించాడు. చదువు! మరియు నీ ప్రభువు పరమదాత. ఆయన కలం ద్వారా నేర్పాడు. మానవుడు ఎరుగని జ్ఞానాన్ని అతనికి బోధించాడు." (సూరహ్ అలఖ్ 1-5)

తరువాత అల్లాహ్ సందేశహరులు గుండె దడదడ కొట్టుకుంటుండగా ఆ సందేశంతో తిరిగివచ్చారు. ఆయన ఖథీజా బిన్త్ ఖువైలిద్(రజి) దగ్గరికెళ్ళి చెప్పారు, "నన్ను దుప్పటితో కప్పు, నన్ను దుప్పటితో కప్పు". వారు ఆయనను కప్పారు ఆయన భయం పోయేవరకు. ఆ తరువాత ఆయన(స) ఖథీజా(రజి)వారికి జరిగిన విషయం ప్రతీది ఆయన తెలియజేసి (చెప్పారు), "నాకేదో జరుగుతుందని నేను భయపడుతున్నాను." ఖథీజా(రజి) బదులుగా చప్పారు :

**"ఎన్నటికీ కాదు! అల్లాహ్ సాక్షి! అల్లాహ్ ఎన్నటికీ మిమ్మల్ని అవమానపరచడు. మీరు బంధువులను ఆదరిస్తారు, పేదవారికి, అనాథలకు సహాయం చేస్తారు, అతిథులను సత్కరిస్తారు మరియు ఆపదలలో ఉన్నవారికి సహాయం చేస్తారు".**

తరువాత ఖదీజా(రజి) ఆయనని తనతోపాటు తన చిన్నాయన కొడుకు వరఖ బిన్ నౌఫల్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా దగ్గరకు తీసుకెళ్ళారు. ఆయన అజ్ఞానకాలంలో క్రైస్తవుడిగా మారాడు మరియు హెబ్రూ అక్షరాలతో వ్రాస్తూ ఉంటాడు. అల్లాహ్ ఆయనకు అవకాశమిచ్చినంతమేర ఇంజీల్‌ను హెబ్రూలో వ్రాశాడు. ఆయన చాలా వృద్ధుడు మరియు ఆయన చూపును కోల్పోయాడు.

వరఖగారితో ఖథీజ(రజి) చెప్పారు, "అన్నా! నీ సోదరుని కుమారుడు (యొక్క కథ) వినండి. వరఖ అడిగారు, "ఓ కుమారా! నీవేమి చూశావు?" అల్లాహ్ యొక్క సందేశహరుడు(స) ఆయన చూసిన దానిని వర్ణించారు. వరఖ చెప్పారు, "ఇది ఆయనే, ఎవరైతే రహస్యాలను దాచిఉంచుతారో - మూసా(అ)వారి దగ్గరకు అల్లాహ్ పంపిన దూత జిబ్రీల్.

"నీ జాతి ప్రజలు నిన్ను బహిష్కరించే వరకూ నేను యౌవ్వనంతో బ్రతికి ఉండగలిగితే బావుణ్ణు" అల్లాహ్ యొక్క సందేశహరుడు(స) అడిగారు "వారు నన్ను బహిష్కరిస్తారా?". వరఖ అవునని సమాధానమిచ్చి చెప్పారు "నీవు తీసుకొచ్చినవంటిదే ఎవరైనా తీసుకువచ్చాక వారితో శతృత్వం వహించారు, మరియు ఆ రోజు వరకూ నేను జీవించి ఉన్నట్లయితే నేను నీకు గట్టిగా మద్దతునిస్తాను. కాని కొన్ని రోజులకే వరఖా చనిపోయారు మరియు దివ్య సందేశావతరణ కూడా కొంతకాలంపాటు నిలిచిపోయింది. **(సహీహ్ బుఖారీ, హదీస్ నెం. 3, సంపుటి 1, అధ్యా. 3)**

భర్తను ఓ ప్రత్యేక స్థితిలో చూసి, ఆమె కంగారు పడకుండా, ఆయనకు ఎంత ఓదార్పునిచ్చారో పై హదీస్‌లో చదివారు కదా! ముహమ్మద్(స)వారు అల్లాహ్ యొక్క సందేశాన్ని ప్రచారం చేసేటప్పుడు ఎన్నెన్ని ఘోర కష్టాలు అనుభవించారో ఆయన జీవితచరిత్ర చదివిన వారికి గుర్తుంటుంది. అల్లాహ్ ఆ కష్టాలను తట్టుకునే స్థైర్యాన్ని ఆయన హృదయంలో కలుగజేశారు. ఇది మనకు తెలుసు. అయితే బాహ్యంగా కూడా స్థైర్యాన్ని ఇవ్వడానికి ఎంత మంచి భార్యను అనుగ్రహించారో!

**ఖుర్ఆన్ చదువుతుంటే ప్రవక్తగా ఆయనపై ఉన్న బాధ్యత ఎంత మానసిక ఒత్తిడిని కలుగజేసిందో అర్థమౌతుంది. అటువంటి పరిస్థితులలో ఓ మామూలు భార్య గనుక ఉండి ఉంటే, ఆమె ఆయన ఒత్తిడిని మరింత పెంచేవారేమో!**

**కష్టాలు కలిగినప్పుడు మనిషి ఆలోచించగలిగితే, అదే సమయంలో తనకు అల్లాహ్ నుండి అనుగ్రహించబడిన ఉపకారాలు కూడా గుర్తించ గలుగుతాడు. ఎందుకంటే అల్లాహ్ అనంత కరుణామయుడు మరియు అపార కరుణాప్రదాత.**

కుమార్తె జైనబ్(రజి)వారిని అబుల్ 'ఆస్ బిన్ రబీ'అహ్‌కు మరియు రుఖయ్యా(రజి)వారిని ఉస్మాన్(రజి)వారికి ఇచ్చి వివాహం జరిపించారు. రుఖయ్యా(రజి)వారు మరణించిన తరువాత, ఉమ్మెకుల్సూమ్(రజి) వారిని ఉస్మాన్(రజి)వారికిచ్చి వివాహం జరిపించారు.

చివరి కుమార్తె అయిన ఫాతిమా(రజి)వారిని అలీ బిన్ అబీతాలిబ్ (రజి)వారికిచ్చి వివాహం చేశారు. ముగ్గురు కుమార్తెలు ప్రవక్త(స)వారు జీవిత కాలంలోనే మరణించారు. ఆయనకెంతో ప్రియకుమార్తె యైన ఫాతిమా(రజి)వారు ముహమ్మద్(స)వారు మరణించిన 6 నెలల తరువాత ఈ లోకాన్ని వీడారు. ముహమ్మద్(స) సత్య ధర్మాన్ని ప్రచారం చేస్తుంటే, మక్కాలోని వివిధ తెగల నుండి శతృత్వం ఎదురైంది. ముహమ్మద్(స) చేత సత్యధర్మ ప్రచారాన్ని ఆపడానికి ఎన్నో విధాలా ప్రయత్నించారు. ఆయన అనుచరులను మరియు ఆయనను కూడా చాలా హింసించారు. చివరికి వివిధ తెగల సర్దార్లు అందరూ కలిసి, హాషిమ్ మరియు అబ్దుల్ ముత్తలిబ్ వంశానికి చెందిన వారందరినీ 3 సంవత్సరాల పాటు వెలివేశారు. వారందరూ చిన్న పిల్లలతో సహా, **'షెఅబె అబీతాలిబ్'** అనే

లోయలో జీవించవలసి వచ్చింది. వీరిలో ముస్లిములే కాదు, విగ్రహారాధకులు కూడా ఉన్నారు. చాలా ఘోరమైన స్థితిని వారు ఎదుర్కోవలసి వచ్చింది. ఆకులు కూడా తినవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆకలి బాధతో పిల్లలు, స్త్రీలు పెట్టే ఆర్తనాదాలు ఆ లోయ బయట ఉన్నవారికి కూడా వినిపించేవి.

**ముహమ్మద్(స) వారిని ఒక్కరిని అప్పగిస్తే చాలు. వీరందరికీ ఎటువంటి సమస్యా ఉండదు కదా! కాని వారంతా ఆయన కోసం ఎన్నో బాధలను సహించారు. ఎందుకని?**

ముహమ్మద్(స) వారిపై హత్యాప్రయత్నం జరుగుతుందేమోనని, పినతండ్రి అబూతాలిబ్, అందరికీ వినపడేలా 'నీవు ఈ ప్రక్కపై పడుకో' అని రాత్రుళ్ళు ప్రవక్త(స) వారికి చెప్పేవారు. అందరూ పడుకోగానే అబూతాలిబ్, ప్రవక్త(స) వారి పడక స్థలాన్ని మార్చివేసేవారు. ఆయనకు బదులు ఆ స్థానంలో, తమ కుమారులలో మరొకర్ని పడుకోబెట్టేవారు. **ముహమ్మద్(స) వారు ఎలాంటి కుటుంబంలో పుట్టారో చూడండి! ఆయనంటే ఎంత ప్రేమ! ఎంత అభిమానం!**

ఈ 3 సంవత్సరాల వెలి గురించి ఆలోచించేవారికి ఇందులో ఎన్నో గొప్ప విషయాలు బోధపడతాయి. ఒక వంశానికి చెందిన మొత్తం వ్యక్తుల నందరినీ వెలివేయడం జరిగింది. వీరిలో ఇస్లామ్‌ను స్వీకరించిన ముస్లిములు ఉన్నారు మరియు ముష్రిక్‌లు కూడా ఉన్నారు. ముష్రిక్‌లను వెలి ఎందుకు వేశారు? ముహమ్మద్(స)వారితో పాటు సత్యం కోసం నిలబడిన వారిని మాత్రమే వెలివేస్తే సరిపోయేది కదా!

"మీ గురించి మేమెందుకు పస్తులుండాలి మరియు అవస్థలు పడాలి?" అని ఏ ఒక్క ముష్రిక్ కూడా ఆవేదనతో ముహమ్మద్(స)వారిని ప్రశ్నించ లేదు. ఇక అబూతాలిబ్‌గారి విషయం చూడండి. ఈయన కూడా విగ్రహారాధకుడే. ఇస్లామ్ స్వీకరించలేదు. కాని ఎటువంటి త్యాగానికి అబూతాలిబ్ సిద్ధపడ్డారో పై సంఘటన ద్వారా తెలుస్తుంది.

**ఒక వ్యక్తి కోసం ఇంత త్యాగం చేసే బంధువులు నేడు మన సమాజంలో ఉన్నారా?** నేటి సమాజంలోని ముస్లిములు ఆనాటి మక్కా ముష్రిక్‌లను విమర్శిస్తూ మాట్లాడేముందు, వారి కంటే వీరు ఏదైనా మంచి స్థాయిలో ఉన్నారా? అని తమను తాము ప్రశ్నించు కోవాలి. నేడు ముహమ్మద్(స)వారి బోధనలపై ముస్లిములు స్థిరంగా నిలబడ గలుగుతున్నారా? లేదు. బంధువులు వరకూ అవసరం లేదు, భర్త ధర్మం ప్రకారంగా బ్రతికితే, **నేటి భార్య పూర్తి మద్దతు నిస్తుందా?** అందరూ ఎంతో సంపాదించుకుంటూ ఉంటే, మీరేమిటి ధర్మం అని కూర్చున్నారంటూ ఎత్తిపొడుపు మాటలతో మానసికంగా దెబ్బతీసే పరిస్థితి నెలకొని ఉంది నేడు. నేటి బంధువులు అటువంటి మద్దతు ఇవ్వడం మాట అటుంచి, 'నీకెందుకీ ధర్మం, అందరిలా బ్రతకవచ్చు కదా' అని సలహాలిస్తారు.

**ముహమ్మద్(స)వారి మహోన్నత వ్యక్తిత్వాన్ని చెప్పడానికి ఆయనతో 3 సంవత్సరాలు బహిష్కరించబడిన వారి గురించి తెలిపితే చాలు.** ఆయన(స)కు అందిన ఈ సహకారం అల్లాహ్ అనుగ్రహం కాక మరేమిటి?

### కష్టాలతో పాటు సుఖాలుంటాయి

కష్టాలతో ఒక ప్రక్కనుండి పరీక్ష పెడుతూనే, మరో ప్రక్కనుండి అల్లాహుతాలా అనుగ్రహం కురిపిస్తారు. సహనం వహించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. ఐశ్వర్యంలో పుట్టి పెరిగిన ఖదీజా(రజి)వారు సకల లోకాల కారుణ్యమైన ముహమ్మద్(స)వారితో కష్టాలను సహిస్తూ తోడుగా ఉన్నారు. అంత ఉత్తమురాలు కనుకనే అల్లాహుతాలా ఆమెకు సలాములు పంపారు. అల్లాహ్ నుండి సలాములు అందుకున్న తొలి మహిళ ఈమె. వహీద్వారా ఈ విషయం జిబ్రీల్(అ) ముహమ్మద్(స) వారికి తెలిపారు.

అలీ(రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స) చెబుతుండగా (క్రింది విధంగా) నేను విన్నాను. అలీ(రజి) (ఇలా) ఉల్లేఖించారు : ప్రవక్త(స) చెప్పారు, "ప్రపంచ మహిళల్లో ఉత్తమురాలు (ఆనాడు) మర్యమ్ మరియు ప్రపంచ మహిళల్లో (ఈనాడు) ఉత్తమురాలు ఖదీజా". **(సహీహ్ బుఖారీ, హదీస్ నెం. 3815, సంపుటి 5, పుస్తకం 63, అధ్యాయం 20)**

**అల్లాహ్ నుండి ప్రవక్తలకు సందేశాలను తీసుకువచ్చే జిబ్రీల్(అస) వారి సలామ్:**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : ప్రవక్త(స)వారి వద్దకు జిబ్రీల్(అ) వచ్చి చెప్పారు, " ఓ రసూలలుల్లాహ్(స)! షేర్వా (లేదా కొంత ఆహారం లేదా నీళ్ళు - ఉల్లేఖకునికి ఈ మూడింటిలో ఏదో గుర్తు లేదు) కలిగిన పాత్రతో ఖదీజా(రజి) మీ దగ్గరకు వస్తున్నారు. ఆమె మిమ్మల్ని చేరినప్పుడు ఆమెకు ఆమె ప్రభువు (అల్లాహ్) తరపున సలామ్ చెప్పండి మరియు నా తరపున (కూడా). మరియు స్వర్గంలో ఖసబ్(మణుల)తో నిర్మించబడిన భవనాన్ని కలిగి ఉంటారనే శుభవార్తను అందజేయండి, అందులో అలజడులుగాని, కష్టాలుగాని ఉండవు **(సహీహ్ బుఖారీ, హదీస్ నెం. 3820, సంపుటి 5, పుస్తకం 63, అధ్యాయం 20)**

### అనుగ్రహాల నివాసం

విశ్వాసులకు తొలి మాతృమూర్తి అయిన ఈమె ఆదర్శ భార్య మరియు ఆదర్శ మాతృమూర్తి. ముహమ్మద్(స)వారు ఆమె ఇంటిలోనే గడిపారు. ఆ ఇల్లు ఒక అనుగ్రహించబడిన స్థలం. ఎందుకంటే అందులో ఆయన నివశించారు మరియు జిబ్రీల్(అ) వహీ తీసుకుని ఈ ఇంటికి వచ్చేవారు. అది ఇస్లామ్‌కి కేంద్రం అయింది ఆ రోజుల్లో. ఎందరో ముస్లిమ్ స్త్రీలు మరియు పురుషులు తరచుగా అక్కడికి వస్తూ ఉండేవారు.

ముహమ్మద్(స)వారు మదీనాకు వలస (హిజ్రత్) చేసిన తరువాత, అలీ(రజి)వారి సోదరుడు ఆ ఇంటిలో ఉండేవారు. తరువాత ము'ఆవియా బిన్ అబూ సుఫ్యాన్(రజి)వారు ఆ ఇంటిని కొని, ఆ స్థలంలో మస్జిద్ నిర్మించారు. ఆ విధంగా ఖదీజా(రజి)వారి ఇల్లు ప్రార్థనా స్థలంగా మారిపోయింది. ఆమె ఉదయం మరియు సాయంత్రాలు రెండు రకాత్‌లు సలాత్(నమాజ్) చేసేవారు అప్పటికి సలాత్ ఇంకా తప్పనిసరి కాలేదు.

**తొలి ముస్లిముల సలాత్**

అఫీఫ్ కిందీ చెప్పారు - అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ ఆయనకు ఆప్త మిత్రుడు మరియు ఆయన తరచుగా అతనిని కలుస్తూ ఉండేవారు యమన్‌లో సుగంధద్రవ్యాల వ్యాపారానికి సంబంధించి.

ఒక సందర్భంలో వారిద్దరూ మినాలో నిలుచుని మాట్లాడుకుంటూ ఉండగా, వారు అందమైన ఓ యువకుడు రావడాన్ని చూశారు. ఆయన శ్రద్ధగా తన చేతులను మరియు పాదాలను కడుగుకుని మరియు గౌరవంతో నిలుచుని చేతులు కట్టుకున్నారు. వెంటనే ఓ గౌరనీయమైన ఉన్నత వంశానికి చెందిన మహిళ మరియు అందమైన ఓ కుర్రవాడు ఆయనతో కలిసారు (ప్రార్థనలో). అఫీఫ్ గారు అబ్బాస్(రజి)వారిని అడిగారు వారు ఏమీ చేస్తున్నారని మరియు అది వ్యాయామానికి కొత్త రూపమా అని. అబ్బాస్(రజి)వారు ఆ యువకుడు తన సోదరుడైన అబ్దుల్లాహ్ కుమారుడని మరియు ఆ మహిళ ఆయన భార్య అని సమాధానమిచ్చారు. ఆ కుర్రవాడు తన సోదరుడైన అబూతాలిబ్ కుమారుడని ముహమ్మద్(స)వారు తాను అల్లాహ్ యొక్క సందేశహరుడనని ప్రకటించారని మరియు ఇస్లామ్ అనే కొత్త ధర్మాన్ని బోధించడం ప్రారంభించారని చెప్పారు.

ఆ తరువాత కాలంలో అఫీఫ్ ఇస్లామ్ స్వీకరించారు. కాని ఆయన(రజి) ఎల్లప్పుడూ ఒక విషయంలో బాధపడుతుండేవారు. ఆ గుర్తుంచుకోదగిన రోజున మినాలో ఇస్లామ్ గురించి విన్నవెంటనే ముహమ్మద్(స)వారు మరియు ఆయన సహచరుల ప్రార్థన మరియు వేడుకోలులో వారితో కలవలేక పోయినందుకు.

మదీనాకు చేసిన హిజ్రత్‌కు మూడు సంవత్సరాలకు పూర్వం ఖథీజా(రజి)వారు ఈ లోకాన్ని వీడారు. ఆమె తన 65వ సంవత్సరంలో మరణించారు. దాదాపు 25 సంవత్సరాల పాటు ముహమ్మద్(స)వారి ఏకైక జీవిత భాగస్వామిగా ఉండి ఇస్లామ్‌కు ఎంతో సేవ చేశారు.

అందరినీ ఆయన ఓదార్చితే, ఆయనని ఈ మాతృమూర్తి ఓదార్చేవారు. ప్రవక్త(స)వారి తండ్రిగారు తన కుమారుడి ముఖాన్ని అయినా చూడకుండానే మరణించారు. ప్రపంచానికి కారుణ్యంగా పంపబడిన తన కుమారుడిని ప్రవక్తగా చూసుకోకుండానే, కుమారుడు అతి పిన్న వయస్సులో ఉన్నప్పుడే, ముహమ్మద్(స)వారి తల్లిగారు మరణించారు. అనాథయైన ముహమ్మద్(స)వారికి తాతగారి అమోఘమైన ప్రేమ లభించిందని అనుకుంటుండగానే ఆయన కూడా మరణించారు. **ఈ అనాథ ఎందరో అనాథలకు కారుణ్యంగా నిలుస్తారని ఆ రోజున ఎవరికీ తెలియకపోవచ్చు.** అయినా బాబాయి తన గుండెల్లో పెట్టుకున్నారు. తన సోదరుడి కుమారుడిని ఆయన ఎంత ప్రేమగా చూసుకున్నారో అర్థం చేసుకోవడానికి అబీతాలిబ్ లోయలో ఆయన వ్యవహరించిన తీరే తెలుపుతుంది.

**"కష్టంతోపాటు సుఖం ఉంటుంది."** అని ఖుర్ఆన్‌లో అల్లాహుతాలా మాటలకు వాస్తవ ఉదాహరణ ఇది. కష్టం తరువాత ఎన్నో రెట్లు సుఖం ఉంది (శాంతిబాట మార్చి 2010 సంచిక). ఆ సుఖం ఆయనను ఎంతగానో ప్రేమించిన ఖథీజా(రజి)వారిలో అల్లాహ్ ఏర్పాటు చేశారని అనిపిస్తుంది.

అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : **"ఈ ప్రపంచం తాత్కాలిక సుఖం. ప్రపంచంలోని తాత్కాలిక సుఖాలన్నింటికంటే ఉత్తమమైనది ధర్మపరాయణురాలైన స్త్రీ (భార్య)"** (సహీహ్ ముస్లిమ్, 3649, పుస్తకం 17, అధ్యా.19, సంపుటి 4)

25 సంవత్సరాల వయస్సులో వివాహం మరియు 25 సంవత్సరాల పాటు ఖథీజా(రజి)వారితో దాంపత్య బంధం. **భర్త చేత గౌరవించ బడటం కంటే సాధించగలిగేది ఏముంటుంది ఏ స్త్రీకైనా!**

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. ఒకరోజు ప్రవక్త(స)వారు నాలుగు గీతలు గీసారు నేలపై మరియు అడిగారు తన సహచరులను వారు అర్థం చేసుకున్నారా ఆ గీతలు దేనికోసమోనని. వారు గౌరవంతో సమాధానమిచ్చారు ఆయన(స)కే బాగా తెలుసునని. అప్పుడు ఆయన చెప్పారు వారితో, ఈ గీతలు విశ్వంలోని నలుగురు ఉత్తమమైన మహిళల కోసం ... వారు: ఖథీజా బిన్త్ ఖువైలిద్, ఫాతిమా బిన్త్ ముహమ్మద్, మర్యమ్ బిన్త్ ఇమ్రాన్, ఈసా(అ)వారి మాతృమూర్తి మరియు ఆసియా బిన్త్ మజాహిమ్ (ఫిరౌన్ భార్య).

**విశ్వాసుల యొక్క తొలి మాతృమూర్తి మరణం**

**ఆమె(రజి) మరణశయ్యపై ఉన్నారు. ఎవరికైనా మరణం తప్పదు. అది అల్లాహ్ నిర్ణయం ప్రకారమే జరుగుతుంది. కాని అది ఆమెకు మేలైనదే! ఆమెకు అప్పటికే మణులతో కూడిన స్వర్గభవనాన్ని అల్లాహుతాలా వాగ్దానం చేశారు. అంతేకాదు అక్కడ ఉండేది ప్రశాంతత. బహుశా ముహమ్మద్(స)వారు కష్టాలలో ఉన్నప్పుడు, ఆయన ప్రశాంతతకై ఆమె చేసినదానికి ప్రతిఫలమేమో అది. ఆమెను ఓదార్చారు ప్రవక్త(స)వారు. సకల లోకాలకు కారుణ్యమైన ఆయన ఓదార్పు కూడా అదే స్థాయిలో ఉంటుంది కదా! ఆమె కళ్ళు మెరిసాయి. ఇహలోకాన్ని వీడారు.**

భర్తకు తన శాయశక్తులా తోడున్నాననే సంతృప్తి ఆమె చివరి శ్వాసలో పొంది ఉంటారు.

ఆమె సమాధి మక్కాకు దగ్గరలోని హుజ్జూన్ అనే ప్రదేశంలో సిద్ధపరచబడింది. ముహమ్మద్(స)వారు అందులోకి దిగి అంతా సవ్యంగా ఉందో లేదో చూశారు. మరియు స్వయంగా తన చేతులతో ఆమెను నెమ్మదిగా అందులోకి దించారు.

**ముహమ్మద్(స)వారు ఆమెకిచ్చిన గౌరవం**

మరణించిన తన మొదటి భార్య - **ఖథీజా(రజి)** వారిని మహాప్రవక్త(స) తరచూ జ్ఞాపకం చేసుకునేవారు.

ఇంట్లో ఎప్పుడు మంచి వంటకం జరిగినా లేక ఏదయినా పశువును కోసుకున్నా మహాప్రవక్త(స) ఖథీజా స్నేహితురాళ్ళను వెదికి వెదికి

మరీ మాంసం పంపేవారు. ఆ దంపతుల అన్యోన్యాన్ని గురించి హజ్రత్ ఆయిషా(రజి) ఇలా అంటున్నారు. "ఖథీజాను నేను చూడలేదు. కాని దైవప్రవక్త(స) మాటిమాటికీ ఆమెను గుర్తు చేసుకుంటూ ఉంటే ఎవరిపైనా కలుగనంతటి అసూయ నాకు ఆమెపై కలిగేది".(సహీహ్ ముస్లిమ్, 6280, అధ్యాయం 12, పుస్తకం 44, సంపుటి 5).

ఖథీజా(రజి) చనిపోయిన కొన్నాళ్ళ తరువాత ఆమె చెల్లెలయిన 'హాల' దైవప్రవక్త(స)తో మాట్లాడటానికి ఇంటికి వచ్చారు. ఇంట్లోకి రావడానికి బయటినుండి అనుమతి నడిగారు అది వినగానే, ఖథీజా(రజి) ఎలా అనుమతి నడిగేవారో ఆయనకు జ్ఞప్తికి వచ్చి సంతోషపడ్డారు. ఆయన అన్నారు :"ఓ అల్లాహ్! హాలా బిన్త్ ఖువైలిద్". (అంటే ఆమె కంఠ ధ్వని, హజ్రత్ ఖథీజా(రజి) కంఠ ధ్వని దాదాపు ఒకే విధంగా ఉండేవని తెలుస్తుంది). ఆ పిలుపు వినగానే ప్రవక్త(స)కు ఖథీజా(రజి) జ్ఞప్తికి వచ్చారు. **క్షణం సేపు ఆయన తొట్రుపాటుకు గురయ్యారు.** ఆ సమయంలో **ఆయిషా(రజి)** అక్కడే ఉన్నారు. నేను (ఆయిషా) అసూయపడి చెప్పాను, "అల్లాహ్ మీకు ఆమె కన్నా మంచి భార్యనివ్వగా, మీరు ఎప్పుడో చనిపోయిన ఆ వృద్ధురాలినే గుర్తు చేసుకుంటారేమిటి?" (సహీహ్ ముస్లిమ్, 6282)

ఈ ప్రశ్నకు ఆయన(స) ఇలా సమాధానమిచ్చారు :

**"లేదు. ప్రజలు నన్ను త్రోసి పుచ్చిన రోజుల్లో ఆమె నా పక్షాన నిలిచింది. ప్రజలు తిరస్కార వైఖరి నవలంభిస్తుండగా ఆమె ఇస్లాంను స్వీకరించింది. నాకు సహాయపడే వారెవరూ లేని సమయంలో ఆమె నన్ను ఆదుకున్నది".**

ఇస్లామ్ స్వీకరించిన స్త్రీలు ఆలోచించాలి. భర్తకు విధేయత చూపాలి. అది భర్తకు భార్యపైనున్న హక్కు. ఆ హక్కును నేడు ఎవరోగాని నెరవేర్చడం లేదు. దానికి వారు అల్లాహ్‌కు సమాధానం చెప్పుకోవాలి. నేడు ఎన్నో మానసిక ఒత్తిడిలతో సతమతమయ్యే భర్తలకు, భార్యలు ఖథీజా(రజి)వారిని ఆదర్శంగా తీసుకుని ఓదార్పునిస్తే కుటుంబాలలో సమస్యలు ఉండవు.

భర్త ఏకాగ్రత కోసం హిరా గుహలో ఉంటే, ఆయనకోసం ఆహారాన్ని తీసుకెళ్ళారుగాని, ఎందుకీ ఏకాగ్రత అంటూ నిష్ఠూరమాడలేదు. ఐశ్వర్య వంతురాలైనా సరే భర్తకు సేవకురాలిగా మారారు. భర్తచే గొప్పగా గౌరవించబడ్డారు. అల్లాహ్ నుండి సలాములు అందుకున్నారు.

**కొత్తగా ఇస్లామ్ స్వీకరించామని నేడు ఎందరో మాకు చెబుతున్నారు మరియు తమకు ఎన్నో కష్టాలు ఎదురౌతున్నాయని వాపోతున్నారు. మరి వారు ఇస్లామ్ గురించి ఏమి తెలుసుకున్నారు? 'విశ్వాసం' అంటే ఏమిటో తెలియకుండానే "విశ్వసించారా?". తొలినాళ్ళలో ఇస్లామ్ స్వీకరించినవారు ఎంత సహనం వహించారో తెలుసుకోవాలి. సాఫల్యం (స్వర్గం) ఊరికినే లభిస్తుందా?**

కష్టపడకుండానే డాక్టర్లు, ఇంజినీర్లు, సైంటిస్ట్‌లు అయిపోతున్నారా?

ఇనుమును కాల్చి కావలిసిన ఆకారంలోకి మారుస్తారు.

కష్టాలు విశ్వాసాన్ని ధృడంగా చేయడానికి, స్థిరంగా నిలపటానికే వస్తాయి. **కష్టం తరువాత సుఖం ఉంది.**

**(20వ పేజీ తరువాయి భాగం)**

ఇదిలా ఉండగా, అబూ సుఫ్యాన్ బిన్ హర్బ్, హకీమ్ బిన్ హిజామ్ మరియు బుదైల్ బిన్ వరఖ మక్కా బయట ఉన్నారు. ఆ ప్రాంతంలో ఏదైనా ముఖ్య విషయం జరగబోతుందేమో తెలుసుకోవడానికి వారు అక్కడకు చేరుకున్నారు. **ముహమ్మద్(స)వారు 10వేల మంది సైన్యంతో వచ్చారని వారికి తెలియదు.** దూరంగా కనిపిస్తున్న ఆ మంటలను చూసి, అబూ సుఫ్యాన్ అన్నాడు, "ఇంతకు ముందెన్నడూ అన్ని మంటలను నేను చూడలేదు మరియు అంత పెద్ద సైనిక శిబిరాన్ని" బుదైల్ అన్నాడు, "అల్లాహ్ సాక్షి, అది ఖుజా'అహ్ తెగ యుద్ధం చేసే తలంపుతో వచ్చి ఉంటుంది." అబూ సుఫ్యాన్ చెప్పాడు, "ఖుజా'అహ్ చాలా బలహీనమైనది మరియు చాలా చిన్నది, అన్ని మంటలను మరియు అంతటి సైనిక శిబిరాన్ని కలిగి ఉండలేదు." ఆ రాత్రివేళ చీకటిలో మాట్లాడుకుంటున్న ఆ ఇద్దరి కంఠస్వరాలను విని, వారెవరో గుర్తు పట్టి "ఓ అబూ హంజలా (అబూ సుఫ్యాన్)?" అని అబ్బాస్(రజి) ధృవీకరించు కోవడానికి పిలిచారు.

"అబుల్-ఫజ్ల్ (అబ్బాస్ రజి)?" అబూ సుఫ్యాన్ ప్రతిస్పందించాడు.

అబ్బాస్(రజి) అన్నారు, "ఔను"

అబూ సుఫ్యాన్ చెప్పారు, "నా తండ్రి మరియు తల్లిని నీకై అర్పింతు గాక. నీతో ఏమైనా విషయముందా?"

"నీ పాడుగాను, ఓ అబూ సుఫ్యాన్!" ఇక్కడకు రసూలుల్లాహ్(స) తన వారితో వచ్చారు. అల్లాహ్ సాక్షి! అయ్యో బాధాకరమైన ఉదయం ఖురైష్‌ల కొరకు ఎదురుచూస్తుంది."

అబూ సుఫ్యాన్ : "ఈ పరిస్థితిలో ఏమి చేయగలం?"

అబ్బాస్ : "నా తండ్రి మరియు తల్లిని నీకై అర్పింతుగాక. అల్లాహ్ సాక్షి మీపై ఆయనది పైచేయి అయితే, ఆయన మీ మెడలను ఖండిస్తాడు. కాబట్టి వాహనం వెనుక ఎక్కు మరియు నేను నిన్ను రసూలుల్లాహ్(స)వారి వద్దకు తీసుకెళ్తాను మరియు ఆయన నుండి నీ క్షేమం కొరకు ప్రయత్నించు."

అబూ సుఫ్యాన్, అబ్బాస్(రజి)వారి వాహనాన్ని ఎక్కారు. వారిద్దరూ ముస్లిమ్ సైనిక శిబిరానికి చేరుకున్నారు. అబ్బాస్(రజి)వారు ఎదుర్కోబోయే పరిస్థితి సామాన్యమైనది కాదు. తను తీసుకువచ్చింది ఇస్లామ్‌కి శత్రువైన అబూసుఫ్యాన్‌ని. **అంతేకాకుండా సైనిక శిబిరం ప్రవేశం దగ్గర ఉన్నది మరెవరో కాదు - ఉమర్(రజి).**

**(తరువాత ఏమి జరిగిందో ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)**

ఉమర్(రజి)వారి జీవిత చరిత్రతో పాటు, ఆయన జీవితంలో ఓ ముఖ్య సంఘటనను ప్రత్యేకంగా వ్యాసం చివరిలో అందించే వారము. ఈసారి స్థలాభావం వలన ఇవ్వలేక పోతున్నాము.

**- శాంతిబాట టీమ్**

# ఖుర్ఆన్‌ని అర్ధం చేసుకుంటూ చదువుదాం - 24

**ఫి'లె సులాసీ ముజర్రద్** — మూడు అక్షరాలలోని ఏదైనా ఒక అక్షరానికి మూలం హమ్జా అయినప్పుడు — **فِعل ثلاثي مُجَرَّد مَهْمُوز** (مادّے کا کوئی ایک حرف ھمزہ یعنی أ یا ء ہو)

| అర్థం | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రశ్నించుట سوال کرنا to question | ప్రశ్న سُؤَال (సువాల్) | అడిగిన వాడు سَائِل (సాఇల్) | ప్రశ్నించు سَلْ (సల్) | ప్రశ్నిస్తాడు يَسْأَلُ (యస్అలు) | అడిగాడు سَأَلَ (సఅల) |
| చదువుట, పఠించుట to read; to recite پڑھنا | చదువు పఠనం قِرَاءَة (ఖిరాఅత్) | చదివిన వాడు قَارِئ (ఖారీ) | చదువు اِقْرَأْ (ఇఖ్రా) | చదువుతాడు يَقْرَأُ (యఖ్రఉ) | చదివాడు قَرَأَ (ఖరా) |
| తీసుకొనుట, పట్టుకొనుట to take; to catch پکڑنا، لینا | స్వీకరణ أَخْذ (అఖ్జ్) | తీసుకున్న వాడు آخِذ (ఆఖిజ్) | తీసుకో خُذْ (ఖుజ్) | తీసుకుంటాడు يَأْخُذُ (యఅ్ఖుజు) | తీసుకున్నాడు أَخَذَ (అఖజ) |
| తినుట to eat کھانا | తినడం أَكْل (అక్ల్) | తిన్నవాడు آكِل (ఆకిల్) | తిను كُلْ (కుల్) | తింటాడు يَأْكُلُ (యఅ్కులు) | తిన్నాడు أَكَلَ (అకల) |
| ఆదేశించుట to command حکم دینا | ఆదేశం أَمْر (అమ్ర్) | ఆదేశించిన వాడు آمِر (ఆమిర్) | ఆదేశించు مُرْ (ముర్) | ఆదేశిస్తాడు يَأْمُرُ (యఅ్మురు) | ఆదేశించాడు أَمَرَ (అమర) |
| క్షేమంగా ఉండుట, నమ్మకం ఉంచుట to be safe; to feel safe; to trust امن میں ہونا، اعتبار کرنا | నమ్మకం أَمْن (అమ్న్) | నమ్మిన వాడు آمِن (ఆమిన్) | నమ్ము اِئْمَنْ (ఇఅ్మన్) | నమ్ముతాడు يَأْمَنُ (యఅమను) | నమ్మాడు أَمِنَ (అమిన) |
| తిరస్కరించుట to refuse سخت انکار کرنا | తిరస్కారం إِبَاء (ఇబాఅ్) | తిరస్కరించిన వాడు آبٍ (ఆబిన్) | తిరస్కరించు اِئْبَ (ఇఅ్బ) | తిరస్కరిస్తాడు يَأْبَى (యఅ్బ) | తిరస్కరించాడు أَبَى (అబ) |
| చూచుట to see دیکھنا | చూపు رَأْي (రాఅ్యున్) | చూచినవాడు رَاءٍ (రాఇన్) | చూడు رَ (ర) | చూస్తాడు يَرَى (యర) | చూచాడు رَأَى (రఅ) |
| వచ్చుట to come آنا | రాక إِتْيَان (ఇఅ్యాన్) | వచ్చిన వాడు آتٍ (ఆతిన్) | రమ్ము اِئْتِ (ఇఅ్తి) | వస్తాడు يَأْتِي (యఅ్తీ) | వచ్చాడు أَتَى (అత) |
| ఇష్టపడుట, కోరుట to will; to wish چاہنا، ارادہ کرنا | కోరిక مَشِيئَة (మషీఅత్) | కోరినవాడు شَاءٍ (షాఇన్) | కోరు شَأْ (షా) | కోరతాడు يَشَاءُ (యషాఉ) | కోరాడు شَاءَ (షాఅ) |
| చెడుగా ఉండుట to be evil بُرا ہونا | سَوْء (సౌఅ్) | سَاوِئ (సావీ) | سُؤْ (సూ) | يَسُوءُ (యసూఉ) | سَاءَ (సాఅ) |
| వచ్చుట to come آنا | مَجِيء (మజీఅ) | جَاءٍ (జాఇన్) | جِئْ (జీ) | يَجِيءُ (యజీఉ) | جَاءَ (జాఅ) |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.** *ఈ 24నెలల్లో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 75.5*

ఈ నెల నేర్చుకున్న పదాలు 1733 (అంటే ఈ పేజీలోని పదాలు ఖుర్'ఆన్‌లో 1733 చోట్ల చూడవచ్చు) source: www.emuslim.com

# జిన్నులు మరియు చేతబడి

④ సీరియల్

## మనిషికుండే బలహీనతలే కొందరికి జీవనాధారం

***శారీరక లేదా మానసిక సమస్యలతో బాధపడేవారు సంబంధిత డాక్టర్‌ని సంప్రదించండి.***

క్రిందటి సంచికలో షైతాన్‌కి నివాసం మరియు ఆహారం లేకుండా ఏమి చేయాలో మరియు అల్లాహ్ యొక్క దూతలకు ఆహ్వానం ఎలా పలకాలో ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల ద్వారా వివరించడం జరిగింది. ఒకవేళ నిజంగా జిన్న్ ఆవహించిందని మీకు బలమైన నమ్మకం ఉంటే, ఆ జిన్నులను శిక్షించే ఆయత్‌లను ఈ సంచికలో అందిస్తున్నాము. ఖుర్‌ఆన్‌లోని 114 సూరహ్‌లు ఉన్నాయని మీకు తెలిసిన విషయమే. వాటిలోని 14 సూరహ్‌ల నుండి 83 ఆయత్‌లను ఈ సంచికలో ఇస్తున్నాము. వాటిని మీరు ఇన్షా అల్లాహ్ పఠించగలరు. అలా కాకుండా అది మానసిక రోగం అయితే తప్పనిసరిగా సంబంధిత డాక్టర్‌కు చూపించవలసిందిగా కోరుతున్నాము. ఒకవేళ అది మానసిక రోగం కాకపోయినా ఖుర్‌ఆన్ పఠించడం వలన మేలే జరుగుతుంది.

జిన్నులను శిక్షించే ఆయత్‌లను అందించే ముందు అల్లాహుతాలా మన కొరకు ఏర్పాటు చేసిన రక్షణ ఏర్పాట్లలో కొన్నింటిని క్లుప్తంగా ఇక్కడ తెలియజేయాలని అనుకుంటున్నాము.

మన సంరక్షణ కొరకు అల్లాహుతాలా **తన దూతలను** రక్షణగా ఉంచారు. వారు ఉదయం మరియు రాత్రి వేళల్లో మారుతూ ఉంటారు. మనకు కనిపించకుండా ఉండే ప్రతీదాని చెడునుండి మరియు జిన్నుల వలన కలిగే హాని నుండి కూడా మనకు రక్షణగా ఉంటారు.

**"ప్రతివాని ముందూ వెనుకా ఆయన నియమించిన, ఒకరి వెంట ఒకరు వచ్చే కావలివారు (అల్లాహ్ దూతలు) ఉన్నారు. వారు అల్లాహ్ ఆజ్ఞానుసారం అతనిని కాపాడుతూ ఉంటారు ....."** (ఖుర్‌ఆన్ 13:11)

పై ఆయత్ విషయంలో విద్వాంసుల మధ్య రెండు రకాల అభిప్రాయాలున్నాయి.

1. అల్లాహ్ ప్రతీ వ్యక్తి కొరకు కారుణ్యంతో తన దూతలను నియమించారు క్రూర మృగాల నుండి, హానికరమైన పురుగుల నుండి మరియు హానికారక వస్తువుల నుండి రక్షించడానికి.
2. జిన్నుల వలన కలిగే చెడునుండి రక్షించడానికి.

అద్-దహ్హాక్ చెప్పారు : అవి అతనిని జిన్నులకు వ్యతిరేకంగా కాపాడు తుంటాయి. అతనికొరకు ఏదైనా వ్రాయబడితే తప్ప.

(అంటే ఒకవేళ అతనికి హాని కలగాలని నిర్ణయం జరిగి ఉంటే తప్ప.)

కాబ్ చెప్పారు : అల్లాహ్ తన దూతలను మీ ఆహారంలో, మీ పానీయంలో మరియు మీ 'ఔరాల'లో కాపాడటానికి నియమించక పోయినట్లయితే, జిన్నులు పెద్ద మొత్తంలో మీకు హాని కలిగించేవి. (ఖుర్తుబీ 9/192-193)

అంతే కాకుండా అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో మరోచోట ఇలా చెప్పారు:

"..... **ఆయన మీపై కనిపెట్టుకుని ఉండేవారిని పంపుతాడు** ....." (ఖుర్‌ఆన్ 6:61)

"**కనిపెట్టుకుని ఉండేవాడు లేకుండా ఏ వ్యక్తి కూడా లేడు.**" (ఖుర్‌ఆన్ 86:4)

### నిజమైన విశ్వాసికి భయపడవలసిన అవసరం లేదు

అబూ ఉమామా చెప్పారు : ప్రవక్త(స)వారు చెప్పారు :

((وكِّلَ بِالْمُؤْمِنِ مِائَةٌ وَسِتُّونَ مَلَكًا، يَذُبُّونَ عَنْهُ مَا لَمْ يُقَدَّرْ عَلَيْهِ، وَمِنْ ذَلِكَ : الْبَصَرُ، سَبْعَةُ أَمْلَاكٍ يَذُبُّونَ عَنْهُ، كَمَا يذبُّ عَنْ قَصْعَةِ الْعَسَلِ الذُّبَابُ، وَلَوْ وُكلَ الْعَبْدُ اِلَى نَفْسِهِ طَرْفَةَ عيْنٍ، لَا خْتَطَفَيْهُ الشَّيَاطِينُ))

**"160మంది అల్లాహ్ దూతలు విశ్వాసికోసం నియమించ బడ్డారు అతనికి వ్రాయబడనిదాని నుండి రక్షించడానికి, దానిలో అతని కళ్ళు 7 దూతలచే రక్షించబడుతున్నాయి తేనె తుట్టెను తేనెటీగలు రక్షించే విధంగా. ఒక వ్యక్తి సంరక్షణ అతని స్వంతానికి వదలివేస్తే ఓ క్షణంపాటు, షైతాన్‌లు అతనికి పెద్దమొత్తంలో హాని కలిగిస్తారు"** (ఖుర్తుబీ 20/4)

విశ్వాసికి ఎల్లవేళలా రక్షణ ఉంది. భయపడవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. **అల్లాహుతాలా తనకే భయపడమంటున్నారు.** మరి అల్లాహ్‌కు భయపడకుండా జిన్నులకు భయపడితే షిర్క్ అవుతుంది. మన భయాన్ని పొందడానికి హక్కు అల్లాహ్‌కే ఉంది. మనచే ఆధారించ బడటానికి అర్హత కూడా అల్లాహ్‌కు మాత్రమే ఉంది. స్వార్థం కోసం కొన్ని భయానక కథలను ప్రజల మధ్యలో కొందరు వ్యాప్తి చేశారు. అటువంటి ఓ సంఘటన డా. అబుల్ ముంజిర్ గారి పుస్తకంలో వివరించ బడింది.

ఒక వ్యక్తి చాలాకాలం క్రితం మరణించాడు. అతనిది చాలా అందమైన ఇల్లు. అది మిగతా ఇళ్ళనుండి దూరంగా ఉండేది. ఆ ఇల్లు చాలా పెద్దది. ఎన్నో గదులతో, అందమైన అలంకరణలతో ఉండేది. ఇంకనూ ఆ ఇంటికి సంబంధించి ఎన్నో ప్రత్యేకతలున్నాయి.

ఆ మరణించిన వ్యక్తి యొక్క ఆస్తిని పొందడానికి అతనికి వారసులెవరూ లేరు. కాబట్టి ఆ ఇల్లు ఖాళీగానే ఉండిపోయింది. అతని బంధువులు దానిని అమ్మడానికి నిర్ణయించారు. ఎప్పుడైతే అమ్మడానికి ఇల్లు సిద్ధం చేశారో, ఆ ఇంటిలో ఇఫ్రీత్ (షైతాన్‌లో కెల్లా బాగా దుష్టుడు) ఉన్నాడనే పుకార్లు ప్రజలలో వ్యాపించాయి. . ఆ పుకారును నమ్మని వారిలో కొందరు రాత్రివేళ వెళ్ళారు. అక్కడి పరిస్థితులు వారు గమనించి, పుకారు నిజమేనని అంగీకరించారు. కాబట్టి ప్రజలు ఆ ఇంటిని కొనడానికి భయపడ్డారు.

ఆ పుకార్ల వలన ఆ ఇంటి ఖరీదులో 4వ వంతుకే అమ్మడానికి చివరికి బంధువులు సిద్ధపడవలసి వచ్చింది. అయితే వారు ఆ కొద్దిపాటి డబ్బుకే అమ్మివేసే సమయంలో, ఓ ధైర్యవంతుడైన యువకునికి ఈ విషయం తెలిసింది. ఈ యువకుడు జిన్నులకు గాని, ఇఫ్రీత్‌లకుగాని భయపడడు. కాబట్టి అతడు వారితో ఆ ఇంటి నుండి జిన్నును బయటికి పంపి మరియు ఇఫ్రీత్‌ను పట్టుకోవడంగాని లేదా బయటకు తరమడం గాని చేస్తానని, అలా చేసినందుకు కొంత డబ్బు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నాడు. వారు అంగీకరించడమే కాకుండా, ఇస్తామన్న దానిలో సగం మొత్తాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చారు.

సాయంత్రం ఆ యువకుడు ఆ ఇంటికి వెళ్లాడు. అతనితో పాటు ఏదైనా అవసరం ఉండవచ్చని ఓ రివాల్వర్ కూడా తీసుకెళ్ళాడు. అతడు ఆ ఇంటికి చేరుకుని కాస్సేపు విశ్రాంతి తీసుకుని, దీపం ఆర్పివేసి పడుకున్నాడు. కొంత సమయం దాటాక ఓ చేయి దుప్పటిని అతనిపై నుండి లాగుతున్నట్లు అనిపించింది. అతడు తన శక్తిమేర దానిని గట్టిగా పట్టుకుని అన్నాడు : "దుప్పటిని ఎవరు లాగుతున్నారు?" ఓ కంఠస్వరం వినిపించింది : "నేను ఇఫ్రీత్‌ని, నీ దుప్పటిని తీసుకోవాలి లేకపోతే నీ శరీరాన్ని ఆవహిస్తాను." అంతే! ఆ యువకుడు ఒక్కసారిగా దుప్పటిని వదిలేశాడు. అవతలి వైపున ఉన్న ఇఫ్రీత్ వెనక్కు పడిపోయాడు. ఆ యువకుడు లేచి అతడి ఛాతీపై కూర్చుని, తుపాకీని అతని తలకి గురిపెట్టాడు. "చెప్పు నీవెవరు?" తాను ఇఫ్రీత్‌ని కాదని, మనిషేనని చెప్పాడు. అయితే అతడు నల్లగానూ అంద విహీనంగా ఉంటాడు. అదే తేడా. అతనిని లేవనిచ్చాడు. దీపం కాంతిలో చూస్తే నగ్నంగా ఉన్న నల్లవాడు అతడు. అతడు పేదవాడు. అతని కుటుంబం పెద్దది. తన కుటుంబాన్ని పోషించుకోవడానికై పనికోసం తిరుగుతున్నాడు.

ఒక వ్యక్తిని పని అడిగితే, ఈ ఇంటికి ప్రతీ రోజు రాత్రి వచ్చి ఉండాలని మరియు ఒకవేళ ఎవరైనా ఈ ఇంటి సమీపంలోకి వస్తే, చప్పట్లు కొట్టాలని, ఓ చోట దరువువేసి శబ్దం చేయాలని చెప్పాడట. ఒకవేళ వచ్చిన వ్యక్తి ఆ శబ్దాలకు భయపడకపోతే, బయట ఫౌంటెన్‌కు ఉన్న కుళాయిలు విప్పివేసి శిలా విగ్రహాల నోటినుండి నీరు వచ్చేటట్లు చేయాలి. ఇంటిపైకి ఎక్కి విపరీత శబ్దాలు చేసి భయపెట్టాలి. ఇంతకాలం ఈ పనులన్నీ చేసి ఇంటిలో ఇఫ్రీత్ ఉన్నాడనే భయాన్ని ప్రజలలో కలిగించ గలిగాడు.

ఆ యువకుడు అతనిని ఆ ఇంటి యజమాని బంధువులకు అప్పగించాడు. బంధువులు ఆరా తీస్తే తెలిసింది ఏమిటంటే, ఆ ఇంటిని కొనాలని ఏ వ్యక్తి అయితే నిర్ణయించుకున్నాడో ఆ వ్యక్తే ఈ నల్లవాడిని ప్రజలలో భయం కలిగించడానికి నియమించాడని. ఇక ఎవ్వరూ ఆ ఇంటిని కొనడానికి ముందుకు రారు కాబట్టి బాగా తక్కువ రేటుకు ఇల్లు కొని లాభపడదామని పథకం వేశాడు. కాని అతని ప్లాన్ బెడిసికొట్టింది. దాదాపు ఇటువంటి డ్రామాలే ఎన్నోచోట్ల జరుగు తుంటాయి.

**ఖుర్'ఆన్ అర్థం చేసుకున్నవారు ఇటువంటి అపోహలకు లోనుకారు.**

షైతాన్‌లు లేవని మేము చెప్పడం లేదు. ఎందుకంటే ఖుర్'ఆన్ చాలా స్పష్టంగా చెప్పింది. ఆ విషయాలన్నీ ఈ సీరియల్ మొదటి వ్యాసంలో వివరించడం జరిగింది. కాని వాస్తవానికి మసిపూసి మారేడికాయ చేసి, ప్రజలను విపరీతమైన భయాందోళనలకు గురిచేయడం ఖండించదగిన విషయం.

తన మానాన తాను బ్రతికే ఏ వ్యక్తిని అయినా భయపెట్టడం ఎవరికీ ధర్మం కాదు. అలా భయపెట్టేవారు లేదా నష్టం కలిగించేవారు మనుషులు కావచ్చు లేదా షైతాన్‌లు కావచ్చు. అటువంటివారు శిక్షకు అర్హులు. మనకి కష్టం కలిగిస్తూ కనిపించకుండా ఉండే షైతాన్‌ని శిక్షించడానికి కొన్ని ఆయత్‌లున్నాయి. వాటిని పఠించాలి. ఆ ఆయత్‌లు మనలో ఎవరైనా చదవవచ్చు. ప్రయత్నించండి "అల్లాహ్" పేరుతో.

అరబీ భాషలో వ్రాయడం, చదవడం కష్టమైన పనేమీ కాదు. ఓ వారం రోజుల పాటు కష్టపడితే నేర్చుకోవచ్చు. ఈ దిగువున పైన పేర్కొన్న అరబీ ఆయత్‌లకు తెలుగు అర్థాన్ని కూడా ఇస్తున్నాము. రెండు మూడుసార్లు చదివి వాటిలోని వివేకాన్ని అర్థం చేసుకోండి :

**1. అల్-ఫాతిహా** (1:1-7)

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ ۝ الْحَمْدُ لِلَّهِ رَبِّ
الْعَالَمِينَ ۝ الرَّحْمَٰنِ الرَّحِيمِ ۝ مَالِكِ يَوْمِ الدِّينِ ۝
إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِينُ ۝ اهْدِنَا الصِّرَاطَ
الْمُسْتَقِيمَ ۝ صِرَاطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ
عَلَيْهِمْ وَلَا الضَّالِّينَ ۝

**2. అల్-బఖరహ్** (2 : 1 - 5)

الم ○ ذَٰلِكَ الْكِتَابُ لَا رَيْبَ فِيهِ هُدًى لِّلْمُتَّقِينَ ○
الَّذِينَ يُؤْمِنُونَ بِالْغَيْبِ وَيُقِيمُونَ الصَّلَاةَ وَمِمَّا رَزَقْنَاهُمْ
يُنفِقُونَ ○ وَالَّذِينَ يُؤْمِنُونَ بِمَا أُنزِلَ إِلَيْكَ وَمَا أُنزِلَ مِن
قَبْلِكَ وَبِالْآخِرَةِ هُمْ يُوقِنُونَ ○ أُولَٰئِكَ عَلَىٰ هُدًى مِّن
رَّبِّهِمْ وَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ ○

**3. అల్-బఖరహ్** (2 : 163 - 164)

وَإِلَٰهُكُمْ إِلَٰهٌ وَاحِدٌ لَّا إِلَٰهَ إِلَّا هُوَ الرَّحْمَٰنُ الرَّحِيمُ ○ إِنَّ فِي
خَلْقِ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَاخْتِلَافِ اللَّيْلِ وَالنَّهَارِ وَالْفُلْكِ
الَّتِي تَجْرِي فِي الْبَحْرِ بِمَا يَنفَعُ النَّاسَ وَمَا أَنزَلَ اللَّهُ مِنَ
السَّمَاءِ مِن مَّاءٍ فَأَحْيَا بِهِ الْأَرْضَ بَعْدَ مَوْتِهَا وَبَثَّ فِيهَا مِن
كُلِّ دَابَّةٍ وَتَصْرِيفِ الرِّيَاحِ وَالسَّحَابِ الْمُسَخَّرِ بَيْنَ السَّمَاءِ
وَالْأَرْضِ لَآيَاتٍ لِّقَوْمٍ يَعْقِلُونَ ○

**4. అల్-బఖరహ్** (2 : 255 - 257)

اللَّهُ لَا إِلَٰهَ إِلَّا هُوَ الْحَيُّ الْقَيُّومُ لَا تَأْخُذُهُ سِنَةٌ وَلَا نَوْمٌ لَّهُ مَا
فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ مَن ذَا الَّذِي يَشْفَعُ عِندَهُ إِلَّا
بِإِذْنِهِ يَعْلَمُ مَا بَيْنَ أَيْدِيهِمْ وَمَا خَلْفَهُمْ وَلَا يُحِيطُونَ
بِشَيْءٍ مِّنْ عِلْمِهِ إِلَّا بِمَا شَاءَ وَسِعَ كُرْسِيُّهُ السَّمَاوَاتِ
وَالْأَرْضَ وَلَا يَئُودُهُ حِفْظُهُمَا وَهُوَ الْعَلِيُّ الْعَظِيمُ ○ لَا إِكْرَاهَ
فِي الدِّينِ قَد تَّبَيَّنَ الرُّشْدُ مِنَ الْغَيِّ فَمَن يَكْفُرْ بِالطَّاغُوتِ
وَيُؤْمِن بِاللَّهِ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقَىٰ لَا انفِصَامَ
لَهَا وَاللَّهُ سَمِيعٌ عَلِيمٌ ○ اللَّهُ وَلِيُّ الَّذِينَ آمَنُوا يُخْرِجُهُم
مِّنَ الظُّلُمَاتِ إِلَى النُّورِ وَالَّذِينَ كَفَرُوا أَوْلِيَاؤُهُمُ الطَّاغُوتُ
يُخْرِجُونَهُم مِّنَ النُّورِ إِلَى الظُّلُمَاتِ أُولَٰئِكَ أَصْحَابُ النَّارِ هُمْ
فِيهَا خَالِدُونَ ○

**5. అల్-బఖరహ్** (2 : 285 - 286)

آمَنَ الرَّسُولُ بِمَا أُنزِلَ إِلَيْهِ مِن رَّبِّهِ وَالْمُؤْمِنُونَ كُلٌّ آمَنَ
بِاللَّهِ وَمَلَائِكَتِهِ وَكُتُبِهِ وَرُسُلِهِ لَا نُفَرِّقُ بَيْنَ أَحَدٍ مِّن
رُّسُلِهِ وَقَالُوا سَمِعْنَا وَأَطَعْنَا غُفْرَانَكَ رَبَّنَا وَإِلَيْكَ
الْمَصِيرُ ○ لَا يُكَلِّفُ اللَّهُ نَفْسًا إِلَّا وُسْعَهَا لَهَا مَا كَسَبَتْ
وَعَلَيْهَا مَا اكْتَسَبَتْ رَبَّنَا لَا تُؤَاخِذْنَا إِن نَّسِينَا أَوْ
أَخْطَأْنَا رَبَّنَا وَلَا تَحْمِلْ عَلَيْنَا إِصْرًا كَمَا حَمَلْتَهُ عَلَى الَّذِينَ مِن
قَبْلِنَا رَبَّنَا وَلَا تُحَمِّلْنَا مَا لَا طَاقَةَ لَنَا بِهِ وَاعْفُ عَنَّا وَاغْفِرْ لَنَا
وَارْحَمْنَا أَنتَ مَوْلَانَا فَانصُرْنَا عَلَى الْقَوْمِ الْكَافِرِينَ ○

**6. ఆలి - 'ఇమ్రాన్** (3 : 18 - 19)

شَهِدَ اللَّهُ أَنَّهُ لَا إِلَٰهَ إِلَّا هُوَ وَالْمَلَائِكَةُ وَأُولُو الْعِلْمِ قَائِمًا
بِالْقِسْطِ لَا إِلَٰهَ إِلَّا هُوَ الْعَزِيزُ الْحَكِيمُ ○ إِنَّ الدِّينَ عِندَ
اللَّهِ الْإِسْلَامُ وَمَا اخْتَلَفَ الَّذِينَ أُوتُوا الْكِتَابَ إِلَّا مِن بَعْدِ
مَا جَاءَهُمُ الْعِلْمُ بَغْيًا بَيْنَهُمْ وَمَن يَكْفُرْ بِآيَاتِ اللَّهِ فَإِنَّ
اللَّهَ سَرِيعُ الْحِسَابِ ○

**7. అల్ - ఆరాఫ్** (7 : 54 - 56)

إِنَّ رَبَّكُمُ اللَّهُ الَّذِي خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ فِي سِتَّةِ أَيَّامٍ
ثُمَّ اسْتَوَىٰ عَلَى الْعَرْشِ يُغْشِي اللَّيْلَ النَّهَارَ يَطْلُبُهُ حَثِيثًا
وَالشَّمْسَ وَالْقَمَرَ وَالنُّجُومَ مُسَخَّرَاتٍ بِأَمْرِهِ أَلَا لَهُ الْخَلْقُ
وَالْأَمْرُ تَبَارَكَ اللَّهُ رَبُّ الْعَالَمِينَ ○ ادْعُوا رَبَّكُمْ تَضَرُّعًا
وَخُفْيَةً إِنَّهُ لَا يُحِبُّ الْمُعْتَدِينَ ○ وَلَا تُفْسِدُوا فِي الْأَرْضِ
بَعْدَ إِصْلَاحِهَا وَادْعُوهُ خَوْفًا وَطَمَعًا إِنَّ رَحْمَتَ اللَّهِ قَرِيبٌ مِّنَ
الْمُحْسِنِينَ ○

**8. అల్ - మూమినూన్** (23 : 115 - 118)

أَفَحَسِبْتُمْ أَنَّمَا خَلَقْنَاكُمْ عَبَثًا وَأَنَّكُمْ إِلَيْنَا لَا
تُرْجَعُونَ ○ فَتَعَالَى اللَّهُ الْمَلِكُ الْحَقُّ لَا إِلَٰهَ إِلَّا هُوَ رَبُّ
الْعَرْشِ الْكَرِيمِ ○ وَمَن يَدْعُ مَعَ اللَّهِ إِلَٰهًا آخَرَ لَا بُرْهَانَ
لَهُ بِهِ فَإِنَّمَا حِسَابُهُ عِندَ رَبِّهِ إِنَّهُ لَا يُفْلِحُ الْكَافِرُونَ وَقُل
رَّبِّ اغْفِرْ وَارْحَمْ وَأَنتَ خَيْرُ الرَّاحِمِينَ ○

**9. అస్ - 'సాఫ్ఫాత్** (37 : 1 - 10)

وَالصَّافَّاتِ صَفًّا ○ فَالزَّاجِرَاتِ زَجْرًا ○ فَالتَّالِيَاتِ ذِكْرًا ○ إِنَّ إِلَٰهَكُمْ لَوَاحِدٌ ○ رَّبُّ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَمَا بَيْنَهُمَا وَرَبُّ الْمَشَارِقِ ○ إِنَّا زَيَّنَّا السَّمَاءَ الدُّنْيَا بِزِينَةٍ الْكَوَاكِبِ ○ وَحِفْظًا مِّن كُلِّ شَيْطَانٍ مَّارِدٍ ○ لَّا يَسَّمَّعُونَ إِلَى الْمَلَإِ الْأَعْلَىٰ وَيُقْذَفُونَ مِن كُلِّ جَانِبٍ ○ دُحُورًا ۖ وَلَهُمْ عَذَابٌ وَاصِبٌ ○ إِلَّا مَنْ خَطِفَ الْخَطْفَةَ فَأَتْبَعَهُ شِهَابٌ ثَاقِبٌ ○

**10. అల్ - అహ్ఖాఫ్** (46 : 29 - 32)

وَإِذْ صَرَفْنَا إِلَيْكَ نَفَرًا مِّنَ الْجِنِّ يَسْتَمِعُونَ الْقُرْآنَ فَلَمَّا حَضَرُوهُ قَالُوا أَنصِتُوا ۖ فَلَمَّا قُضِيَ وَلَّوْا إِلَىٰ قَوْمِهِم مُّنذِرِينَ ○ قَالُوا يَا قَوْمَنَا إِنَّا سَمِعْنَا كِتَابًا أُنزِلَ مِن بَعْدِ مُوسَىٰ مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ يَهْدِي إِلَى الْحَقِّ وَإِلَىٰ طَرِيقٍ مُّسْتَقِيمٍ ○ يَا قَوْمَنَا أَجِيبُوا دَاعِيَ اللَّهِ وَآمِنُوا بِهِ يَغْفِرْ لَكُم مِّن ذُنُوبِكُمْ وَيُجِرْكُم مِّنْ عَذَابٍ أَلِيمٍ ○ وَمَن لَّا يُجِبْ دَاعِيَ اللَّهِ فَلَيْسَ بِمُعْجِزٍ فِي الْأَرْضِ وَلَيْسَ لَهُ مِن دُونِهِ أَوْلِيَاءُ ۚ أُولَٰئِكَ فِي ضَلَالٍ مُّبِينٍ ○

**11. అర్ - రహ్మాన్** (55 : 33 - 36)

يَا مَعْشَرَ الْجِنِّ وَالْإِنسِ إِنِ اسْتَطَعْتُمْ أَن تَنفُذُوا مِنْ أَقْطَارِ السَّمَاوَاتِ وَالْأَرْضِ فَانفُذُوا ۚ لَا تَنفُذُونَ إِلَّا بِسُلْطَانٍ ○ فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ○ يُرْسَلُ عَلَيْكُمَا شُوَاظٌ مِّن نَّارٍ وَنُحَاسٌ فَلَا تَنتَصِرَانِ ○ فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ○

**12. అల్ - హష్ర్** (59 : 21 - 24)

لَوْ أَنزَلْنَا هَٰذَا الْقُرْآنَ عَلَىٰ جَبَلٍ لَّرَأَيْتَهُ خَاشِعًا مُّتَصَدِّعًا مِّنْ خَشْيَةِ اللَّهِ ۚ وَتِلْكَ الْأَمْثَالُ نَضْرِبُهَا لِلنَّاسِ لَعَلَّهُمْ يَتَفَكَّرُونَ ○ هُوَ اللَّهُ الَّذِي لَا إِلَٰهَ إِلَّا هُوَ ۖ عَالِمُ الْغَيْبِ وَالشَّهَادَةِ ۖ هُوَ الرَّحْمَٰنُ الرَّحِيمُ ○ هُوَ اللَّهُ الَّذِي لَا إِلَٰهَ إِلَّا هُوَ الْمَلِكُ الْقُدُّوسُ السَّلَامُ الْمُؤْمِنُ الْمُهَيْمِنُ الْعَزِيزُ الْجَبَّارُ الْمُتَكَبِّرُ ۚ سُبْحَانَ اللَّهِ عَمَّا يُشْرِكُونَ ○ هُوَ اللَّهُ الْخَالِقُ الْبَارِئُ الْمُصَوِّرُ ۖ لَهُ الْأَسْمَاءُ الْحُسْنَىٰ ۚ يُسَبِّحُ لَهُ مَا فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ ۖ وَهُوَ الْعَزِيزُ الْحَكِيمُ ○

**13. అల్ - జిన్న్** (72 : 1 - 9)

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

قُلْ أُوحِيَ إِلَيَّ أَنَّهُ اسْتَمَعَ نَفَرٌ مِّنَ الْجِنِّ فَقَالُوا إِنَّا سَمِعْنَا قُرْآنًا عَجَبًا ○ يَهْدِي إِلَى الرُّشْدِ فَآمَنَّا بِهِ ۖ وَلَن نُّشْرِكَ بِرَبِّنَا أَحَدًا ○ وَأَنَّهُ تَعَالَىٰ جَدُّ رَبِّنَا مَا اتَّخَذَ صَاحِبَةً وَلَا وَلَدًا ○ وَأَنَّهُ كَانَ يَقُولُ سَفِيهُنَا عَلَى اللَّهِ شَطَطًا ○ وَأَنَّا ظَنَنَّا أَن لَّن تَقُولَ الْإِنسُ وَالْجِنُّ عَلَى اللَّهِ كَذِبًا ○ وَأَنَّهُ كَانَ رِجَالٌ مِّنَ الْإِنسِ يَعُوذُونَ بِرِجَالٍ مِّنَ الْجِنِّ فَزَادُوهُمْ رَهَقًا ○ وَأَنَّهُمْ ظَنُّوا كَمَا ظَنَنتُمْ أَن لَّن يَبْعَثَ اللَّهُ أَحَدًا ○ وَأَنَّا لَمَسْنَا السَّمَاءَ فَوَجَدْنَاهَا مُلِئَتْ حَرَسًا شَدِيدًا وَشُهُبًا ○ وَأَنَّا كُنَّا نَقْعُدُ مِنْهَا مَقَاعِدَ لِلسَّمْعِ ۖ فَمَن يَسْتَمِعِ الْآنَ يَجِدْ لَهُ شِهَابًا رَّصَدًا ○

**14. అల్ - హుమ'జహ్** (104 : 1 - 9)

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

وَيْلٌ لِّكُلِّ هُمَزَةٍ لُّمَزَةٍ ○ الَّذِي جَمَعَ مَالًا وَعَدَّدَهُ ○ يَحْسَبُ أَنَّ مَالَهُ أَخْلَدَهُ ○ كَلَّا ۖ لَيُنبَذَنَّ فِي الْحُطَمَةِ ○ وَمَا أَدْرَاكَ مَا الْحُطَمَةُ ○ نَارُ اللَّهِ الْمُوقَدَةُ ○ الَّتِي تَطَّلِعُ عَلَى الْأَفْئِدَةِ ○ إِنَّهَا عَلَيْهِم مُّؤْصَدَةٌ ○ فِي عَمَدٍ مُّمَدَّدَةٍ ○

**15. అల్ - ఇఖ్లాస్** (112 : 1 - 4)

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

قُلْ هُوَ اللَّهُ أَحَدٌ ○ اللَّهُ الصَّمَدُ ○ لَمْ يَلِدْ وَلَمْ يُولَدْ ○ وَلَمْ يَكُن لَّهُ كُفُوًا أَحَدٌ ○

**16. అల్ - ఫలఖ్** (113 : 1 - 5)

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

قُلْ أَعُوذُ بِرَبِّ الْفَلَقِ ۝ مِن شَرِّ مَا خَلَقَ ۝ وَمِن شَرِّ
غَاسِقٍ إِذَا وَقَبَ ۝ وَمِن شَرِّ النَّفَّاثَاتِ فِي الْعُقَدِ ۝ وَمِن شَرِّ
حَاسِدٍ إِذَا حَسَدَ ۝

**17. అన్ - నాస్** (114 : 1 - 6)

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

قُلْ أَعُوذُ بِرَبِّ النَّاسِ ۝ مَلِكِ النَّاسِ ۝ إِلَٰهِ
النَّاسِ ۝ مِن شَرِّ الْوَسْوَاسِ الْخَنَّاسِ ۝ الَّذِي يُوَسْوِسُ فِي
صُدُورِ النَّاسِ ۝ مِنَ الْجِنَّةِ وَالنَّاسِ ۝

**1. అల్-ఫాతిహా** (1: 1 - 7)

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో అన్ని పొగడ్తలు మరియు కృతజ్ఞతలు సకల లోకాలకు ప్రభువు, పోషకుడు అయిన అల్లాహ్ కొరకే. అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత. తీర్పు దినానికి సర్వాధికారి. నిన్నే మేము ఆరాధించేది మరియు నీ సహాయాన్నే మేము అర్థించేది. మాకు ఋజుమార్గం (సన్మార్గం) వైపునకు మార్గదర్శకత్వం వహించు. వారి మార్గం ఎవరిపై నీ అనుగ్రహాన్ని ప్రసాదించావో, నీ కోపానికి గురియైన వారిది కాదు, మార్గభ్రష్టులైనవారిది (వారి మార్గం) కాదు.

**2. అల్-బఖరహ్** (2 : 1 - 5)

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో అలిఫ్ - లామ్ - మీమ్. ఇది (ఈ ఖుర్ఆన్) ఒక దివ్య గ్రంథం, ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. అల్లాహ్ పట్ల భీతి గలవారికి ఇది మార్గ దర్శకత్వము. (వారికి) ఎవరైతే అగోచర యథార్థాన్ని విశ్వసిస్తారో, సలాత్ (నమాజ్)ను స్థాపిస్తారో మరియు మేము ప్రసాదించిన జీవనోపాధి నుండి (మా మార్గంలో) ఖర్చు చేస్తారో. మరియు ఎవరైతే (ఓ ముహమ్మద్!) నీపై అవతరింపజేయబడిన దానిని (ఈ ఖుర్ఆన్‌ను) మరియు నీకు పూర్వం అవతరింపజేయబడిన వాటినీ విశ్వసిస్తారో మరియు పరలోక జీవితాన్ని దృఢంగా నమ్ముతారో! అలాంటి వారే తమ ప్రభువు (చూపిన) సన్మార్గంలో ఉన్నవారు, మరియు అలాంటి వారే సాఫల్యం పొందేవారు.

**2. అల్-బఖరహ్** (2 : 163 - 164)

మరియు మీ ఆరాధ్యుడు కేవలం ఆ ఒకే ఒక్కడు (అల్లాహ్) మాత్రమే. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు, అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత. నిశ్చయంగా, భూమ్యాకాశాల సృష్టిలోనూ, రేయింబవళ్ళ మార్పులోనూ, ప్రజలకు ఉపయోగకరమైన వాటిని తీసుకొని, సముద్రంలో పయనించే ఓడలలోనూ మరియు అల్లాహ్ ఆకాశం నుండి వర్షం కురిపించి దాని ద్వారా నిర్జీవమైన భూమికి ప్రాణం పోసి, అందులో వివిధ రకాల జీవరాసులను వర్ధిల్లజేయటం లోనూ మరియు వాయువులు మరియు మేఘాలు, భూమ్యాకాశాల మధ్య నియమబద్ధంగా చేసే సంచారాల మార్పులలోనూ, బుద్ధిమంతులకు ఎన్నో సంకేతాలున్నాయి.

**2. అల్-బఖరహ్** (2 : 255 - 257)

అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యడు లేడు. ఆయన సజీవుడు. విశ్వవ్యవస్థకు ఆధారభూతుడు. ఆయనకు కునుకూరాదు మరియు నిదురా రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనకు చెందినదే. ఆయన సమ్ముఖంలో - ఆయన అనుజ్ఞ లేకుండా - సిఫారసు చేయగల వాడెవడు? వారి ముందున్నదీ మరియు వారి వెనుక నున్నదీ అన్నీ ఆయనకు బాగా తెలుసు. మరియు ఆయన కోరితే తప్ప, ఆయన జ్ఞానవిశేషాలలో ఏ విషయమునూ వారు గ్రహింపజాలరు. ఆయన కుర్సీ ఆకాశాలనూ మరియు భూమినీ పరివేష్టించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఏ మాత్రం అలసట కలిగించదు. మరియు ఆయన అత్యున్నతుడు, సర్వోత్తముడు. ధర్మం విషయంలో బలవంతం లేదు. వాస్తవానికి రుష్ద్ (సన్మార్గం), దుర్మార్గం నుండి స్పష్టంగా కనిపిస్తుంది. కావున కల్పిత దైవాల (తాగూత్)ను తిరస్కరించి, అల్లాహ్‌ను విశ్వసించిన వాడు, సుస్థిరమైన, ఎన్నటికీ విడిపోని ఆధారాన్ని పట్టుకున్నట్లే. మరియు అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు. అల్లాహ్ విశ్వసించినవారి సంరక్షకుడు, ఆయన వారిని చీకటి నుండి తీసి వెలుగులోకి తెస్తాడు. మరియు సత్యాన్ని తిరస్కరించినవారి రక్షకులు కల్పిత దైవాలు (తాగూత్), అవి వారిని వెలుగునుండి తీసి చీకటిలోనికి తీసుకొని పోతాయి. అలాంటివారు నరకాగ్నివాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దే! మీరు మీ మనస్సులలో ఉన్నది, వెలుబుచ్చినా లేక దాచినా అల్లాహ్ మీ నుంచి దాని లెక్క తీసుకుంటాడు. మరియు ఆయన తాను కోరినవానిని క్షమిస్తాడు మరియు తాను కోరినవానిని శిక్షిస్తాడు. మరియు అల్లాహ్ ప్రతీదీ చేయగల సమర్థుడు.

**2. అల్-బఖరహ్** (2 : 285 - 286)

ఈ ప్రవక్త తన ప్రభువు తరపునుండి, తనపై అవతరింప జేయబడిన దానిని విశ్వసించాడు మరియు (అదేవిధంగా) విశ్వాసులు కూడా (విశ్వసించారు). వారంతా అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను మరియు ఆయన ప్రవక్తలను విశ్వసించారు. వారంటారు: "మేము ఆయన ప్రవక్తల మధ్య ఎలాంటి బేధభావాలను చూపము. మరియు మేము (ఆదేశం) విన్నాము మరియు దానిని శిరసా వహించాము, నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము, ఓ మా ప్రభూ! మా గమ్యస్థానం నీ వైపుకే ఉంది. "అల్లాహ్ ఏ ప్రాణిపైననూ దాని శక్తికి మించిన భారం వేయడు. తాను సంపాదించిన (పుణ్య ఫలితం) దానికి లభిస్తుంది మరియు తాను చేసిన దుష్కర్మల శిక్ష అది అనుభవిస్తుంది. ఓ మా ప్రభూ! మేము మరచినా లేక తప్పు చేసినా మమ్మల్ని పట్టకు! ఓ మా ప్రభూ! పూర్వం వారిపై మోపినట్టి భారం మాపై మోపకు. ఓ మా ప్రభూ! మేము సహించలేని భారం మాపై వేయకు. మమ్మల్ని మన్నించు, మమ్మల్ని క్షమించు మరియు మమ్మల్ని కరుణించు. నీవే మా సంరక్షకుడవు. కావున సత్య తిరస్కారులపై మాకు విజయాన్ని ప్రసాదించు.

**3. ఆలి - 'ఇమ్రాన్** (3 : 18 - 19)

అల్లాహ్ సాక్ష్యమిచ్చారు 'ఆరాధ్యుడు లేడు ఆయన తప్ప' అని మరియు (అదే విధంగా) అల్లాహ్ యొక్క దూతలు మరియు జ్ఞానవంతులు (ఇచ్చారు) - (ఆయనే) న్యాయాన్ని నిలిపేవాడు. ఆరాధ్యుడు లేడు ఆయన తప్ప. (ఆయనే) సర్వశక్తివంతుడు, మహా వివేకవంతుడు. నిశ్చయంగా, అల్లాహ్ దృష్టిలో ధర్మం ఇస్లామ్. మరియు విభేధించలేదు గ్రంథాన్ని ఇవ్వబడినవారు వారికి జ్ఞానం లభించిన తరువాతనే వారిలో వారు పరస్పర ఈర్ష్యతో తప్ప. మరియు ఎవరైతే తిరస్కరించారో అల్లాహ్ యొక్క ఆయత్‌లను, నిశ్చయంగా అల్లాహ్ అతి శీఘ్రుడు లెక్క (తీసుకోవడం)లో.

**7. అల్ - ఆరాఫ్** (7 : 54 - 56)

నిశ్చయంగా, మీ ప్రభువైన అల్లాహ్‌యే ఆకాశాలను మరియు భూమిని ఆరుదినములలో సృష్టించాడు. ఆ పిదప తన అర్ష్‌ను అధిష్టించాడు. ఆయన రాత్రిని పగటి వెంట ఎడతెగకుండా అనుసరింపజేసి, దానిపై కప్పుతూ ఉంటాడు. మరియు సూర్యచంద్ర నక్షత్రాలు ఆయన ఆజ్ఞకు కట్టుబడి ఉన్నాయి. నిశ్చయంగా, సర్వసృష్టి ఆయనదే! మరియు ఆజ్ఞ నడిచేది ఆయనదే. అల్లాహ్ ఎంతో శుభదాయకుడు, సర్వలోకాలకు పోషకుడు. మీ ప్రభువును వినయంతో మరియు రహస్యంగా (మౌనంగా) ప్రార్థించండి. నిశ్చయంగా, ఆయన హద్దులు మీరే వారిని ప్రేమించడు. మరియు భూమిలో సంస్కరణ జరిగిన పిదప దానిలో కల్లోల్లాన్ని రేకెత్తించకండి మరియు భయంతో మరియు ఆశతో ఆయనను ప్రార్థించండి. నిశ్చయంగా, అల్లాహ్ కారుణ్యం సజ్జనులకు సమీపంలోనే ఉంది.

**8. అల్ - మోమినూన్** (23 : 115 - 118)

ఏమీ? వాస్తవానికి మేము మిమ్మల్ని వృథాగానే పుట్టించామని మరియు మీరు మా వైపునకు ఎన్నడూ మరలిరారని భావించారా? కావున అల్లాహ్ అత్యున్నతుడు, నిజమైన విశ్వసార్వభౌముడు, ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయనే గౌరవప్రదమైన అర్ష్‌కు ప్రభువు. ఇక ఎవడైనా అల్లాహ్‌తో పాటు మరొక ఆరాధ్యుడిని - తన వద్ద దానికొరకు ఎలాంటి ఆధారం లేకుండానే - ప్రార్థిస్తాడో! నిశ్చయంగా, అతని లెక్క అతని ప్రభువు వద్ద ఉంది. నిశ్చయంగా, సత్యతిరస్కారులు సాఫల్యం పొందలేరు. కావున నీవు ఇలా ప్రార్థించు : "ఓ నా ప్రభూ! నన్ను క్షమించు, నన్ను కరుణించు, కరుణించే వారిలో నీవే సర్వోత్తముడవు."

**9. అస్ - 'సాఫ్ఫాత్** (37 : 1 - 10)

వరుసగా బారులు తీరి నిలుచున్న (అల్లాహ్ దూతల) సాక్షిగా! మేఘాలను నడిపించే (అల్లాహ్ దూతల) సాక్షిగా! ఈ ఉపదేశాన్ని తెచ్చే (అల్లాహ్ దూతల) సాక్షిగా! నిశ్చయంగా, మీ ఆరాధ్యుడు కేవలం (అల్లాహ్) ఒక్కడే! ఆకాశాలు మరియు భూమి మరియు వాటి మధ్యనున్న వాటి ప్రభువు మరియు సూర్యోదయ స్థలాలకు ప్రభువు. నిశ్చయంగా, మేము భూలోకానికి దగ్గరి ఆకాశాన్ని నక్షత్ర సముదాయాలతో అలంకరించాము, మరియు ధిక్కారి అయిన ప్రతి షైతాన్ నుండి కాపాడటానికి. ఇకవారు (షైతాన్‌లు), ఉన్నత స్థానాలలో ఉన్న నాయకుల (షైతాన్‌ల) మాటలు వినలేరు మరియు వారు ప్రతిదిక్కునుండి తరమబడుతూ ఉంటారు. వారు (షైతాన్‌లు) బహిష్కరించబడ్డారు మరియు వారికి నిరంతరమైన శిక్ష ఉంది. కాని ఎవరైనా (ఏ షైతానైనా), దేనినైనా ఎగురవేసుకుని పోతున్నట్లైతే, మండే అగ్నిజ్వాల అతనిని వెంబడిస్తుంది.

**10. అల్-అహ్‌ఖాఫ్** (46 : 29 - 32)

మరియు (ఓ ముహమ్మద్!) జిన్నుల ఒక సమూహాన్ని మేము - ఖుర్'ఆన్‌ను వినటానికి నీ వైపునకు మొగ్గునట్లు చేసినపుడు, వారు అక్కడ చేరిన తరువాత పరస్పరం ఇలా మాట్లాడుకున్నారు : "నిశ్శబ్దంగా వినండి!" దాని (పఠనం) ముగిసిన తరువాత, వారు హెచ్చరిక చేసేవారిగా, తమ జాతి వారి వైపునకు మరలిపోయారు. వారు (జిన్నులు) ఇలా అన్నారు : "ఓ మా జాతివారలారా! వాస్తవంగా మేము మూసా తరువాత అవతరింప జేయబడిన ఒక గ్రంథాన్ని విన్నాము. అది దానికి పూర్వం వచ్చిన దానిని ధృవీకరిస్తుంది. సత్యం వైపునకు మరియు ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తుంది. "మా జాతి వారలారా! అల్లాహ్ వైపునకు పిలిచేవానిని అనుసరించండి. మరియు ఆయనను (అల్లాహ్‌ను) విశ్వసించండి. ఆయన మీ పాపాలను క్షమిస్తాడు మరియు మిమ్మల్ని బాధాకరమైన శిక్ష నుండి కాపాడుతాడు. "మరియు అల్లాహ్ వైపునకు పిలిచేవానిని అనుసరించనివాడు భూమిలో తప్పించుకోలేడు. మరియు అతడికి, ఆయన తప్ప మరొక సంరక్షకుడు లేడు. అలాంటి వారు స్పష్టంగా మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నట్లే!"

**11. అర్-రహ్మాన్** (55 : 33 - 36)

ఓ జిన్నుల మరియు మానవ జాతివారలారా! ఒకవేళ మీరు ఆకాశాల మరియు భూమియొక్క సరిహద్దుల నుండి బయటకి వెళ్లిపోగలిగితే, వెళ్ళిపొండి! (అల్లాహ్) యొక్క సెలవు లేనిదే మీరు వాటినుండి వెళ్ళిపోలేరు. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏయే అనుగ్రహాలను నిరాకరిస్తారు? మీ ఇద్దరి పైకి అగ్నిజ్వాలలు మరియు పొగ పంపబడతాయి. అప్పుడు మీరు ఎదుర్కోలేరు. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏయే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

**12. అల్-హష్ర్** (59 : 21 - 24)

ఒకవేళ మేము ఈ ఖుర్'ఆన్‌ను ఏ పర్వతం పైనైనా అవతరింపజేసి ఉంటే, అల్లాహ్ భయం వల్ల అది అణిగిబ్రద్దలై పోవటాన్ని నీవు చూసి ఉంటావు. మరియు బహుశా ప్రజలు ఆలోచిస్తారని, ఇలాంటి దృష్టాంతాలను మేము వారి ముందు పెడుతున్నాము. ఆయనే, అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయనకు అగోచర మరియు గోచర విషయాలన్నీ తెలుసు. ఆయన అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత. ఆయనే, అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన విశ్వసార్వభౌముడు, పరమ పవిత్రుడు, శాంతికి మూలాధారుడు, శాంతిప్రదాత, సంరక్షకుడు, సర్వశక్తివంతుడు, గొప్ప ప్రాబల్యం కలవాడు, సర్వలోపాలకు అతీతుడు. వారు కల్పించే భాగస్వాములకు అల్లాహ్ అతీతుడు. ఆయనే, అల్లాహ్! విశ్వ సృష్టికర్త, ప్రతీదానిని సృజించేవాడు మరియు రూపాలను తీర్చిదిద్దేవాడు. ఆయనకు సర్వశ్రేష్టమైన పేర్లున్నాయి. ఆకాశాలలో మరియు భూమిలో ఉన్న సమస్తమూ, ఆయన పవిత్రతను కొనియాడుతుంటాయి. మరియు ఆయనే సర్వశక్తివంతుడు, మహా వివేకవంతుడు.

**13. అల్-జిన్న్** (72 : 1 - 9)

(ఓ ముహమ్మద్!) చెప్పు : "నాకు ఈ విధంగా దివ్యసందేశం పంప బడింది. నిశ్చయంగా ఒక జిన్నుల సమూహం, ఇది (ఈ ఖుర్'ఆన్‌ను) విని, తమ జాతివారితో ఇలా అన్నారు : 'వాస్తవానికి మేము ఒక అద్భుతమైన పఠనం విన్నాము! అది సరైన మార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తుంది. కావున మేము దానిని విశ్వసించాము. మరియు మేము మా ప్రభువుకు ఎవ్వడిని కూడా భాగస్వామిగా సాటి కల్పించము. మరియు నిశ్చయంగా, మా ప్రభువు వైభవం ఎంతో ఉన్నతమైనది. ఆయన ఎవ్వరినీ భార్యగా గానీ, కుమారునిగా గానీ చేసుకోలేదు. మరియు నిశ్చయంగా, మనలోని అవివేకులు, కొందరు అల్లాహ్ విషయంలో దారుణమైన మాటలు పలుకుతున్నారు మరియు వాస్తవానికి, మనం మానవులుగానీ, జిన్నులు గానీ అల్లాహ్‌ను గురించి అబద్ధం పలకరని భావించేవారము. మరియు వాస్తవానికి మానవులలో నుండి కొందరు పురుషులు, జిన్నులలో నుండి కొందరు పురుషులను శరణువేడుతూ ఉండేవారు. ఈ విధంగా వారు, వారి (జిన్నుల) తల బిరుసుతనం మరింత అధికమే చేసేవారు. మరియు వాస్తవానికి, వారు కూడా మీరు భావించినట్లు, అల్లాహ్ ఎవ్వరినీ కూడా సందేశహరునిగా పంపడని భావించారు మరియు నిశ్చయంగా, మేము ఆకాశాలలో తొంగి చూడటానికి ప్రయత్నించినపుడు, మేము దానిని కఠినమైన కావలివారితో మరియు అగ్ని జ్వాలతో నిండి ఉండటాన్ని చూశాము. మరియు వాస్తవానికి పూర్వం అక్కడి మాటలు వినటానికి మేము రహస్యంగా అక్కడ కూర్చునేవారం. కాని ఇప్పుడు ఎవరైనా (రహస్యంగా) వినే ప్రయత్నం చేస్తే, అతడి కొరకు అక్కడ ఒక అగ్ని జ్వాల పొంచి ఉంటుంది.

**14. అల్-హుమ'జహ్** (104 : 1 - 9)

అపనిందలు మోపే, చాడీలు చెప్పే ప్రతీ ఒక్కడికీ వినాశం తప్పదు. ఎవడైతే ధనాన్ని కూడబెట్టి, మాటిమాటికి దాన్ని లెక్కబెడుతూ ఉంటాడో! తన ధనం తనను శాశ్వతంగా ఉంచుతుందని అతడు భావిస్తున్నాడు. ఎంతమాత్రం కాదు! అతడు (రాబోయే జీవితంలో) తప్పకుండా అణగ ద్రొక్కబడే నరకాగ్నిలో వేయబడతాడు. ఆ నరకాగ్ని అంటే ఏమిటో నీకు తెలుసా? అల్లాహ్, తీవ్రంగా ప్రజ్వలింపజేసిన అగ్ని, అది గుండెల దాకా చేరుకుంటుంది. నిశ్చయంగా, అది వారి మీద క్రమ్ముకుంటుంది పొడుగాటి (అగ్ని) స్తంభాల వలే!

**15. అల్ - ఇఖ్లాస్** (112 : 1 - 4)

చెప్పు : "ఆయనే అల్లాహ్!" ఒక్కడు. అల్లాహ్ ఎవరి అవసరం లేనివాడు. ఆయనకు సంతానం లేదు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాడు. మరియు ఆయనతో పోల్చదగినది ఏదీ లేదు.

**16. అల్ - ఫలఖ్** (113 : 1 - 5)

చెప్పు : "నేను ఉదయకాల ప్రభువు (అల్లాహ్) శరణు వేడుకుంటున్నాను. ఆయన సృష్టించిన ప్రతిదాని కీడు నుండి. మరియు చిమ్మచీకటి కీడు నుండి ఎప్పుడైతే అది కమ్ముకుంటుందో. మరియు ముడుల మీద మంత్రించి ఊదేవారి కీడు నుండి. మరియు అసూయపరుడి కీడు నుండి. ఎప్పుడైతే అతడు అసూయపడతాడో.

**17. అల్ - నాస్** (114 : 1 - 6)

చెప్పు : "నేను మానవుల ప్రభువును (అల్లాహ్‌ను) శరణుకై వేడు కుంటున్నాను. మానవుల సార్వభౌముడు మానవుల ఆరాధనకు అర్హుడు. కలతలు రేకెత్తించి తొలగిపోయేవాని కీడు నుండి, ఎవడైతే మానవుల హృదయాలలో కలతలు రేకెత్తిస్తాడో వాడు జిన్నులలోని వాడూ కావచ్చు లేదా మానవులలోని వాడూ కావచ్చు."

**మరికొంత భాగం ఇన్శా అల్లాహ్ వచ్చే సంచికలో ...**

## కొత్తగా చేరిన పాఠకులకు మా విన్నపం

మాకు ఉన్న పోస్టల్ లైసెన్స్ ప్రకారం ప్రతీ నెల 15వ తారీఖున శాంతిబాట పోస్ట్ చేయవలసి ఉంది. ఒకొక్కసారి కొన్ని వ్యాసాల పరిశోధన కొరకు ఎక్కువ సమయం అవసరమౌతుంది. సాంకేతిక సమస్యల వలన కూడా పత్రిక ఆలస్యం కావచ్చు.

**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 200/- పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**

**క్రింది ఎడ్రస్‌కు పంపండి.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440
మనియార్డర్ చేయగానే 9491103017కి ఫోన్ చేసి
తెలియజేయవలసిందిగా కోరుతున్నాము

**ఎక్కువ చందాలను పంపగోరువారు**
**క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**
SBI A/c No. 10428633092
Waltair, Visakhapatnam-530003
Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017
velugubaata@gmail.com
info@saanthibaata.net

**మొదటి సంవత్సరం సంచికలు**
(తొలి సంచిక ఆగష్టు 2009 మినహా)
**మరియు 2వ సంవత్సరం సంచికలు కావలిసిన వారు**
**రూ. 365/- మనియార్డర్ చేయగలరు.**

**కేవలం ఏదో ఒక ఆర్టికల్ మాత్రమే అవసరమైతే**
**మా వెబ్‌సైట్ www.saanthibaata.net నుండి**
**ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**

మీ కవర్‌పై ఉండే ఎడ్రస్ స్లిప్‌పై మీ ఫోన్ నంబర్ లేకపోయినా లేక మీ నంబర్ మారినా ఆ నంబర్‌ను వెంటనే మాకు తెలియజేయండి.

# షిజోఫ్రినియా

SCHIZOPHRENIA

## వైద్య నిపుణునిచే నయం కాదగిన ఓ మానసిక వ్యాధి

**డేనియల్ అనే ఓ యువకుని వయస్సు 21 సంవత్సరాలు. 6 నెలల క్రితం వరకూ అతడు కాలేజీలో బాగా చదువుకుంటూ ఉండేవాడు మరియు ఆ ప్రాంతంలో ఉండే ఓ ఎలక్ట్రానిక్స్ షాప్‌లో పార్ట్-టైమ్ ఉద్యోగం కూడా చేస్తుండేవాడు. కాని ఆ తరువాత అతనిలో మార్పులు రావడం మొదలైంది. ఉన్మాదం అతనిలో పెరుగుతుంది మరియు వెర్రిపనుల ద్వారా ఆ విషయం బయటకు మెల్లగా తెలుస్తుంది. తన ప్రొఫెసర్లు పట్టుకోవడానికి తన వెంట బడుతున్నారని నమ్మాడు. ఎందుకంటే ఇతని క్లాస్‌రూమ్‌లో ఇతని వింత ప్రవర్తనను వారు ప్రశంసించేవారు కాదు. తరువాత తన తోటి విద్యార్థియైన ఒకరితో ఇతర విద్యార్థులు తనపై కుట్రపన్నారని చెప్పాడు. కొన్నాళ్ళకు కాలేజీ మానేశాడు.**

ఇక అక్కడి నుండి అతని పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిపోయింది. డేనియల్ స్నానం చేయడం మానివేశాడు. గడ్డం చేసుకోవడంగాని, బట్టలు ఉతుక్కోవడం వంటివి కూడా మానేశాడు. పనిచేసే చోట, తన యజమాని అక్కడి టెలివిజన్ సెట్లలో తనను గమనించడానికి ఏవో బగ్స్ ఏర్పాటు చేశాడని తనను తాను నమ్మించుకున్నాడు. ఆ టెలివిజన్ సెట్లలో ఏర్పాటు చేసిన బగ్స్‌ని కనిపెట్టమని, వాటిని పనిచేయకుండా చేయాలని ఏవో మాటలు వినబడుతున్న భ్రమ కలిగింది. నిజానికి బయట నుండి ఏ శబ్దాలు వినబడటం లేదు. ఇక అటువంటి ఓ పరిస్థితిలో అక్కడ ఉన్న చాలా టి.వి.లను నాశనం చేసేసి, ఇంకెప్పుడూ అధర్మమైన గూఢచర్యం ఇక్కడ ఉంచను అంటూ అరుస్తూ వెళ్ళిపోయాడు. తీవ్రంగా భయపడిపోయిన అతని యజమాని పోలీసులను పిలిచాడు. వారు అతనిని హాస్పిటల్‌లో జాయిన్ చేశారు.

ఆరోగ్యంగా ఉండే ఆ యువకుడు ఆ విధంగా ఉన్మాదిగా మారిపోవడానికి కారణం మనస్సుకు కలిగిన అనారోగ్యం. ఆ అనారోగ్యం పేరే - **షిజోఫ్రినియా**. ఇటువంటి వాటిని నేడు సైక్రియాట్రిస్ట్‌లు నయం చేయగలుగుతున్నారు.

### షిజోఫ్రినియా అంటే ఏమిటి?

ఇది మెదడుకు కలిగిన అనారోగ్యం. ఈ అనారోగ్యం మనిషి చేసే పనులపై, ఆలోచనలపై మరియు ప్రపంచాన్ని చూచే అతని విధానంపై ప్రభావం చూపుతుంది. ఏదైనా వస్తువు ఒకచోట ఉంటే, ఆ వస్తువు అక్కడ ఉందనే వాస్తవం ఆరోగ్యంగా ఉండే వ్యక్తి గ్రహిస్తాడు. కాని వీరి గ్రహణశక్తిలో మార్పు వస్తుంది. లేనిదానిని ఉన్నట్లుగా భావిస్తారు. ఉనికిలో లేనివాటిని చూస్తున్నట్లు, మరియు వింటున్నట్లు భావిస్తూ ఉంటారు.

చాలా వింతగానూ అయోమయంగానూ మాట్లాడుతుంటారు. ఎవరో తమకు హాని చేయడానికి ప్రయత్నిస్తున్నారని భావిస్తారు లేకపోతే ఎవరో తమను గమనిస్తున్నారని భావిస్తారు. నిజానికి మరియు కల్పితానికి మధ్య ఉండే బేధాన్ని తెలుసుకోవడం వీరికి చాలా కష్టమై పోతుంది. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెంచుకుని, అయోమయంతో భయంతో బ్రతుకుతారు.

ఈ అనారోగ్యం సాధారణంగా టీనేజీ వయస్సు చివరిలో కనిపిస్తూ ఉంటుంది. అది ఉన్నప్పటికీ ఒకొక్కసారి మధ్య వయస్సులో మొదటిసారిగా కనిపించవచ్చు లేదా ఆ తరువాత కాలంలో ఎప్పుడైనా బయటపడవచ్చు. అరుదుగా చిన్నతనంలో కూడా కనిపించవచ్చు. షిజోఫ్రినియా స్త్రీలలో కంటే, పురుషులలో మరింత తీవ్రంగా ఉంటుంది.

కాని ముందుగా జాగ్రత్తపడి వైద్యం చేయించ గలిగితే, మన ఆత్మీయులు మామూలు జీవితం గడిపే అవకాశం ఉంది.

### షిజోఫ్రినియా యొక్క సూచనలు మరియు వ్యాధి లక్షణాలు :

ఐదు రకాల వ్యాధి లక్షణాలు షిజోఫ్రినియా యొక్క లక్షణంగా చెప్పుకోవచ్చు.

1. Delusions
2. Hallucinations
3. Disorganized speech
4. Disorganized behaviour
5. "Negative" symptoms

అయితే షిజోఫ్రినియా ఉన్న ప్రతీ ఒక్కరికీ ఈ ఐదు లక్షణాలు ఉండవలసిన అవసరం లేదు. ఈ వ్యాధి అందరిలోనూ ఒకేలా ఉండక పోవచ్చు. మనిషి నుండి మనిషికి మారుతూ ఉంటుంది. వ్యాధి తీవ్రతలోగాని లేదా పాటర్న్‌లోగాని తేడాలుండవచ్చు. అంతేకాకుండా ఈ వ్యాధి లక్షణాలు కాలంతో పాటు మారే అవకాశం కూడా ఉంది.

### 1. DELUSIONS (మతి భ్రమణం ద్వారా ఏర్పడే తప్పుడు అభిప్రాయాలు)

షిజోఫ్రినియాలో చాలా సాధారణమైనది ఈ **డెల్యూజన్**. ఈ అనారోగ్యం కలిగి ఉన్న 90శాతం కంటే ఎక్కువ మందిలో భ్రమపడటం గమనించవచ్చు. తరచుగా ఈ భ్రాంతి తర్కం లేనిదిగా, వెర్రి భావనలతో నిండినదిగా లేక అసందర్భమైన ఊహలతో నిండినదిగా గమనించవచ్చు. ఈ భ్రమలలో సాధారణంగా చెప్పగలిగినవి నాలుగు రకాలు :

- **Delusion of persecution (వేదనతో కూడిన భ్రాంతి)** :

తనపై ఎవరో కుట్ర పన్నారని మొదలైన విధంగా భావిస్తుంటారు. ఉదాహరణకు : తన కుళాయి నీళ్ళలో ఎవరో రేడియోధార్మిక పదార్థాలు కలిపి విషపూరితం చేసి చంపాలను కుంటున్నారని భ్రమపడటం వంటివి.

- **Delusion of reference (సాధారణమైన విషయాలే అయినప్పటికీ, అవి తమ గురించేనని భ్రమకు లోనవడం)**

ఉదాహరణకు రోడ్డు ప్రక్కనుండే బిల్‌బోర్డ్ తన కోసమే ఏర్పాటు చేసారని లేదా టీవీలో మాట్లాడే వ్యక్తి తన గురించే మాట్లాడుతున్నాడని భావించడం మొదలైనవి.

- **Delusion of grandeur (మహత్యాన్ని కలిగి ఉన్నాననే భ్రమ)**

తనకు తాను స్వయంగా ప్రముఖ వ్యక్తిగా భ్రమపడతాడు. తననే దేవుడుగా భావించు కోవచ్చు. తనకు అసాధారణమైన శక్తులున్నాయని, గాలిలో ఎగరగలడని భావిస్తాడు. కొన్ని రోజుల క్రితం ఇటువంటి ఓ వ్యక్తి మా శాంతిబాట ఆఫీస్‌కి ఓ పుస్తకం, కొన్ని పాంప్లెట్స్ పట్టుకుని వచ్చాడు. ఓ పాంప్లెట్ ఇచ్చి 2 నిమిషాలు మాట్లాడతానన్నాడు. సరే, లోపలికి పిలిచి కూర్చుని చెప్పమంటే, ఇలా చెప్పాడు "నాతో దైవం సంభాషించాడు." ప్రవక్తతో సంభాషిస్తాడు గాని సాధారణ మానవులకు ఆ అవకాశం ఉంటుందని అనుకుంటున్నారా? అని అడిగితే "నేను ప్రవక్తను. సత్య ప్రవక్తను" అంటూ సమాధానమిచ్చాడు. చనిపోయిన వాడిని తిరిగి లేపుతాను అని చెప్పాడు. అతని విషయం అర్థం కావడంతో నెమ్మదిగా పంపించేయడం జరిగింది.

- **Delusion of control (ఎవరో నియంత్రిస్తున్నారనే భ్రమ)**

అంటే అతడి ఆలోచనలను లేక చేసే పనులను బయట నుండి ఎవరో నియంత్రిస్తున్నారని, ఇతర గ్రహవాసులు ఆ పని చేస్తున్నారని భ్రమిస్తాడు. ఎవరికీ చెప్పని తమ ఆలోచనలు ఇతరులకు చేరి పోతున్నాయని (thought broadcasting) లేక ఎవరో ఆలోచనలను తమ మెదడులో నాటుతున్నారని (thought insertion) లేక తమ ఆలోచనలను ఎవరో దొంగిలిస్తున్నారని (thought withdrawl) భ్రమపడతారు.

**2. HALLUCINATIONS (లేనివి ఉన్నట్లుగా భ్రమించడం)**

ఇది ఇంద్రియాలన్నింటికీ సంబంధించినదే అయినప్పటికీ, బాగా సాధారణమైన హాలూసినేషన్స్ వినికిడికి సంబంధించినవి. అంటే ఎవరో మాట్లాడుతున్నట్లు వినబడటం లేక ఏవో శబ్దాలు వినబడటం. దృష్టికి సంబంధించినవి కూడా ఉంటాయి. తన లోలోపల అనుకునేవి కూడా బయటనుండి ఎవరో తమతో మాట్లాడుతున్నట్లుగా భ్రమపడతారు.

వాటిని భ్రమగా అనుకోరు. అవి నిజమనుకుంటారు. చాలాసార్లు ఆ మాటలు తనకు తెలిసిన వ్యక్తికి సంబంధించిన కంఠస్వరంగా భావిస్తారు. ఈ కంఠ స్వరాలు ఎలా ఉంటాయంటే, సంక్లిష్టంగా ఉండవచ్చు లేక అశ్లీలంగా ఉండవచ్చు లేక అబ్యూసివ్‌గా ఉండవచ్చు.

అయితే ఈ వ్యాధి ఉన్న వ్యక్తి ఒంటరిగా ఉన్నప్పుడు, ఇవి మరింత అధ్వాన్నంగా తయారౌతాయి. కాబట్టి ఇటువంటి వారిని ఒంటరిగా వదల కూడదు.

**3. DISORGANISED SPEECH (ప్రసంగం తారుమారుగా ఉంటుంది)**

అసంపూర్ణంగా ముక్కలు ముక్కలుగా ఆలోచించడం ఈ అనారోగ్యం యొక్క మరో లక్షణం. వినేవారు ఆ విషయం గమనించ గలుగుతారు. మామూలుగా ఆలోచించడం గాని, ఒకే విషయంపై కేంద్రీకరించడం గాని వారికి కష్టంగా ఉంటుంది. మనమేమైనా అడిగితే సంబంధంలేని సమాధానాలు చెబుతారు. ఒక విషయంతో వాక్యం మొదలుపెట్టి వేరే దానితో ముగిస్తారు. తర్కం లేనివి చెబుతుంటారు, అసంబద్ధంగా మాట్లాడుతారు.

**సాధారణ సూచనలు :**

1. వారు మాట్లాడుతున్నప్పుడు, చాలా వేగంగా ఒక విషయం నుండి మరో విషయానికి మారిపోతూ ఉంటారు. ఒక ఆలోచనకి మరో ఆలోచనకు సంబంధాలుండవు.
2. వారే స్వయంగా కొన్ని పదాలు తయారు చేసుకుంటారు. వాటి అర్థం ఆ రోగికి మాత్రమే అర్థమౌతుంది.
3. ఒకే రకమైన పదాలు లేక వాక్యాలు పదేపదే చెబుతుంటారు.
4. వారు ఒకే శబ్దంతో ముగించే రైమింగ్ పదాలు కూడా వాడతారు. కాని వాటికి ఎటువంటి అర్థం ఉండదు. ఉదా : (ఇంగ్లీష్‌లో) ("I said the bread and read the shed and fed Ned at the head")

**4. DISORGANISED BEHAVIOUR (ప్రవర్తన తారుమారుగా ఉండటం)**


- రోజువారీ పనులు చేసుకోవడంలో క్షీణత
- ఊహించని బావోద్వేగంతో స్పందించడం
- వెర్రి ప్రవర్తనలు
- పనులు చేయడానికి వెనుకాడటం

ఈ షిజోఫ్రినియా అనే మానసిక అనారోగ్యానికి సంబంధించి మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు వచ్చే సంచికలో, ఇన్షా అల్లాహ్ ...

(**గమనిక :** ఈ ఆనారోగ్యాన్ని సైక్రియాట్రిస్ట్ నయం చేయగలుగుతారు, ఇన్షాఅల్లాహ్! మనకు జ్వరం లేదా జలుబు, దగ్గు వచ్చినప్పుడు ఏ విధంగా డాక్టర్‌ని సంప్రదిస్తామో అదే విధంగా చిన్న చిన్న మానసిక సమస్యల విషయంలో మానసిక వైద్యనిపుణుడిని కూడా సంప్రదించాలి. సైక్రియాట్రిస్ట్ దగ్గరికి వెళ్ళడానికి సిగ్గుపడ నవసరం లేదు. పిచ్చి ఉన్నవారే అతని దగ్గరికి వెళ్ళాలనుకోవడం సరియైనది కాదు.)

**ఈ శీర్షికలో మానసిక వైద్యంపై అందించే సమాచారం పాఠకులలో అవగాహన కల్పించడానికి మాత్రమే.** వ్యాధి తీవ్రత మరియు ఇతర పరిస్థితులను బట్టి వైద్య నిపుణులు మిగిలిన వివరాలు చెబుతారు.

ఒకొక్కసారి నడుము నొప్పి వస్తే, కిడ్నీలో రాళ్ళు ఉండవచ్చని అనుమానంతో డాక్టర్‌గారి దగ్గరికి వెళతాము. డాక్టర్‌గారు పరీక్షలు చేశాక, దానివలన కాదని చెప్పి, సాధారణ నొప్పి మాత్రమేనని చెప్పి పంపవచ్చు. అదే విధంగా మీకు ఏదైనా అనుమానంగా అనిపిస్తే సైక్రియాట్రిస్ట్‌ని సంప్రదించవచ్చు. ఒకవేళ ఎటువంటి సమస్య లేకపోతే, ఆ విషయం డాక్టర్‌గారే చెబుతారు.




**వాస్తవానికి సైన్స్ అంటే విజ్ఞానం. కాని సైన్స్ అంటే అందరికీ వెంటనే గుర్తుకు వచ్చేవి ప్రయోగాలు, ప్రయోగశాలలు. కాబట్టి ప్రజలలో ప్రస్తుతం ఏ అర్థమయితే పాతుకుపోయిందో ఆ సైన్స్ పదానికి మరియు ధర్మానికి సంబంధించిన విషయాలు ఈ వ్యాసంలో చర్చించబడ్డాయి.**

తొలి మనిషి ఈ భూమిపై అడుగుపెట్టి నప్పటినుండీ సైన్స్ ఉంది. చేతులు, కాళ్ళు కడుక్కుని భోజనం చేయడం వేల సంవత్సరాల నుండి ఆచరణలో ఉంది. కాని అప్పటివారికి బాక్టీరియా గురించి తెలియదు. ప్రవక్తలు తమ ప్రజలకు శుచి, శుభ్రత నేర్పారు. పర్సనల్ హైజీన్ గురించి బోధించారు. ఇది సైన్స్ కాక మరేమిటి? వారికి జ్ఞానముంది. ఆ జ్ఞానం ద్వారా వారు పొందిన వివేకాన్ని సైన్స్ ద్వారా నేడు స్పష్టంగా కొంత వరకైనా తెలుసుకో గలుగుతున్నాము. వారు చేసే పనులలోనే అంతర్లీనంగా సైన్స్ ఉండేది. తాము చేసే పనులలో సైన్స్ ఉందని వారికి తెలియక పోవచ్చు. అయినప్పటికీ అది సైన్సే కదా!

సైన్స్ అభివృద్ధి చెందుతూ ఉంది. మనిషి పుట్టి లక్షల సంవత్సరాలు దాటినా సరే తెలుసుకున్నవి చాలా తక్కువ. కాబట్టి సైన్స్‌కు అందని ప్రతీ విషయమూ మూఢనమ్మకం కాదు. బురదలో ఆడుకోవద్దని చిన్నారులకి చెబుతాము. కాని ఎందుకు ఆడుకోకూడదో ఆ చిన్నారులకి అప్పటికి అర్థం కాకపోయినా, వారు పెద్దవారయ్యాక అర్థం అవుతుంది. అర్థం కాని ప్రతీ విషయాన్ని అవివేకంగా కొట్టి పారేయడం సరికాదు.

## సైన్స్‌పై అవగాహన లేకపోయినా ... విశ్వాసం

మారుమూల పల్లెటూర్లలో జీవించే ఓ వృద్ధురాలు ఆరోగ్యం బాగుండకపోతే డాక్టర్ దగ్గరకు వెళ్ళి చూపించుకున్నప్పుడు, డాక్టరు గారు మాత్రలు వాడమని ఇస్తారు. ఆ మాత్రలు ఏ విధంగా తయారు అయ్యాయో, వాటి రసాయనిక ఫార్ములా ఏమిటో మరియు అందులో నిమిడియున్న సైన్స్ ఏమిటో ఆ వృద్ధురాలికి అవసరం లేదు. ఒకవేళ వివరంగా చెప్పినా కూడా ఆ వృద్ధురాలికి వాటి గురించి అర్థం కాదు. ఆమెకు కావలసింది ఆ మాత్రలు ఏయే సమయాలలో వేసుకోవాలో మరియు ఎన్ని వేసుకోవాలో తెలిస్తే చాలు. **డాక్టర్ సలహా పాటించే ఆ వృద్ధురాలిది మూఢనమ్మకమా? లేక విజ్ఞానమా?**

## సైన్స్‌కు మంచీ మరియు చెడు తెలియదు

సైన్స్ అండ్ టెక్నాలజీ ఉపయోగించి ఓ ఆయుధాన్ని తయారుచేస్తే, ఆ ఆయుధాన్ని ఎవరు ఉపయోగించినా, అది ఒకే విధంగా పనిచేస్తుంది. దానికి మంచీ చెడు తెలియదు. మంచివాడినీ చంపుతుంది మరియు చెడ్డవాడిని కూడా చంపుతుంది. అంటే ధర్మంగా బ్రతికేవాని చేతిలో ధర్మం నిలబెట్టడానికి ఉపయోగపడితే, దుర్మార్గుని చేతిలో అదే ఆయుధం అధర్మానికి ఉపయోగపడుతుంది. మంచీ మరియు చెడును నిర్ధారించేది కేవలం ధర్మం మాత్రమే, సైన్స్ కాదు.

కాబట్టి సైన్స్ యొక్క ఫలాలు ప్రజలకు మేలు చేయాలంటే, సైన్స్‌కి ధర్మం యొక్క అవసరం తప్పనిసరిగా ఉంది. అందుకనే ఇప్పుడు ఎథిక్స్ అని ప్రత్యేకంగా ఓ సబ్జక్టును ప్రతీ రంగంలో ఏర్పాటు చేసుకుంటున్నారు. ఉదాహరణకు బిజినెస్ ఎథిక్స్, మెడికల్ ఎథిక్స్ మొదలైనవి. మన డాక్టర్లకు 'ఇండియన్ మెడికల్ అసోసియేషన్' అనే ఓ అసోసియేషన్ ఉంది. తమలో ఎవరికైనా అన్యాయం జరిగితే వారంతా ఐకమత్యంతో ఆ అసోసియేషన్ తరపున న్యాయం కోసం పోరాడుతారు. మరలా ఇక్కడ న్యాయం మరియు అన్యాయం అనే పదాలు వచ్చాయి. ఇవి ధర్మానికి సంబంధించినవి. సైన్స్‌కి ఏ మాత్రం సంబంధం లేనివి.

నేడు అధునాతన టెక్నాలజీ ఉపయోగించి కట్టే వంతెనలు కూలుతున్నాయి. కాని మన గోదావరి నది మీద రాజమండ్రి దగ్గర పాత వంతెన బ్రిటిష్ వారి కాలంలో నిర్మించబడింది. దాని నాణ్యత ఎందరిచేతో ప్రశంసించ బడింది. అప్పటి కాలం కంటే ఎన్నో రెట్లు టెక్నాలజీ నేడు అభివృద్ధి చెందింది. కాని ఇప్పుడు నాణ్యతలో లోపం ఎందుకు వస్తుంది? దానికి కారణం సైన్స్ కాదు. **కేవలం మనిషి స్వార్థమే!** ఇటువంటి లక్షణాలను కంట్రోల్ చేయగలిగేది **ధర్మం మాత్రమే.**

మనల్ని సృష్టించిన సృష్టికర్త ఏర్పాటు చేసిన ధర్మశాస్త్రాన్ని మూఢ నమ్మకంగా కొట్టిపారేస్తున్నారు. కాని ఆ విధంగా కొట్టిపారేసేవారే లోప భూయిష్టమైన న్యాయవ్యవస్థను చూసి నాగరికం అనుకుంటున్నారు.

**మృగంగా బ్రతికేవాడిని కూడా ధార్మిక జ్ఞానం ఓ మనిషిగా మార్చగలదు. అందుకొరకు సైన్స్ అవసరం లేదు. కాని ధార్మిక అంశం లేని సైన్స్ మనిషిని కూడా మృగంగా మార్చగలదు.**

కాబట్టి ప్రతీవ్యక్తికి ధార్మికజ్ఞానం కావాలి. ఆ జ్ఞానం కొరకు ప్రత్యేకంగా నేడు ఉనికిలో ఉన్నటువంటి మదరసాలలోనే చదువుకోవలసిన

అవసరం లేదు. నాటి మదరసాలలో ధార్మిక జ్ఞానంతో పాటు, ఆల్జీబ్రా, ట్రిగొనోమెట్రీ, మెడిసిన్, ఇంజనీరింగ్ సబ్జక్టులు కూడా బోధించేవారు. కాబట్టి వందల సంవత్సరాల తరువాత నేడు మదరసాలు ఇంకా బాగా అభివృద్ధి చెంది గొప్ప యూనివర్శిటీలుగా మారిపోయి ఉండాలి. కాని అలా కావడానికి బదులు కేవలం సలాత్ (నమాజ్) చేయించే ఇమామ్లను మాత్రమే తయారుచేసే స్థాయికి దిగజారి పోయాయి.

ఈ రోజుల్లో కొన్ని స్కూళ్ళలో అయితే ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ కూడా బోధిస్తున్నారు. అంతసేపు రోజూ నిజంగా, సవ్యంగా పాఠాలు చెబితే, 3 నెలలలోనే పాఠాలు అన్నీ పూర్తి అయిపోతాయి. నేటి విద్యావిధానం బాగుండలేదు. బాలకార్మికుని కంటే ఘోరమైన భారం ఇప్పటి బాలలు మోస్తున్నారు. మానసికంగా కూడా వారిపై ఎంతో ఒత్తిడి ఉంది.

రోజుకి కనీసం రెండు గంటలు ఇతర సబ్జక్టులతో పాటు ధర్మం గురించి కూడా చెబితే, విద్యార్థి 10వ తరగతికి వచ్చేసరికి, జీవితానికి అవసరమయ్యే కనీస ధర్మావగాహనను కలిగి ఉంటాడు. అది సమాజానికి ఎంతో మేలు చేస్తుంది.

అందరికీ ధర్మంపై కనీస అవగాహన ఉంటే, ధర్మం పేరుతో మోసాలు చేసే ప్రబుద్ధులు సమాజంలో ఉండరు. జమాత్ల మధ్య ఐక్యత నెలకొంటుంది. **ధర్మ ప్రచారం పేరుతో ప్రజల ఐక్యతను పాడుచేసే అజ్ఞాన ప్రచారకుల బెడద కూడా ప్రజలకు తప్పుతుంది.** ప్రజల మధ్య మానవత్వం మరియు ప్రశాంతత నెలకొంటాయి.

## శాంతిబాటలో సైన్స్ వ్యాసాల ఉద్దేశ్యం

శాంతిబాట ప్రారంభ సంచికలో మరియు ఆ తరువాత వచ్చిన కొన్ని సంచికలలో ఖుర్ఆన్ మరియు ఆధునిక సైన్స్ గురించి వ్యాసాలెన్నింటినో అందించాము. వాటి ఉద్దేశ్యమేమిటంటే, నేటి ఆధునిక సైన్స్కు పునాదులు వేసినవారు ముస్లిమ్ శాస్త్రవేత్తలే అనే విషయాన్ని ముఖ్యంగా నేటి ముస్లిములు స్పష్టంగా తెలుసుకోవాలని.

ఎందుకంటే బయట జరుగుచున్న ప్రచారం ఈ వాస్తవానికి భిన్నంగా ఉంది. ఖుర్ఆన్ను అనుసరించేవారు సైన్స్కు వ్యతిరేకమని, ప్రాపంచిక చదువుకు వ్యతిరేకమని, స్త్రీలను చదవనివ్వరని మొదలైన ఎన్నో అపోహలను కలుగజేశారు. చాలామంది ముస్లిములు నిజం తెలుసుకోక, ఆ అపోహలనే నిజమని నమ్ముతున్నారు. అందుకని వాస్తవాలు చెప్పి ముస్లిముల కళ్ళు తెరిపించాలని, ఆ వ్యాసాలు అందించడం జరిగింది.

అంతేకాకుండా ముస్లిమ్ శాస్త్రవేత్తలు కనిపెట్టిన లేదా అభివృద్ధి చేసిన ఎన్నో సబ్జక్టులనుగాని లేదా పరికరాలనుగాని ఇతరులు చేసినట్లు పాఠ్యపుస్తకాలలో చెప్పడాన్ని గమనించి ఆ విషయాలు తప్పు అని వివరించడమే కాకుండా వాస్తవంగా వాటిని కనుగొన్న వారి పేరుతో సహా బాలబాలికల ప్రత్యేక శీర్షికలో ప్రారంభ సంచిక నుండి చాలా వ్యాసాలలో తెలియజేయడం జరిగింది.

ప్రపంచంలో ఒకొక్కసారి ఒకొక్క ప్రాంతం శాస్త్ర విజ్ఞానంలో ముందంజలో ఉండటాన్ని గమనించవచ్చు. ఒకప్పుడు ఎలక్ట్రానిక్స్లో జపాన్ తొలి స్థానంలో ఉండేది. ఇప్పుడు పోటీ పెరిగింది. కష్టపడి సైన్స్ను అభివృద్ధి చేసిన దేశాలలో, దాని ద్వారా ఐశ్వర్యం పెరిగాక, కష్టపడి చదవడం మాని అక్కడి ప్రజలు విలాసాలకు అలవాటు పడితే, ఆ దేశం మరలా క్రిందికి పడిపోవచ్చు.

**సమాజమంతా చదువుకోవాలంటే ...**

స్త్రీ చదువుకుంటే సమాజమంతా చదువుకున్నట్లేనని ముహమ్మద్(స) వారి బోధనను అనుసరించి ఆ రోజు విద్యకు అత్యున్నత ప్రాధాన్యత నిచ్చారు ముస్లిములు. నేటి ముస్లిముల వెనుకబాటుతనానికి గల కారణం, వారు ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలకు దూరం కావడమే! ఖుర్ఆన్, సున్నత్లకు దూరంగా ఉండేవారు ముస్లిములుగా చెలామణి అవుతూ వెనుకబడితే, దానికి కారణం 'ఇస్లామ్' ఎలా అవుతుందో!

## ముహమ్మద్(స)వారిపై విశ్వాసం

ప్రవక్త(స)వారు ఒక విషయం చెబితే చాలు, ఎటువంటి అనుమానాలు లేకుండా **మోమిన్లు** దానిని విశ్వసించి అమలుపరిచేవారు. ఉదాహరణకు క్రింది హదీస్ చూడండి :

ముజాహిద్ నుండి మన్సూర్ ఉల్లేఖించారు. ఉసైద్ బిన్ జుహైర్ చెప్పారు : రాఫి'అ బిన్ ఖదీజ్ మా దగ్గరికి వచ్చి చెప్పారు : రసూలుల్లాహ్(స) **మీకు మేలు కలిగించే దాని నుండి మిమ్మల్ని నిరోధించారు. కాని అల్లాహ్కు విధేయత మరియు అల్లాహ్ యొక్క సందేశహరునికి విధేయత చూపడం మీకు ఇంకా ఎక్కువ మేలైనది.** రసూలుల్లాహ్(స)వారు పంట దిగుబడిలోని వాటా కొరకు భూమిని అద్దెకివ్వడాన్ని నిరోధించారు. ఆయన అన్నారు : ఎవరికైతే తన భూమి అవసరం లేదో, దానిని అతని సోదరునికి ఇవ్వనీయండి లేకపోతే దానిని అలాగే వదిలెయ్యాలి. (అబూదావూద్ - సహీహ్, 3398, పుస్త. 22, అధ్యా.31, సంపుటి 4)

అంటే వారు మేలుగా భావించేదాని కంటే, అల్లాహ్కు మరియు ఆయన సందేశహరునికి చూపే విధేయతే ఎంతో మేలు అని భావించేవారు. **అదే విశ్వాసం.**

పంట ఉత్పత్తిని భూయజమాని మరియు కౌలుదారుడికి మధ్య పంచడంలో ఏదో ఒక సంవత్సరం లేదా రెండు సంవత్సరాల లెక్కలు పరిగణనలోకి తీసుకుంటే సరిపోదు. దీర్ఘకాలిక స్టాటిస్టిక్స్ తీసుకుంటే ప్రవక్త(స)వారు బోధనలో ఉన్న వివేకం బోధపడవచ్చు లేదా దానిలో మనకు ఊహకందని మరొక మేలు ఏదైనా భవిష్యత్తులో తెలియవచ్చు.

ఉదాహరణకు మేనమామను ఓ స్త్రీ వివాహమాడితే, అంగవైకల్యంతో పిల్లలు పుట్టడాన్ని గమనిస్తున్నాము. ఆ అంగవైకల్యానికి కారణం మేనరికం అని నేడు సైన్స్ చెబుతుంది. కాని దాదాపు 1400 సంవత్సరాల

క్రితమే ఇస్లామ్ మేనరికం వివాహాలను నిషేధించింది. మేనరికపు వివాహాలు ఎందుకు చేసుకోకూడదు అని అప్పటి ప్రజలు ముహమ్మద్(స)వారిని ప్రశ్నించలేదు. అది తమకు మేలు అని భావించారు. **అది ఆయనపైగల విశ్వాసం.** అంతేకాకుండా అతి పురాతనమైన అరబీ భాషలో ఓ రెండు అక్షరాల పదం యొక్క అర్థం ఏమిటంటే "మేనరికపు వివాహాల వలన బలహీనమైన పిల్లలు పుట్టడం." అంటే నేటి ఆధునిక సైన్స్ కనుగొన్న విషయం గురించి ఏనాడో అరేబియాలోని ప్రజలకు తెలుసు. కాబట్టి సైన్స్ ధర్మాచరణలో అంతర్లీనంగా వస్తూనే ఉందనే విషయం విశ్వసించాలి.

## విశ్వసించడానికి ఆధారాలు కావాలా?

ప్రతీ విశ్వాసానికి ఆధారాల యొక్క అవసరం లేదు. ఒక వ్యక్తి మాకు ఫోన్ చేసి ఖుర్ఆన్ గ్రంథంలో ఈసా(అ)వారికి శిలువ వేయలేదని చెప్పడం జరిగిందని, ఆ విషయంపై చాలా ఘాటుగా ప్రశ్నించాడు. ఖుర్ఆన్ అనేది అల్లాహ్ యొక్క ప్రసంగం. దానిలో మాకెటువంటి సందేహం లేదు.

**శాంతిబాట టీమ్ ఎల్లప్పుడూ ముహమ్మద్(స)వారి బోధనలకు అత్యంత విలువ ఇస్తుంది.** ఇతర గ్రంథాలలోని విషయాలను నిజమనిగాని, అబద్ధమనిగాని అనవద్దని ముహమ్మద్(స)వారు స్పష్టంగా ఆదేశించారు. ఆ ఆదేశం ప్రకారం మేము ఇతర ధర్మాలవారి విషయంపై ఎటువంటి వ్యాఖ్యానం చెయ్యము అని మా పాఠకులకు బాగా తెలిసిన విషయమే! అయినాసరే, మమ్మల్ని ఇటువంటి ప్రశ్నలు వేస్తే, ఖుర్ఆన్‌పై అనుమానం కలుగుతుందేమోననే ఆశ వారిది. నిజానికి ఖుర్ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదివిన వారికి, ఈ గ్రంథంపై ఏ చిన్న అవమానమూ రాదు. కాని ఇంకా తెలుసుకోవాలనే ఆసక్తి బాగా పెరుగుతుంది. అంతే కాకుండా ఈ విధంగా ప్రశ్నించేవారు ప్రజలను అయోమయంలో పడవేయాలని చూస్తారు. ఆ విధంగా చేసే ప్రయత్నంలో వారికి ఖుర్ఆన్ పట్ల విశ్వాసం లేదనే విషయాన్ని పరోక్షంగా మనకు తెలియజేస్తున్నారనే విషయం వారు గమనించ లేకపోతున్నారు.

ఇక్కడ ఆ వ్యక్తి అడిగిన ప్రశ్న ఇతర గ్రంథానికి సంబంధించినది కాదు. ఖుర్ఆన్ గ్రంథంలో ప్రస్తావించబడిన ఓ విషయం గురించి. ఆ కారణం చేతనే ఆ ప్రశ్నకు ఇలా సమాధానం చెప్పడం జరిగింది :

**''ఖుర్ఆన్‌లో చెప్పబడింది కనుక శిలువ వేయలేదని మేము విశ్వసిస్తున్నాము''**

**"గుడ్డిగా ఎలా నమ్మేస్తారు మీరు?"** అని తిరిగి ప్రశ్నించాడు.

"విశ్వాసాలు ఆ విధంగానే ఉంటాయి. ఎందుకంటే మూసా(అ)వారు సముద్రాన్ని రెండుగా చీల్చారని మేము విశ్వసిస్తున్నాము. ఎందుకంటే ఆ విషయం ఖుర్ఆన్‌లో చెప్పబడింది. ఆ విధంగా సముద్రం చీల్చబడినప్పుడు మేము అక్కడ లేము. **ఖుర్ఆన్‌ను ఆధారంగా తీసుకోకుండా, అది జరిగిందని ఎవరైనా ఆ చారిత్రక సంఘటనను నిరూపించ గలరా?"** అని ఆ సోదరుడిని ఎదురు ప్రశ్నించడం జరిగింది.

ఆ సోదరుడు "గుడ్డి నమ్మకం" అన్నాడు. కాబట్టి చెబుతున్నాము, మాది గుడ్డి నమ్మకం కాదు. **మాది సంపూర్ణ విశ్వాసం.** స్వర్గం, నరకం ఉన్నాయని విశ్వసిస్తున్నాము. అల్లాహ్‌యే సృష్టికర్త అని విశ్వసిస్తున్నాము. ఇవన్నీ కళ్ళతో చూడకపోయినా మేము విశ్వసించాము. మన వీపుపై ఏదైనా పురుగు ప్రాకుతుంటే స్పష్టంగా ఏదో ప్రాకుతుందని మనకు తెలుస్తుంది. కాని అది మన కళ్ళతో చూసి చెప్పామా? లేదు కదా! అదే విధంగా మనిషి కుండే జ్ఞాన పరిధిని బట్టి, ఆ జ్ఞానానికి తగ్గ స్థాయిలోనే విశ్వాసం ఉంటుంది. అది ఆ జ్ఞానానికి అర్థం అవుతుంది.

ఎవరితోనైనా **"మీ తల్లిదండ్రులు ఎవరు?"** అని అడిగితే వారు చూపుతారు లేదా వారి పేర్లు చెబుతారు. కాని వారిద్దరూ అతని తల్లిదండ్రులేనని ఆ వ్యక్తికి ఎలా తెలుసు? **పుడుతున్నప్పుడు చూశాడా?** ఒకవేళ చూసినా సరే, ఆమె తన తల్లి అని అర్థం చేసుకో గలదా ప్రసవించ బడిన ఆ శిశువు? అదే విధంగా ఆ బిడ్డకు తండ్రి ఎవరనేది కూడా ఎవరైనా చెబితేనే తెలుస్తుంది. మరి ప్రపంచంలో నివశిస్తున్న ఇన్ని వందల కోట్ల మందిలో ప్రతీ ఒక్కరూ, డి.ఎన్.ఏ. పరీక్ష చేయించుకుని, ఆ పరీక్ష ద్వారా నిరూపించబడిన తర్వాత మాత్రమే వారిని **తమ తల్లిదండ్రులుగా ఒప్పుకుంటున్నారా?** ఆ డి.ఎన్.ఏ. పరీక్ష కూడా ఎవరికి వారే చేసుకోలేరు కదా! ఎవరో టెక్నీషియన్ ఆ పరీక్ష చేసి నిర్ధారించి చెప్పాలి. అప్పుడు కూడా ఆ వ్యక్తి ఏది చెబితే దానినే గుడ్డిగా నమ్మాలి.

మమ్మల్ని ప్రశ్నించిన వ్యక్తి తన ఇంటికి వెళ్ళి, అతని తల్లిదండ్రులతో "మీ డి.ఎన్.ఏ., నా డి.ఎన్.ఏ. పరీక్ష చేయిద్దాము, మీరు నిజంగా నా తల్లిదండ్రులు అవునో కాదో సైన్స్ ద్వారా నిరూపించుకోవాలి" అని చెబితే, **ఆ తల్లిదండ్రుల స్పందన ఎలా ఉంటుంది?"**

## ప్రతీ మనిషి ఎన్నో సందర్భాలలో విశ్వసించక తప్పదు

డాక్టర్‌గారు ఫలానా రోగం ఉందని చెప్పి, మాత్రలు వ్రాస్తే దానిని విశ్వసించి ఆయన చెప్పినట్లే చేయాలి. అలా కాకుండా, "డాక్టర్‌ను నేను గుడ్డిగా ఎందుకు నమ్మాలి? ముందుగా మెడిసిన్ చదువుకుని, ఆ తరువాత ఫార్మసీ చదువుకుని అంతా స్పష్టంగా తెలిసిన తర్వాతనే ఆ మాత్రలు వేసుకుంటాను అని ఎవరైనా అనగలడా? అలా చెబితే అతడు మూర్ఖుడు అవుతాడు. కాని డాక్టర్ మాటలను విశ్వసిస్తే నాగరీకుడు అవుతాడు.

ఎన్నో విషయాలలో మనకు తెలియక పోయినా విశ్వసిస్తూనే ఉన్నాము. నాస్తికుడైనా, హేతువాదైనా సరే చాలా సందర్భాలలో తప్పనిసరిగా విశ్వసించవలసిందే. ముందుగానే చెప్పుకున్నాం, ఈ విశ్వాసమనేది ఆ వ్యక్తికున్న జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది.

అంతేకాదు. శిలువవేయబడలేదనే విషయం ఒక్కటి మాత్రమే కాదు, ఖుర్ఆన్‌లో చెప్పబడిన ఏ చిన్న పదంపైనైనా సరే మాకు **ఎటువంటి అనుమానం లేదు.** మాకే కాదు, అనుమాన పడవలసిన అవసరం ఎవరికీ రాదు. క్రింది ఖుర్ఆన్ వాక్యాలు చూడండి:

**ఇది (ఈ ఖుర్'ఆన్) ఒక దివ్య గ్రంథం, ఇందులో ఏ మాత్రం సందేహం లేదు.** అల్లాహ్ పట్ల భీతి గలవారికి ఇది మార్గదర్శకత్వము. (వారికి) ఎవరైతే అగోచర యథార్థాన్ని విశ్వసిస్తారో, సలాత్ (నమాజ్)ను స్థాపిస్తారో మరియు మేము ప్రసాదించిన జీవనోపాధి నుండి (మా మార్గంలో) ఖర్చు చేస్తారో. మరియు ఎవరైతే (ఓ ముహమ్మద్!) నీపై అవతరింపజేయబడిన దానిని (ఈ ఖుర్'ఆన్‌ను) మరియు నీకు పూర్వం అవతరింపజేయబడిన వాటినీ (దివ్య గ్రంథాలను) విశ్వసిస్తారో మరియు పరలోక జీవితాన్ని దృఢంగా నమ్ముతారో! అలాంటి వారే తమ ప్రభువు (చూపిన) సన్మార్గంలో ఉన్నవారు, మరియు అలాంటి వారే సాఫల్యం పొందేవారు. **(ఖుర్'ఆన్ 2:2)**

**మూసా(అ) ప్రవక్త గారికి 'తౌరాత్' అనే గ్రంథాన్ని, ఈసా(అ)వారికి 'ఇంజీల్' అనే గ్రంథాన్ని ఇచ్చారని ఖుర్'ఆన్ తెలియజేస్తుంది.**

ఇంజీల్ అనే గ్రంథం ఈసా(అ)వారికి ఎప్పుడు ఇవ్వబడి ఉండవచ్చు? ప్రజలు ఆయన(అ)పై శతృత్వం వహించక పూర్వమా? లేక శతృత్వం వహించిన తరువాత?

**"ఆ తరువాత మేము మా సందేశహరులను ఒకరి తరువాత ఒకరిని పంపుతూ వచ్చాము. ప్రతిసారి ఒక సమాజం వద్దకు దాని సందేశహరుడు వచ్చినప్పుడు, వారు అతనిని అసత్యుడని తిరస్కరించారు."** (ఖుర్'ఆన్ 23:44)

కాబట్టి ఏ ప్రవక్తకైనా అల్లాహ్ ఆయనపై అవతరింప జేసిన గ్రంథం ప్రకారం బోధన ప్రారంభించిన తరువాతే **కొందరు అనుచరులు** మరియు **కొందరు శతృవులు** తయారవుతారు. శతృవులే లేకపోతే శిలువ వేయాలనే ప్రయత్నమే జరగకపోవచ్చు. కాబట్టి, శిలువ వేసి శిక్షించాలనే శతృవుల నిర్ణయానికి పూర్వమే గ్రంథం అవతరించబడిందని సందేహం లేకుండా అర్థమౌతుంది. ముందుగానే అవతరించబడింది కాబట్టి అందులో శిలువ ప్రస్తావనకు అవకాశం లేదు కదా! అంతేకాకుండా శిలువ గురించిన ముందస్తు సమాచారమే అందులో ఉండి ఉంటే, ముందుగానే సహచరులు జాగ్రత్త పడతారు కదా! ఇంజీల్ గ్రంథం అవతరించిన తరువాత, చిట్టచివరి గ్రంథం ఖుర్'ఆన్ అవతరించింది. ఈ రెండు గ్రంథాల మధ్య కాలంలో ఎటువంటి గ్రంథం అవతరించ బడలేదు. కాబట్టి ఇంజీల్ అవతరించిన తరువాత జరిగే ఏ విషయాల గురించి అయినా తరువాయి గ్రంథంలోనే ప్రస్తావించే అవకాశం ఉంది కాబట్టి, ఖుర్'ఆన్‌లో ఆ విషయాలు చెప్పబడ్డాయని మేము విశ్వసించడంలో గుడ్డితనం లేదు కదా! ఇది గుడ్డి నమ్మకం ఎంతమాత్రం కాదు. కాబట్టి **మా విశ్వాసాన్ని గుడ్డిదని ఎలా చెప్పగలరు?** ఖుర్'ఆన్‌కి పూర్వం జరిగిన చారిత్రక విషయాలను గ్రంథంలో తెలపడానికి గల ముఖ్య కారణం, వాటి నుండి మనం గుణపాఠం నేర్చుకోవాలని మాత్రమే.

ఒకవేళ ఒక ధర్మంవారు విశ్వసించినట్లు శిలువ వేసినా లేక వెయ్యకపోయినా, ఖుర్'ఆన్ గ్రంథాన్ని అర్థం చేసుకోవడంలోగాని, దానిని ఆచరించడంలోగాని ముస్లిములకు ఎటువంటి ఇబ్బందీ తలెత్తే పరిస్థితి లేదు. కాబట్టి శిలువ వేయబడిందని విశ్వసించేవారి గురించి కామెంట్ చేయవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. **ఖుర్'ఆన్‌పై వారు వ్యక్తం చేసిన అనుమానాలను పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం కూడా లేదు.**

**వారి విశ్వాసం వారిది మరియు మన విశ్వాసం మనది.** ఆ విషయంలో వాదనకు అవకాశమే లేదు. నేడు ప్రపంచంలో ఎంతోమంది ప్రజలు మానవులను కూడా దైవాలుగా ఆరాధిస్తున్నారు. అది వారి విశ్వాసం.

కొసమెరుపు ఏమిటంటే, ఫోన్ చేసిన వ్యక్తి తాను కూడా 'ముస్లిమ్'నే అని చెప్పుకున్నాడు. అంతేకాకుండా ఈ వ్యక్తి వంటివారే కొందరు, తెలంగాణా ప్రాంతం నుండి ఫోన్ చేసి శిలువ వేయబడలేదు అని నిరూపిస్తే లండన్ నుండి లక్ష రూపాయలుగాని లేదా కోటి రూపాయలు గాని (ఎంత చెప్పారో సరిగ్గా గుర్తు లేదు) ఇప్పిస్తారట. వీరు ఆ ప్రైజ్ మనీ ఇచ్చేవారికి ఏజెంట్లుగా పనిచేస్తున్నారా?

## విశ్వాసాలను నిరూపించడమేమిటి?

ఇవన్నీ అజ్ఞానపు వాదనలు మరియు తాటాకు చప్పుళ్ళు.

ఇటువంటి వాటికి కారణం నేటి దాయీలు స్వార్థంతో వేసిన ఎత్తుగడలు. ప్రజల మనస్సులలో అనుమానాలు కలుగజేసే కుట్రలు మాత్రమే. వీటిని అస్సలు పట్టించుకోవద్దు. పట్టించుకోవద్దు అని చెబుతూనే, మీరెందుకు ఈ విషయాన్ని మాకు తెలియజేశారు? అని పాఠకులు మమ్మల్ని ప్రశ్నించవచ్చు. మీ మనస్సులు పాడుచేయడానికి ఎన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారోననే విషయం తెలియజేసి, జాగ్రత్త పడేలా చేయాలనే సంకల్పంతోనే ఈ విషయం చెప్పడం జరిగింది. వారితో వాదించమని కాదు.

ఒక శాస్త్రవేత్త ఓ కొత్త విషయాన్ని కనుగొనేటప్పుడు, తన మనస్సులో ఒకటి ఊహిస్తాడు. దాని ప్రకారంగా పరిశోధన చేసినప్పుడు, అతడు విశ్వసించినదే నిజం కావచ్చు లేక ఊహించనిది మరొకటేదో ఫలితంగా రావచ్చు. అదే విధంగా ప్రతీ మనిషి తన జ్ఞానపరిధిలో ఒక విశ్వాసాన్ని కలిగి ఉంటాడు. **ఆ జ్ఞానం అతనిని ఆ విశ్వాసంలోనే ఉంచవచ్చు లేదా మరో విశ్వాసం వైపు తీసుకెళ్ళవచ్చు.**

కాబట్టి పాఠకులకు మేము చెప్పేది ఏమిటంటే, ఇతర ధర్మాల విషయాలలో జోక్యం చేసుకోకండి. ''మేము ఖుర్'ఆన్‌ను విశ్వసిస్తున్నాము'' మరియు ముహమ్మద్(స)వారి బోధనలను విశ్వసిస్తున్నాము అని చెప్పండి. అది కూడా చెప్పలేకపోతే **"మీ విశ్వాసం మీది. మా విశ్వాసం మాది."** అని చెప్పండి.

గత కొన్ని సంవత్సరాలనుండి కొందరు దాయీలు సున్నత్‌కు వ్యతిరేకంగా ఒక ధర్మం వారితో డిబేట్లు పెట్టుకోవడం వలన, మరియు వారితో చీకటి ఒప్పందాలు చేసుకోవడం వలన దాని చెడు ప్రభావం ముస్లిమ్ సమాజంపై పడుతుంది. దోమలు మంచి నిద్రను పాడుచేసినట్లు, ఈ దాయీలు ముస్లిమ్ సమాజాన్ని చిరాకు పెడుతున్నారు. జ్ఞానమున్న ప్రతీ

ఒక్కరూ అటువంటి వాదనలను ఆపాలి. వారు చేస్తున్న పని ఇస్లామ్ సూచించిన సామరస్యానికి వ్యతిరేకమని తెలుసుకోవాలి. సమాజానికి చేటు చేస్తున్న ప్రస్తుత వ్యాపారాత్మక దాయీ వ్యవస్థను (బిద్'అత్‌ను) నిర్మూలించాలి.

## ఖుర్'ఆన్ మరియు సైన్స్

ఖుర్'ఆన్ ద్వారా తెలిసిన సైన్స్ విషయాలను శాంతిబాటలో అందించమని ఎందరో పాఠకులు పదే పదే కోరుతున్నారు. కాని వాటిని అందిస్తే వాటినే పట్టుకుని ఇతర ధర్మాలవారితో మరియు సైన్స్ టీచర్స్‌తో వాదించిన విషయాన్ని గమనించాము. గతంలో ఇలా వాదించే వారిలో ఎక్కువ మంది సైన్స్‌పై కనీస అవగాహన లేనివారే! సైన్స్ అనేది కేవలం ఓ పాఠ్య పుస్తకం కాదు. తన మొత్తం జీవితకాలంలో ప్రపంచంలోని ఏ వ్యక్తి కూడా మొత్తం సైన్స్‌పై పట్టు సాధించ లేడు. అది అసాధ్యం.

**కొన్ని విషయాలు ఒక స్థాయి వారికి మాత్రమే చెప్పాలి.** ఇస్లామ్ బోధనలు ఎందరో ఆధునిక శాస్త్రవేత్తలను తయారు చేయగలిగాయంటే, సైన్స్ ఇస్లామ్‌కి వ్యతిరేకం కాదనే విషయం స్పష్టం అవుతుంది. కాబట్టి అల్లాహ్ గొప్పతనాన్ని అర్థం చేసుకోవడానికి, అన్ని వర్గాల పాఠకులకు అర్థం అయ్యేవాటిని మాత్రమే ఇవ్వాలని నిర్ణయించుకున్నాము. వాటి ద్వారా అల్లాహ్ యొక్క ఘనతను మరింతగా ప్రజలకు చేరువ చేయాలనేదే మా ప్రయత్నం.

ఫిబ్రవరి, 2011 శాంతిబాట సంచికలో 'గోల్డెన్ రేషియో' గురించి వివరించాము. ఆ వ్యాసం అర్థం కావడానికి కొన్ని ఫొటోలను మరియు పట్టికలను కూడా జత చేశాము. అతి సూక్ష్మ బాక్టీరియా నుండి అతి పెద్ద గెలాక్సీల వరకూ ప్రతీ దానిలో కూడా ఈ రేషియో ప్రకారం డిజైన్ ఉందని, కాబట్టి ఒకే డిజైన్‌ను కలిగి ఉన్న ఈ విశ్వానికి సృష్టికర్త ఒక్కరేనని చెప్పడం జరిగింది. ఆ విధంగా అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని తెలియజేయడం కోసం ఈ రేషియోను చర్చించడం జరిగింది.

ఇదే విధంగా అల్లాహ్ సృష్టిలో ఎన్నో పోలికలు ఉన్నాయి. అటువంటి ఓ పోలికనొకదానిని ఇక్కడ చర్చిస్తున్నాము. క్రింది ఆయత్ చూడండి.

**వాస్తవానికి ఆకాశాలు మరియు భూమి సృష్టి (లో) మరియు రాత్రి మరియు పగల అనుక్రమం(లో) సూచనలున్నాయి అర్థం చేసుకొనే వారి కొరకు.** ఎవరైతే అల్లాహ్‌ను స్మరిస్తారో (వారు) నిలుచున్నా మరియు కూర్చున్నా మరియు తమ పక్కలపై (పరుండినా) మరియు **ఎవరైతే ఆలోచన చేస్తారో ఆకాశాలు మరియు భూమి సృష్టిపై.** "మా ప్రభూ మీరు సృష్టించలేదు దీనిని వ్యర్థంగా. నీవు సర్వలోపాలకు అతీతుడవు (పవిత్రుడవు) కావున రక్షించు మమ్మల్ని నరకాగ్ని శిక్ష నుండి" (ఖుర్'ఆన్ 3:190-191)

## విశ్వం మరియు మానవుడు

మానవుడు సృష్టిలో ఓ సూక్ష్మభాగం. ఈ సూక్ష్మ సృష్టికి మరియు విశ్వం యొక్క సృష్టికి మధ్య పోలిక ఉందా?

దీని కొరకు 'బిగ్‌బేంగ్ థీరీ'ని ఉపయోగించుకో దలచుకోలేదు. ఎందుకంటే అది కేవలం ఓ థీరీ (సిద్ధాంతం) మాత్రమే. అది నిరూపించ బడిన తరువాత మాత్రమే సైన్స్ అవుతుంది.

ఈ పోలిక కేవలం ఖుర్'ఆన్ ఆయత్‌ల ద్వారా మరియు కొన్ని హదీస్‌ల ద్వారా వివరించ దలిచాము.

### విశ్వం

**ఏమీ లేని శూన్యం నుండి ఈ విశ్వం సృష్టించబడింది. అది ఆకాశాలుగానూ మరియు భూమిగానూ విడదీయ బడింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ద బడింది. అంతేకాకుండా విశ్వం విస్తరించబడుతూనే ఉంది. అంటే విశ్వం పెరుగుతూ ఉంది. అలా పెరిగి పెరిగి చివరకు ప్రళయం వచ్చాక విశ్వం పూర్తిగా నాశనమవుతుంది.**

### మానవుడు

**ఇదే విధంగా మానవుడు తన తల్లికి గర్భం రానప్పుడు ఎక్కడున్నాడు? ఆమె గర్భంలో కూడా ప్రారంభంలో శూన్యమే ఉంది. ఆ శూన్యంలో శిశువు ఓ రక్తపు ముద్దగా అల్లాహ్‌చే తయారు కాబడి, ఆ తరువాత అది వివిధ అవయవాలుగా విడదీయబడి ఓ రూపాన్ని పొందుతుంది. ఆ శిశువు ప్రసవించబడ్డాక పెరుగుదల మొదలవుతుంది. ఆ పెరుగుదల ఒక స్థాయికి వచ్చాక, పెరుగుదల ఆగిపోతుంది. మరణం సంభవిస్తుంది.**

పై ఆయత్‌లను బట్టి విశ్వం మరియు మనిషి సృష్టి గురించి 1400 సంవత్సరాల క్రితమే ఆ కాలంలోని ముస్లిములకు చాలా స్పష్టంగా తెలుసునని అర్థమౌతుంది. అంతేకాకుండా ముహమ్మద్(స)వారు ఈ విషయంపై చేసిన బోధనలు, తల్లిగర్భంలో జరిగే ఎన్నో విషయాలను మన కళ్ళ ముందు ఉంచాయి.

ప్రతీరోజు కాస్సేపు ఖుర్'ఆన్ చదవండి. చదివిన విషయాలను అర్థం చేసుకోవడమే కాకుండా వాటి గురించి ఆలోచిస్తుండండి. ఎన్నో గొప్ప విషయాలు మీరు తెలుసుకోగలుగుతారు. ఖుర్'ఆన్ పదే పదే చెప్పేది కూడా అదే - **"ఆలోచించమని"**

మీరు ఏ రంగానికి చెందినవారైనా సరే, ఆ రంగానికి సంబంధించి, ఏదో ఒక దృగ్విషయం మీకు ఖుర్'ఆన్ నుండి బోధపడే అవకాశం ఎంతైనా ఉంది.

## 1. శూన్యంలో సృష్టి

**విశ్వం**

**ఆయనే ఆకాశాలను మరియు భూమిని శూన్యం నుండి సృష్టించాడు** (ఏ నమూనా లేకుండా ఆరంభించినవాడు) (ఖుర్ఆన్ 6:101)

నిశ్చయంగా ఆయనే ఆరంభించేవాడు మరియు ఆయనే ఉనికిలోకి తెచ్చేవాడు (ఖుర్ఆన్ 85:13)

**మానవుడు**

తల్లిగర్భం ధరించక పూర్వం గర్భంలో ఉన్నది కూడా శూన్యమే! తల్లిదండ్రులు కలిసినప్పుడు, తల్లి గర్భాశయంలో విడుదలైన అండంతో వీర్యకణం చేరిన తరువాత పిండం తయారవుతుంది.

నిశ్చయంగా, మేము మానవుణ్ణి ఒక మిశ్రమ వీర్య బిందువుతో సృష్టించాము. అతనిని పరీక్షించటానికి, మేము అతనిని వినేవాడిగా, చూసేవాడిగా చేశాము (ఖుర్ఆన్ 76:2)

కావున మానవుడు తాను దేనితో సృష్టించబడ్డాడో గమనించాలి! అతడు విసర్జించబడే ద్రవపదార్థంతో సృష్టించబడ్డాడు. అది వెన్ను మరియు రొమ్ము ఎముకల మధ్య భాగం నుండి బయటికి వస్తుంది (ఖుర్ఆన్ 86:5-7)

"... ఆయన మిమ్మల్ని మీ తల్లుల గర్భాలలో మూడు చీకటి తెరలలో ఒక రూపం తరువాత మరొక రూపాన్ని ఇచ్చాడు ..." (ఖుర్ఆన్ 39:6)

## 2. ప్రారంభంలో ...

**విశ్వం**

**ప్రారంభంలో విశ్వం అంతా ఓ పదార్థంగా మరియు పొగలా ఉండేది.**

"ఏమీ? ఈ సత్య తిరస్కారులకు తెలియదా? వాస్తవానికి ఆకాశాలు మరియు భూమి కలుసుకుని ఉండేవనీ ....." (ఖుర్ఆన్ 21:30)

తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లో సూరహ్ బఖరాలోని ఒక ఆయత్‌కు సంబంధించి, ముజాహిద్ గారి వ్యాఖ్యానం ఉంది. అల్లాహ్ భూమిని సృష్టించినప్పుడు, దాని నుండి పొగ బయటకి తన్నుకుంటూ వచ్చింది.

అప్పుడే ఆయన పొగగా ఉన్న ఆకాశం వైపునకు తన ధ్యానాన్ని మరల్చి, దానిని మరియు భూమిని ఉద్దేశించి ఇలా అన్నాడు : ....... (ఖుర్ఆన్ 41:11)

**మానవుడు**

మానవుడు తల్లిగర్భంలో ప్రారంభంలో ఓ రక్తపు ముద్దలా ఉన్నాడు.

**చదువు! నీ ప్రభువు పేరుతో, ఆయనే (సర్వాన్ని) సృష్టించాడు! ఆయనే మానవుణ్ణి రక్తపు ముద్దతో సృష్టించాడు ..."** (ఖుర్ఆన్ 96:1-2)

"... నిశ్చయంగా, మేము మిమ్మల్ని మట్టితో సృష్టించాము. తరువాత వీర్య బిందువుతో, ఆ తరువాత నెత్తురు గడ్డతో, ఆ పైన మాంసపు కండతో, అది పూర్తిగా రూపం పొందవచ్చు, లేక పూర్తిగా రూపం పొందక పోవచ్చు. ఇదంతా మేము స్పష్టం చేస్తున్నాము. ఆ తరువాత మేము కోరినవారిని ఒక నిర్ణీతకాలం వరకు గర్భకోశాలలో ఉంచుతాము ..." (ఖుర్ఆన్: 22:5)

## 3. ఒకే భాగంగా కలిసి ఉన్నవి .... విడిపోవడం ... రూపుదిద్దుకోవడం

**విశ్వం**

"..... వాస్తవానికి భూమ్యాకాశాలు కలుసుకుని ఉండేవనీ, అయితే మేము వాటిని పగులగొట్టి వేరు చేశామని? ....." (21:30)

"..... **ఆకాశాన్ని మేము చేతులతో నిర్మించాము** ....." (51:47)

"ఏమీ? మీరు చూడటం లేదా? అల్లాహ్ ఏడు ఆకాశాలను ఏ విధంగా అంతస్తులలో సృష్టించాడో! మరియు వాటి మధ్య చంద్రుణ్ణి కాంతిగాను మరియు సూర్యున్ని దీపంగానూ చేశాడు. (ఖుర్ఆన్)

"మరియు మేము ఆకాశాన్ని సురక్షితమైన కప్పుగా చేశాము. అయినా వారు అందులోని సూచనల నుండి విముఖులు అవుతున్నారు. మరియు రేయింబవళ్ళను మరియు సూర్యచంద్రులను సృష్టించినవాడు ఆయనే. అవి తమ తమ కక్ష్యలలో తేలియాడుతూ (తిరుగుతూ) ఉన్నాయి. (ఖుర్ఆన్ 21:32-33)

"ఆయనే, సూర్యుణ్ణి దీపంగానూ మరియు చంద్రుణ్ణి వెలుగుగానూ చేసి, దానికి దశలు నియమించాడు. దాని ద్వారా మీరు సంవత్సరాలు మరియు గణనను తెలుసుకోవాలని. నిశ్చయంగా, రేయింబవళ్ళ నిరంతర మార్పులలోనూ మరియు భూమ్యాకాశాలలో, అల్లాహ్ సృష్టించిన ప్రతిదానిలోనూ, అల్లాహ్‌పట్ల భీతిగల ప్రజలకు సూచనలు ఉన్నాయి. (ఖుర్ఆన్ 10:5-6)

"కావున ఆయన వాటిని రెండు రోజులలో ఏడు ఆకాశాలుగా నిర్మించాడు, మరియు ప్రతి ఆకాశానికి దాని వ్యవహారాన్ని వహీ ద్వారా నిర్దేశించాడు మరియు మేము ఈ ప్రపంచపు ఆకాశాన్ని దీపాలతో (నక్షత్రాలతో) అలంకరించాము మరియు దానిని సురక్షితం చేశాము. ఇదే సర్వశక్తివంతుని, సర్వజ్ఞాని నియామకం. (ఖుర్ఆన్ 41:12)

"మరియు వాస్తవంగా, మేము భూమికి దగ్గరగా ఉన్న ఆకాశాన్ని దీపాలతో అలంకరించాము. మరియు వాటిని షైతాన్‌లను తరిమికొట్టే సాధనాలుగా చేశాము ..." (ఖుర్ఆన్ : 67:5)

**మానవుడు**

మరియు వాస్తవంగా, మేము మానవుణ్ణి మట్టి యొక్క సారంతో

సృష్టించాము. తరువాత అతనిని ఇంద్రియ బిందువుగా. ఒక కోశంలో భద్రంగా ఉంచాము. ఆ తరువాత ఆ ఇంద్రియ బిందువును రక్తపు ముద్దగా మార్చాము. ఆ పైన ఆ రక్తపు ముద్దను మాంసపు ముద్దగా మార్చాము. ఆ పిండంలో ఎముకలను ఏర్పరచి, ఆ ఎముకలను మాంసంతో కప్పాము. ఆ తరువాత దానిని మరొక సృష్టిగా చేశాము. కావున శుభకరుడు అయిన అల్లాహ్‌యే అత్యుత్తమ సృష్టికర్త (ఖుర్ఆన్ 23:12-14)

ముహమ్మద్(స)వారు మదీనా వచ్చారని తెలుసుకుని అప్పటికి యూదుడైన అబ్దుల్లాహ్ బిన్ సలామ్, ప్రవక్త(స)వారి దగ్గరికి వచ్చి మూడు ప్రశ్నలు వేశారు. ఒక ప్రవక్త తప్ప ఆ ప్రశ్నలకు ఎవ్వరూ సమాధానం చెప్పలేరని కూడా ఆయన చెప్పారు. ఆ ప్రశ్నలకు జవాబులు వెంటనే ముహమ్మద్(స) చెప్పడం జరిగింది. వెనువెంటనే ఆయన ముహమ్మద్(స)వారిని అల్లాహ్ యొక్క సందేశహరునిగా సాక్ష్యమిచ్చి ముస్లిమ్ అయిపోయారు.

ఆయన అడిగిన 3 ప్రశ్నలలో ఒక ప్రశ్న ఏమిటంటే బిడ్డ తన తండ్రిని ఎందుకు పోలి ఉంటాడు మరియు మేనమామను ఎందుకు పోలి ఉంటాడు? **(చూడండి : సహీహ్ బుఖారీ 3329, పుస్తకం 60, అధ్యా.1, సంపుటి 4)**

అయితే ఆ ప్రశ్నకు ఇచ్చిన జవాబు పై హదీస్‌లో క్లుప్తంగా ఉండటంతో, ఆ జవాబును మరింత విపులంగా వివరించే కొన్ని హదీస్‌లను దిగువ నిస్తున్నాము.

విశ్వాసుల మాతృమూర్తి **హజ్రత్ ఉమ్మె సలమహ్(రజి)** ఉల్లేఖనం: ఉమ్మె సులైమ్(రజి) వద్దకు వచ్చి చెప్పారు : "ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా(స)! సత్యాన్ని తెలుపడంలో అల్లాహ్ సిగ్గుపడడు. స్త్రీకి స్వప్న స్కలనం అయితే ఆమె గుసుల్ చేయాలా?" అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "ఔను, ఆమె నీటిని (ద్రవాన్ని స్రవిస్తే) చూస్తే" ఉమ్మె సలమహ్(రజి) అన్నారు : 'ఓ రసూలుల్లాహ్(స), స్త్రీకి కూడా స్వప్న స్కలనం అవుతుందా?" ఆయన అన్నారు: "నీ చేతికి మన్ను తగల, ఆమె బిడ్డకు ఆమె పోలికలు ఎలా వస్తాయి?" **(సహీహ్ ముస్లిమ్, హదీస్ నెం. 712, సంపుటి 1, పుస్తకం 3, అధ్యా. 7)**

మరో ఉల్లేఖనంలో **(సహీహ్ ముస్లిమ్ హదీస్ నెం. 710)**లో ఉమ్మె సలమహ్(రజి) చెప్పారు : "నేను అందుగురించి సిగ్గుపడి చెప్పాను: 'అది నిజంగా జరుగుతుందా?'. రసూలుల్లాహ్(స) అన్నారు : "పోలిక ఎలా జరుగుతుందని అనుకున్నావు?". పురుషుని (నుండి స్రవించే ద్రవం) నీరు చిక్కగా మరియు తెల్లగా, మరియు స్త్రీ నీరు పలుచగా మరియు పసుపు రంగులో ఉంటుంది. వాటిలో ఏదైతే ప్రాబల్యం వహిస్తుందో లేదా ముందుగా వస్తుందో, పోలిక (దాని ప్రకారం) ఉంటుంది".

(అంటే స్త్రీ నీరు ముందుగా స్రవించబడితే, బిడ్డకు తల్లి పోలిక వస్తుంది, లేదంటే తండ్రి పోలిక వస్తుంది) (పైన తెలిపిన 'ఉమ్మె సులైమ్' మరియు 'ఉమ్మె సలమహ్' పేర్లు వేరు వేరు. గమనించగలరు.)

## ఏయే దశలకు ఎంతకాలం పడుతుంది?

అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖనం. **ముహమ్మద్(స)వారు చెప్పారు** :

"నిశ్చయంగా మీలోని ప్రతీ ఒక్కరూ అతని తల్లి గర్భంలో సేకరించ బడతాడు 40 రోజుల పాటు, తరువాత అతడు రక్తపు ముద్దగా అన్ని రోజుల పాటు, తరువాత మాంసపు ముద్దగా అన్ని రోజుల పాటు ఉంటాడు. తరువాత అల్లాహ్ ఒక దూతను పంపుతాడు 4 మాటలతో : అతడు వ్రాస్తాడు - అతని ఆచరణలను, అతని మరణ సమయం, జీవనోపాధి మార్గాలు మరియు అతడు దుర్మార్గుడా లేక సన్మార్గుడా ....... **(సహీహ్ బుఖారీ, 3332, పుస్తకం 60, అధ్యా. 1, సంపుటి 4)**

అనస్ బిన్ మాలిక్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు, "అల్లాహ్ ఒక దూతను గర్భంలో నియమిస్తారు, మరియు ఆ దూత చెబుతాడు, "ఓ ప్రభూ! **నుత్ఫా** (స్త్రీ, పురుషుల మిశ్రమ ద్రవ బిందువు). ఓ ప్రభూ! **రక్తపు ముద్ద.** ఓ ప్రభూ! **మాంసపు ముద్ద.** మరియు తరువాత శిశువు యొక్క సృష్టిని సంపూర్ణం చేయకోరితే, దూత అడుగుతాడు, "ఓ ప్రభూ! ఆడ లేక మగా? ఓ ప్రభూ! దుర్మార్గుడా లేక సన్మార్గుడా? అతని జీవనోపాధి ఏమిటి? అతని జీవితకాలం ఏమిటి? తరువాత అలాగే వ్రాయబడుతుంది అతని తల్లి కడుపులో. **(సహీహ్ బుఖారీ, 3333, అధ్యా.1, పుస్తకం 60, సంపుటి 4)**

"..... తరువాత ఆయన అతనిని సృష్టించి రూపాన్ని తీర్చిదిద్దాడు..." (ఖుర్ఆన్ : 75:37-39)

"ఆ తరువాత, అతనిని యుక్తమైన రూపంలో తీర్చిదిద్ది, అతనిలో తన ఆత్మను ఊదాడు. మరియు మీకు వినేశక్తిని, చూసేశక్తిని మరియు హృదయాలను ఇచ్చాడు. మీరు కృతజ్ఞతలు తెలుపుకునేది చాలా తక్కువ! (ఖుర్ఆన్ : 32:9)

ఆయనే నిన్ను సృష్టించాడు, తరువాత ఎలాంటి లోపం లేకుండా నిన్ను తీర్చిదిద్దాడు మరియు నిన్ను తగిన ప్రమాణంలో రూపొందించాడు. తాను తలచిన ఆకారంలో నిన్ను మలిచాడు (ఖుర్ఆన్ : 82:7-8)

## 4. పెరుగుదల

### విశ్వం

మరియు ఆకాశాన్ని మేము చేతులతో నిర్మించాము. మరియు నిశ్చయంగా, మేమే దానిని **విస్తరింప జేయగలవారము** (ఖుర్ఆన్ 51:47)

మానవుడు

"... పిదప మిమ్మల్ని శిశువుల రూపంలో బయటికి తీస్తాము. ఆ తరువాత మిమ్మల్ని యవ్వనదశకు చేరనిస్తాము. (ఖుర్'ఆన్ 22:5)

## 5. ప్రళయం మరియు మరణం

విశ్వం

" ... ఆ రోజు మేము ఆకాశాన్ని, చిట్టా కాగితాలను చుట్టినట్లు చుట్టి వేస్తాము. మేము ఏ విధంగా సృష్టిని మొదట ఆరంభించామో! ..." (ఖుర్'ఆన్ 21:104)

మానవుడు

"మరియు అల్లాహ్‌యే మిమ్మల్ని భూమినుండి మొలకల వలే ఉత్పత్తి చేశాడు. తరువాత ఆయన మిమ్మల్ని అందులోకే తీసుకుని పోతాడు మరియు మిమ్మల్ని దాని నుండి బయటకి తీస్తాడు! (71:17-18)

"ఆ తరువాత నిశ్చయంగా మీరు మరణిస్తారు" (ఖుర్'ఆన్ : 23:15)

"..... మీలో ఒకడు చనిపోతాడు, మరొకడు నికృష్టమైన వృద్ధాప్యం వరకూ చేర్చబడతాడు, అప్పుడతడు, మొదట అంతా తెలిసినవాడైనా ఏమీ తెలియనివాడిగా అయిపోతాడు. (ఖుర్'ఆన్: 22:5)

ఈ విశ్వాన్ని సృష్టించినది అల్లాహ్‌యే! ఆయన ఈ సృష్టి గురించి, అది ఎలా తయారు చేయబడిందో క్లుప్తంగా తన సందేశహరుడైన ముహమ్మద్(స)వారికి వహీ ద్వారా తెలియజేశారు.

కాబట్టి సృష్టి గురించి సృష్టికర్త చెప్పినదే నూటికి నూరుపాళ్ళు నిజం. కాబట్టి ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల ద్వారా 1400 సంవత్సరాల క్రితమే తల్లి గర్భంలో జరిగే పిండం యొక్క పరిణామ క్రమాలు, పోలికలు మొదలైన విషయాలు అప్పటి ప్రజలు స్పష్టంగా తెలుసు కోగలిగారు.

అంటే కేవలం ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను మాత్రమే చదివిన వారు, నేటి సైన్స్ చదువులు వారికి లేకపోయినా సరే, సృష్టి గురించి వాస్తవాలను స్పష్టంగా చెప్పగలరు.

'అబ్దుల్లాహ్ బిన్ సలామ్' మూడు ప్రశ్నలు వేసి చెప్పారు కదా **"ఒక ప్రవక్త మాత్రమే వాటికి సమాధానం చెప్పగలరు"** అని. దానికి కారణం ఆ ప్రవక్తకు వాస్తవం తెలియజేయబడుతుంది. నేటి శాస్త్రీయ పరిశోధనల ఫలితాలు ఖుర్'ఆన్ మరియు హదీస్‌లలో చెప్పిన వాటికి దగ్గరగా ఉన్నప్పుడే, అవి వాస్తవాలు కాగలుతాయి. సైన్స్ ద్వారా నిరూపించు కోవలసిన అవసరం ఖుర్'ఆన్‌కి ఎంతమాత్రం లేదు.

వందల సంవత్సరాల క్రితమే పరిపూర్ణమైన సైన్స్ ధర్మ సందేశంలోనే నిమిడి ఉంది. అది విడిగా లేకుండా ధర్మాచరణతోనే ఉంది. ఖుర్'ఆన్ ఆయత్‌లు వివేకంతో (wisdomతో) నిండి ఉన్నవి. ఆ వివేకాన్ని తెలుసుకున్నవాడు విజ్ఞాని (సైంటిస్ట్) అవుతాడు. మీరు ఎంత ఎక్కువ స్థాయిలో ప్రయత్నిస్తే, అంతే స్థాయిలో మీరు ఖుర్'ఆన్ నుండి విజ్ఞానాన్ని పొందగలుగుతారు.

నేడు సైన్స్ చదువుకున్న విద్యార్థులుగాని, పట్టభద్రులుగాని పైన తెలిపిన విషయంలో చెప్పినంత స్పష్టంగా చెప్పగలిగారా?

భారీ విస్ఫోటనం (పెద్ద ప్రేలుడు) సంభవించి ఈ సృష్టి ఏర్పడింది అని బిగ్ బేంగ్ థీరీ ద్వారా సృష్టి ప్రారంభాన్ని శాస్త్రవేత్తలు ఊహించారు. విశ్వం రోజురోజుకూ వ్యాపిస్తు ఉంది. కాబట్టి అది కొన్ని వేల సంవత్సరాల క్రితం ఇప్పటికంటే తక్కువ ఉండవచ్చుని, ఆ విధంగా బాగా వెనక్కి వెళితే అది ఒక బిందువు పరిమాణంలో ఉండేదనే అంచనాకి వచ్చారు.

బిగ్ బేంగ్ థీరీలో చెప్పినంత భారీ ప్రేలుడు జరిగిందనే అనుకుందాం. కాని ఆ ప్రేలుడును ఊహించలేకపోయినా, అణుబాంబులు ప్రేలడం మరియు ప్రపంచంలో వివిధ దాడులలో బాంబుల వలన జరిగిన ప్రేలుడులు మనలో ఎందరో వీడియోలలో చూడటం జరిగింది.

కాని ఈ ప్రేలుడు జరిగాక అందంగా ఉన్న భవనాలు కూడా వికృతంగా మారాయి గాని, అవి మరింత అందంగా మారలేదు కదా! మరి భారీ ప్రేలుడు ద్వారా ఈ విశ్వం ఉనికిలోనికి వచ్చి ఉంటే, మన ప్రకృతి ఇంత అందంగా ఉండేదా? పొగ ఇంత అందమైన ఆకాశాలుగా మారి ఉండేదా? లేదు. ఈ సృష్టిని అందంగా మలిచాడు మన సృష్టికర్తయైన అల్లాహ్.

"..... **ఆకాశాన్ని మేము చేతులతో నిర్మించాము** ....." (51:47)

ఇక్కడ చేతులు అంటే మన చేతులు వంటివి అని అర్థం ఎంతమాత్రమూ కాదు. ఎందుకంటే సృష్టిలో ఆయనను పోలినదేదీ లేదు కాబట్టి.

సృష్టి దానంతట అదే ఏర్పడలేదు. సృష్టికర్తచే సృష్టించబడింది. ఆ సృష్టి ఎలా జరిగిందో ఆయన యొక్క సందేశహరులు అవసరమైనంత మేర వివరించారు.

**దయచేసి సైన్స్ మరియు ఖుర్'ఆన్‌ను పోలుస్తూ బహిరంగ సభలు జరగకుండా చూడండి. అజ్ఞానులైన కమర్షియల్ దాయీల చేత సైంటిఫిక్ విషయాలు మాట్లాడించకండి. ఆ విధంగా చేసి 'ఇస్లామ్'ను అవమానించే ప్రయత్నం చేయవద్దు.**

**ధర్మంలోనే సైన్స్ ఉంది. సైన్స్‌లో ధర్మం లేదు.**
**సైన్స్‌కు ధర్మం యొక్క అవసరముంది**

భార్యాభర్తల నుద్దేశించి ఖుర్'ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నారు :

వారు మీకు వస్త్రాలు, మీరు వారికి వస్త్రాలు (2:187) | They are clothing for you and you are clothing for them | هُنَّ لِبَاسٌ لَّكُمْ وَأَنتُمْ لِبَاسٌ لَّهُنَّ




అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు :

"ఈ ప్రపంచం తాత్కాలిక సుఖం. ప్రపంచంలోని తాత్కాలిక సుఖాలన్నింటికంటే ఉత్తమమైనది ధర్మపరాయణురాలైన స్త్రీ (భార్య)"

(సహీహ్ ముస్లిమ్, 3649, పుస్తకం 17, అధ్యా.19, సంపుటి 4)

వస్త్రాలు నగ్నత్వం నుండి కాపాడుతూ మనకు గౌరవాన్నిస్తాయి. అదే విధంగా భార్య గౌరవాన్ని భర్త మరియు భర్త గౌరవాన్ని భార్య కాపాడాలి. కుటుంబంలో భార్యాభర్తలకు వేర్వేరు బాధ్యతలున్నాయి. వారి మధ్య హెచ్చుతగ్గుల గురించి ఆలోచించ వలసిన అవసరం లేదు. ఇద్దరిలో ఎవరికీ ఎక్కువ తఖ్వా ఉంటుందో, ఎవరు తమ బాధ్యతను అల్లాహ్ ఆదేశించిన దాని ప్రకారం నిర్వర్తిస్తారో వారికే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ విలువ ఉంటుంది. కాబట్టి భార్యాభర్తలు ధర్మ పరాయణతలో, బాధ్యతలను నిర్వహించడంలో, ఒకరి గౌరవాన్ని మరొకరు కాపాడటంలో పోటీపడాలి. భార్యాభర్తల సంబంధంలో > (ఎక్కువ), < (తక్కువ), = (సమానం) వంటి గుర్తులు ఉండవలసిన అవసరం లేదు. కొన్ని విషయాలలో భర్త అధికుడైతే, మరికొన్ని విషయాలలో భార్య ఆధిక్యత వహిస్తుంది. సంతోషంగా బ్రతకవలసిన ఎన్నో కుటుంబాలు చీలిపోయి విడాకుల కోసం పరితపించడమో, మానసిక క్షోభకు గురికావడమో జరుగుతుంది. సలాత్ (నమాజ్) ఎలా చేయాలీ, సౌమ్ (ఉపవాసం) ఎలా ఉండాలీ, ఖుర్'ఆన్‌ను అరబీలో ఎలా చదవాలీ, ఈ విషయాలు తెలుసుకుంటే చాలు అని నేటి ముస్లిమ్ సమాజంలోని స్త్రీలు అనుకుంటున్నారు. వివాహం జరిగినప్పుడో లేక జరిగిన తరువాతైనా సరే ఒక ఇల్లాలిగా తాను నిర్వహించవలసిన బాధ్యతలేమిటో, వాటి గురించి అల్లాహ్ ఏమి ఆదేశించారో తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. తల్లి తన కుమార్తెకు బంగారు నగలు, బట్టలు, ఇతర సామాన్లు ఇవ్వడం గురించి ప్రాధాన్యత ఇస్తుంది గాని, తన కూతురు ఇహలోకంలోనూ పరలోకంలోనూ సంతోషంగా బ్రతకడం కోసం అవసరమైన శిక్షణ ఇవ్వడం లేదు. ఓ మాతృమూర్తి తన కుమార్తె వివాహ సమయాన ఎటువంటి విషయాలు చెప్పి, భర్తతో పంపారో ఈ వ్యాసంలో చదవండి. మహిళ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తి స్తే ఓ గొప్ప సమాజం మన ముందుంటుంది.

"మరియు ఆయన సూచనలలో: ఆయన
మీ కొరకు మీ జాతి నుండియే
- మీరు వారి వద్ద సౌఖ్యం పొందటానికి -
**మీ సహవాసులను (అజ్వాజ్)**లను
పుట్టించి, మీ మధ్య ప్రేమను మరియు
కారుణ్యాన్ని కలిగించడం ..."
*(ఖుర్'ఆన్ 30:21)*

ఏయే వయస్సులలో స్త్రీ, పురుషులు వివాహం చేసుకోవచ్చో క్రిందటి సంచికలో వివరించాము. ఏ స్త్రీ, పురుషుల మధ్య వివాహం ధర్మ సమ్మతం అవుతుందో మరియు ఏ ఇద్దరి మధ్య వివాహబంధం నిషేధమో తెలుసుకోవడం చాలా ముఖ్యం.

మన దేశంలో ఇస్లామేతర ధర్మాలవారికి ముస్లిముల వివాహాలపై ఎన్నో అపోహలు ఉన్నాయి. సామాజిక ప్రయోజనం దృష్ట్యా ఆ అపోహలను తొలగించవలసిన బాధ్యత ముస్లిములపై ఉంది. అంతేకాకుండా ఇస్లామ్‌కి పూర్వం అరేబియాలో అమలులో ఉన్న అన్ని రకాల వివాహాలను ముస్లిముల వివాహాలుగా పరిగణిస్తూ పాఠ్యపుస్తకాలలో కొందరు వ్రాయడం జరిగింది. **అది నిజం కాదు.** మొట్టమొదట సాధారణ అపోహలను దూరం చేద్దాం. తరువాత ఇస్లామ్ వివాహ నియమాల గురించి తెలుసుకుందాం.

### 1. అన్నా చెల్లెల పిల్లలు

ఉదాహరణకు, అన్నయ్యకు ఒక కొడుకు ఉన్నాడు. చెల్లెలుకి ఒక కూతురు ఉంది. అప్పుడు మన దేశంలో ఇస్లామేతర ధర్మాలవారు, ఆ పిల్లలిద్దరినీ **బావా మరదళ్ళు**గా పరిగణిస్తారు. మరియు ఆ పిల్లలు పెరిగాక, అందరూ ఇష్టపడితే వారిద్దరికీ వివాహం జరుపుతారు.

### 2. అన్నదమ్ముల పిల్లలు

ఉదాహరణకు, అన్నయ్యకు ఒక కొడుకు ఉన్నాడు. తమ్ముడికి ఒక కూతురు ఉంది. అప్పుడు వారిద్దరినీ ఇస్లామేతర ధర్మాల వారు **అన్నా చెల్లెల్లుగా** పరిగణిస్తారు. మరియు వారిద్దరి మధ్య వివాహం పాపంగా భావిస్తారు. అంటే వారిద్దరి మధ్య ఆ వివాహం వారి దృష్టిలో ధర్మ సమ్మతం కాదు.

పైన తెలిపిన రెండు ఉదాహరణలను విశ్లేషించి చూడండి. ఒక అన్నయ్య మరియు ఒక తమ్ముడు మధ్య ఎటువంటి రక్త సంబంధం ఉంటుందో, అటువంటి రక్తసంబంధమే ఒక అన్నయ్య మరియు ఒక చెల్లెలు మధ్య ఉంటుంది. మరి రెండు విషయాలలోనూ రక్త సంబంధం ఒక్కటే అయినప్పుడు, వారి పిల్లల మధ్య సంబంధం కూడా ఒకే విధంగా ఉండాలి. రెండు రకాలుగా ఎందుకు ఉంది? ఒకచోట బావామరదళ్ళ సంబంధం అని చెప్పి, మరోచోట అన్నాచెల్లెల్ల సంబంధమని **ఏ ప్రాతిపదికన చెప్పారు?**

అన్నయ్య యొక్క కొడుకు మరియు చెల్లెలు యొక్క కూతురు వివాహం చేసుకోగలిగినప్పుడు, అన్నయ్య యొక్క కొడుకు మరియు తమ్ముడు యొక్క కూతురు కూడా వివాహం చేసుకోగలరు కదా!

ఇస్లామ్ ప్రకారం అన్నాచెల్లెల్ల పిల్లల మధ్యగాని, అక్కాతమ్ముళ్ల పిల్లల మధ్యగాని, అక్కా, చెల్లెల్ల పిల్లల మధ్యగాని మరియు అన్నదమ్ముల పిల్లల మధ్యగాని వివాహం చేయదలిస్తే, ఆ వివాహాలలో ఎటువంటి దోషం లేదు.

**కాని ఇక్కడ ముఖ్యంగా గుర్తు పెట్టుకోవలసిన విషయం ఏమిటంటే, ఏ ఇద్దరి మధ్య వివాహం అయితే ధర్మసమ్మతమో, ఆ ఇద్దరూ యుక్త వయస్సుకి వచ్చినప్పుడు, ఏకాంతంగా మాట్లాడుకోవడం గాని లేదా మూడవ వ్యక్తి లేకుండా కలిసి ప్రయాణించడంగాని చేయకూడదు.**

అయితే వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. అక్కాచెల్లెల్ల పిల్లలే కదా అని లేదా అన్నదమ్ముల పిల్లలే కదా అని, వారికి యుక్త వయస్సు వచ్చిన తరువాత, వారు ఏకాంతంగా మాట్లాడుకోవడానికి, కలిసి తిరగడానికి ఎటువంటి అభ్యంతరం చెప్పడం లేదు.

ఆ విధంగా అభ్యంతరం చెబితే, వారిలో లేనిపోని ఆలోచనలు కలిగించి నట్లవుతుంది అని పాఠకులు అభిప్రాయపడవచ్చు. నిజమే! పిల్లలకున్న జ్ఞానపరిధిని బట్టి వివేకంతో చెప్పాలి. మీరు వారిని అనుమానించడం లేదు కదా! ఇక్కడ పిల్లల స్వేచ్ఛను హరించడం లేదు. మూడవ వ్యక్తి కూడా ఉండాలి. స్వేచ్ఛకు అంతరాయం కలగకుండా, సాంఘిక దురాచారాలకు అవకాశం లేకుండా, భవిష్యత్తులో ఏ స్త్రీగాని, పురుషుడుగాని చింతించ వలసిన పరిస్థితి రాకుండా మధ్యస్థమైన నియమాలను ఇస్లామ్ ఏర్పరచింది.

### ఇస్లామ్‌లో అన్నాచెల్లెల్లు అంటే ఎవరు?

1. వారిద్దరి తల్లి ఒక్కరే అయివుండాలి. 2. (లేదా) వారిద్దరి తండ్రి ఒక్కరే అయి ఉండాలి. 3. అమ్మాయి మరియు అబ్బాయి పసివాళ్ళుగా ఉన్నప్పుడు ఒకే స్త్రీ యొక్క చనుబాలు త్రాగి ఉండాలి. ఈ విధంగా స్తన్య సంబంధం ద్వారా కూడా వారిద్దరూ అన్నా చెల్లెల్లే అవుతారు.

పైన చెప్పిన విధంగా అన్నాచెల్లెల్ల సంబంధం కలవారి మధ్య వివాహం నిషేధం. అది ధర్మ సమ్మతం కాదు.

### మేనమామను వివాహం చేసుకోవచ్చా?

కొన్ని ధర్మాలలో తన మేనమామని ఓ స్త్రీ వివాహం చేసుకుంటుంది. అంటే అమ్మాయి తన తల్లియొక్క తమ్ముడిని వివాహం చేసుకుంటుంది. కాని అదే విధంగా 'అబ్బాయి' తన తండ్రి యొక్క సోదరిని (అంటే మేనత్తను) వివాహం చేసుకోకూడదు. మేనమామతో వివాహం తప్పు కానప్పుడు, మేనత్తతో వివాహం తప్పు ఎలా అవుతుంది? **ఏ ప్రమాణం ద్వారా ఇలా నిర్ణయించారు?** ఇది విమర్శ ఎంతమాత్రం కాదు. ఎవరి ఆచారాలు వారివి.

**ఇతర ధర్మాలలో వివాహాలు ఏ విధంగా జరిగినా, వాటిపై వ్యాఖ్యానించడం మా ఉద్దేశ్యం కాదు. వాటిని అనుసరించే వారికి ముస్లిముల వివాహాలు తప్పుగా అనిపించాయి కాబట్టి అది స్పష్టం చేయడానికి మాత్రమే ఏ ప్రమాణాల ప్రకారం అలా నిర్ణయింపబడి ఉంటుందోనని ప్రశ్నార్థకంగా చెప్పడం జరిగింది.**

ఇస్లామ్‌లో ఎటువంటి మేనరికపు వివాహాలైనా సరే నిషేధించ బడ్డాయి. అరబీలో ఓ రెండు అక్షరాల చిన్ని పదం ఉంది. దాని అర్థం - మేనరికపు వివాహాల వలన పిల్లలు బలహీనంగా పుట్టడం. ఈ భాష అతి పురాతనమైనది. తొలి భాష ఇదేనని కొన్ని విశ్లేషణలు తెలియ జేస్తున్నాయి.

**ఇప్పటి వరకూ చెప్పిన విషయాలు, ఇస్లామ్ వివాహ నియమాలపై ఓ ప్రాథమిక అవగాహన కల్పించడానికి మాత్రమే.**

అయితే పూర్తి వివరాలు ఖుర్'ఆన్‌లో స్పష్టంగా చెప్పబడ్డాయి. ఖుర్'ఆన్‌లో అల్లాహుతాలా చెప్పిన దాని ప్రకారం ఏయే వివాహ సంబంధాలు నిషేధమో వాటి వివరాలు దిగువన ఇస్తున్నాము.

**మీ తండ్రులు వివాహమాడిన స్త్రీలను మీరు వివాహమాడకండి. ఇంతకు పూర్వం జరిగిందేదో జరిగిపోయింది. నిశ్చయంగా, ఇది అసభ్యకరమైనది, జుగుప్సాకరమైనది మరియు చెడుమార్గము.**

**మీకు ఈ స్త్రీలు నిషేధించబడ్డారు : మీ తల్లులు, మీ కుమార్తెలు, మీ సోదరీమణులు, మీ మేనత్తలు, మీ తల్లి సోదరీమణులు, మీ సోదరుల కుమార్తెలు, మీ సోదరీమణుల కుమార్తెలు, మీకు పాలిచ్చిన తల్లులు, మీతోపాటు పాలు త్రాగిన సోదరీమణులు, మీ భార్యల తల్లులు, మీరు సంభోగించిన మీ భార్యల కుమార్తెలు - ఎవరైతే మీ సంరక్షణలో ఉన్నారో! మీరు వారితో సంభోగించకపోతే తప్పులేదు. మీ వెన్ను నుండి పుట్టిన మీ కుమారుల భార్యలు, మరియు ఏకకాలంలో అక్కా చెల్లెల్లను ఇద్దరినీ చేర్చడం నిషిద్ధం. కాని ఇంతకు పూర్వం జరిగిందేదో జరిగిపోయింది. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత** (ఖుర్'ఆన్ 4:22-23)

పై ఆయత్‌లు ముహ్‌ర్రామాత్ (వివాహానికై నిషిద్ధమైన స్త్రీల) గురించి వివరించబడింది. అంటే ఓ పురుషుడు వివాహం చేసుకోదలిస్తే, ఆ స్త్రీ పైన పేర్కొన్న స్త్రీల లోని వ్యక్తి కాకూడదు.

పైన తెలిపిన స్త్రీలలో కొందరు ఎట్టి పరిస్థితులలోనూ వివాహం చేసుకోవడానికి వీలు లేదు. అంటే ఆ కొందరూ శాశ్వతంగా నిషేధించ బడ్డారు. పై స్త్రీలలో మరికొందరు శాశ్వతంగా నిషేధించ బడలేదు. వారు కొన్ని పరిస్థితులలో మాత్రం వివాహానికై ధర్మసమ్మతం అవుతారు. **ఆ వివరాలు :** పైన తెలిపిన స్త్రీలలో 3 రకాల స్త్రీలు మొదటి కేటగిరిలోకి వస్తారు. **శాశ్వతంగా వివాహానికి ధర్మ సమ్మతం కాని వారు ఎవరంటే :** బంధుత్వం ద్వారా, పెంపకం ద్వారా మరియు వివాహ సంబంధం ద్వారా సంబంధాలు కలిగి ఉన్నవారు.

ఇస్లామ్‌కి పూర్వం అరేబియాలో తండ్రి మరణించాక, అతని భార్యను (స్వంత తల్లికాదు) వివాహం చేసుకునేవారు. అది అసభ్యకరమైనది. అటువంటి వివాహాలను ఇస్లామ్ నిషేధించింది. అరేబియాలో జరిగిన ప్రతీ విషయాన్ని ఇస్లామ్‌కి ముడిపెట్టడం అంటే, ప్రజల్ని తప్పుదారి పట్టించడమే. ఈజిప్టు నేడు ముస్లిముల దేశం. కాని దాదాపు 1400 సంవత్సరాల క్రితం అక్కడ ఎన్నో వింత సంస్కృతులు ఆచరణలో ఉండేవి. ఆ వింత ఆచరణలకు ఇస్లామ్‌కి సంబంధం లేదు. అప్పటి రాజులను మరియు అంతకు పూర్వం ఈజిప్టును పాలించిన రాజులను ముస్లిములుగా భావించి, ఆ తప్పుడు భావనలతోనే సినిమాలు తీసే అవివేకులు ఎందరో ఉన్నారు. చరిత్ర గురించి తెలియని వాళ్ళు చారిత్రక విషయాలపై సినిమాలు తీస్తున్నారు. అసలు నిజం తెలియని ప్రజలు వాటిని నమ్ముతున్నారు.

పై ఆయత్‌లో

- **ఉమ్మహాతుకుమ్** (మీ తల్లులు) అంటే తన తండ్రి భార్యలే కాకుండా, అమ్మమ్మలు, నాన్నమ్మలు కూడా. వీరు నిషిద్ధం వివాహానికి.
- **బనాతుకుమ్** (మీ కుమార్తెలు) : అంటే తన స్వంత కుమార్తె మాత్రమే కాకుండా కుమార్తెకు కుమార్తె (మనవరాలు), కుమారుని యొక్క కుమార్తె (మనవరాలు) కూడా. వీరు నిషిద్ధం
- **అఖవాతుకుమ్** (మీ సోదరీమణులు) : తన స్వంత చెల్లెలు వివాహానికి నిషిద్ధం. మరో రెండు రకాల చెల్లెలు ఉన్నారు. వారు కూడా వివాహానికి నిషిద్ధం. 1. అల్లతీ సోదరి (ఇద్దరికీ తండ్రి ఒక్కరే, కాని తల్లులు వేరు) 2. అఖ్యాఫీ సోదరి (తల్లి ఒక్కరే, తండ్రులు వేర్వేరు - అంటే బిడ్డ పుట్టాక భర్త మరణిస్తే, మరొకరిని వివాహం చేసుకోవడం ద్వారా పుట్టిన బిడ్డ). ఈ కేటగిరి గురించి ఇప్పటికే చెప్పుకున్నాం.
- **అమ్మాతుకుమ్** (మీ మేనత్తలు) : తండ్రి యొక్క స్వంత సోదరి. లేదా తండ్రికి సవతి-సోదరి (half-sister)
- **ఖాలాతుకుమ్** (పెద్దమ్మలు / పిన్నమ్మలు) : తన తల్లి యొక్క స్వంత సోదరి లేక సవతి సోదరి (అల్లతీ లేక అఖ్యాఫీ)
- **బనాతుల్ అఖి** (సోదరుని కుమార్తెలు) : సోదరుని స్వంత కుమార్తె (హఖీఖీ), అల్లతీ లేక అఖ్యాఫీ.
- **బనాతుల్ అఖ్‌తి** (సోదరి కుమార్తెలు) : పై విధంగానే స్వంత (హఖీఖీ), సవతి కుమార్తెలు (అల్లతీ లేక అఖ్యాఫీ)
- **ఉమ్మహాతుకుముల్లతీ అర్జానకుమ్** (మీకు పాలిచ్చిన తల్లులు) : స్వంత తల్లులు కాకపోయినా, పాల సంబంధం ద్వారా తల్లి సమానమైన వారు.
- **అఖ్‌వాతికుమ్ మినర్రజా'అహి** (మీతోపాటు పాలుతాగిన సోదరీ మణులు). ఇది కూడా ముందుగా చెప్పుకున్నాం.
- **ఉమ్మహాతు నిసానికుమ్** (మీ భార్యల తల్లులు) : ఇక్కడ కూడా తల్లులు అంటే కేవలం భార్య తల్లి మాత్రమే కాకుండా, భార్య యొక్క అమ్మమ్మలు, నాన్నమ్మలు కూడా.
- **సవతి కుమార్తెలు** (step-daughters) (శారీరకంగా సంబంధం ఉన్న భార్యల యొక్క కుమార్తెలు) : అంటే ఒక స్త్రీతో వివాహబంధం కలిగి మరియు ఆమెతో శారీరకంగా కలిసిన తరువాత, ఆమెకు అప్పటికీ పూర్వపు భర్త ద్వారా కలిగిన కుమార్తెలుంటే, వారు వివాహానికి నిషిద్ధం. ఒకవేళ ఒక స్త్రీని వివాహం చేసుకుని, ఆమెతో శారీరకబంధం ఏర్పడక ముందే ఇద్దరూ వేరైతే, అప్పుడు ఆమె కుమార్తె వివాహానికి నిషిద్ధం కాదు.
- (మీ వెన్ను నుండి పుట్టిన కుమారుల భార్యలు) : కుమారుడు మరణించాక లేదా విడిపోయాక అతని భార్య వివాహానికి నిషిద్ధం. ఇక్కడ కుమారులు అంటే కుమారుని కుమారులు కూడా. ఇక్కడ స్వంత కుమారుడు మాత్రమే, **దత్తపుత్రుడు కాదు.**
- **ఏక కాలంలో అక్కాచెల్లెల్లు ఒకరి వివాహబంధంలో ఉండకూడదు.** ఆమె మరణించాక గాని లేదా ఆమెతో విడిపోయాక గాని, ఆమె సోదరిని వివాహం చేసుకోవచ్చు. అంతేకాకుండా ఏకకాలంలో తన భార్యతోపాటు ఆమె యొక్క పిన్నమ్మ లేదా పెద్దమ్మగాని లేదా మేనత్తగాని తనకు రెండవ భార్యగా ఉండకూడదు. ఉదా: భార్య మరియు ఆమె పిన్నమ్మను ఏక కాలంలో ఇద్దరు భార్యలుగా కలిగి

ఉండకూడదు. అదే విధంగా పెద్దమ్మ లేదా పిన్నమ్మ కూడా రెండవ భార్యగా ఉండకూడదు.

- వేరొకరి వివాహబంధంలో ఉన్న స్త్రీని వివాహం చేసుకోరాదు. తన అధీనంలోకి వచ్చిన బానిస స్త్రీని తప్ప.

ఇప్పటివరకూ వివరించిన స్త్రీలతో వివాహం నిషిద్ధం. వీరు కాకుండా, ఇతర స్త్రీలను వివాహం చేసుకోవచ్చు.

**ఏ వయస్సులో వివాహం జరపాలో మరియు ఎవరితో వివాహం జరపాలో క్రిందటి మరియు ఈ సంచికలో అందించిన సమాచారం స్పష్టం చేసింది.**

**కాబట్టి వివాహానికి సంబంధించి ఎటువంటి సందేహం లేకుండా ప్రతీ విషయాన్ని ఇస్లామ్ అత్యంత స్పష్టంగా చెప్పడం జరిగింది.**

## కాబోయే భర్తకి అప్పటికే ఓ భార్య ఉండి ఉంటే?

అన్ని ధర్మాలలోనూ ఒకరి కంటే ఎక్కువ భార్యలను కలిగి ఉండటం ధర్మసమ్మతమే. అయితే వాటికి ఒక హద్దు అంటూ ఉండేది కాదు. ఇస్లామ్‌కి పూర్వం అజ్ఞానకాలంలో ఒక్కొక్కరు చాలామంది భార్యలను కలిగి ఉండేవారు.

భార్యల సంఖ్య విషయంలో ఇస్లామ్ ఒక స్పష్టమైన హద్దు పెట్టింది. **ఒక పురుషునికి కనీసం ఒక్క భార్య ఉండాలి.** లేదా ఇద్దరు ఉండవచ్చు, ముగ్గురైనా ఫర్వాలేదు. కాని నలుగురిని మించకూడదు. శారీరక / మానసిక సమస్యల వలన తప్ప బ్రహ్మచారిగా ఉండటాన్ని ఇస్లామ్ అనుమతి నివ్వలేదు.

ఈ విషయంలో అల్లాహుతాలా ఖుర్‌ఆన్‌లో ఏమి చెప్పారో చూడండి:

> **"మరియు అనాథ బాలికలకు న్యాయం చేయలేమనే భయం మీకు ఉంటే, మీకు నచ్చిన స్త్రీలను ఇద్దరిని గానీ, ముగ్గురిని గానీ, నలుగురిని గానీ వివాహం చేసుకోండి. అయితే వీరితో న్యాయంగా వ్యవహరించ లేమనే భయం మీకు ఉంటే, ఒకామెను మాత్రమే లేదా మీ స్వాధీనంలో నున్న వారిని తీసుకోండి. ఒకే వైపునకు మొగ్గకుండా. ఇదే సముచితమైన మార్గం."** (ఖుర్‌ఆన్ 4:3)

ఇక్కడ అనాథ బాలికల ప్రస్తావన రావడానికి కారణం, ఈ ఆయత్‌కు ముందు వారి గురించి చెప్పడం జరిగింది. అది ఈ ఆయత్‌లోనూ కొనసాగింది. ఖుర్‌ఆన్ గ్రంథం అన్ని కాలాలకు, అన్ని ప్రాంతాల కొరకు అవతరించింది. కాబట్టి ఒకే చోట ఎన్నో విషయాలను స్పష్టం చేస్తుంది. అయితే కొందరు ఆ పరిస్థితులను వక్రీకరించి, తప్పుడు భావనను ప్రజలలో కలుగజేశారు. కొందరు అజ్ఞానంతో చేస్తే, మరికొందరు కపట విశ్వాసంతో చేయడం జరిగింది. కొందరి మత దురభిమానం కూడా వీరికి సాయపడింది.

పై ఆయత్ ద్వారా స్పష్టంగా తెలిసేది ఏమిటంటే, ఒక పురుషునికి ఒకరి కంటే ఎక్కువ భార్యలుండవచ్చు. కాని వారందరికీ న్యాయం చేయాలి. ఒకవేళ అలా చేయలేమనే భయం ఉంటే ఒకామెను మాత్రమే చేసుకోవాలి. **ఈ విధంగా ఒక్క భార్య మాత్రమే ఉండాలని చెప్పిన ధర్మం కూడా ఇస్లామ్ మాత్రమే.**

ప్రతీ ఒక్కరికి నలుగురు భార్యలు ఉండవలసిన అవసరం లేదు. తప్పనిసరి అసలు కాదు. కేవలం ఇద్దరు భార్యలే ఉన్నప్పటికీ, వారిద్దరికీ న్యాయం చేయడం కూడా అందరికీ సాధ్యం కాదు.

## ఒక్క భార్య చాలదా?

ఈ విషయంపై చర్చించే ముందు రెండు హదీస్‌లను పరిశీలిద్దాం. క్రింది రెండు హదీసులను చదవండి.

### ఒకే భార్యను కలిగి ఉంటే

"ఒక మోమిన్ (విశ్వాసి) మోమినా (విశ్వాసురాలు) అయిన తన భార్యను అసహ్యించుకోకూడదు. ఆమెలోని ఏదయినా ఒక గుణం తనకు నచ్చక పోయినా ఎన్నో ఇతర గుణాలు తనకు ఇష్టం కావచ్చు" అని ముహమ్మద్(స) చెప్పారు. **(సహీహ్ ముస్లిమ్, హదీస్ నెం. 3645, అధ్యాయం 17, పుస్తకం 17, సంపుటి 4)**

### ఒకరి కంటే ఎక్కువ భార్యలుంటే

"ఎవరికైనా ఇద్దరు భార్యలుండి, అతడు వారి హక్కుల్ని న్యాయంగా, సమానంగా, సమంజసంగా నిర్వర్తించకపోతే, తీర్పు దినాన అతని సగదేహం వాలిపోతుంది." అని మహాప్రవక్త(స) చెప్పినట్లు అబూహురైరా ఉల్లేఖించారు. (తిర్మిజీ 1141, నసాయీ 3394, అబూదావూద్ 2133)

ఒకటీ, రెండు చిన్న చిన్న నచ్చని లక్షణాలు భార్యలు కలిగి ఉన్నా సరే, ముహమ్మద్(స) వారు, తన భార్యలను చాలా ప్రేమగా చూసుకున్నారు.

పైన తెలిపిన రెండవ హదీసు ప్రకారం 'భార్యల మధ్య హక్కుల్ని న్యాయంగా, సమానంగా, సమంజసంగా నిర్వర్తించాలి'. ప్రతీ భార్యకి తన భర్తపై అల్లాహ్ కలుగజేసిన హక్కు ఉంటుంది.

**సమానంగా చూడాలి అనగానే, సాధారణంగా భావాన్ని వదిలేసి, కొందరు మరో విధంగా ఆలోచించే అవకాశం కూడా ఉంది.**

ఉదాహరణకు 'ఒక భార్య ఇంటికి ఒక కేజీ కూరను భర్త తీసుకెళ్లాడనుకోండి. రెండవ భార్య ఇంటికి కూడా ఒక కేజీ కూరనే తీసుకెళ్లాలని, పది గ్రాములు అటూ, ఇటూ కాకుండా ఖచ్చితంగా ఉండాలని, అప్పుడు మాత్రమే వారిద్దరినీ సమానంగా చూసినట్లని ఆలోచించడం' సరి కాదు. రెండవ భార్యకి పిల్లలెక్కువుంటే ఎక్కువ కూర అవసరమవుతుంది కదా!

కాబట్టి సమానంగా చూడటమంటే ఇది కాదు.

అలాగే **భార్యలలో ఒక భార్యపై ఎక్కువ ప్రేమ ఉండటం కూడా తప్పు కాదు. అది మిగతా భార్యలకు అన్యాయం చేయడం అని ఎంతమాత్రం భావించకూడదు. అది మనస్సుకు సంబంధించింది. మన అధీనంలో ఉండని విషయమది.**

అది ఎలాగంటే, తల్లిదండ్రులు తమ పిల్లలందరికీ ఒకేరకమైన సౌకర్యాలను కల్పించి ఒకేలా చూసినా సరే, అందులో ఒక బిడ్డ బాగా చదువుకుంటూ, సభ్యతా సంస్కారాలతో, వినయ విధేయతలలో అందరినీ మించితే, ఆ బిడ్డపై సాధారణంగా తల్లిదండ్రులకు ప్రేమ ఎక్కువగా ఉంటుంది. దీని అర్థం వారు మిగతా పిల్లలకు అన్యాయం చేస్తున్నట్లు ఎంతమాత్రం భావించ కూడదు.

ఈ విధంగా తన అధీనంలో లేని విషయాల గురించి మానవోత్తముడు అల్లాహ్‌ను వేడుకునేవారు. ఆయిషా(రజి)వారి ఉల్లేఖనాన్ని బట్టి తెలిసేది ఏమిటంటే, భార్యలనందరినీ ఆయన(స) ప్రేమగా చూసుకునేవారు, పక్షపాతం చూపించకుండా న్యాయంగా వ్యవహరించేవారు. అయినప్పటికీ ఆయన ఇలా వేడుకున్నారు :

**"ప్రభూ! నా అధీనంలో ఉన్న విషయమై నేను నీ ఆదేశాలను ఉల్లంఘించను. కాని నా అధీనంలో లేని విషయమై నన్ను నిందించవద్దు"** (అబూదావూద్, సహీహ్ హదీస్ నెం. 2134)

ముహమ్మద్(స)వారికి 25 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, ఖదీజా(రజి)వారితో వివాహం జరిగింది. అప్పటికే ఆమె రెండు సార్లు వైధవ్యం పొందారు. ఆమె వయస్సు అప్పటికి 40 సంవత్సరాలు. ఆమెతో 25 సంవత్సరాలు కాపురం చేశారు. అంటే ఆమె మరణించే సమయానికి ఆమె వయస్సు దాదాపు 65 సంవత్సరాలు.

ఆమె మరణం అనంతరం మాత్రమే సౌదా(రజి)వారిని వివాహం చేసుకున్నారు. ఆమె విధవరాలు మాత్రమే కాకుండా వయస్సు పైబడిన మహిళ. ముహమ్మద్(స)వారి కుమార్తెల బాధ్యత ఆమె తీసుకున్నారు. హిజ్రీ శకం 2వ సంవత్సరంలో ఆయిషా(రజి)వారు ముహమ్మద్(స)తో కాపురానికి వచ్చారు. అంటే ఆయిషా(రజి)వారు కాపురానికి రాక పూర్వం, అంటే 54 సంవత్సరాల వరకూ ఆయనకు ఏక కాలంలో ఇద్దరు భార్యలు లేరు. ముహమ్మద్(స)వారు 63 సంవత్సరాలు జీవించారు. ఇతర వివాహాలు ఆఖరి 9 సంవత్సరాలలోనే జరిగాయి. వాటి వెనుక ముస్లిమ్ సమాజానికి గొప్ప మేలు ఉంది. ఆ విషయాలు "మాచే ప్రచురించబడిన ముహమ్మద్(స)వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారం" పుస్తకంలో వివరించాము.

ముహమ్మద్(స)వారు ఒక విధవరాలిని మరియు తనకంటే వయస్సులో పెద్దవారైన స్త్రీని చేసుకున్నారు గనుక, నేడు ఏ ముస్లిమ్ పురుషుడైనా అదే విధంగా చేస్తే అది ప్రవక్త(స)వారి సంప్రదాయం (సున్నత్) అవుతుంది. 54 సంవత్సరాల వరకూ ఆయన ఏక కాలంలో ఒకే భార్యతో కాపురం చేసారు. కనుక అదే విధంగా కలిగి ఉండటం కూడా సున్నతే కదా!

**మూర్ఖపు వాదనలు :**

కొందరు వ్యామోహంతో రెండేసి, మూడేసి వివాహాలు చేసుకుని, ఇస్లామ్ ఆదేశాన్ని పాటించడానికేనని నమ్మబలుకు తున్నారు. సున్నత్ కోసం చేసుకున్నామని చెబుతున్నారు. అల్లాహ్ సర్వం వినేవాడూ, సర్వం చూసేవాడూ. వీరి సంకల్పం ఏమిటో ఆయనకు బాగా తెలుసు. తప్పనిసరిగా ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండమని, అల్లాహుతాలా ఆదేశించలేదు. మరియు ముహమ్మద్(స)వారు ఆదేశించలేదు. నేడు ధర్మప్రచారకులమని చెప్పుకునే డబ్బా బృందంలో చాలామంది రెండవ భార్య కోసం తహ తహ లాడుతున్నారు. ఒకరు సంసారం చేయడానికట, మరొకరు దావాకు అవసరమట. ఇటీవల కాలంలో అటువంటి దాయీని చితక్కొట్టి, పోలీస్ స్టేషన్‌కి అప్పగించారు ఓ జమాత్ నాయకుడు.

వివాహం చాలా గొప్ప మేలు కోసం ఏర్పాటు చేయబడింది. అది కేవలం కోరికలు తీర్చుకోవడానికి మాత్రమే ఉద్దేశించబడింది కాదు.

**వివాహ వ్యవస్థలో స్త్రీకి అన్యాయం జరగకుండా ఇస్లామ్ ఏర్పరిచిన ఎన్నో ముఖ్య విషయాలను స్పష్టంగానూ మరియు సవివరంగానూ ఇన్షా అల్లాహ్ ఇదే శీర్షికలో రాబోయే వ్యాసాలలో అందిస్తాము.**


ఏ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశ్యం మాకు లేదు. అన్ని ధర్మాలను గౌరవిస్తున్నాం

టెర్రరిజం

- క్రైస్తవ టెర్రరిజం ?
- సిక్కు టెర్రరిజం ?
- యూదు టెర్రరిజం ?
- కమ్యూనిస్ట్ టెర్రరిజం ?
- హిందూ టెర్రరిజం ?
- ఇస్లామిక్ టెర్రరిజం ?

తీవ్రవాదానికి, మత ధర్మానికి ఏ విధమైన సంబంధం లేదు. ✓

టెర్రరిజం అనేది ముస్లిములకే స్వంతమన్నట్లు, మీడియా ఎందుకు ముస్లిములనే టార్గెట్‌గా పెట్టుకుంది?

**టెర్రరిజం అనే ఒక శీర్షికను ఆగష్టు, 2009 సంచికతో ప్రారంభించి 2 సంవత్సరాల పాటు కొనసాగించాము.**

- **శతాబ్దాలుగా తీవ్రవాద దాడులు చేసింది ఎవరు? (వారిలో ముస్లిములు లేరు)**
- **రష్యా సేనలు ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమించిన తరువాత అల్-ఖైదా అనే సంస్థను అమెరికా గూఢచారి సంస్థ ఏర్పాటు చేసింది. అల్-ఖైదా పేరును అడ్డంగా పెట్టి ముస్లిములను టెర్రరిస్టులుగా ప్రపంచ ప్రజల చేత నమ్మించడానికి గత 20 సంవత్సరాల నుండి అమెరికా చేయని ప్రయత్నం అంటూ ఏదీ లేదు.**
- **బిన్ లాడెన్ ట్విన్ టవర్స్ కూల్చాడని అమెరికా F.B.I. వారి దగ్గర సాక్ష్యం లేదు.**
- **బిన్ లాడెన్ టవర్స్ కూలిన 3 నెలలకే అనారోగ్యంతో చనిపోయినట్లు ది గార్డియన్ అనే పత్రికిచ్చిన సమాచారం ద్వారా తెలుస్తుంది.**
- **ట్విన్ టవర్స్‌ను అమెరికాయే కూల్చించి, ఆ పాపాన్ని ముస్లిములపై నెట్టివేసిందని చెప్పడానికి బలమైన సాక్ష్యాలు ఎన్నో ఉన్నాయి.**
- **ఇస్లామ్ 100% శాంతిని నెలకొల్పే ధర్మం. తీవ్రవాద దాడుల వంటి దాడులను ఖండిస్తుందేగాని వాటిని ప్రోత్సహించదు. ఆసక్తికరమైన ఆధారాలతో ఎన్నో వ్యాసాలు అందించాము.**

**కొత్తగా చేరిన చందాదారులకు ఈ వ్యాసాలున్న పుస్తకాలు కావాలంటే రు. 380/- M.O. చేయండి. లేదా మా వెబ్‌సైట్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని చదువుకోవచ్చు. టెర్రరిజంపై ప్రత్యేక పుస్తకం ఇన్షా అల్లాహ్ త్వరలో ...**

# ధర్మ సందేశ ప్రచారం

## ఖుర్'ఆన్ మరియు సున్నత్ తెలుగులో

దావా (దావత్ - అల్లాహ్ మార్గంవైపు పిలవడాన్ని) జీవనోపాధిగా చేసుకో కూడదని, వ్యాపారంగా చేసుకో కూడదని, 'దాయి'గా పిలుపించుకోవడం కంటే 'ముస్లిమ్'గా పిలుపించుకోవడం ఉత్తమమని, దావా అనేది ప్రతి ముస్లిమ్ యొక్క బాధ్యత అని, ఆ బాధ్యతను ప్రవక్త(స)వారు సూచించిన సౌమ్యమైన విధానంలో, మంచి కారెక్టర్‌తో చేయవలసి ఉంది అని ఈ శీర్షికలో అందించిన తొలి 6 వ్యాసాలలో తెలియజేశాము. అవి మా వ్యక్తిగత అభిప్రాయాలు ఎంతమాత్రం కావు. **ప్రతీ విషయానికి ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను ఆధారంగా చూపాము.** మనకు ఖాళీ లేదని, డబ్బిచ్చి ఎవరిచేతో మన సలాత్(నమాజ్)ను చేయించుకుంటే, అది మన ఆరాధన ఏవిధంగా కాదో, అదేవిధంగా ఎవరికో డబ్బు ఇచ్చి మన తరపున అల్లాహ్ మార్గంవైపు పిలవమని చెప్పడం కూడా, మనం పిలిచినట్లు కాదని సోదరులు అర్థం చేసుకున్నారు. తులనాత్మక అధ్యయనాలు మరియు ఇతర గ్రంథాలతో దావా చేయడం వంటి ఇస్లామ్ వ్యతిరేక కార్యక్రమాల గురించి కూడా స్పష్టంగా తెలియజేయబడింది.

**కాఫిర్** ☑ **ముష్రిక్** ☑ **మోమిన్** ☑ **మునాఫిఖ్** ☑ **ఆలిమ్** ☑ **అమీర్** ☑ జకాత్ ☐

# జకాత్

(ONE OF THE FIVE PILLARS OF ISLAM)

ధనవంతుడు తప్పనిసరిగా పేదవారికి చెల్లించవలసిన పన్ను

*అల్లాహ్ మార్గం వైపు పిలిచే ప్రతీ ముస్లిమ్ ముందుగా కొన్ని అరబీ పదాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. లేకపోతే ఎదుటివారి మనస్సు గాయపడే అవకాశముంది. అంతేకాకుండా, ఎవరెవరితో అల్లాహ్ ఏ విధంగా ప్రవర్తించమన్నారో ముందుగా తెలుసుకుంటే మన బాధ్యతను సక్రమమైన పద్ధతిలో నిర్వర్తించ గలుగుతాము. అందుకే కొన్ని ముఖ్య పదాలను ఒక దాని తరువాత ఒకటిగా ఈ శీర్షికలో ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.*

ఈ శీర్షిక 'శాంతిబాట' 3వ సంచిక నుండి ప్రారంభమై ఇప్పటికి 11 వ్యాసాలను పూర్తి చేసుకుంది. 'దావా' పేరుతో జరుగుతున్న మోసాలను, వ్యాపారాలను ఖుర్'ఆన్ మరియు హదీస్‌ల వెలుగులో అల్లాహ్ దయవలన స్పష్టంగా ప్రజలకు తెలియజేయగలిగాము. మొదట్లో కొంత వ్యతిరేకత కనబరచినప్పటికీ, **ప్రజలు ఆలోచించడం మొదలు పెట్టారు.** దక్షిణాది రాష్ట్రాలలో మరియు కొన్ని దేశాలలో ఇటీవల కాలంలో ఈ 'దావా' కార్యక్రమాలపై వ్యతిరేకత మొదలైంది. ఇది **బిద్'అత్** అని సమాజం అర్థం చేసుకునే సరికి **చాలా సమయం గడచిపోయింది.**

ఇప్పటికే ముస్లిమ్ సమాజం తీవ్రంగా నష్టపోయింది. ఇప్పటికైనా జాగ్రత్త పడితే, నష్టనివారణ చర్యలు చేపడితే, ముస్లిమ్ సమాజానికి అవమానం తప్పే అవకాశం ఉంది. 'దావత్'కి సంబంధించి ఇంతవరకూ ప్రచురించ బడిన వ్యాసాలను మా వెబ్‌సైట్ www.saanthibaata.net నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

'దావత్' అనేది ప్రతీ ముస్లిమ్‌పైనున్న తప్పనిసరి బాధ్యత. మనపై సలాత్ (నమాజ్) ఎలా ఫర్జ్‌గా ఉందో, దావత్ కూడా మనపై అదే విధంగా ఫర్జ్‌గానే ఉంది. 'దావత్' ప్రారంభించడానికి ముందుగా మన నడవడికను పరిశుద్ధం చేసుకోవాలి, ఏ విధంగా సలాత్‌కు ముందు నీటితో వుజూ చేసుకుని అవయవాలను శుభ్రం చేసుకుంటున్నామో అదే విధంగా. నడవడిక పరిశుద్ధం కావాలంటే అబద్ధాలు చెప్పడం మానివేయాలి, సౌమ్యంగా మాట్లాడాలి, తోటివారికి హాని కలిగించేవాటిని తొలగించాలి. శక్తిమేర తోటివారికి సహాయ సహకారాలు అందించాలి. చిరునవ్వుతో పలకరించాలి. ఉత్తమ నడవడికకు సంబంధించి, ఇటువంటి ఎన్నో లక్షణాలను హదీస్ గ్రంథాల నుండి తెలుసుకోవచ్చు. **మనం ఇస్లామ్ ప్రకారం జీవించే ప్రతీ క్షణం, మనం దావా చేస్తున్నట్లే!**

ముహమ్మద్(స)వారు సందేశ ప్రచారాన్ని ప్రారంభించే సరికి అక్కడి సమాజంలోని ప్రజలు ఆయన(స) గురించి అత్యంత సౌమ్యుడు అని, నిజాయితీపరుడని, నమ్మకస్తుడని, మంచివాడని ... ప్రశంసించేవారు. కాబట్టి ధర్మ సందేశ ప్రచారం చేయాలనుకునే ప్రతీ ముస్లిమ్ మొట్ట మొదట ముహమ్మద్(స)వారి ఉత్తమ నడవడికను ఆదర్శంగా తీసుకోవాలి.

**ఈ సంచికలో అందిస్తున్న పదం 'జకాత్'.** ఖుర్'ఆన్, సున్నత్ మరియు సన్మార్గం పొందిన ఖలీఫాలను అనుసరించమని ముహమ్మద్(స)వారు బోధించారు. **ఆయన మరణానంతరం సహాబాలు, ముస్లిమ్ ప్రజలు ఆ విధంగానే అనుసరించారు.**

**జకాత్ అంటే ...**

భాషాపరంగా జకాత్ అంటే పెరుగుదల లేక శుద్ధి గావించడం (శుభ్రపరచడం) అని అర్థం. జకాత్ మన ఐశ్వర్యాన్ని శుద్ధి చేస్తుంది. ఒక నిర్ణీతమైన పరిమాణం (నిసాబ్) కంటే ఎవరి ఐశ్వర్యం ఎక్కువగా ఉంటుందో, వారు తప్పనిసరిగా జకాత్ చెల్లించాలి.

**అతి ముఖ్యమైన ఇస్లామీయ మూలస్తంభమైన జకాత్‌ని సమూలంగా నాశనం చేయాలని ఎందరో ప్రయత్నిస్తున్నారు. 'జకాత్' గురించి ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స)వారు బోధించిన విషయాలను వక్రీకరించి, జకాత్ ఎవరికైతే చేరాలో వారికి చేరకుండా చేస్తున్నారు.**

**ఎవరు వీళ్ళు? వీరేమైనా ఇస్లామ్‌కి శతృవులా? మరి ఎందుకు ఇలా చేస్తున్నారు?**

మంచిని బోధించడం మరియు చెడును నిరోధించడం ప్రతీ ముస్లిమ్‌పై అల్లాహ్ ఉంచిన బాధ్యత. మరి ప్రపంచంలో 150 కోట్లకు పైగా ఉన్న ముస్లిములు, **ఈ చెడును ఎందుకు ఆపలేకపోతున్నారు?**

కారణం ఏమిటంటే, వారికి జకాత్ గురించి స్పష్టంగా తెలియదని చెప్పాలి. **ఇది ఎంత హాస్యాస్పదం!** ధర్మాన్ని ఆచరణలో పెట్టక పోవచ్చేమోగాని, తమను తాము ముస్లిమ్‌లుగా భావించుకునేవారు కనీసం ఇస్లామ్ మూలస్తంభాల గురించి కూడా తెలుసుకోకపోవడం, **ఘోరమైన నిర్లక్ష్యంకాక మరేమిటి?**

సరే! ప్రజలు నిర్లక్ష్యం చేశారనుకుందాము. మస్‌జిద్‌లలో ఖుత్బాలు ఇచ్చే **ఇమామ్‌లు ఏమి చేస్తున్నారు?** సంవత్సరంలో 52 శుక్రవారాలు వస్తాయి. వాటిలోని కనీసం 2 శుక్రవారాలైనా జకాత్ గురించి వాస్తవాన్ని చెప్పలేరా?

ఇమామ్‌లు చెప్పలేదు సరే, **ఆలిమ్ కోర్సులు చదువుకున్నవారు జకాత్ గురించి నిజం ఎందుకు చెప్పడం లేదు?** విద్వాంసుల నిర్వాకం ఎలా ఉందంటే కంచే చేనుమేస్తుంది అన్నట్లుంది. పొలంలోకి జంతువులు వచ్చి తినేయకుండా ఆపడానికి, ఆ పొలం చుట్టూ రక్షణగా కంచె వేస్తారు. పొలంలోకి జంతువులు రాకుండా ఆ కంచె పొలాన్ని కాపాడుతుంది. కాని రక్షణగా ఏర్పాటుచేసిన ఆ **కంచే స్వయంగా పొలాన్ని మేసేస్తే రైతు ఏం చేయగలడు?**

ఆలిమ్ కోర్సు పూర్తిచేసిన ఎక్కువ మందిలో అవినీతి చోటు చేసుకుంది. వారు కూడా మదరసాల కోసమనిగాని, మరో రూపంలోగాని, పేదవారి హక్కు అయిన 'జకాత్'ను దోచు కుంటున్నారు. **పుట్టగొడుగుల్లా ఎన్నో దావా సంస్థలు మొదలయ్యాయి. అజ్ఞాన దాయీలు ఎందరో తయారయ్యారు.** కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. కోట్ల రూపాయలు బయట నుండి అందుతున్నాయి. అయినప్పటికీ పేదవాని పరిస్థితి మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది.

**అల్లాహ్ యొక్క ఆదేశాన్ని అపహాస్యం చేస్తున్నారు**

అల్లాహుతాలా ఖుర్'ఆన్‌లో స్పష్టంగా 8 రకాల వ్యక్తుల గురించి చెప్పడం జరిగింది. వారికి మాత్రమే జకాత్ ఇవ్వవలసి ఉంది. కాని దురదృష్టవశాత్తూ, అల్లాహ్ ఆదేశించిన వారికి తప్ప మిగతావారికే ఎక్కువగా జకాత్ చేరుతుంది. **అంటే అది పూర్తిగా వ్యతిరేకం.** అంటే అల్లాహ్ ఆదేశాన్ని ఇంత బహిరంగంగా అపహాస్యం చేస్తున్నారా?

**ఆలిమ్ కోర్సు చదివిన వారందరూ అవినీతిపరులు కాదు.** వారిలో కనీసం ఒక్క నిజాయితీ పరుడైనా బహిరంగంగా ఈ ఘోర తప్పిదాన్ని ఖండించడం జరిగిందా? మాకు అందిన సమాచారం మేరకు, **ఇండియాలో లక్షల సంఖ్యలో ఆలిమ్ కోర్సు చదివినవారు ఉన్నారు.** వీరిలో ఒక్క నిజాయితీగల విద్వాంసుడైనా సరే, ఖుర్'ఆన్ చెప్పిన సత్యాన్ని బహిరంగంగా చెప్పడానికి ఎందుకు భయపడు తున్నాడు? అల్లాహ్‌కు భయపడవలసిన విద్వాంసుడు ఇతర మానవులకి భయపడు తున్నాడంటే, జ్ఞానం ఉండి కూడా ఇతను షిర్క్ చేసేవారికి సమానం కావడం లేదా?

**ఆరాధింపబడటానికి హక్కు కలిగి ఉన్నది కేవలం అల్లాహ్ మాత్రమే. సృష్టిరాశుల నుండి భయాన్ని పొందటానికి కూడా హక్కు కలిగి ఉన్నది కేవలం అల్లాహ్ మాత్రమే.**

జకాత్ విషయంలో ప్రజలను మోసం చేస్తున్న దాయీలు మరియు అవినీతి ఆలిమ్‌ల బండారం 2010 సంవత్సరం రమదాన్ నెలలో 'శాంతిబాట' పూర్తి ఆధారాలతో బయటపెట్టింది.

ఇక అక్కడినుండి 'శాంతిబాట' పత్రికను మూయించడం కోసం రకరకాల ఎత్తులు వేస్తూనే ఉన్నారు. 'శాంతిబాట' ఎవరో కొందరి ప్రతిభ వలన నడిచే పత్రిక కాదు. కేవలం అల్లాహ్ అనుగ్రహంతో మాత్రమే నడిచే పత్రిక కావడంతో, దీనిని ఆపడం వారికి సాధ్యం కాలేదు.

ప్రజలకు సత్యం చేరింది. దాయీల మరియు ఆలిమ్‌ల జేబులకు కొంతమేర చిల్లుపడింది. అయితే జమాత్‌ల నాయకులు, సత్యం పక్షాన నిలబడకుండా అవినీతిపరులకు దన్నుగా ఉండటంతో, ప్రజలు ఇప్పటికీ మోసగించబడుతూనే ఉన్నారు.

## పంటలపై జకాత్

పంటలపై జకాత్ ఇస్తున్నారా? పంటలపై జకాత్ ఇవ్వకుండా కరువులు వచ్చాయని మరియు వరదలు వచ్చాయని **ఎందుకు బాధ పడతారు?** కాని పంటపై జకాత్ ఇచ్చిన ఓ రైతు పట్ల అల్లాహ్ ఏ విధంగా అనుగ్రహం పంపారో ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో అందిస్తాము. ఏయే పంటలపై ఎంత జకాత్ చెల్లించాలో 2010, 2011 రమదాన్ ప్రత్యేక సంచికలలో వివరించాము.

ఈ సంచికలో ఉమర్(రజి)వారు ఖలీఫాగా ఉన్న కాలంలో జకాత్ ఏ విధంగా సేకరించ బడిందో మరియు ఏ విధంగా పేదలకు జకాత్ సొమ్ము ఖర్చు చేయబడిందో వివరిస్తున్నాము.

## మూల స్తంభాలు - 5

ఇస్లామ్ యొక్క మూలస్తంభాలు - ఐదు. అవి 1. ఈమాన్ 2. సలాత్ 3. జకాత్ 4. సౌమ్ (రోజా) 5. హజ్జ్. ఈ ఐదింటిలో ఒక్క హజ్జ్ మాత్రమే మక్కాకు సంబంధించినది. మిగతా 4 విషయాలకు ప్రాంతాలతో సంబంధం లేదు. అయితే ఈ నాలుగింటిలోని 3 విషయాలలో వివిధ జమాత్‌ల మధ్య **అతి స్వల్పమైన బేధాలున్నాయి.** కాని బేధాలు స్వల్పమే అయినప్పటికీ తీవ్రంగా ఘర్షణ పడతారు. అన్ని జమాత్‌లచే ఎటువంటి బేధం చూపబడని విషయం ఒకే ఒక్కటి ఉంది. అదే 'జకాత్'.

**'జకాత్' విషయంలో మాత్రం వివిధ జమాత్‌ల మధ్య విబేధాలు ఎందుకు లేవు? అందులో మాత్రం ముస్లిములు ఐక్యత ఎలా సాధించ గలిగారు?**

'జకాత్'అనేది ధనవంతుల దగ్గర వసూలు చేసి, పేదవారికి పంచ బడేది. అంటే డబ్బు వసూలు మరియు పంపకం. **అదీ అసలు విషయం.** డబ్బు అంటే ఉన్న ఎనలేని ప్రేమతో అన్ని విషయాలలోనూ స్వల్పమైన బేధాలకే ఘర్షణ పడే వివిధ జమాత్‌లకు చెందిన విద్వాంసులు మాత్రం ఈ ఒక్క విషయంలో మాత్రం ఏకాభిప్రాయంలోనే ఉంటారు.

ఈ ఏకాభిప్రాయం దేనిలో అంటే - **ఖుర్'ఆన్‌లో అల్లాహ్ ఏ ఆదేశాన్ని అయితే స్పష్టంగా చెప్పారో, ఆ ఆదేశాన్ని వ్యతిరేకించడంలో** వీరందరూ ఐక్యంగా పనిచేస్తున్నారు. 'జకాత్' పేరుతో పేదలకు అందవలసిన సొమ్ము కొన్ని దశాబ్దాలుగా దోపిడీకి గురిఅవుతూ ఉంది. **ఖుర్'ఆన్‌లో అతి స్పష్టంగా ఉన్న అల్లాహ్ యొక్క ఆదేశం సామాన్య ప్రజలకు ఎందుకు అర్థం కాలేదు?** ఎందుకంటే ఖుర్'ఆన్‌ను ప్రజలు అర్థం చేసుకుంటూ చదవడం లేదు. వారికి తీరిక లేదట. ఒకవేళ ఎప్పుడైనా సరే వారికి తీరిక దొరికితే, ప్రోగ్రామ్‌ల పేరుతో వారిని విద్వాంసులు తమ దగ్గరకు రప్పించుకుని బ్రెయిన్ వాష్ చేసేస్తున్నారు. **ఒకే అబద్ధాన్ని 10 సార్లు చెబితే దానిని నిజమని ప్రజలు నమ్మేస్తారని భావిస్తున్నారు.**

శాంతిబాట చదివాక ప్రజలు విద్వాంసులను చాలాచోట్ల నిలదీసి అడిగారు. జకాత్ విషయంలో మరియు దావా విషయంలో ఇంతకాలం నిజాన్ని కప్పిపుచ్చి ఎందుకు మోసం చేసారని అడిగారు. **ఫలితంగా విద్వాంసులంతా ఒక్కటయ్యారు.** ఒక్కటైతే మాత్రం ఏం చేయగలరు? మీరంతా వారిని నిలదీయండి. అసత్యాలను, కల్పితాలను చెప్పడానికి ఇక ముందు వారు తీవ్రంగా భయపడాలి.

### జకాత్ - సమాజంలోని ప్రజలందరిపై ఉన్న ఒక ఉమ్మడి బాధ్యత

ఇస్లామ్ యొక్క ఐదు మూల స్తంభాలలో, జకాత్ మాత్రం ప్రత్యక్షంగా **సామాజిక అంశాలపై** కేంద్రీకరించబడింది. వాస్తవానికి ఇది ఇస్లామ్‌లో అవతరించబడిన **తొలి దివ్య శాసనం.**

జకాత్ వ్యవస్థ ద్వారా ధనవంతుల నుండి ఐశ్వర్యం తీసుకో బడుతుంది మరియు పేదవారికి పంచబడుతుంది. అయితే ఈ జకాత్ పంటలపై ఒక రకమైన శాతాన్ని, బంగారం మరియు వెండి, నగదుపై మరో రకమైన శాతాన్ని కలిగి ఉంది. వ్యాపార సామాగ్రి, పశువులపై కూడా జకాత్ చెల్లించాలి.

### పేదవారికి మరియు ధనవంతులకి మధ్య ప్రేమను నెలకొల్పే ఓ వ్యవస్థ

సమాజంలోని ప్రజలపై ఓ ఉమ్మడి బాధ్యతగా ఏర్పాటైన వ్యవస్థగా జకాత్ శాసనం గావించబడింది. **ఇది ఒక సాంఘిక సంక్షేమ వ్యవస్థ.** ఒక విధంగా social security scheme అనవచ్చు. సమాజంలో పేద మరియు ధనవంతుల మధ్య ప్రేమను నెలకొల్పే విధంగా శాసనం గావించబడిన ఓ వ్యవస్థగా జకాత్‌ను మనం తెలుసుకోవాలి. అల్లాహుతాలా కొంతమందికి సంపదలు ఇచ్చి పరీక్షిస్తాడు. మరికొందరికి పేదరికాన్ని ఇచ్చి పరీక్షిస్తాడు. జకాత్‌లో కారుణ్యం ఉంది.

**రెండవ ఖలీఫా ఉమర్(రజి)వారు** ముహమ్మద్(స) వారి మరియు అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారి **అడుగుజాడల్లోనే నడిచారు.**

'జకాత్' సంస్థను స్థాపించారు. జకాత్‌ను సేకరించడానికి మనుష్యులను పంపారు. అంతేకాకుండా జకాత్ ఇచ్చేవారి పట్ల ఎంతో న్యాయంగా వ్యవహరించమని సిబ్బందికి సూచనలిచ్చారు.

ఒకసారి జకాత్ సేకరించిన ఓ వ్యక్తిని ఆయన మందలించారు. ఎందుకంటే అతడు అసాధారణమైన ఓ గొఱ్ఱెను జకాత్‌గా తీసుకు వచ్చాడు. అది సాధారణ గొఱ్ఱెల కంటే ఎక్కువ పాలివ్వగలదు. ఉమర్(రజి)వారు అతనితో అన్నారు : **"దాని యజమానులు దానిని మనస్ఫూర్తిగా ఇచ్చి ఉండరు. ప్రజలను పురికొల్పవద్దు"** (అంటే భవిష్యత్తులో వారు జకాత్‌ను ఎగ్గొట్టే ఆలోచనలు చేయవచ్చు)

### అవసరంలేని వాటిపై కూడా జకాత్ చెల్లిస్తామని ప్రజలు చేసిన విజ్ఞప్తి

ఒక సందర్భంలో సిరియా మరియు దాని పరిసర ప్రాంతాల నుండి ఓ ప్రజా సమూహం ఉమర్(రజి)వారి దగ్గరకు వచ్చి చెప్పారు, "మేము కొంత ఐశ్వర్యాన్ని పొందాము, ప్రత్యేకంగా చెప్పాలంటే, మేము కొన్ని గుఱ్ఱాలను మరియు బానిసలను పొందాము. మరియు మేము వాటిపై జకాత్ చెల్లించాలని అనుకుంటున్నాము. మరియు ఆ విధంగా వాటిపై మా యాజమాన్యాన్ని పరిశుద్ధి పరచుకోవాలని అనుకుంటున్నాము."

వారి హృదయాలు సరియైన చోటనే ఉన్నాయి. కాని ఇక్కడ సమస్య ఏమిటంటే, ప్రవక్త(స)వారు వ్యాపార సామాగ్రిపై జకాత్ వసూలు చేయించారుగాని, గుఱ్ఱాలపై మరియు బానిసలపై కాదు. అవి వ్యక్తిగత మేలు కోసం. **వాటిపై జకాత్ లేదు.**

ఉమర్(రజి)వారి కాలంలో ప్రజలకు అధిక సంఖ్యలో గుఱ్ఱాలు మరియు బానిసలు లభించడం జరిగింది. అయినప్పటికీ ఉమర్(రజి) స్వయంగా ఆ వచ్చిన వారినుండి జకాత్‌ను స్వీకరించలేదు. ఎందుకంటే, **"నిశ్చయంగా, నా సహచరులిద్దరూ** (ప్రవక్త(స) వారు మరియు అబూబక్ర్(రజి) వారు) **వాటిపై జకాత్‌ను తీసుకోలేదు, కాబట్టి అది ఇప్పుడు నేనెలా చేయగలను?"**

ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకోవడానికి ముందు, ఆయన ప్రవక్త(స)వారి సహచరులను సంప్రదించారు. అలీ(రజి)వారు ఇలా సలహా ఇచ్చారు : "అది మంచిదే. అది ఫర్జ్ కానంతవరకూ, మామూలు

పన్ను వసూలు చేయడం మీ తరువాత కొనసాగించ బడుతుంది"

అలీ(రజి)వారు మరియు ఇతరులు ఈ సలహాలను ఇవ్వడానికి గల కారణం ఆ కాలంలో గుఱ్ఱాలను మరియు బానిసలను కలిగి యుండటం సర్వసామాన్యమై పోయింది. కాబట్టి ఉమర్(రజి)వారు ఒక బానిసపై పది దిర్హములు, అతడు యువకుడైనా లేక ముసలివాడైనా సరే, అతని యజమాని చెల్లించవచ్చు. మరియు10 దిర్హములు అరేబియా గుఱ్ఱంపై మరియు 5 దిర్హములు ఇతర గుఱ్ఱాలపై జకాత్‌గా చెల్లించ వచ్చు. గుఱ్ఱాలను అల్లాహ్ మార్గంలో పోరాడటానికి ఉపయోగించేవారు.

అయితే గుఱ్ఱాలు మరియు బానిసలపై జకాత్ చెల్లించిన వారికి, ఉమర్(రజి)వారు ప్రతీ రెండు నెలలకు పన్ను రాయితీని (టాక్స్ క్రెడిట్) ఇచ్చేవారు - 209 కేజీల గోధుమల విలువ కలిగి ఉండేది ఈ టాక్స్ క్రెడిట్ - దీని విలువ వారు జకాత్ చెల్లించినదాని కంటే ఎక్కువ. ఉమర్(రజి)వారు ఈ పన్ను మినహాయింపును ఎందుకిచ్చారంటే, ముహమ్మద్(స)వారు గుఱ్ఱాలపై మరియు బానిసలపై జకాత్ చెల్లించనవసరం లేదని చెప్పారు కాబట్టి.

ద్రవ్యకాలలో ఏదైనా ఖజానా లభిస్తే, దానిలో 5వ వంతు జకాత్‌గా తీసుకోబడేది. **ఐశ్వర్యం కలిగిన వారిని వ్యాపారం చేయమని లేదా వ్యాపారంలో పెట్టుబడి పెట్టమని ఉమర్(రజి)వారు ప్రోత్సహించేవారు.** ఆ విధంగా చేయడం ద్వారా ఐశ్వర్యం ఒకరి నుండి ఒకరికి మారుతూ ఉంటుంది.

సమాజం బాగుండాలంటే అందరూ బాగుండాలి. దేశ ఆర్థికాభివృద్ధి కూడా పెరుగుతూ ఉండాలి. పేదవారికి హక్కులున్నాయి. మరియు ధనవంతునికీ హక్కులున్నాయి. ప్రతీ ఒక్కరూ తమ హక్కుల ప్రకారంగా పనిచేస్తే, సమాజం కూడా సరియైన విధంగా పనిచేయగలుగుతుంది.

## బైతుల్‌మాల్ ఖర్చులు

వివిధ పన్నుల రూపంలో సేకరించబడిన సంపద నుండి ప్రభుత్వం ప్రజల కొరకు చేసే ఖర్చును 3 రకాలుగా విభజించడం జరిగింది.

1. జకాత్
2. జిజ్‌యా, ఖరాజ్ మరియు ఉషూర్ పన్నులు
3. యుద్ధప్రాప్తి

ఈ ఖర్చులు ఏ విధంగా చేయాలో ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలు స్పష్టంగా సూచించాయి.

**ఈ వ్యాసంలో 'జకాత్' ద్వారా సేకరించబడిన సంపదను ఏ విధంగా పంచారనే విషయాన్ని మాత్రమే అందిస్తున్నాము. ఇతర పన్నుల యొక్క ఖర్చు గురించి మరో వ్యాసంలో చెప్పుకుందాం, ఇన్షా అల్లాహ్!**

అల్లాహుతాలా ఖుర్ఆన్‌లో చాలా స్పష్టంగా 8 రకాల వ్యక్తులకు మాత్రమే జకాత్ ఇవ్వమన్నారు. అంటే అల్లాహ్ చెప్పినవారికి కాక ఇతరులకు జకాత్ ఇవ్వకూడదు. జకాత్‌కు సంబంధించి అల్లాహ్ యొక్క ఆదేశం 9వ సూరహ్‌లో 60వ ఆయత్‌లో ఉంది.

**"నిశ్చయంగా జకాత్ కేవలం యాచించు నిరుపేదలకు[1] మరియు యాచించని పేదవారికి[2], (జకాత్) వ్యవహారాలపై నియమించ బడిన వారికి[3] మరియు ఎవరి హృదయాలనైతే (ఇస్లామ్ వైపుకు) ఆకర్షించ వలసి ఉందో వారికి[4], బానిసల విముక్తి కొరకు[5], ఋణగ్రస్తులైన వారి కొరకు[6], అల్లాహ్ మార్గంలో [7], మరియు బాటసారుల కొరకు[8] ఇది అల్లాహ్ నిర్ణయించిన ఒక విధి మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు."** (ఖుర్ఆన్ 9:60)

ఉమర్(రజి)వారి పరిపాలనలో జకాత్ వ్యవస్థ చాలా స్పష్టంగా అర్థమయ్యే విధంగా ఉండేది. పేదవారు మరియు అవసరాలలో ఉన్నవారు తమ అవసరాలు తీర్చుకోవడానికి వారికి సరిపోయేటంత ధనం ఇవ్వబడేది. అంటే వారిని పేదరికపు స్థాయి నుండి దాటించి పైకి తేగలిగేటంత లేదా కనీసం అట్టడుగు ధనవంతుని స్థాయికి చేర్చ గలిగేటంత ఇచ్చేవారు.

ఎటువంటి విధానం ఉమర్(రజి)వారి కాలంలో అమలులో ఉండేదో, అది ఆయన మాటలలోనే ప్రతిబింబిస్తుంది : **"వారికి మీరు ఇచ్చేటప్పుడు, సరిపోయినంత ఇవ్వండి వారు మరొకరిపై ఆధారపడకుండా ఉండేలా"**

ప్రజలు తీవ్రమైన రోగం బారిన పడి శాశ్వతంగా పనిచేయలేని పరిస్థితిలో ఉంటే, వారికి ఉమర్(రజి)వారు జకాత్ సొమ్మునుండి ఇచ్చేవారు. తాత్కాలికంగా జబ్బుపడిన వారికి కాస్త ఎక్కువ ఇచ్చేవారు, ఎందుకంటే వారు త్వరగా కోలుకుని పనిలో చేరేటందుకు మరియు **ఒకరిపై ఆధారపడకుండా ఉండేందుకు.**

జకాత్‌ను సేకరించే వారి కొరకు, జకాత్‌ను పంచేవారి కొరకు జీతాలను ఖుర్ఆన్‌లో ఆదేశించిన ప్రకారం జకాత్ నుండే ఇచ్చేవారు. జకాత్ వ్యవహారంలో పనిచేసేవారి విధులు :

- జకాత్ ఎవరు చెల్లించాలి?
- సంపదలోని ఏయే వాటినుండి జకాత్ ఇవ్వాలి?
- ఎంత శాతం జకాత్‌గా చెల్లించాలి?
- జకాత్‌ను స్వీకరించడానికి నిజమైన అర్హులు ఎవరు?
- ఎంతమంది అర్హులున్నారు?

ఇటువంటి ఎన్నో అంశాలను చూసుకోవలిసిన బాధ్యత వారిపై ఉంది.

పై ఆయత్‌లో తెలిపిన విధంగా ప్రతీ కాలంలో, ప్రతీ ప్రాంతంలోనూ జకాత్‌ను స్వీకరించడానికి **8 కేటగిరులకు సంబంధించిన వ్యక్తులు ఉండక పోవచ్చు**. ఉదాహరణకు బానిసలు లేనప్పుడు, బానిస విముక్తి కోసం ఉన్న కేటగిరి ద్వారా జకాత్ పంచనవసరం లేదు. ఆ సొమ్మును ఇతర కేటగిరులలో వాడవచ్చు. అదే విధంగా అప్పులు పాలై నష్టపోయినవారు లేకపోతే, ఆ కేటగిరిలో జకాత్ చెల్లించనవసరం లేదు.

అయితే, ఒక్కొక్క కాలంలోగాని లేదా ఒక్కొక్క ప్రాంతంలోగాని 8 కేటగిరులకు చెందిన **వ్యక్తులు అందరూ ఉండవచ్చు**.

పై ఆయత్ లో చెప్పబడిన **"ఎవరి హృదయాలనైతే ఆకర్షించ వలసి ఉందో వారికి"** - అంటే వారు ముస్లిమేతరులు. దయతో వారిపై కొద్దిగా ఖర్చు చేయడం ద్వారా వారి హృదయాలు ఇస్లామ్ పట్ల మెత్తబడతాయి అని నమ్మకమున్నప్పుడు, కొంత సొమ్ము ఆ విధంగా ఖర్చు చేయడం జరుగుతుంది. ముహమ్మద్(స)వారు ఆ విధంగా ఇచ్చారు.

ఉమర్(రజి)వారు తన పరిపాలనా కాలంలో ఆ కేటగిరిలో 'జకాత్'ను ఖర్చు పెట్టలేదు. కాలం మారింది. పరిస్థితులు మారాయి. ఇస్లామ్ ఇప్పుడు బలంగా ఉంది. కాబట్టి ఈ కేటగిరిలో జకాత్ ఇచ్చి వారి హృదయాలను మెత్తబరచవలసిన అవసరం లేదని ఉమర్(రజి)వారు భావించారు. ఆయన నమ్మినది ఏమిటంటే ఈ కేటగిరిలో ఇవ్వడం గాని, ఇవ్వకపోవడం గాని అప్పటి ఇస్లామ్ యొక్క పరిస్థితులపై ఆధార పడి ఉంటుందని.

ఇక్కడ పాఠకులు ఒక ముఖ్య విషయం గమనించాలి. కొందరు అవివేకులు 'జకాత్' పేరుతో ఓ పుస్తకం ప్రచురించారని క్రిందటి సంచికలో తెలియజేశాము. వారు జకాత్‌లోని 'ఫీ సబీలిల్లాహ్' కేటగిరిని కాలానుగుణంగా మార్చుకునే ఫ్రీ ఆప్షన్ అని చెప్పారు. అదీ మరియు పై విషయం ఒకటి కాదు. ఉమర్(రజి)వారు ఆ కేటగిరిని మార్చలేదు మరియు ఖండించలేదు. ఈ కేటగిరిలో చెల్లింపు ఆపివేశారు.

కొందరు ఇస్లామ్ శత్రువులు ఈ విషయాన్ని అవకాశంగా తీసుకున్నారు. ఒక కేటగిరిని ఆపడం ద్వారా ఉమర్(రజి)వారు ఖుర్'ఆన్ శాసనానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ప్రకటించడం మొదలెట్టారు. కాని అలా చేయడానికి బలమైన మరియు వివేకవంతమైన కారణముంది. ఉమర్(రజి)వారు ఆ కేటగిరిని ఎంతమాత్రం వ్యతిరేకించ లేదు.

ఇక్కడ ముఖ్యంగా అందరూ గమనించవలసింది ఏమిటంటే, ఉమర్(రజి)వారి విధానాన్ని సహాబీలు ఎవ్వరూ అభ్యంతరం చెప్పకుండా, మనస్ఫూర్తిగా అంగీకరించారు.

ఖుర్'ఆన్ ఆదేశించిన విధంగా బానిసలను విముక్తి చేయడానికి, ప్రజలు తమ అప్పులను తీర్చుకోవడానికి, అల్లాహ్ మార్గంలో పోరాటం చేయడానికి, బాటసారికి సహాయం చేయడానికి జకాత్‌ను ఖర్చు చేసేవారు. ఇక్కడ **బాటసారి** అంటే ప్రయాణం మధ్యలో ఆగిపోయిన వాడు. అంటే సరిపోయినంత ధనం లేక తన గమ్యస్థానం చేరకుండా మార్గమధ్యంలో నిలిచి పోయినవాడు.

### దార్ అద్-దఖీఖ్

ముహమ్మద్(స)వారు మరియు అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు తమ కాలంలో ఆ విధంగా నిలిచిపోయిన బాటసారుల గురించి చాలా శ్రద్ధ తీసుకునేవారు. ఉమర్(రజి)వారు కూడా వారినే అనుసరించారు. అంతే కాకుండా ఈ విషయంలో మరికాస్త ముందడుగు వేశారు. బాటసారుల అవసరాల కోసం ఓ సంస్థను ఏర్పాటు చేశారు. అదే **దార్ అద్-దఖీఖ్**. ఈ సంస్థ పని ఏమిటంటే బాటసారుల కోసం ప్రత్యేక గృహాలను ఏర్పాటు చేయడం, ఆ గృహాలలో పిండి, ఖర్జూరాలు, ఎండు ఖర్జూరాలు, అస్-సవీఖ్ అనే ఓ ఆహార పదార్థం మరియు మార్గమధ్యంలో నిలిచిపోయిన వారికి అవసరమయ్యే సామాగ్రి వాటిలో ఉండేవి. అవి అతిథుల కోసం కూడా ఉపయోగించేవారు.

మక్కా నుండి మదీనాకు పోయే మార్గంలో వివిధ దూరాలలో ఆహార నిల్వలు ఉంచేవారు. బాటసారి ఒక ఒయాసిస్ నుండి మరో ఒయాసిస్‌కు చేరుకునే వరకూ సరిపోయేటంత పరిమాణంలో వాటిని ఉంచేవారు.

### 'ఫీసబీలిల్లాహ్' కేటగిరిలో ముజాహిదీన్‌లకు జకాత్ ఇచ్చేవారు.

ఉమర్(రజి)వారి కాలంలో బిద్'అత్ లేదు. బిద్'అత్‌కు పాల్పడేటంత ధైర్యం ఎవరికీ లేదు. కాబట్టి ఆ కాలంలో నేడు ఉన్నటువంటి కమర్షియల్ దాయీలు గాని, దావా సంస్థలుగాని లేవు. మదరసాలు ఉన్నాయి. కాని మదరసాల కొరకు 'జకాత్' సొమ్మును ఇవ్వలేదు.

### సమాజానికి విద్వాంసులు అవసరమే! కాని ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లను వదిలేసి, పూర్తిగా ఆలిమ్‌ల పైనే ఆధారపడితే, ఏ సమాజమైనా నాశనమై పోతుంది.

విశ్వాసి (మోమిన్) అల్లాహ్ పట్ల భీతి కలిగి ఉంటాడు. "నిశ్చయంగా, అల్లాహ్ యొక్క దాసులలో **జ్ఞానం గలవారు మాత్రమే ఆయనకు భయపడతారు. ...**" (ఖుర్'ఆన్ 35:28)

ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు: ఎవరికైతే అల్లాహ్ మేలు చేయాలనుకుంటారో, అతనికి ధర్మాన్ని అర్థం చేసుకునే శక్తినిస్తాడు **(తిర్మిజీ - సహీహ్, 2645, పుస్తకం 39, అధ్యా.1, సంపుటి5)**

కాబట్టి మదరసాలో చదవకపోయినా ప్రతీ మోమిన్ (విశ్వాసి) జ్ఞాని అవుతాడు. **'చదువు-సంస్కారం'** అనే మాటలు విని ఉంటారు. అంటే చదువుతో పాటు సంస్కారం కూడా వస్తుందని. కాని నేడు అలా జరగడం లేదు. చదువుకున్నవారు కూడా సంస్కారవంతంగా లేరు. అంటే ఈ చదువులో లోపం ఉంది. ఈ చదువు సంస్కారాన్ని నేర్పలేకపోతుంది. దీని భావం చదువులేనివారు సంస్కారంతో ఉండరని కాదు. చదువుకోని వారికీ సంస్కారం ఉంటుంది. కాని **చదువుతో పాటు తప్పనిసరిగా సంస్కారం నేర్చుకుంటారని చెబుతారు.**

ప్రస్తుతం **'ఆలిమ్ కోర్సు** మరియు **జ్ఞానం'** కూడా అదే విధంగా ఉన్నాయి. ఆలిమ్ కోర్సు చదివిన వారికి జ్ఞానం ఉంటుందని భావిస్తున్నాం. కాని వాస్తవానికి వారిలోని అత్యధికులకు జ్ఞానం ఉండటం లేదు. కొందరు ఆలిమ్‌లు 'అల్లాహ్' పేరు గురించి కూడా స్పష్టంగా చెప్పలేని అజ్ఞానాన్ని కలిగి ఉన్నారు. ఆలిమ్ కోర్సు పూర్తిచేయడమే కాకుండా మదీనా యూనివర్శిటీలో కూడా చదువుకున్న ఓ ఆలిమ్‌గారికి అల్లాహ్ పేరు యొక్క విశిష్ఠతను శాంతిబాట టీమ్ బోధించవలసి

వచ్చింది. దీనినిబట్టి అతని జ్ఞానం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోండి. 'ఆలిమ్' అంటే ధార్మిక విద్యకు సంబంధించిన ఓ కోర్సు చదివినవాడని అర్థం చేసుకోవాలి. అంతేగాని అన్నీ తెలిసినవాడని కాదు. **అన్నీ తెలిసినవాడు అల్లాహ్ మాత్రమే.**

మదరసాలో నేర్చుకున్నా లేక ఇంటిలో నేర్చుకున్నా, జ్ఞానం జ్ఞానమే! ఆలిమ్ కోర్సు పూర్తిచేసిన వారికి ఉండేది ఇస్లామ్‌పై ప్రాథమిక అవగాహన మాత్రమే. ఆ తరువాత వారు ఖుర్'ఆన్ తఫ్సీర్ గ్రంథాలు, వివిధ హదీస్ గ్రంథాలు అధ్యయనం చేసి వివరంగా తెలుసుకోవలసి ఉంటుంది. అటువంటి అధ్యయనాన్నే ప్రతీ విశ్వాసి కూడా చేయగలడు. అంతేకాదు తప్పని సరిగా చేయాలి. ఆ విధంగా మనలో ఎక్కువమంది అధ్యయనం చేయకపోతే, **ఆలిమ్‌లు సత్యాన్ని దాచివేసే ప్రమాదముంది.** ఇప్పుడు జరుగుతున్నది అదే!

ఒక సైంటిస్ట్ ఏదైనా కొత్త వస్తువును కనుగొన్నాడనుకుందాం. అంటే ఆ వస్తువును ఎలా తయారు చేయాలో అతడు యూనివర్శిటీలో నేర్చుకోలేదు. యూనివర్శిటీలో నేర్చుకున్న జ్ఞానాన్ని ఉపయోగించి, పరిశోధించి ఆ వస్తువును తయారుచేయగలిగాడు. యూనివర్శిటీలో చదివేశాను కదా అని ఏ పరిశోధనా చేయకుంటే **అటువంటి వస్తువు తయారు కాదు.** భారీ ప్రయోగశాలలో పరిశోధన చేసి నోబెల్ ప్రైజులు సంపాదించిన వారున్నారు. ఏ ఆధునిక ప్రయోగశాల లేకుండానే పరిశోధన చేసి నోబెల్ ప్రైజును పొందిన సి.వి.రామన్ వంటివారు కూడా ఉన్నారు.

### వారం రోజులు చాలు

ఏదైనా ఓ భాషలో చదవడం, వ్రాయడం వస్తే చాలు. అరబీలో చదవడం, వ్రాయడం వారం రోజులలో నేర్చుకోవచ్చు. ఖుర్'ఆన్ ఆయత్‌లను సులభంగా అరబీలో చదువుకోవచ్చు. అరబీలో చదివేయడమో లేక కంఠస్థం చేయడంతోనే సరిపోదు. అరబీలో మనందరినీ ఉద్దేశించి అల్లాహ్ చేసిన ప్రసంగమే ఖుర్'ఆన్. కాబట్టి **అల్లాహ్ మనకు ఏమి చెప్పారో ఖుర్'ఆన్ నుండి తెలుసుకోవాలి.** విద్వాంసులు చెప్పకపోతే మీరు తెలుసుకోరా?

మీరు ఖుర్'ఆన్ జ్ఞానాన్ని కలిగిఉంటే, ఏ అవినీతి ఆలిమ్‌నైనా నిలదీసి అడగవచ్చు. ఖుర్'ఆన్ జ్ఞానం గురించి ఆలిమ్‌లకు వదిలేసి, వారు చెప్పినది నిజమో, కాదో ధృవీకరించు కోకపోతే, వారు మిమ్మల్ని మార్గభ్రష్టత్వం వైపుకు తీసుకుపోతారు. **విద్వాంసులను గౌరవించాలి.** కాని వారిని **గుడ్డిగా నమ్మి నష్టపోకూడదు.**

కేవలం కోర్సు పూర్తి చేసుకుని, అవగాహన లేని వారి దగ్గర జ్ఞాన ముండదు. అల్లాహ్ పట్ల భయం లేని అవినీతి ఆలిమ్‌ల దగ్గర జ్ఞానం లేదు. ప్రవక్త(స)వారు నేర్పిన క్రింది దు'ఆలు చూడండి :

అబూహురైరా(రజి) చెప్పారు. ప్రవక్త(స)వారు చేసే దు'ఆ లలో ఒకటి:**"ఓ అల్లాహ్! ప్రయోజనం లేని జ్ఞానం నుండి, స్వీకరించబడని దు'ఆ నుండి, (అల్లాహ్‌కు) భయపడని హృదయం నుండి మరియు తృప్తినొందని ఆత్మనుండి నీ రక్షణను వేడు కుంటున్నాను"**(ఇబ్నెమాజా-సహీహ్,250,పు. 1, అధ్యా. 23, సం. 1)

ఉమ్మె సల్మా (రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు ఫజర్ సలాత్ (నమాజ్) చేశాక, చెప్పేవారు: **"ఓ అల్లాహ్! ప్రయోజనం ఉన్న జ్ఞానం కొరకు, మంచి ఉపాధి కొరకు మరియు స్వీకరించబడే ఆచరణల కొరకు నేను మిమ్మల్ని వేడుకుంటున్నాను"**
(ఇబ్నెమాజా - సహీహ్, 925, పుస్తకం 5, అధ్యా. 32, సంపుటి 2)

జ్ఞానం ఉంటే సరిపోదు. ఆ జ్ఞానం మనకూ మరియు సమాజానికి ప్రయోజనం చేకూర్చాలి. ప్రయోజనం లేని జ్ఞానం నుండి, భయపడని హృదయం నుండి అల్లాహ్ రక్షణను వేడుకోవాలి.

### వివేకం (హిక్మత్)

జ్ఞానం ద్వారా వివేకం లభిస్తుంది. వివేకం గలవారు అల్లాహ్‌పై తప్ప, ఇతరులపై ఆధారపడకుండా జీవిస్తారు. ఆలిమ్ కోర్సులు పూర్తి చేసిన వారికి నిజంగా జ్ఞానం ఉంటే, వారు బయటకు రాగానే ఏదో ఒక వ్యాపారమో, కూలి పనో లేక మరొక్కటో చేసుకుని గౌరవంగా జీవించ గలుగుతారు. అలా చేయలేక పోతున్నారంటే వారు ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను అర్థం చేసుకోలేకపోయారని స్పష్టంగా తెలుస్తుంది.

జ్ఞానియైన సల్మాన్ ఫార్సీ(రజి)వారు గవర్నర్ అయినప్పటికీ బుట్టలు, చాపలు అల్లి మార్కెట్లో అమ్ముకుని జీవించారు. ఒక వ్యక్తి ఆయన గవర్నర్ అని తెలియక, కూలి వాడనుకుని ఓ మూటను మోయమని ఆదేశిస్తే, ఆ మూటను అతని ఇంటి వరకూ మోసుకెళ్ళారు.

కాని నేడు 'జ్ఞానులుగా' పెద్ద పెద్ద బిరుదులతో పొగిడించుకునే ఆలిమ్‌లు **ఎవరో వేసే భిక్షంపై మరియు జకాత్‌పై ఆధారపడుతున్నారు.** నేతి బీరకాయలో 'నెయ్యి' ఎంత ఉంటుందో వీరి హృదయాలలో 'అల్లాహ్ పట్ల భయం' అంతే ఉందనిపిస్తుంది. ఆలిమ్ కోర్సు పూర్తి చేసుకుని యువకులుగా బయటకు వస్తున్నారు. కష్టపడి పనిచేయ గలిగే యువకులకు దానాలు ఇవ్వడం సమంజసమా?

**అంతా కమీషన్ వ్యాపారమే.** కష్టపడకుండా విమానాలలో లేదా ఎ.సి. ట్రయిన్లలో, బస్సుల్లో ప్రోగ్రామ్‌లకు హాజరవడం, నాలుగు మాటలను ముక్కున బట్టి, మైక్ దగ్గర వదిలేయడం. ఆ నాలుగు మాటలకు పదివేలో లేక పదిహేను వేలో తీసుకుని పోవడం, ఖరీదైన లాడ్జిలలో బస, ఫ్రీ భోజనం.

### అల్లాహ్ మార్గం వైపు పిలుస్తున్నారా? లేక దూరం చేస్తున్నారా?

మనదేశంలో ఇటువంటి ప్రోగ్రామ్‌ల కొరకు లక్ష రూపాయలనుండి 40 లక్షల రూపాయల వరకూ ఖర్చు పెడుతున్నారని సమాచారం. వీటికి కూడా జకాత్ సొమ్ము వాడుతున్నారు. 40 లక్షలతో ప్రోగ్రామ్ చేసి, స్టేజీ పైకి ఇద్దరినో, ముగ్గురినో తీసుకువచ్చి, ఆ ప్రసంగాల వల్లనే వారు ఇస్లామ్ స్వీకరించారని, ఏదో సాధించినట్లు నాటకమాడుతున్నారు.

అటువంటి వాటికి జకాత్ సొమ్ము వాడటం మహా పాపం. ఆ నలభై లక్షలు ఒక పల్లెటూరిలోని పేద ముస్లిములకు, వితంతవులకు, వృద్ధులకు ఖర్చుపెట్టి, అది అల్లాహ్ ఆదేశమని వారికి చెబితే, **వారు ఇస్లామ్ పట్ల ఎంతో మంచి భావం కలిగి ఉంటారు!**

నేడు మన రాష్ట్రంలో చూస్తున్నాము. ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో మేలు పొందినవారు, ఆ పథకం ప్రారంభించిన వ్యక్తిపై ఎంత కృతజ్ఞత చూపుతున్నారో. వాస్తవానికి ఆ పథకంలో వాడిన సొమ్ము ఆయన స్వంత సొమ్ము కాదు. ప్రభుత్వానిదే!

కాని ఈ జకాత్ సొమ్ము అల్లాహ్ అనుగ్రహించింది. పేదలకు ఇవ్వమని ఆయన ఆదేశించారు. ఆయన ఆదేశాన్ని వ్యతిరేకిస్తూ, పేద ముస్లిములను ఇస్లామ్‌కి దూరం చేస్తున్న దాయిలు మరియు ఆలిమ్‌లు వాస్తవానికి పేదప్రజలను అల్లాహ్ మార్గంవైపు పిలవడానికి బదులు అల్లాహ్ మార్గం నుండి దూరం చేస్తున్నారని ఇప్పటికైనా తెలుసుకోవాలి.

మనదేశ ప్రజలను కొన్ని దశాబ్దాలుగా ఆలిమ్‌లు మోసం చేశారు. ఇప్పుడూ అదే మోసం కొనసాగిస్తున్నారు. అర్హులకు జకాత్ అందకపోతే, ఆ పాపం అందరికీ చుట్టుకుంటుంది. కేవలం ఆలిమ్‌లకు మాత్రమే ఆ పాపం చుట్టుకోదు.

మీ దగ్గర ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలున్నాయి కదా! వాటిని మస్జిద్‌లలో ఏర్పాటు చేయండి. ప్రోగ్రామ్‌ల కోసం మీరు ఖర్చుపెట్టే డబ్బులతో ఇటువంటి గ్రంథాలెన్నో కొనగలరు.

ఆలిమ్‌లు మోసం చేస్తే, ఆ మోసం నుండి బయటపడలేరా? ఖుర్ఆన్, హదీస్‌లు, ముహమ్మద్(స)వారి సీరత్, మరియు సహాబాల జీవిత చరిత్రలు అందుబాటులోనే ఉన్నాయి కదా! ప్రజలను మోసం చేసిన విద్వాంసులు నరకంలో శిక్షింపబడుతున్నట్లు చెప్పే హదీస్‌లెన్నో ఉన్నాయి. ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలున్నప్పటికీ, ఆలిమ్‌లను అనుసరించి మనం నష్టపోతే, తీర్పుదినం నాడు ఆ నెపాన్ని ఆలిమ్‌లపైకి తోసేస్తే అల్లాహ్ మనల్ని క్షమిస్తారా?

పూర్వపు జాతులు అల్లాహ్ గ్రంథాలపై కాకుండా పూర్తిగా విద్వాంసులపై ఆధారపడటం వల్లనే నాశన మయ్యాయి.

జకాత్ ఎవరికివ్వాలో తెలుసుకోవాలంటే, ఖుర్ఆన్ చదివితే చాలు. ఏ విద్వాంసుడూ చెప్పనవసరం లేదు. అయితే అది ఎలా ఇవ్వాలో తెలుసుకోవాలంటే ముహమ్మద్(స)వారి బోధనలు చదవాలి. ఖుర్ఆన్ గ్రంథంలో 9వ సూరహ్‌లోని 60వ ఆయత్‌లో ఎవరెవరికి ఇవ్వాలో స్పష్టంగా చెప్పబడింది. ఫీ సబీలిల్లాహ్ (అల్లాహ్ మార్గంలో) అనే కేటగిరి ఒక్కటే మీకు స్పష్టంగా అనిపించకపోవచ్చు. కాని ఇస్లామ్‌పై జ్ఞానమున్న వారికి 'ఫీ సబీలిల్లాహ్' అని మాత్రమే చెబితే అది ఎవరిని ఉద్దేశించి చెప్పడం జరిగిందో తెలుస్తుంది.

ఖుర్ఆన్‌ను మీరు పూర్తిగా చదివితే, దానిలో మొత్తం 43 ఆయత్‌లలో 'ఫీ సబీలిల్లాహ్' అనే పదాలు గమనించవచ్చు. వాటన్నింటి బట్టి, ఫీ సబీలిల్లాహ్ అంటే అల్లాహ్ మార్గంలో పోరాడటం అని తెలుస్తుంది. కాబట్టి ముజాహిదీన్‌లకే ఆ కేటగిరిలో ఇవ్వాలి. అంతేగాని, క్రింద తెలిపినవారికి ఇవ్వకూడదు.

**దాయిలకు, దావా సంస్థలకు, లైబ్రరీలకు, పుస్తకాలకు, మదరసాలకు, టి.వి. చానళ్ళు మొదలైన వాటికి జకాత్ ఇవ్వకండి.**

క్రిందటి సంచికలో 'ఇబ్నె అబ్బాస్'(రజి)వారి గురించి వివరించాము. ఆయనకు తఫ్సీర్‌లో అందరికంటే ఎక్కువ జ్ఞానముంది. ఆయన కూడా ఫీ సబీలిల్లాహ్ కేటగిరిలో ముజాహిదీన్‌లకే ఇవ్వాలని చెప్పారు. ఇబ్నె అబ్బాస్(రజి)వారు చెప్పిన తఫ్సీర్‌ని మొత్తం సహాబీలంతా ఏ అభ్యంతరం తెలపకుండా ఆమోదించేవారు.

తఫ్సీర్ ఇబ్నె కసీర్ గ్రంథం చదివితే, వివిధ తఫ్సీర్‌ల గురించి అవగాహన ఏర్పడుతుంది. ఇబ్నె అబ్బాస్(రజి)వారికి ఏదైనా ఆయత్‌కి సంబంధించి తఫ్సీర్ తెలియకపోతే, తెలియదని చెప్పేవారు.

స్వంత అభిప్రాయంతో తఫ్సీర్ చెబితే వారి స్థానం నరకమేనని చెప్పే హదీస్‌లు ఎన్నో ఉన్నాయి. ఈ విషయం తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లో చాలా స్పష్టంగా చెప్పబడింది. ఇబ్నె అబ్బాస్(రజి)వారి తఫ్సీర్ జ్ఞానం, ముహమ్మద్(స)వారి దు'ఆ ఫలితం అని మీకు తెలిసిన విషయమే! **ఆయన తఫ్సీర్‌ని కాకుండా నేటి విద్వాంసుల తఫ్సీర్‌ని విశ్వసిస్తే, మన స్థానం కూడా నరకమే కావచ్చు.**

క్రింది హదీస్ చూడండి.

హమ్జా యొక్క తండ్రిగారి ఉల్లేఖనం:
అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "నేను పడుకుని ఉండగా, నన్ను నేను (పానీయం) త్రాగుతున్నట్లుగా చూశాను మరియు నాకు ఎంత ఆశ్చర్యం కలిగిందంటే దాని యొక్క తడి నా గోళ్ళ నుండి బయటికి వస్తున్నట్లుగా గమనించాను. తరువాత నేను (పానీయాన్ని) ఉమర్‌కు ఇచ్చాను. వారు (ప్రవక్త(స)వారి అనుచరులు) అడిగారు, "(ఈ కల యొక్క) అర్థమేమిటి?" ఆయన చెప్పారు, "**అది జ్ఞానం".(సహీహ్ బుఖారీ, 3681, పుస్తకం 62, అధ్యా. 6, సంపుటి 5)**

పై హదీస్ ద్వారా ఉమర్(రజి)వారి జ్ఞానం ఎంత ఉన్నత స్థాయిలో ఉందో అర్థమౌతుంది. అటువంటి జ్ఞాని ఖలీఫాగా పరిపాలించిన కాలంలో 'ఫీ సబీలిల్లాహ్' కేటగిరిలో ముజాహిదీన్‌లకే జకాత్ ఇచ్చారని ఇప్పటికే చెప్పుకున్నాం. అంతేకాకుండా జకాత్‌గా లభించిన ఒంటెలను 'హజ్జ్' చేయాలనుకునే పేదవారికి ఇచ్చేవారు.

ప్రతీ సత్కార్యానికి జకాత్ ఇవ్వాలని అల్లాహ్ నిర్ణయించి ఉంటే, ప్రత్యేకంగా 8 రకాల వ్యక్తుల గురించే ఎందుకు చెబుతారు? అని ఓ క్షణం ఆలోచిస్తే మీకే బోధపడుతుంది. ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఆదేశించి నట్లు జకాత్ చెల్లిస్తే సమాజంలో కొన్ని సంవత్సరాలకు పేదరికం ఉండదు. ఆ విధంగా చేస్తే ఫీజ్ రియంబర్స్‌మెంట్ ముస్లిములకు అవసరం లేదు. బి.సి. రిజర్వేషన్ల అవసరం కూడా ఉండదు.

**జకాత్ పేదప్రజల హక్కు. అది వారికి సరిగ్గా అందేవరకూ, ఇన్షా అల్లాహ్, శాంతిబాట పోరాడుతూనే ఉంటుంది. శాంతిబాటను మీ స్నేహితులచే చదివించండి. మీరంతా పేదవారికి సహకరించండి.**

# పాఠకుల అభిప్రాయాలు

**రాష్ట్రంలో పెరిగిపోతున్న రషీల సంఖ్య ...**

జ్ఞానం-అజ్ఞానం శీర్షికలో 'జకాత్ పేరుతో ప్రచురించిన ఓ పుస్తకంపై చేసిన విశ్లేషణను పాఠకులు స్వాగతించారు. ఆ పుస్తక రచయిత(ల)కు ఖుర్'ఆన్ మరియు హదీస్‌ల పట్ల ఉన్న తిరస్కార భావాన్ని ప్రజలు చీదరించుకున్నారు. ప్రజలలో చైతన్యం వస్తే ఇటువంటి పుస్తకాలు ఆగిపోతాయి. అందుకే మేము పదే పదే మా పాఠకులకు మనవి చేస్తున్నాం **"ఖుర్'ఆన్‌ను ప్రతీరోజూ చదవమని".**

సరియైన విధంగా సమాధానం చెప్పారని పాఠకులు అభిప్రాయ పడ్డారు. వ్రాసినదంతా వాస్తవమే! కాని 'దాయీలు దోచు కుంటున్నారు' అనే విషయంపై దాయీలు అభ్యంతరాలు చెబుతున్నారని ఒక సోదరుడు తెలియజేశారు. "మేము దోచుకోవడం లేదు, ఇస్తే తీసుకుంటున్నాము" అని దాయీలు సమాధానమిస్తున్నారని చెప్పారు. ఒక్కసారి ఆలోచించండి. మీ ఇంటికి ఒక వ్యక్తి వచ్చి, ఓ వస్తువునిచ్చి, ఇది మీ వస్తువే తీసుకోండి అని చెబితే, అది మీది కాకపోయినా సరే మీదేనని చెప్పి తీసుకోగలరా? ఒకవేళ తరువాత పోలీసులొచ్చి ప్రశ్నిస్తే, **ఏమి సమాధానం చెప్పాలోనని భయపడరా?**

మరి పేదప్రజలకు చెందిన జకాత్‌ని తీసుకుని వచ్చి, ఇది మీకే అంటే ఎలా ఒప్పుకుంటారు? తీర్పు దినాన అల్లాహ్ అడిగితే **ఏమి సమాధానం చెప్పాలోనని భయపడరా?** అది తమ సొత్తు కాదని పేద ప్రజల హక్కు అని చెప్పాలి కదా! జకాత్ పేద ప్రజల హక్కు అనే చిన్న విషయం తెలియనివారు ధర్మం గురించి ఎలా చెప్పగలుగుతారు? "టి.వి. ఛానళ్ళకు ఇవ్వండి, దావా కోసం ఇవ్వండి" అని ప్రకటనలు చేస్తున్నారు. ఆ ప్రకటనల కోసం ఎంతో ఖర్చు చేస్తున్నారు. **తనదికాని సొమ్మును తనకివ్వమని అడగటాన్ని ఏమంటారు?** ఆ విధంగా పొందిన దానిని ఏమంటారు? దొంగ సొత్తును అమ్మేవాడు మాత్రమే కాదు, దానిని కొన్నవాడు కూడా నేరస్థుడే! నేటి రాజకీయ నాయకులు, ప్రజల దగ్గరకి వచ్చి వారింట్లో నుండి డబ్బు దోచుకుపోవడం లేదు. కాని వారికి అంద వలసిన డబ్బును తమ ఖజానాకి మళ్ళించుకుంటున్నారు. **ఇది దోపిడీయే కదా!** సమాజ సంక్షేమం కోసం అల్లాహ్ ఏర్పాటు చేసిన ఓ ఉత్తమమైన ఏర్పాటును, వక్రీకరించి పేదప్రజలను మోసం చేసి డబ్బు తినేయడాన్ని ఏమనాలో మీరే తేల్చండి. రాజకీయ నాయకులను మీరు నిలదీయ లేకపోవచ్చు. జకాత్ విషయంలో పేదప్రజల హక్కును కొల్లగొట్టే దాయీలను గాని, నాయకులనుగాని, ఆలిమ్‌లనుగాని ఇన్షా అల్లాహ్ మీరు ఖచ్చితంగా నిలదీయగలరు. అల్లాహ్‌కు భయపడండి.

**ముస్లిమ్ మహిళ ...**

ఈ సీరియల్ పట్ల మహిళలు ఆసక్తి చూపుతున్నారని తెలియజేశారు. ఎక్కువమంది పత్రికను కొనకుండా, శాంతిబాట వెబ్‌సైట్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని చదువుతున్నారని తెలిపారు. అంతేకాకుండా వెబ్‌సైట్ ఏర్పాటు చేసి మంచిపని చేశారని అభినందించారు. అల్-హమ్‌దులిల్లాహ్! పత్రికను పాఠకులకు పోస్ట్ చేసిన రెండు, మూడు రోజులలోనే సాఫ్ట్ కాపీ (pdf file)ని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నాము. ఎప్పటి పత్రికను అప్పుడే వెబ్‌సైట్‌లో ఉంచితే అమ్మకాలు తగ్గి, నష్టాలు రావచ్చని శ్రేయోభిలాషులు అభిప్రాయ పడ్డారు. నష్టం వచ్చినా తప్పదు. పత్రికను షాపులలో విక్రయించడం లేదు. సంవత్సర చందా కట్టినవారికే పంపుతున్నాము. విదేశాలలో ఉన్న తెలుగు వారు కూడా మా పాఠకులతో పాటు చదువుకునే వీలు కల్పించాలనేదే మా సంకల్పం. ఆర్థికంగా నష్టమైనప్పటికీ, ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ అది మాకు లాభాన్ని చేకూర్చవచ్చని ఆశిస్తున్నాము. సత్యాన్ని అందించే ఈ పత్రికను అల్లాహ్ అనుగ్రహంతో కొనసాగడానికి, మీ స్నేహితులనుగాని, మీ బంధువులను గాని చందాదారులుగా చేర్పించండి.

**రాతి యుగం ...**

సీరియల్‌గా వేస్తున్న ఈ వ్యాసాలన్నీ కలిగియున్న పుస్తకం ఉంటే తెలపమని సోదరులు కోరుతున్నారు. తెలుగులో అటువంటి పుస్తకం లేదు. మేము కూడా ఏ నెలకు అవసరమైన వ్యాసాన్ని, ఆ నెలలోనే సిద్ధం చేసుకుంటున్నాము.

ఇంగ్లీష్‌లో పబ్లిష్ అయిన హారున్-యహ్యాగారి పుస్తకం నుండి మక్కీకి మక్కీ అనువాదం చేయడం లేదు. క్రిందటి సంచికలో అందించిన వ్యాసం పూర్తిగా శాంతిబాట రీసెర్చ్ టీమ్‌చే రూపొందించ బడింది. ఆ వ్యాసంలోని ఏ విషయం కూడా హరున్-యహ్యాగారి పుస్తకం లోనిది కాదు. శాంతిబాటలో రెగ్యులర్‌గా అందిస్తున్న వ్యాసాలను బట్టి, పాఠకుల అభిప్రాయాలనుబట్టి ఒక అంచనా వేసుకుని, దానికి తగిన విధంగా ఉండేలా వ్యాసాలు అందించడం జరుగుతుంది.

**ముఫ్తీలు, మౌలానాలు చెప్పడం లేదు ...**

మా ఊరిలో ముఫ్తీలు, మౌలానాలు ఉన్నారుగాని, శాంతిబాటలో చెప్పే విధంగా సహాబాల కోసం చెప్పడం లేదు. అందుకనే 'శాంతిబాట' పత్రిక ఎప్పుడొస్తుందా అని ఆతృతతో ఎదురుచూస్తుంటాము. మేమిచ్చే సమాచారం వందల సంవత్సరాల క్రితం నుండే అందుబాటులో ఉంది. నేటి ముస్లిములకు ఏయే విషయాలు అవసరమో, అటువంటి వాటిని వివిధ గ్రంథాలనుండి సేకరించి విద్వాంసుని పర్యవేక్షణలో ప్రామాణికమైన వాటిని పాఠకులకు అందించే ప్రయత్నం చేస్తున్నాము.

**వ్యాసాలన్నీ బాగున్నాయి ...**

క్రిందటి సంచికకు మంచి స్పందన లభించింది. వ్యాసాలన్నీ బావున్నాయని చాలామంది తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. **అల్-హమ్‌దులిల్లాహ్.**

---

**మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.**

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** Saanthibaata Printing House, 19-1-447, Hanuman Statue Center, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650


www.saanthibaata.net
New Look!
saanthibaata
The first Islamic Research Magazine in Telugu.
A source for the most authentic information about Islam in Telugu
హోమ్
CLICK HERE
www.saanthibaata.com
saanthibaata
FIRST YEAR
డౌన్‌లోడ్ మేగజైన్
website visited from 23 countries
బుక్స్
FREE BOOKS
Download Free
www.saanthibaata.net
www.saanthibaata.com
Designed & Maintained by SAANTHIBAATA TEAM

**SAANTHIBAATA MONTHLY** **March & April, 2012** Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India** **RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

# జకాత్

## ఐదు ఇస్లామ్ మూల స్తంభాలలో ఒకటి
## పేదవారికి మరియు ధనవంతులకి మధ్య ప్రేమను కలిగించే వ్యవస్థ
## ఓ సాంఘిక సంక్షేమ వ్యవస్థ

ఎవరి వీలును బట్టి వారు ఎన్నో సత్కార్యాలు చేయవచ్చు, ఫర్జ్ నమాజ్ తప్పనిసరిగా చేయవలసిన నమాజ్. అది చేసిన తరువాత ఎన్ని నఫిల్ నమాజ్‌లైనా చేసుకోవచ్చు, జకాత్‌ను ధనవంతులు తప్పని సరిగా చెల్లించాలి. అది ఫర్జ్. నఫిల్ దానాలు ఎన్నయినా చేయవచ్చు, ఎవరికైనా ఇవ్వవచ్చు, అల్లాహుతాలా జకాత్‌ను ప్రతీ సత్కార్యానికి ఉపయోగించమని ఆదేశించకుండా, 8 రకాల వ్యక్తులకు మాత్రమే చెల్లించాలని, కేవలం వారికి మాత్రమే చెల్లించాలని ఖుర్'ఆన్‌లో ఆదేశించారు. కాని నేడు జకాత్ అల్లాహుతాలా చెప్పినవారికి మాత్రం అందడం లేదు. ఇది అల్లాహ్ ఆదేశాన్ని బాహాటంగా తిరస్కరించినట్లు కాదా?

## రమదాన్ నెల దగ్గరయింది

త్వరగా మీ ఏరియాలో ఉన్న పేదవారిని, వ్యాపారాలలో లేదా వ్యవసాయంలో అప్పుల పాలైన వారిని గురించి సర్వే చేయండి. జకాత్ సేకరించి వారికి అందించండి. ముందుగా ఎక్కడ సేకరించిన జకాత్ అక్కడి పేదవారికి పంచాలి. జకాత్ సేకరణ మరియు పంపకం అల్లాహ్ ఆదేశించినట్లు, ప్రవక్త(స)వారు చూపినట్లు మరియు దానిని సన్మార్గం పొందిన ఖలీఫాలు అమలు చేసినట్లు అమలు చేస్తే ముస్లిమ్ సమాజంలో పేదరికం తగ్గిపోతుంది. జకాత్ చెల్లించకపోతే ఘోరమైన శిక్ష ఉంది. ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల ప్రకారం జకాత్ ఇచ్చి మిమ్మల్ని మీరు రక్షించుకుంటారో లేక కొంతమంది ఆలిమ్‌లు (విద్వాంసులు) మరియు దాయీలు చెప్పినట్లు చేసి ఆఖిరత్‌లో నష్టపోతారో మీరే నిర్ణయించుకోండి.

దాయీలకు, దావా సంస్థలకు, మదరసాలకు, టీ.వి. చానళ్ళకు, లైబ్రరీలకు, పుస్తకాలకు, ప్రోగ్రామ్‌లకు జకాత్ ఖర్చు చేయకుండా, అల్లాహుతాలా ఖుర్'ఆన్‌లోని 9:60 ఆయత్‌లో ప్రస్తావించిన వారికి మాత్రమే ఇవ్వమని శాంతిబాట టీమ్ విజ్ఞప్తి చేస్తుంది.

బంధువులలోని పేదవారికి జకాత్ ఇస్తే మీకు లభించే పుణ్యం రెట్టింపు అవుతుంది. ఒకటి జకాత్ చెల్లించినందుకు. రెండవది బంధుత్వాన్ని నిలిపినందుకు

Visit
www.saanthibaata.net

23 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న
తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్